# కెప్టెన్ కథ

తవఁరుగోరలా కూకుంటే, నానిలా పామ్మీద ఇష్ణుమూర్తిలా తొంగోడం ఏం బాగోనేదండి. "కానేటి చేస్తానండీ? వొళ్ళు వొశం లేనప్పుడు" కంపెనీ కామాక్షి హేడ్డుబాబుతో అన్నట్టు.

"నానేటీ దాచనండి మరి. తవఁరుగోరు యినాలేగాని అంతా జెప్పేస్తానండి... ఏటి తల్లీ! సరిగ్గా యీ టయాముకే రావాలా? కన్నెరికానికి కరీం సాయిబు తగులుకున్నాడని... యింకా కత ఆరభించనే నేదు, అప్పుడే తగులుకున్నావ్! తగులుకుంటే తగులు కున్నావ్ గాని – నా నోటదుగు తాను, సెప్తావా? నీ సేతిలోదేటి? ఇనీమావా? ఇండీషనా? అంతున్నాది! ఏదోటి – బేగి పొడిసీ, అవతల నా కత కోసరం ఆ బాబులు కాసుక్కూకున్నారు.

అబ్బ నా తల్లే! కసరత్తు జేసినోడ్ని కాబట్టి యీ ఇండీషనుకి తట్టుకున్నాను. గాని ఇదే మరోడైతేనా? ఆడు సచ్చన్నా పోతాడు, నేకపోతే నిన్ను సంపేసన్నా సంపేస్తాడు.

ఈ యమ్మ యెప్పుడూ యింతే బాబూ, చెనానికో యిండీ షను – చిటానికో మాత్తర తెస్తాది. ఇంతకీ తల్లీ యీ యిండీషను నాకా? పక్కోడికా? యీ పాలి సూసుకు మరీ యియ్యమ్మా. నాను సచ్చినా పరవాలేదు కాని ఆ బాబు సస్తే ఏడ్దానికి ఒక పెళ్ళాం యిద్దరు ముండలూ ఉన్నట్టున్నారు.

ఎళ్ళు తల్లీ ఎళ్ళు...మరింక ఇప్పుడప్పుడే రాక...నాను సావన్లే – 'పాపీ సిరంజీవ'ని 'లా పాయింటు' మన పక్క ఉందిలే.

అమ్మయ్య! మొత్తాని కెలాగైతేనేం ఎల్లింది బాబూ, యిప్పుదు సెప్పండి. తవఁరు గోరికి ఏటి కావాలి?...ఏటీ?... నా కతంటారా? అబ్బో అదో పెద్ద యిష్టరీ బాబూ. నా పేరేటా? యెంత బతుకెంత కొచ్చినాదీ?

నా పేరు నా నోటితోటే సెప్పుకోవల్సిన గతి పట్టినాది. యింతకీ బతికున్నప్పుడున్నది పేరు కాదు బాబు – సచ్చినాక మిగుల్తాదే... అదిగో... అదీ అసలు పేరు.

ముందటేడు వొరకూ మన పేరు సెప్తే సింహాలు కూడా నీళ్ళు ముట్టేయి కావు.

ఇదిగో... యీ జబ్బ జూసినారా? తవఁరిగోరి తొడంతు న్నాది–అల్లప్పుడో పాలి... సావుకారింట్లో సోరీ కేసులో పట్టు కున్నప్పుడు – కనకయ్య హేడ్డు యిదిగో... యీ జబ్బమీదే గుద్దినాడు–గుద్దినాడు–అంతే... కుడిసెయ్యివి – మూడు ఏళ్ళు యిరిగిపోయి – మూణ్నెల్లు "మెడికల్లీవు" ఎట్టేసినాడు.

కనకయ్యగోడికి మంచి పనే అయ్యిందన్నాడు. ఎవుడూ... సర్కిల్‌బాబు... ఆడ్ని కొడ్తే లాఠీలే ఇరిగిపోతాయి. సేత్తో కొడితే ఏటొద్ది అని కూడా అన్నాడండి. ఇంతకీ తవఁరు గోరు నా పేరు గదండీ అడిగినారు. మన అసలు పేరు... కొండండి. సిసలు పేరు కెప్టెనండి. తవఁరిగార్లాటోళ్ళు కెప్టెనుగోడంటారండి... ఆ పేరెందుకొచ్చిందో మరోపాలి మనవి చేసుకుంటానండి!

కత ఎక్కడ మొదలెట్టడవోఁ తెలకుండా ఉంది బాబూ. ఏటీ! కత రాంపురంలో మొదలెట్టమంటారా? సిన్నప్పటి స్టోరీ కూడా కావాలంటారా? తవఁరుగోరి... ఇష్టవేఁ...

పేరుకే రాంపురం బాబూ. రాములోర్లు లేరు... సరికదా ఇబీషనులన్నా లేరు బాబు. సీతమ్మ తల్లెవర్తన్నా ఉంటే.. మన కంట బడ్డేదంతే... మూడొంతులమంది రావణాసురుళ్ళే బాబు. మిగిల్నోళ్ళు మారీచ సుబాహులు...

మనకీ రాంపురాల్తోనూ, లచ్చింపురాల్తోనూ పన్లేదు బాబూ. మన్దసలు...పట్నం బాబూ. కొత్తపేట చెయిను గేంగుకి మనవేఁ లీడర్లవిఁ...

మనూరికి ఏ కార్నివాలు.. వొచ్చినా మున్సిపాలిటి లైసెన్సు కన్నా ముందర మన లైసెన్సు పుచ్చుకోవల్సిందే ..... బాబూ.

ఎవుడు "గేబ్లింగు డెన్ను" యెట్టినా–ఏ ముండ "డిపో" యెట్టినా....మన పెర్మిషన్ పుచ్చుకోవలిసిందేనండి.

మనం ఆరు సుట్లు జైలు కెళ్ళినాం. ఆరుగురి కాళ్ళు, ముగ్గురి సేతులూ ఇరిసేసినాం... ఉట్టినే కాదు బాబు మనకి అడ్డొస్తేనే...

మనకో "తీరీ" ఉందండి. ఏటో జెప్పనా?

మనం పుల్ని కూడా ఏఁవీఁ అనం...

అడ్డొస్తే మేకనైనా మెళ్ళిరిసేస్తాం.

"ఆదూసు కెళ్ళకండొరే... ఆడసలే మంచోడు గాదు" అనీస నోరు డియస్పీ బాబులు కూడా మన గురించి, మనం సెయి ర్మన్‌కి నిలబళ్ళేదు గానండి... నిలబడితే అయిపోయుండే వోళ్ళం... నయాని కొక్కోటుబడితే, బయానికి యెయ్యోట్లు పడ తాయండి మనకి...

ఎలక్షన్లొచ్చేయంటే సాలు, మనపే రెలిగిపోయాది... ఎటూ సాయం సెయ్యనందుకే ఇచ్చేవోరు రెండు పార్టీల వోళ్లూనూ...

మన గొప్ప మనం సెప్పుకోకూడదు గానండి.... ఓ సిన్న కత సెప్తాను... ఇనుకోండి.

ఓపాలి మున్సిపల్ ఎలక్సన్లొచ్చినాయి బాబూ. "యీడికెందు కియ్యాల ముడుపు? ఈడు సెప్తేయీడి ముండే ఓటెయ్యదు" అన్నాడు అప్పల్సావిఁ–అప్పల్సా వంటే ఎవరా అనదుగుతారా'? అల్లప్పుడు మంతర్సాని రేప్ కేసులో ఇరుక్కున్నాడే, అదుగో – ఆదు–ఆదు అలాగన్నాడో లేదో–మనం ఊళ్లో దండోరా ఏయించీ సేం. అప్పల్సావిఁ సపోర్టర్లకి పార్కులో మీటింగని.. మీటింగుకి ఆడి సపోర్టరన్నోడు రాలేస్సరి గదా–ఆదు కూడా రాలేదు బాబు.

ఎలక్సన్లోంచి "యిత్డ్రా" అయిపోనాడంతే...

కొత్త సినిమా రిలీజంటే హాలోళ్ళు ముందు మనక్కబురు చెయ్యాల్సిందే బాబూ,జెనాన్ని కంట్రోల్సెయ్యమని. ఇక సినీమా షూటింగులంటారా–పోలీసు బందోబస్తు కంటె ముందు మన బందోబస్తడిగేవోరు బాబు–ప్రొడ్యూసర్లు–ఇంతకీమనల్నో ప్రొడ్యూసరు "ఇలన్" ఏసం ఎయ్యమని బతిమాల్నాడు బాబూ. "ఈరో" అయితేనే ఏస్తాను నేకపోతే యెయ్యననీసినా నండి. "నా కబ్బెంతరం నేదు..కాని మా "ఈరోయిన్" గుంట మంచం వెఁక్కేస్తాదే నిన్ను జూస్తే" అన్నాడండి. "దాంతోపాటు నువ్వూ ఎక్కీ మనం మాటతప్పం" అనేసినానండి. అలాగ "క్లోజు" ఐపోనాదండి మన సినీమా లైపు. లేకపోతే ఇప్పటి సెత్కారీ "ఈరో"ల్ని యెప్పుడో రిటైరు జేయించేసీ వోద్నండి.

అప్పుడు సినీమాల్లో జేరితే ఎలాగుండేదో బతుకు!

పద్మవ్యూహంలో అబిమన్యుడన్నట్టు... ఏటో కన్ఫ్యూజై పోత న్నాను బాబూ...

ఆఁ.. పోలీసోడు మొదలు పుండాకోర్నాయాల వొరకూ ఎవుడికేం కావొలిసొచ్చినా మన కాళ్లట్టుకోవల్సిందేనండి మరి.

ఓ పాలి ఏటైందో ఎరికా!

ఆయేళ కొత్త "యస్పీ" బాబు దిగినాడు బాబూ మనూరికి. పంజాబీ వోట్ట–గాని పఠాన్లా గున్నాడండి.

ఇంతకో జబ్బ–అంత గర్జనా – నిలువున్నర మడిసి – ... ఇద్దరు మదుసుల లావు–"సూటు"కో తాను కావాలన్నటు ట్నాడండి.

ఆ బాబు ఆయేళే రెయిలు దిగేడంట ఇక జూసుకోండి... బెల్లానికి సీఁవలు పట్టీసినట్టు... ప్లాటుఫారంనిండా పోలీసోళ్ళే ...ఆళ్ల సేతుల్లో లారీల్ని పువ్వుల దండలూ, యాపిల్ పళ్లూ.. కప్పీసినాయండి...

"యస్పీ" బాబు రెయిలుపెట్టె దువ్వారం కాడకొచ్చి ఠంచన్గా నిల్చుని రంగు కళ్ళద్దాలు తీసినాడండి.

ఇంక జూసుకోండి సంతలో పశువులు డెక్కలు సప్పుడు లాగ... కిందున్న పోలీసోళ్లు ఒకటే జోళ్లుకొట్టేడవండి, ఒకటే సలావుఁలు జేసేడవండి.

ఆ బాబు సిన్నప్పుడు నాటకాలేసేవోడో యేటోగాని... హీరో నాగ ఒక సిన్న నవ్వు..నవ్వి దిగినాడండి... ఇలా పెట్టి ఆ బాబు దిగడవేఁటి అలా గజదొంగను జుట్టేసినట్టు జుట్టీసినారండి పోలీసోళ్లు.

పోలీసోళ్లు గులాప్పువ్వుల వోఁసన యెయ్యడం తొలిసుట్టు – నాను అప్పుడే జూసినానండి–ఎంకటరవఁణమూర్తికి యేసి నట్టు... ఆ బాబుని దండల్తో ముంచీసినారండి.

ఇంతమందిరి పోలీసోళ్లున్నప్పుడు... మనం "ఆపరేషన్" జేస్తే బాగుండదని మనం ఒల్లకుండి పోనావండి. ఈ లోపల "యస్పీ" బాబు సామాను దించదాని కెక్కినారండి ఇద్దరు పోలీసోళ్లు.

కాని ఒక్కడే సరిపోనాడండి సామానుదించడానికి. ఆ బాబు రెండు పెట్టెల్లోనూ ఒక పెట్టె నేదండి. కెమేరా కూడా నేదటండి.

అయినా ఆ బాబు "హీరో" నవ్వు మాన్లేదండి బంగళా జేరీ వొరకూ–జేరేక కూడా ఆ బాబు మారనేదండి, నవ్వే మారి పోనాదండి... విలన్ నవ్వుకి...

రెండ్రోజుల్లో తన సామాను తనకి జేర్చకపోతే సబిన్సపెట్టర్లని వొందుకు తినేస్తానన్నాట్టండి. హెడ్డుల్ని వొండుకోకుండానే తినేస్తానన్నాట్టండి. ఇనస్పెట్రు బాబుల్ని మన్యాలు పట్టించేస్తా నన్నాట్టండి. ఇదంతా నాకెలా తెలిసిందంటారా?..యెంకటేశం బాబని ఒకడు టౌను యినస్పెట్రు వుండీవోడండి.ఆ బాబే సెప్పే డండి. సెప్పేక "ఒరే కెప్టెనూ, నువ్వు కెప్టెనువిగావురా, మా పాలిటి కిష్ణమూర్తివేరా.. మా ఉజ్జోగాలు నిలబెట్రా. కాళ్లట్లు కోమంటావేట్రా"? అని బతిమిలాడినాడండి.

"సి! ఫ్సీ!! కాళ్లూ పట్టుకోవద్దు. కంటవూఁపట్టుకోవొద్దు. గాని రెండునెల్లు 'లైసెన్స్' కట్టనంతే" అనీసినానండి. లైసెన్సంటే యేటంటారా? రైలు టేషన్లోనూ, బస్టాండులోనూ మనపని మనం జేసుకోడానికి పోలీసోళ్ళకి... వోరానికోసారి కడతాలెండి

– అదండి లైసెన్సంటే. "రెన్నెల్లు కాకపోతే ఆర్నెల్లు కట్టకురా. కాని ముందర మా బతుకులు నిలబెట్రా" అని బతిమాల్నాడండి ఆ బాబు.

ఎంత పోలీసోడైనా –అప్పుడు మాత్తరం ఆ బాబుని జూస్తే జాలేసి నాదండి.

మరంతే..

మాపిటేలకెల్లి "పలానా రూము సెక్ జేసుకోండి, మీ సామాను మీకు దొరుకుద్ది" అని సెప్పినానండి. దొరికినాదా అంటారా?... మంచోరే. నే నసలు పోలీసుల్లో పుట్టాల్సినోడ్నండి; అదురుష్టం బాగుండి పుట్టనేదంతే. ఇంతకీ ఆ సామాను ఎవురు తీసినారనా? ఆ రూము ఓ మెడికల్ స్టూడెంటు కుర్రాడిదండి. ఆ బాబు "తర్డియర్" కొచ్చినాక నాను రెండు సుట్లు జెయిలు కెళ్ళొచ్చినానండి.

ఆ బాబుని మొదట డైమాన్రాణీ డిపోలో జూసినానండి. మలిసుట్టు "సెవున్ హిల్స్" బార్లో అగుపడినాదండి. యీ మద్దెల రెండుసోట్లా అగపడ్డం నేదండి. ఏట్రా ఈ బాబేటైనాడ్రా అని యిచారిస్తే–ఏటది– 'పెతెడిన్నో' ఏటో అంటారే– ఆ మందు ఆ బాబుకీ అలవాటై పోనాదటండీ. ఆ కర్సు తట్టుకోనేక పస్టుక్లాసు పెట్టెల్లోనే పని మొదలెట్టినాడండి. ఆ బాబుకి ఎవురూ నేరా అంటారా? ఎందుకు నేరండి? ఆళ్ళ బాబు పెద్ద ఆఫీసరండి.

కేసేటైందని అడక్కండి.

పెద్దోళ్ళ పిల్లలు కూనీజేసినా కేసులుండవండి. అదీ రూలేనండి. ఈ కోరట్లూ, కేసులూ, జైళ్ళూ అన్నీ లేనోళ్ళకేనండి. ఏటో బాబు–ఏదో సెప్పబోయి, మరేటో సెప్పేస్తున్నాను. యంతకీ నాను సెప్పబోయీ కత మెడికల్ స్టూడెంటుదీ కాదు. యస్పీ బాబుదీ కాదండీ.

యెంకటరవఁణ బాబుదండి.

## 2

ఏటి బాబూ ఏటంటారూ? ఇమానం మీదకొచ్చినా యినిపిం చకుండా సెవులకి యీ కట్లోటండి, యెంకటరవఁణ బాబు కత సెప్పాలంటే ముంగల ఆచారి సంగతి చెప్పాలండి.

ఆచారి బాబెవరంటారా?

ఆ బాబు వొకీలూ, నేను పారిటీసీనండి.

అయితే మాత్తరం మాది సాన్దీ, సరసుడిదీ సవందం కాదండి. మాది రావుఁలోరూ, ఉడతా సవందం అనుకోండి. నేకపోతే మారీచుడూ, సుబాహూ సవందం అనుకోండి.

ఏటీ! ఆ బాబుని మీ రెరగరా?

ఇటు మూడు జిల్లాలూ, అటు మూడు జిల్లాలూ తిరిగినా నాపాటి నంజ నీ కగపడదండట యెనకటి కెవర్తో!

అలాగ్గ మన స్టేట్‌హోల్ మొత్తంమ్మీద ఆపాటి వొకీలు నేదను కోండి.. ఆ బాబెలాగుంటా డంటారా?

ముందుకి సెంబులాంటి గుండు, యెనక్కి ఏ ఆడదైనా సరే మోజు పడీటంత బారెడు జుత్తండి. నుదుటిమీద మూరెడు నామాలండి. సెవులకి రూపాయకాసంత తమ్మిట్లండి. సిన్నసైజు పొదుండబ్బీలు దూరిపోతాయి అన్నంత ముక్కు కన్నాలండి.. కొత్త రాగిబిందెలాంటి రంగండి. ఆరడుగుల యిగ్రహం అండి.

సందేళ సిలుకు పంచా, సిలుకు సొక్కా ఏసుకొని, మంచి గందం సేతికర్ర ఊపుకుంటూ సికారెల్తావుంటే ఇలాగెలా గుండీ వోడంటే– సరదాకి దిరీసు యిప్పేసుకున్న మైసూరు మా రాజులా గుండీవోడండి.

ఇక– తెల్ల సిలుకుపంచె– అత్తాకోడలంచుది – పీకవొరకూ బొత్తాయి లెట్టుకున్న లాంకోటూ. నెత్తిన బంగారం కిరీటంలాంటి జెరీ పాగా ఎట్టుకొని–కార్లో కోరటు కెల్తావుంటే, యీ బాబెవడూ! ఇలా దశరద మహరాజు మినిస్ట్రులాగున్నాడూ అనిపించీదండీ.

ఆ బాబుకాడ ఇద్దరు ఆడోళ్ళతో సహా పదిమందిరి జూని యర్లండి. అబ్బో! ఆ బాబుకి మూడు కార్లు, ఆరు మేళ్ళు, వొందెకరాల బూఁవిఁ...

ఇక ఆ బాబు ఆఫీసు అంటారా?... అయిక్లాసు హోటేల్లాగుం టాదండి. ఎయిరు కండిషనో ఏదో అంటారే అది – లోపలకెళ్తే పొద్దుటేళో, రేత్తిరో తెల్దు–అబ్బో కూకుంటే కందిపోయీ కుర్చీలు – ఓ వార్నఓయకరా బల్ల–ఆ బల్ల మీద తాఁవఁరపువ్వులాటి దీపం – ఆ దీపం ఎనక ఆ బాబు గదంతా సిన్న సీకటి – అర బెత్తెడు మందాన తివాసీ–ఆ తివాసీ మీద సప్పుళ్ళేకండా నడిసీ ఆ బాబు జూనియర్లని జూస్తే హిట్లరులాటోడి క్కూడా హార్టెటాక్ ఒచ్చేస్తాదండి.

కూనీసేసిన గాడిదకొడు కెవడన్నా ఆగదిలోకొచ్చినా దంటే "ఉరి ఇక్కడేస్తారా? కోరట్లో ఏస్తారా" అనిపించీ వొలసిందేనండి.

ఇంకా బాబు కోడికేసులూ, కుక్క కేసులూ పద్తాడనుకుం టారేటి? సె! స్సే!!

ఆ బాబు ముండ కేసు పట్టేడంటే అది మా రాజు ముండే అయ్యుండాలండి.

దొంగతనం కేసు పట్టేడంటే–

అది స్టేటుబ్యాంకు దోపిడీయే అయ్యుండాలండి.

ఆ బాబు పరపతంటారా?

అబ్బో... ఆ బాబు క్లబ్బుకెళ్తే కలకటేర్లు కూడా లెగిసి నిలబడిపోయివోరండి.

ఓపాలి ఆబాబు కోరట్లోకి ఎళితే, పరాకు మీదున్న జడిజీయే లెగిసి నిలబడి పోయాడటండి.

ఓపాలి పాపారావునాయుడు బాబూ అదే... నిరుటివొరకూ "పీ.పీ" జేసినదే ఆ బాబు–ఆ బాబేటన్నాడంటే "ఆచారీ, నీ వోదన యింటే కూనీ అయిపోయినోదు గూడా "నాను మామూలు సావే సచ్చినాను గాబోసు అనుకుంటాడురా" అన్నాడటండి.

ఇంతకీ ఆ బాబు కాడకొచ్చీ పారిటీలు ఎవరనుకున్నారు?

వొడ్డీల మీద వొడ్డీలు ఏసీసి డబ్బు కోసరం పెళ్ళాన్నీ, పేణాన్నీ అమ్మించేస్తారే...

అలాటి సావుకోర్లు – ముదనష్ట పాస్తులు, ముండలాస్తులు కలిపీసుకొని – ఈ పారిటీ గాదని ఆ పారిటీ–ఆ పారిటీ గాదని ఈ పారిటీ–మారిచేసి ఎమ్మెల్లేలూ, ఎంపీలూ అయిపోతారే అలాటోళ్ళు.

సస్పెండైపోయిన సూపరెంట్లు.

ఒకడికి తియ్యావొలసిన కాలు, మరోడికి తీసీసే డాకటర్లు, పిట్టల్ని కాల్చేసినట్టు పదిమందిర్ని కాల్చేసే రాచ్చస ముండా కొడుకులు, సేరు ఇసక్కి సిటికెడు సిమెంటేసి, యీయేల కడితే, యీ యేలే పడిపోయీ బ్రిడిజీలూ కడతారే అలాంటి కంట్రాక్టర్లు – అరబస్తా ఎరువుకి బస్తాడు ఉప్పు కలిపీసీ యాపారస్తులు – సంసారికీ, సానికీ తేడా తెలకుండా మందుకొట్టీసి అమాయకపు గుంటల్ని చెరిపీసే డబ్బున్నోళ్ళ కుర్రాళ్లూ.

అయితేనేంగాక, ఆ బాబుకీ నానంటే ఎంత యిదో సెప్పలేం. ముప్పై వేలు పుచ్చుకున్న మర్డరు కేసైనా సరే ఒగ్గీసి, మనది సిన్న సోరీ కేసైనా సరే వొచ్చీవాలసిందే.

## 3

ఏటీ! సీతమ్మోరికి రావణాసురిడి మీద మనసైందన్నట్టు – నాతో ఆ బాబుకి సావాస వేటంటారా? అక్కడే వుంది తిరకాసు.

మందుకాడ సావాసం, ముండకాడ యిరోధం వొస్తాయం టారండి తెలీనోళ్లు.

కాని మనకీ ఆ బాబుకీ కలిసింది ముండకాడే.

ఆ బాబుది అసలు సీతంపురం అగ్గురారం. మనకా ఊళ్లో దూరపు సుట్టాలున్నార్లెండి. ఆ సుట్టాలగుంట "సీతమ్మ"ని ఒకర్తె వుండీదండి. నలుపైనా నిగనిగలాడుతూ – ఇలా – సింతపిక్కలా గుండీదండి.

మూరిడు ముక్కు – ముంతంత కొప్పు – రూపాయంత బొట్టు – చారడేసి కళ్లు – యింతకో జెబ్బ – అంతకో... చెమించాల – బూతులొచ్చేస్తున్నాయి – తొడలు అగపడుతూ కోక ఎగ్గట్టి ఒంగొని పొలంలో నాట్లేస్తూ వుంటే – దానితల్లి సిగ్గోసిరి – మా ఏపు ఆడోళ్ళకి రైకలుండవేమో – ఆడోళ్ళక్కూడా మనసొద్ది దానిమీద.

మనకితగిల్నోళ్ళలో మూడోదో, నాలుగోదో అది. మనకంటే వొయసులో కుసింత పెద్దే ననుకోండి – కాని యిలాంటి షయాల్లో పెద్దా, సిన్నా అని సూసీనోవో – సూస్తూ వూరికుండి పోవల్సిందేనండి.

దాన్ని పిటాపురం యిచ్చినారండి. అయితేనేం, కన్నెరికం బేరవేఁమో – మనమీద మోజు పోనాదికాదు దానికి.

పాపం, ముందటేడు లారీకుమ్మీసినాదండి దాన్ని. ఆ లారీ కూడా ఎల్లకితలా పడిపోనా దనుకోండి.

ఎంతవొరకూ సెప్పినానూ... ఏటో మళ్లీ – కనుప్యూజు అయిపోతన్నానండి. ఓపాలి సంకురేత్తిరికి కన్నోరింటికొచ్చి నాదండి ఆ గుంట. ఒచ్చింది పోనీ ఒల్ల గుండొచ్చా? మనకి కబురెట్టినాదండి. పాత కాతా కబురెడితే – ఎల్లక పోతే అగు మానం అయిపోద్ది గాదండి? మరం చేత బయలెల్లినానండి.

అప్పటికింకా అగ్గురోరానికి బస్సులు పడనేదండి. కొత్త రోడ్డు కాడ బస్సు దిగీసి నడిసెళ్తున్నానండి.

సిన్న సీకటండి.

ఊరంతా మసక, మసగ్గా అగపడుతున్నాదండి.

నాను ఊరుసెరువుకాడ కొచ్చినానో నేదో – బుగతగోరి పశువుల పాకలోంచి ఓ ఆడదాని యేడుపూ, కేకలు, తిట్లూ యినపడినాయండి. అసలా కేకలూ ఎంత గట్టిగున్నాయంటే – మాటలొచ్చిన పశువు బూతులు తిడుతున్నదేమో అనిపించి నాదండి.

మనిసైనా, గొడ్డయినా అంత అరుస్తుంటే ఒల్లకోలేం కదండీ? మరంచేత పాకలోకి పరిగెత్తినానండి. అప్పుడు నాను జూసింది నిజవేఁవేనా అనిపిస్తాదండి నా మట్టుకు నాకే – అప్పుడప్పుడు.

పాకలో పశువులు బెదిరిపోయి తోకలెత్తేసి, గెంతుతూ అరుస్తున్నాయండి.

ఏటా అని సూద్దునూ! గుండెలమీద పైట నేదండి. కాళ్ళ మద్దెన కోక ఎగ్గదుతూ "ఓ గుద్దు గుద్దినానంటే – యేరే గొయ్యి తియక్కర్నేదు. బూఁవిఁలోకి దిగడిపోతావు. నా ఊసు తెల్దేటో! రా–రా– నంజికొడకా – రా– నీ బతుక్కి ముండ కావా(లా?" అంటూ తిడుతున్నాదండి. యెవరూ? సీతమ్మ.

దాని వోలకం జూస్తే అప్పటికే ఎవుడ్నో ఒకడ్ని – సంపేసి పాతీసి నట్టున్నాదండి. శవం ఏటైందా అని సూద్దునూ – శవం నేదు గానండి –

శవంలా తొంగునున్నాదండి ఆచారిబాబు పేడకుప్పలో. "ఈ గండం గనక తప్పిపోనాదంటే మరింక – యీ జనమలో పెళ్ళామ్మీద కూడాసెయ్యేస్తే ఒట్టు" అన్నట్టుందండి ఆ బాబు సూపు.

ఆ బాబు మనకంటె పదేళ్ళు పెద్దేననుకోండి. అప్పట్లో ఆ బాబు వొకీలుగా అప్పుడప్పుడే పైకొస్తున్నాడండి. మన బు(ర పాదరసంలా పరిగెత్తినాదండి. మనం జేసే పనికి యెలాగా ఒక వొకీలు కావాల. ఓ పక్క పోలీసోళ్ళని మేపనేక ఛస్తుంటే మరో పక్క వకీళ్ళు చీక్కు తినేస్తున్నారు.

మరంచేత పెంచితే యిలాటోడ్నే పెంచాలనిపించి నాదండి. ఎంటనే సీతమ్మని రెక్కట్టుకొని పాకవతలకి లాక్కెళ్ళినానండి! అదే గనక పతి(వ్రాతైతే దాని తిట్లకి ఆచారిబాబు – పెళ్ళాం పిల్లల్తో యేరే క(రల దండగ నేకుండానే బుగ్గయిపోయీవోడండి.

మరింక సెప్పడాని కేటుందండి? ఆచారిబాబుని నెగదీసి నానండి. సెర్లో గేదెని కడిగేసినట్టు నూతికాడ – కడిగీసినానండి. అసలే సంకురేత్తిరి సలేమో–యిలాగ యీకల్తీసిన కోడిలా అయి పోనాదండి సలికి.

ఊర్లో పంచాయతీ సెయ్యకుండా పదిరూపాయలు పారించీ సినానండి సీతమ్మకి– ఆ బాబు చేత.

మరంతేనండి. ఆ యేళకాడినుంచీ ఆ బాబు మనవంటే కుక్కేనండి.

## 4

ఏటి బాబూ? నా పనేటని అడుగుతున్నారా?

యిందాకే సెప్పినాను గదండీ? అసలు అన్ని పనుల్లోకి పడుపువృత్తి పాతదంటారండి తెలీనోళ్ళు – కాని దొంగతనవేఁ అన్నిటికంటె పాతదండి. నా నెప్పుడూ అబద్దం ఆడనండి.

మనకిందో గేంగుందండి. ఆళ్ళు కు(ర్రోళ్ళుగారండి. పిల్లి పిల్లలకంటె మెత్తగుంటారండి. అయితేనేం? అవసరవైఁతే – పులి పిల్లల్లేం కర్మ – పెద్దపుల్లే అయిపోతారండి.

ముందటేడండి – తఁవరు గోరికి తెల్దో – ఏటో – గాని – లచ్చింపేటని ఒక వూరందండి. ఆ ఊరి సాలోడొకడు పట్నం సినీమా కొచ్చినాడండి. ఒక్కడూ కాదండి. పెళ్ళాన్ని ఎంటేసుకొని మరీ ఒచ్చినాడండి. మలాట జూసినారండి ఇద్దరూను. బయట కొచ్చినాక ఆ జనంలో పెళ్ళాం అగుపళ్ళేదండి ఆడికి. ఎతికి, ఎతికి ఆకిరికి తెల్లారి పోలీసోళ్ళకి రిపోరటు యిచ్చినాడండి. ఆళ్ళకి సదివింపులు కూడా సదివించినాడండి. ఆకరికి ఏటి తేల్నాదీ అంటే – ఆడి పెళ్ళాన్ని ఒకరయ్యగోడు ఎత్తుకెళ్ళి కమ లమ్మ కంపెనీకి అమ్మేసినాడటండి. యీ సాలోడు పోలీసుల సుట్టూ తిరిగి తిరిగి ఆడిసెప్పులేగాదు బాబూ, కాళ్ళు కూడా అరిగిపోనాయండి. యింక యీళ్లు నా పెళ్ళాన్ని నా పక్కలో తొంగోపెట్టరనుకున్నాడో–ఏటో–ఆడు తిన్నగా ఎళ్లి – ఆ కమ లమ్మ కాళ్ళట్టుకున్నాడటండి.

అన్నట్టు కమలమ్మని తఁవఁరుగో రెరగరు కదూ! అదండీ – యూనిఫారం ఏస్తే ముదరహేడ్డు నాగుంటాదండి. తీసేస్తే ఆడి మొగుడి నాగుంటాదండి. మందెయ్యనప్పుడు రాచ్చాసి లాగా, ఏసినప్పుడు బెమ్మరాచ్చసిలాగా ఉంటాదండి. దానికి రౌడీల సపోర్టుందండి. పోలీసోళ్ళ కుమ్మక్కుందండి. దాని నెత్తిమీద పండెం(టుక ముక్క మిలి(టీవోడు కూడా తెంపనేడండి. దానికి సూపరెంటు బాబే ఓ దణ్ణవెట్టేసినాడండి. యీ సాలె నంజికొడుకు ఒక నెక్కా? దాని తెలివి ఏటనుకున్నారు?

ఆఫీసర్లలో–ఎవుడికి పారీవాలిసింది ఆడికి పారేస్తా దండి. డబ్బు గావలిసినోడికి డబ్బు–మందు కావలిసినోడికి మందు – గుంట కావలిసినోడికి గుంట–మూడూ గావలిస్తే మూడూ పారేస్తాదండి. ఇక దాని కంపెనీలో గుంటలం టారా? యెట్టిన దాన్ని యెట్టకుండా యెనబై సినీమాలు తీసేవొచ్చుండి. రాజు గోరికాడ్నించీ–రిచ్చావోడి వొరక్కూ ఎలాటోడికి అలాటిదాన్ని అంటించేస్తాదండి. కాని ఒక్క యిసయం ఒప్పుకోవాలండి. ఎవుడో–ఐక్లాసు ఆఫీసరు లాటోడు తప్పిస్తే, ఎవుడన్నాసరే గుంట కావాలంటే – దానింటికి పోవల్సిందే నండి–అలాటి కమలమ్మ యీసాలోడు అడగ్గానే "యిందరా నీ పెళ్ళం– తీసుకుపోరా" అన్జెప్పి యిచ్చేస్తాదాండి యీడి ఎ(ర్రిగాని?

ఆఁ–యీడెళ్ళి దాని కాళ్ళట్టుకున్నాడని జెప్పినాను గదండీ? అది ఈడి ఏపు–సచ్చిన సాలెపురుగుని జూసినట్టు సూసి 'చెడిన దాన్తో కాపురం ఏటిసేస్తావు?" అందటండి–కాళ్ళు యిడిపించు కోకుండానే..

"నేకపోతే దానిమీద నాను మదుపెట్టిన మూడువేలూ యిచ్చీ–వొడ్డీ ఒగ్గీసుకుంటాను. ముదనష్టం బేరంలోకి దిగేనను కొని" అందటండి.

"యింకా దాన్నొగ్గనేకపోతే–నాకాడ జీతానికుండు. పాసిం జర్లకి–పకోడీలూ–గ(ట్రా తెద్దువుగాని" అని కూడా అందటండి.

యీడు ఏటంటాడండి? సెవులూ, నోరూ మూసుకొని నాకా డకొచ్చి నా కాళ్ళు సుట్టేసినాడండి. నాకాడ కెలాగొచ్చి నాడం టారా? మా దద్దగారిది ఆడి ఊరేనండి. మన గొప్ప మా దద్దకి తెలుసుగదండీ? అంచేత మా దద్దగోరి మనఁవడ్ని ఆ సాలోడు ఎంటబెట్టు కొచ్చినాడండి. మరండి–ఆ సాలోడు ఎలాగున్నాడనుకుంటారండి?

ఆడ్ని సూస్తే పోలీసోడిక్కూడా వొణ్కుం సయించదండి.

మడిసి బెగిలిపోనాడండి.

తల్లిని చూసినా జడుసుకునేటట్టున్నాడండి.

ఓపాలి పిలిస్తే పలకడండి.

ఓపాలి పిలిస్తే తుళ్ళిపడ్తాడండి.

అదండి సంగతి.

ఆడు నా కాళ్ళు పాఁవుఁలా సుట్టేసినాడు కదండీ. ఆడు మామూలు పాఁవైతే, ఆ కమలమ్మ ముండ కొండసిలువండి. దాన్తో యవ్వారవంటే డబుల్ డేంజరండి. పోనీ మన అసిస్టెంటు గోళ్లని పిలిసి పోయి దాని కంపెనీలో జొరబడి ఆ సాల్దాన్ని ఎత్తుకొచ్చీయండ్రా" అందావంటే దాని రౌడీలు యాళ్ళని పెరట్లో పేనాల్తోనే పాతేస్తారండి.

మరింక ఏటి దారి? అని ఆలోచించినానండి. దారి దొరక నేదు కానండీ–సిన్న ఉపాయం దొరికినాదండి.

మన అసిస్టెంట్లలో ఆకురాయిల్లాటోళ్ళని అరడజను మందిర్ని ఏర్నానండి. ఆ పూట సారా తాగవఁని అమ్మమీద ఒట్టు ఏయించుకున్నానండి ఆళ్ళసేత. ఆళ్ళందర్నీ కమలమ్మ కంపెనీకెళ్ళి ఆ గుంటనే అడగమని సెప్పినానండి. ఏటలా జూస్తన్నారు? ఒక్క గుంటకి ఒక్క రేతిరి యింతమందిరా అనా? తఁవఁరుగోరి కిలాటి యిసయాలు తెలవ్వండి మరి–ఒక్కో గుంటున్నాదంటే–ఒక రిజర్వు ప్లేటూనుకి సరిపోద్దండి. అదలా ఒగ్గేయండి.

సరే. మనోళ్ళు ఎళ్ళినారండి. అందులో మొదటోడు ఆ గుంటతో "ఒలే–అమ్మీ–మాఁవుఁ నిన్ను ముట్టుకోడానికీ, ముద్దెట్టుకోడానికీ రానేదు. నా ఎనకున్నోళ్లు–కాపలావోళ్ళని మంచిచేసుకొని మందు పట్టేస్తారు.

నువ్వు మాత్తరం సెట్టుకింద సీతమ్మోరిలా ఏడుస్తూ కూకోకు, కుసింత ఉషారుజెయ్యి. ఒకడ్ని బైటకంపించి మరోడ్ని పిలిసే టప్పుడు యీలుజూసుకొని ఒకడితో వొచ్చీ. మలుపుకాడ మన "ఆటో" వుంది. నీ మొగుడి కాడికి నిన్ను జేర్చడాని కొచ్చినాం గాని నిన్ను సెరసడానిక్కాదు!" అని అన్నీ యివరంగా సెప్పి నాడండి. ఆడితో బైటకొచ్చినప్పుడు ఆ గుంట వుషారుజూసి కమ లమ్మ కళ్ళు నులుముకుందటండి. "ఏటీ నాను కలగం టున్నానా?" అనుకొని.

మనం ప్లాను ఏసినాఁవూఁ అంటే–మూడు కళ్లోడు– ఆడొచ్చీ వొరకూ దానికి తిరుగుండదండి. అయిదో వోడితో ఆటో ఎక్కీసీ నాదండి ఆ గుంట.

నాను సీరావఁసెం(ద్రుడ్నిగాను గానండి, యిలాటి కంపెనీ యవ్వారాలంటే నాకు గిట్టవండి. నా నీతి నాకున్నాదండి.

మనకో "తీరీ" ఉన్నాదని ముందరే మనివిజేసినాను గదండీ. నాను దొంగతనం జేస్తానండి. కాదన్నండి. దొంగతనం– నేరవోఁ కాదో తవఁరి గోరికి తెలుసనుకోండి–గాని నా పెకారం అది పాపం మాత్తరం కాదండి.

# 3

ఏటీ! నాకు పెళ్ళయిందా అనడుగుతున్నారా? అయింది బాబూ అయింది. మాలాటోళ్ళ పెళ్ళిళ్ళకి మంత్రాలూ వుండవు, బేమ్మడూ వుండడండి. పెళ్లికాక ముందర-నాను బెమ్మచార్నీ గాను నా పెళ్ళాం పతివ్రొతా గాదండి.

ఒక తెప్పకేసు- అవుస్ బ్రేకింగన్నా కాదు- సిన్న పిక్ పాకెటింగు- అంతే- మూడేళ్ళేసేసినాడు మేస్టీటు బాబు. అదంతే- ఆ బాబు, మర్దరు కేసులో ముద్దాయిగోడిని ముద్దెట్టుకోమన్నా ఎట్టేసుకుంటాడేమోగాని, తెప్పకేసంటే మాత్తరం తెగ మండిపడతాడటండి. ఎంచేతంటారా? దానికో సిన్నకత వుందిలెండి. ఆ బాబు సదూకునీ రోజుల్లో ఓపాలి అయిదరాబాదెల్తే ఎవుడో పరుసు కొట్టేసినాట్టండి. సేతిలో కాన్లేక పస్తులుండి తిరిగొచ్చినాడటండి. మరోపాలి ఆ బాబు పెళ్ళాం సుట్టాలింటికి పెళ్ళి కెళ్ళి రెయిల్లో తిరిగి వస్తుంటే ఒంటిమీదున్న జవ్వరీ నిద్దర్లేసేసరికి నేదటండి.

మరంతే- ఆ బాబు మేస్టీటు అయినకాడి నుంచీ- "ఏపీపీ." ఒగ్గేమన్నా 'తెప్ప' కేసు ఒగ్గడటండి. ముష్టి మూడ్రూపాయల పరుసు కేసండి నాది- మూడేళ్ళన్నాడండి. నన్ను జైల్లో- ఇక ఆరు వోరాలకి వొగ్గేస్తారనగా- తొలిసుట్టు జూసినానండి బీగాన్ని- బీగం అంటే మా ఆడదిలెండి.

బ్రోతల్ ఏక్టు కేసులో- బూతు పాటలు పాడిందని ఆరు వోరాలు ఏసేసినారటండి. నాకు తెలకడుగుతాను- కానండి- బాబూ- ఆ యాపారంలో బూతు పాటలు పాడక- బక్తి పాటలు పాడితే- సాగుద్దేటండి యాపారం? మళ్ళా బంగళాల్లో బూతులు మాత్తరం నీతులుగానే సూస్తారండి. నా నోటిసెప్తానండి, జెనమలో మరో ఆడదాని రెక్కట్టుకోని మొగోడికి ఆడి పెళ్ళావేఁ వొల్లదండి. ఏ పురాణం యిన్నా బూతు కతే కదండీ.

నన్నడుగుతే - మొగోడెవడన్నా సరే- ఆడు
ప్లీడరైనా- పారిటీ అయినా
ముద్దాయైనా-మేస్ట్రీటైనా
యస్పీ అయినా- ఆర్డర్లీ అయినా
తెల్లోడైనా- నల్లోడైనా
పొడుగోడైనా- పొట్టోడైనా
ఆకరికి
పాకీవోడైనా- ప్రైమ్మినిష్టరైనా- సరే- మీసవున్న మొగోడె వర్నన్నా సెప్పమనండి - గుండెలమీద సెయ్యేసుకుని సెప్పమనండి. అలాంటి పన్జెయ్యనేదని సెప్పమనండి.

సెప్పడు. సెప్పనేడు. అంతే.

ఒకేళ- అలా నిజెంగానే- గుండెలమీద సెయ్యేసుకుని- ఎవుడన్నా సెప్పినాడంటే- ఆడు గుండెల్లేనివోడనా అవ్వాల- నేకపోతే గుండెల్దీసిన బంటన్నా అవాల- అది రూలేనండి.

నా మాటబద్దమేఁవోఁ! ఓపాలి... అలా... అలా... ఏటంటారు సెప్మా? ఆఁ- "సెవెన్ మూన్స్" ఒటేలు- ఏడంతస్తులుంటాదే... అక్కడికిరేత్తిరేళ వొద్దులెండి- మద్దేనపేళ ఎళ్ళినా సరే, దేని మొగుడికాడ అది తొంగుంటే, నన్ను తొత్తుకొడకా అని పిలండి- నాను పలుకుతాను.

చెమించాలండి ఏటో సెప్పబోయి ఏటో సెప్పేస్తున్నానండి.

బీగాన్ని జెయిల్లో సూసినానా? అదేటోగాని సినీమాల్లో సూపించినట్లు మమ్మల్నిద్దర్నీ ఒక్కపాలే ఒగ్గినారండి. ఇద్దరం బైట కొచ్చినావండి. నానే ఓ పాక ఒటేలుకి తీసికెళ్ళినానండి. ఇద్దరం "టీ" తాగినావండి. ఆనక- ఓ సెట్టు వోర కూకున్నాక-

"ఇదిగో సూడూ- నువ్వు పతివ్రోతవని నాననుకోను. నాను సీరామసెంద్రుడ్ని నువ్వూ అనుకోక. నీ కిష్టవైఁతే కలిసుందాం. పెళ్ళీ ఒద్దు, పెడాకులూ ఒద్దు.

యిడిపోయీ వోళ్లని పెళ్ళాపదు.

కలిసుండే వోళ్ళకి పెళ్ళక్కర్లేదు.

"కాని ఒక్క మాట- నువ్వు నీ వృత్తి మానీ. నీదానికన్నా నాదేం గొప్పదని కాదు. కాని నీ పన్లో వొళ్ళు సెడతాది - నా పన్లోనూ సెడతాదనుకో దొరికితే- కాని అదో రకం సెద్దం. ఆలోసనజేసి సెప్పు- కలిసుందావోఁ, వొద్దో" అన్నానండి.

"కాన్నాకో కొడుకున్నాడే" అందండి.

"నీ బేటా బాబెవడని అడగను సరా" అన్నానండి.

అంతేనండి.

గుడి కెళ్ళనేదండి.

మసీదు కెళ్ళనేదండి.

బేమ్మడ్ని పిల్నేదండి.

ముల్లానీ పిల్నేదండి.

సక్కగా– సుకంగున్నావండి అప్పటి కాడ్నించీ.

యీ కాలం పెళ్ళాలకంటే పతిౖవ్రొతే నండి అది. అయినా సరేనండి– నాను జెయిలు కెళ్తే మాత్తరం– దాన్ని పోలీసోళ్ళు అల్లరి పెట్టక మాన్రండి.

నాను మైసూరు మారాజునీ గాను.

జైపురం జమీందార్నీ కానండి.

కాని– నాకంటూ– స్పెషల్‌గా ఓ ఆడదంటూ వుండాలని మా సెడ్డ ఆశ గుండీదండి. దేవుడి దయవొల్ల అది తీరిపోనాదండి.

"సిటీలో బతకాల్సినోడివి. ఏటీ పల్లెటూరి పితలాటకంలో యిరుక్కుపోనావ్?" అంటారా. మరక్కడేనండి తిరకాసు.

నాన్జేసిన పనికి – నానే మరో యాబయ్యేళ్ళు– బతికుంటే– బూఁవీఁ– బంగారప్పతకం– యిస్తాదండి గవుర్నమెంటు.

సరీగ్గా అయిదేళ్ళ కిందటండి– ఆచారి గోరింట్లో జూసినాదండి నన్ను– ఎవుడూ? యెంకటరవఁణ బాబు. అప్పుడా బాబు కంటపడకపోతే నా యిష్టరీనే మారిపోయి ఉండీదండి.

ఆ యేళ ఆ ప్లీడరుగోరి ఆఫీసుకెళ్ళినానండి. ఎందుకంటారా? అదే సెప్తున్నానండి.

ఆ ముందేరేత్తిరి మా యాడది మలాట సినీమా కెళ్ళినాదటండి.

నా యాపారం మీద నా నెల్లి పోనానండి– కలకత్తా కాశిగోదని... ఆడు యినప్పెట్లు బద్దలు కొట్టడానికీ, పోలీసోళ్ళచేత యీపు బద్దలుకొట్టించుకోడానికే పుట్టినాడండి... మన్ది సేతిలాగవం– అంటే అస్తలాగవం– బిజెనెస్సండి. ఇళ్ళక్కన్నాలు కొట్టవండి మనం.

శెవం జోబీలో పరుసు కూడా తియ్యడండి కాశిగోదు.

కాని హార్బరులోంచి– షిప్పు తెచ్చీరా అంటే తెచ్చేస్తాడండి.

"లోకోషెడ్డు"లోంచి రైలింజను పట్టుకొచ్చీరా అంటే పట్టుకొచ్చేస్తాడండి.

ఆడే నచ్చుజెప్పినాదండి– నాకు. ఏటనీ? "ఒరే– కెప్టెనూ నాతో వోటా కూద్రా–కోపరేటివు కోలనీలో ఓ యిల్లున్నాది– యింటోళ్ళు తిరపతెళ్ళినారు– నీకు తెలుసు గదా–ఏ తాళవఁన్నా ఊడదీసీగల్ను నాను. నా నొక్కడ్నీ ఎల్లనేక గాదు– ఏదో సిన్నప్పటి ఫ్రెండువిగదా సపోరటువుంటావని" అని బతిమాల్నాడండి.

అదిగో–ఆ దూటీమీదెల్లి పోనానండి. ఆ రేత్తిరి– మాఁవుఁ.

మా యాడది మలాట సినిమాకెళ్లిందా? ఆటైపోనాక యింటికొచ్చేస్తుందటండి. మద్ది తోవలో– 'వేన్' ఆపినారటండి పోలీసోళ్ళు. వేను దిగినాట్టండి అడ్డబుర్ర హేడ్డు. దిగినోడు– దిగినట్టే ఒల్లకుండాలా? ఆహఁ. మా యాడదాని మొకంలో మొకవెఁట్టి "ఇంత సీకట్లో యీ సీతమ్మోరెవరా అనుకున్నాను. ఓసీ, నువ్వేనటే! ఎక్కు ఎక్కు" అన్నాడటండి.

"నానా పని మానీసినాను గదా" అందటండి అది.

"ఏట్రా పేచీ?" అని అరిసినాదటండి ముందు సీట్లోంచి ఇనస్పెట్రు.

"పతిౖవ్రొతై పోనానంటున్నాదండి" అన్నాడటండి హేడ్డు.

"వేన్లో వున్న ప్రెతీ లంజా ఆ మాటే అందని జెప్పు– బేగి వేనెక్కమను– నేకపోతే వేనుకింద పడిపోద్దని చెప్పు" అన్నాట్టండి ఇనస్పెట్రు.

అడ్డబుర్రగోడూ, మరో యిద్దరు 'పీ.సీ."లూ కలిసి– మా యాడదాన్ని బలవంతంగా వేనెక్కించేసి తీసుకు పోనారటండి.

ఆ మర్నాదు పొద్దున్న నాను యింటికాడకొచ్చీసరికి ఏటుందీ? సంగత్తెలిసి స్టేషనుకి పరిగెత్తినానండి. అక్కడ మా యాడది కాక మరో పదిమంది ఉన్నారండి– ఆడోళ్ళు.

అడ్డ బుర్రగోడ్ని పిలిసి 'ఏటి యవ్వారం?" అనడగినానండి– అంటే "నీకు తెలసి యెవ్వారం ఏటుంటాదిరా? కొత్త బాబొకదు యేయసీ దిగినాడు– నిన్ననే– కలకత్తా వోడట... మా ఆఫీసర్లు దండలేసినారు. ఇంతకీ– దండలేయించుకోడాని క్కూడా ఓ యోగం ఉండాల– ఆ బాబు కదినేదు– దండలన్నీ మావోళ్ళ మొకాల్ని కొట్టేసినాడట. కొట్టినోడు– కొట్టినట్లూ ఊరుకోక ఓ "స్పీచి" కూడా కొట్టినాడట– ఏఁవఁనీ– సంగానికి జబ్బుసేసిం దన్నాడట. పోలీసోళ్ళకి పెద్దరోగవఁన్నాడట. పోలీసోళ్ళు బతికీది వొణ్ణం తినిగాదు. గేంబ్లింగు డెన్నులూ, బ్రోతల్ హౌసులూ తిని అన్నాడట. తన హయాంలో– లంజెరికం, జూదం సాగనివ్వ నన్నాడట. పదిరోజుల్లో– పోలీసోళ్ళ పెళ్ళాల పుస్తెలమ్మిం చీక పోతే– తను– ఐ.పీ.యస్సోడ్నే కానన్నాడట. యింకేటుంది? తిరిగొచ్చిన మా ఆపీసర్ల మొకాలు జూడాల– పక్కింటాడితో పెళ్ళాం లెగిసిపోయినట్టున్నాయి మొకాలు.

మరంచేత– రేత్తిరి రెయిడింగ్‌కి బైలెల్లినాఁవు. ఏ కంపెనీ

కెళ్లినా సీతలుక్కాపలాలున్న లచ్చుమల్లా ఉన్నారు రౌడీ నంజ కొడుకులు–అక్కడికి మావేఁదో రావణాసురుళ్ళ వైనట్టు.

మాకేటి గతి?

కలకత్తావొ డొచ్చేడన్జెప్పి– కంపెనీలోళ్ళతో కసాలా పళ్ళేం కదా– పడితే పెళ్ళాల్ని పుట్టిళ్ళకి అంపీవల్సిందే పోషించనేక– మరంచేత బతిమాలాడ్నాము– బయం కూడా పెట్టినావఁనుకో. నానో మాట సెప్తా ఇంటావా? ఏటంటే –

పోలీసోళ్ళకి–

ఆళ్ళ పెళ్ళాలు బయపడ్రు.

పిల్లలు బయపడ్రు.

ముండల డిపోలోళ్ళు బయపడ్రు.

గేంబ్లింగు డెన్నోళ్ళు బయపడ్రు.

స్టూడెంట్లు బయపడ్రు.

సినిమా హాలోళ్ళు బయపడ్రు.

కాంగిరేస్సోళ్ళు బయపడ్రు.

కమ్యూనిష్టులు బయపడ్రు– నక్సలైట్లు బయపడ్రు.

పిక్‌పోకెట్లు బయపడ్రు.

పీకలు కోసీవోళ్ళు బయపడ్రు.

ఆడోళ్ళు బయపడ్రు.

మొగోళ్ళు బయపడ్రు.

మరింకెందుకూ మీ డిపార్టమెంటంటావా?

ఏంపని జేస్తున్నదంటావా? పనిచేస్తుందని ఏ నంజి కొడు కన్నాడు.

పాత లారీలాగ దొర్లుకుపోతున్నాదంతే.

దానికి పెట్రోలైపోనాది– సాన్నాళ్ళై.

స్టీరింగు ఎప్పుడో ఒగ్గీసినాది.

డౌన్లో వున్నాది కాబట్టి దొర్లుకుపోతున్నాదంతే. ఎప్పుడో అప్పుడాగిపోద్ది–

ధామ్మని దేనికో గుద్దీసి– మరీ ఆగిపోద్ది.

యింతకీ మా డిపార్టుమెంటూసు– యిప్పుడెందుగ్గాని రేత్తిరి సీకట్లో ఎవుడెదురొచ్చినాడో– సరిగ్గా సూళ్ళేదు– గాని బహుశా "మఫ్టీ"లో మా పోలీసోడే అయ్యుంటాడు–పెళ్ళాల్ని మరిసి పోయి, నిద్దరకో దణ్ణవెఁట్టి, తెల్లార్లూ ఊరకుక్కల్లా తిరిగితే, అదిగో సూడు, దొరికినోళ్ళు– ఆళ్ళూ– ముచ్చటగా మూడు పుంజీల్లేరు.

గడియో, క్షణవోఁ– మా మీదికి దిగిపోతాడు, యే. యెస్పీ బాబు, ఎదకొచ్చిన పెద్దపుల్లాగ. "ఆ పని" మీ యాడది మానీసి నాదని నాకు తెలుసు. కాని నా పని పోద్ది కేసెట్టక పోతే. నాను సెప్పేది జాగర్తగా యినుకో– సిన్న "సొలిసిటింగ్" కేసె దతాను. అంతే– మేజ్ట్రీటు బాబు కూడా, మా మంచోడు. బక్తుడు, కోరట్లో లేనప్పుడు గుళ్ళోనే వుంటాడు. ఎలాగో నా తంటాలు నానుపడి సిన్న జరిమానాతో కేసైపోయీటట్లు సూస్తాను. కావ లిస్తే జరిమానా కూడా నానే కట్టుకుంటాను.

అరిస్సెంద్రుడు విశ్వామిత్రుడికిచ్చిన మాట తప్పుతాడేమో గాని– పోలీసోడు ముద్దాయికిచ్చిన మాట మాత్తరం తప్పడు. అది రూలే. మరంచేత– బాబ్బాబూ–మీ యాడదానికి–ఎలాగో నచ్చ జెప్పి "గిల్టీ" కొప్పించీ అని బతిమాల్నాడు.

"గిల్టీ" కొప్పుకోకపోతే– యింకా "ఎప్పయ్యారు బుక్" సెయ్య నేదు. ఏ కేసెడతానో నాకే తెల్దు" అని బెదిరించినాడు కూడా– యింకెవడూ? ఆ అడ్డ బుర్రగోడే.

తీరా మా యాడదాన్తో మాట్టాడితే "నకసలైట్నని సెప్పి సెట్టు క్కట్టేసి కాల్సీమను. వొప్పుకుంటాను. కాని నాను యీ కేసు కొప్పుకోను" అని మొండికెత్తీసినాదండి.

ఆళ్ళిద్దరి మద్దెల–పీల్దులో పుడ్బాల్లా ముప్పై సుట్లు తిరిగి యిక నాబంనేదని–ఆచారిబాబు ఆఫీసు కెళ్ళినానండి.

ఆఫీసులో–ఆ బాబు కెవడో–డిస్మిసైపోయిన డీయస్పీ తగులు కున్నాడటండి.

అంచేత నాను వొరండాలో కూకుండిపోనానండి.

అదిగో–సరిగ్గా ఆ టయాముకే దిగినాడండి– జీపు ఎంకట రవఁణ బాబు.

మెళ్ళో ఎర్రపావూఁ, నల్లపావూఁ కలిపి ఏసుకున్నట్టు అత్తా కోడలంచు కద్దరు వోణీ ఏసుకున్నాడండి.

పొందూరు పంచండి–తెల్ల టెర్లిన్ లాల్చీ అండి.

టోపీ యెడితే కాంగిరేస్సు మినిస్ట్రు– తీసేస్తే జనతా మిని స్ట్రులా గున్నాడండి.

సంగసేవ మొదలుకొని స్మగ్లింగు వొరకూ–ఏ పని జేస్తా దన్నా–నమ్మొచ్చు–అన్నట్టున్నాడండి.

ఆ బాబు కళ్ళు మూసుకుంటే మునిలాగుంటాడండి.

కళ్ళిప్పిజూస్తే సాలు–పరిగెడుతున్న పాఁవులు కూడా ఆగి పోతాయన్నట్టున్నాడండి.

ఈ బాబు కూనీకైనా, తపస్సుకైనా ఒక్కలాగే పనికొస్తాదని పించి నాదండి– నాకు.

నావేపు ఓపాలి జూసి–లోనకెళ్ళిపోనాదండి.

అప్పుడ్నాకు–

గళ్ళలుంగీ ఉందండి–

బొక్కల బనీనుందండి.

మూరెడు జుత్తూ– జానెడు మీసం ఉన్నాయండి

మొలని ఇత్తడి గుండీల బెల్టుందండి

కుడిసేతికి తోలు పటకా ఉందండి.

నోట్లో బీడీ ఉందండి.

సేతిలో లాఠీ ఉందండి.

అచ్చు సినీమాల్లో రౌడిలాగున్నానండి– అప్పుడు.

మన సైజు సూస్తున్నారు కదండీ. సచ్చిన్నాడు మొయ్యడానికి నలుగురు సాఁర్లు, రెండు పుంజీలు కావాలండి.

అయ్యేళ ఏటి జరిగిందో మూడు ముక్కల్లో సెప్పేస్తానండి. ఎంకట్రవఁణబాబు లోపలకెళ్ళినాడు గదండీ? అప్పుడే ఆచారి బాబుకాడ నా గురించంతా బోగట్టా పీకినాడటండి– ఆనక ఆచారిబాబు నన్ను లోపలికి పిలిసినాడండి. పిలిసి, ఎంకట్ర వఁణబాబుతో "కావాలంటే ఆడి లాఠీతోనే– ఆడి జబ్బమీద దెబ్బ ఏసి సూడు. యిరుగుతే ఆ లాఠీ ఇరుగుద్ది. నేకపోతే నీ సెయ్యి యిరుగుద్ది. అంతే– కానాడికి సెలనం వుండదు" అన్నాడండి.

ఆ తరువాత– ఆచారిబాబే అంతా సెటిల్ సేసేసినాడండి. నాను ఎంకట్రవఁణబాబుకి బాడీగార్డుగా ఎల్లడానికీ– ఆ బాబు నన్ను పోషించి–నెలకి నూట యాభై జీతం యివ్వడానికీ– మా యాడదానిసేత– ఆళ్ళూళ్ళోనే– ఆబాబే "టీ" కొట్టు ఎట్టించ డానికీ, ఏర్పాటు జేసినాడండి.

నాకూ ఆ బేరం నచ్చినాదండి. అప్పటి వొరకూ నాను బతికీ బతుకంటె– యిసుగొచ్చేసినాదండి. అంతవొరకూ దొంగ తనాలు జేసి పోలీసుల్ని పోషించినాను–గాని–నాను సుకపడ్డే దండి. నాకంటూ నాకు ఏటి మిగిల్నాదండి? పోలీసోళ్ళ దెబ్బలూ – స్టేషన్లో జాగారాలూ– పైగా స్టూడెంటు కుర్రాళ్ళు "టూరు" కెళ్ళినట్లు ఏడాది కోపాలి జైలుకెళ్ళడం. మరింక యీ బతు కొగ్గేస్తేనే బాగుంటాదనిపించినాదండి.

మరంచేత– మా యాడదాన్తో మాటాడకుండానే ఉజ్జోగానికి ఒప్పేసుకున్నానండి. అదెప్పుడూ నా మాట కాదన్దులెండి.

నాను పనిలో జేరకముందు ఎంకట్రవఁణబాబు 'ఇస్టరీ' నాను యినదవేఁగాని– నాకు సొయంగా తెల్దండి– ఏటి బాబూ– అది కూడా కావాలంటారా? మరైతేనండి– అల్లడుగో– గంగిరెద్దులా బుర్రకి కట్టు కట్టుకొని– గాల్లో రెండు కాళ్ళూ ఏళ్ళాడేసి సచ్చిన కొంగలా గున్నాడే– సన్నాసిగోడు, ఆడ్నడగండి, సెప్తాడు. ఆడికంతా సొయంగా తెలుసండి.

## 6

### సన్నాసి చెప్పిన కథ

నా పేరు సన్నాసండి– తఁవఁరిగార్లోటోళ్ళు– సన్నాసి గోడం టారండి.

నాదీ రాంపురవేఁనండి.

బుల్లిబాబు–ఎంకట్రవఁణ బాబుని అలాగే పిలుస్తారండి మరి– ఆ బాబుకంటె నానే ఏడాది పెద్దటండి. కొత్తామాసెళ్ళిన మూర్రోజులుకి పుట్టినా నటండి. నాను పుట్టిన నచ్చిత్రం అసలు మంచిదికాదటండి. అంచేతే గావాల్ను– నన్ను కన్న ఎంటనే మాయమ్మ సచ్చిపోనాదండి. మరో మూడేళ్ళకే, మా అయ్యకూడా పోనాదండి. పుట్టి వెంటనే అమ్మనీ, అయ్యనీ– పొట్టనెట్టేసు కున్నాడన్జెప్పి నన్ను సన్నాసిగో దన్నారంటారండి.

మరింక– మా దద్దే (పెత్తండ్రి) నన్ను పెంచినాడండి. ఇంతకీ మాలాటోళ్ళకి పిల్లల్ని పెంచడం ఏవంత కష్టం కాదండి. ఏటుం దండి? పందిపిల్లల్లా ఆళ్ళే బతికేస్తారండి. అసలాళ్ళ నెవరూ పెంచరండి. గోసెట్టిన కాడ్నించి ఎవుడి బతుకు ఆడే బతికేస్తాడండి...

నాకో నాలుగు ముక్కలు అబ్బాలని మా దద్దకి ఆశుండీ దటండి. అంచేత నన్ను అయిదో ఏట బళ్ళో ఏసినారటండి. బడి కెళ్ళిన మూడోనాడో, నాలుగోనాడో పంతులు ఒక దెబ్బేసి నాడటండి. పాపం అతగాడి తప్పేటండి? ఎంత జెప్పినా నాకు సదువు బుర్రకెక్క నేదటండి. కొట్టకపోడానికి నానేం నాయుడి కొడుకునా? బుగతమనవడ్నా అండి? ఆ దెబ్బకి జడుపు ఊష్టం (జ్వరం) వొచ్చేసినాదటండి నాకు.

పొగేయించినా పోనేదటండి.

మనకిసదువు అచ్చిరాదన్జెప్పి– నాసేత బడి మానిపించీ సినాడటండి మా దద్ద. నాను మానీసిన పదిరోజులకి పంతులే వొచ్చి– సొయానా నన్ను తీసికెల్లి నాడటండి. ఈపాలిమాత్తరం– పంతులు కొట్టకుండానే మళ్ళీ వొచ్చీసినాదటండి నాకు మాయ దారి ఊష్టం. యీపాలి మాత్తరం– సివంచలం కొండెక్కించి– గుండు గీయిస్తే గాని పోనేదటండి. మరింక మరోసారి పంతు లొస్తే నన్ను మావొళ్ళే–దాచీసినారటండి.

సదువెలాగూ లేదన్జెప్పి– నన్ను సిన్నప్పుడే బుల్లిబాబు గోరి యవసాయంలో ఎట్టీసినారండి. ఆళ్ళు–కూడెట్టీ వోరండి. గుడ్డిచ్చీవోరండి. ఆళ్ళ పశువులపాకలో తొంగో నిచ్చీ వోరండి.

సిన్నప్పుడుగొడ్లు కాసీవోణ్నండి. పేడలు తీసీవోడ్నండి. కుసింత వొయసొచ్చినాక నీళ్ళు మోసీవోడ్నండి. బుల్లిబాబుకి నలుగెట్టి తలంటీవోడ్నండి. ఆళ్ళ యింట్లో మనిషిలాగే– మెలిగీ వోడినండీ.

బుల్లి బాబుగారిల్లు ఊరికి వొంద పగ్గాలుంటాదండి. మూడె కరాల మాఁవిడితోట– మద్దెన గుళ్ళో లింగంలా– కుది మట్టం గుండండి ఆరి మేడ.ఆ మాఁవిఁడితోట పక్కనే ముప్పై ఎకరాల మాగాణీ అండి. అదిగాక అక్కడో ముక్కా–యిక్కడో సెక్కా కలిపి మరో ముప్పై యెకరాలుంటాయండి.

స్మసేనం యెనక–ఆరెకరాల కొబ్బరి తోటా ఆరిదేనండి. అది నానేసిన్దేనండి. యిప్పుడెలాగుందంటారేటి? వొయసొచ్చిన ముదరపెళ్ళి కూతుర్లా– నువ్వా? నేనా? అన్నట్టుందండి. దాని మీదొచ్చీ డబ్బుతో మూడు ఎమ్మెల్యే ఎలక్సన్లు గెలిసీవొచ్చండి.

బుల్లి బాబుగారొక్కరే అని జెప్పినాను గదండి. అంటే, ఆ బాబుకి తోడబుట్టినోళ్ళు ఎవురూ నేరన్నమాటండి. కానైతే నేవండి? ఇల్లంతా ఎప్పుడూ జనవేఁనండి. గడియో, చెణవో– బేండుమేళం వోళ్ళు వస్తారన్న పెళ్ళి యిల్లులాగుండీదండి. ఇంటి ముంగల పాతిక సెంట్ల పందిరెప్పుడూ ఉండాలండి. పెతీ ఏడూ దానికి కొత్తకమ్మ నెయ్యాల్సిందేనండి.

ఆ పందిరి –దానమ్మ–ఎంత సల్లగుండీదంటే– ముష్టోడన్నా సరే, మినిస్ట్రయినా సరే– అందులో కాలెట్టినాడంటే– కునుకు ఒచ్చీవొలసిందేనండి.

తాసీల్దారుకాడనుంచీ తాబేదారు వొరకూ– మా ఊరు కేంపొచ్చిన పెతీ ఆపీసరుకి భోజనం మాయింటినుంచే ఎళ్ళా లన్నమాటండి.

ఊరికి– అగ్గొచ్చినా– వొరదొచ్చినా– సరే, మాలోళ్ళ కూడు ఆ యింటికాడేనండి.

ఇక, సదువండి– బుల్లిబాబు బియ్యే వొరకూ సదివినాడండి. ఆకరి ఏడు సదువుతుండగా– ఆరి అయ్యపోతే– సదువు మానీసి నాడండి. సదూకుండీ రోజుల్లోనే ఓపాలి సత్తాగ్రహవో యేదో జేసి– ఆ బాబు ఆర్నెల్లు జైలుకెళ్ళి నాడటండి. ఆ బాబు సిన్న ప్పటినుంచీ– కద్దరే కట్టీవోడండి–సదువు మానీసినాక పంట్లాలు మానీసి పంచెల్లోకి దిగినాడండి. కాని, ఆ బాబు పంట్లాం సొక్కా ఏసుకుంటే– ఎలాగుండీ వోడండీ?– నెహూరు బాబు సిన్నప్పుడు యిలాగే వుండీవోడు కాబోలనిపించిందండి– సూసీవోళ్ళకి.

యింకాడోళ్ళు– సరేసరండి– ఆ బాబు యీదంటెళ్తావుంటే– మరి యీదకి లోపలికి తప్పుకున్నా కిటికీలకి– యేల పడి పోయీవోరండి.

అయితే మాత్తరం, మా బాబు అగ్గినిప్పండి. ఓ సిన్న సంగతి మనవి జేస్తానండి. అది వింటే తఁవఁరుగోరికే– అరదవఁయి పోద్దండి– ఆ బాబెలాటోడో!

అప్పటికింకా–ఆ బాబుకి పెళ్ళికానేదండి. ఆరి అమ్మ, అయ్య ఇంకా బతికే ఉన్నారండి.

మాబాబుగోరి కుటుంబానికి, బుగత గోరీ కుటుంబానికీ "అగ్గి–గాలీ" స్నేహితవండి.

ఇదిగో పసుపు అంటే అదుగో ముసుగని పాపం మనువైఁ న మూణ్నెల్లకే– బుగతగోరి మూడో కూతురు ముండమోసీ నాదండి–రంగుకి యెల్లావులాగున్నా, కాపఁరానికి మాత్తరం తోటపెద్దులా గుండీదండి. ఆ యమ్మ జుత్తు మోకాళ్ళవరకూ వొచ్చీదండి.

ఆ యమ్మని సూస్తే, తక్కువ కులపోళ్ళం – మాలో టోళ్ళకే – కొబ్బరి బొండాం తాగేసినట్టు తాగెయ్యాల నుండీదండి.

కళ్ళల్లో సెందురుళ్ళు నెట్టుకొని, తడి కోకతో, బంగారం లాంటి బిందెతో నూతికాడ్నుంచి– యిలా ఆరో నెల సూల్తో వున్న ఆవులా మందంగా నడిసొస్తావుంటే, ఎవుడన్నా సరే– ఆకరికి గాంధీగారు లాటోడికన్నా సరే– మరో పాలీ– మరోపాలీ జూడాలనిపించీదండి.

అలాటమ్మేగాని, పిలిస్తే పాలుతాగీవోడు కాడ్నించీ– పళ్ళూడి పోయిన వోడి వొరకూ– వొరసగా "క్యూ" నిలబడి పోతారన్న మాటండి.

కానాయమ్మ మాత్తరం అటువంటిది కాదండి.

సచ్చిన మొగుడి ఫోటోకి పూజ్జెయ్యన్దే– పచ్చి మంచి నీళ్ళన్నా ముట్టీది కాదండి. ఏకాసికీ, పున్నానికీ కటికు పోసాలుండీదండి.

ఓ పాలి– ఆ యమ్మ బావే–యింజనీరో ఏదో అట. సూద్దా నికి సినీమా "యీరో" లాగుండీవోడు– అతగోడు–ఓ పాలి ఆమె కొంగట్టుకుంటే– సెప్పు లేకపోయినా సేత్తోనే పళ్ళూడ గొట్టీసిందటండి.

కాని ఎన్నాళ్ళుంటాదండి అలాగ. పగలు యెన్ని పూజలు జేసినా– రేత్తిరి సచ్చిన మొగుడు పక్కలోకి రాడుకదండీ! ఆ వొయసోళ్ళు– కడుపుకి పస్తులెట్టినా, పరుపుకి పస్తులు యెట్టనేరు కదండీ. తప్పు ఆ యమ్మది గాదండి– వొయసుదండి. మరింక వొయసు బాద తట్టుకోనేక– ఓ పాలి– అరదరేత్తిరి నూతిలోకి గెంతీసినాదండి.

సరిగ్గా– ఆదే టయాంకి బుగతెందుకో లెగిసినాడు కాబట్టి సరిపోనాది గాని నేకపోతే ఆ యమ్మ నీటిసావు సచ్చీసీదండి.

నా నోటి జెప్తాను, యినుకోండి– అసలు మరోలాగ అనుకో వొద్దు– బాబూ– ఆలాటమ్మల్ని– బతికించకూడదండి– నూతి లోనో, గోతిలోనో పడిసావైనా– సవ్వనివ్వాల. లేకపోతే మరో మొగుడ్ని తేవాల. అంతేగాని మొగుడ్నీ తేక– సవ్వానివ్వక– ఆ యమ్మనలా గుండమనడం శానా పాపం బాబూ. ఏటో! మీలా టోళ్ళ కన్నా మాలాటి తక్కువ కులపోళ్ళవేఁనయం అండి. మొగుడు సస్తే మూణ్నెల్లు తిరక్కుండా మారు మనువుఁ జేసి పారేస్తాం.

అవునూ, నాను ఏటి సెప్తున్నానూ? బుల్లి బాబు కతలోంచి బుగత గోరి బొట్టె కతలోకి ఎలిపోనానండి. అంతే బాబూ– మాలాంటోళ్ళం– అదే మీలాటోళ్ళయితేనా–సావుఁలోరు పాం కోళ్ళతో నడిసినట్టు– టకటక జెప్పేస్తారండి.

ఓనాడు

మా బుల్లి బాబుగోరింట్లో– అంతా సివంచలం సెందన యాత్తర కెల్లిపోనారండి– ఒక్క బుల్లిబాబు తప్ప.

ఆ సాయంతరం నాను కిందున్నానండి.

బుల్లి బాబు మేడమీదున్నాడండి.

యీలోగా వొచ్చినాదండి బుగతగోరి బొట్టె.

పొద్దుపోనాదండి.

అప్పుడాయమ్మ సెంటే రాసుకుందో, సెందనవేఁ రాసు కుందో గానండి– వొళ్ళు గుమగుమ లాడిపోతున్నాదండి. నాను బట్టకట్టినాక ఆయమ్మ మా మేడెక్కడం జూడలేదండి.

"పెద్దయ్యగారేఁరా? అమ్మగోరు ఉన్నారా" అని అన్ని యివ రాలూ అడిగినాదండి. ఆ యెనక బుల్లి బాబుగోరి కాడికి– మేడ మీది కెళ్ళినాదండి.

ఎక్కినమ్మ ఎక్కినట్టూ–నివఁషవఁన్నాకాందే– మేడదిగి ఎళ్ళి పోనాదండి– కొంగుతో కళ్ళు వొత్తుకుంటూ.

"యిదేఁటా బగమంతుడా" అని నాను శానాయిద్దై పోనానండి.

మరింకేటుందండి? తెల్లారేసరికి ఆ యమ్మ శెవం సెర్లో– తావఁర పువ్వుల మద్దెన కలవ పువ్వులా– తెల్లగా తెప్ప తేలి పోనాదండి.

# 7

మా బుల్లి బాబు గాందీగోరి శిష్యుడన్చెప్పినాను కదండీ. కద్దరే కట్టేవోడని గూడ జెప్పినానా? అతగోడి బుద్ది దరమ బుద్దండి. ఎస్టేటు సేతి కొచ్చినాక సదువు మానీసినాదని జెప్పి నాను గదండీ.

"ఓసోస్, యిలాంటి గాందీబక్తుల్ని బుఁరమీదెన్ని ఎంఁట్రు కలున్నాయో అంతమందిర్ని సూసినాం. కాలంలో వున్నోడిసేతల ఆస్తి కర్పూరబ్బిళ్ళే. ముప్పై పెట్టిల్లో పెట్టినా అరించుకుపోద్ది" అన్నారండి ఊరు పెద్దలు– ఆళ్ళయన్నీ దురాలోసనలేనండి.

అసలు మా బాబెలాటోడో తెల్దు మీకు.

పరాయోడి పైసా పూజ్జేసిచ్చినా ముట్టుకోడండి.

"పరాయోడి పెళ్ళాం పరాయోడికే పెళ్ళాం."

"ముందుకెళ్ళాలంటే "మందు" ముట్టుకో కూడదు."

"పేకాడీవోడు పైకెళ్ళడు"

"ఒకరికి పెట్టింది మనకి వొడ్డీతో సహా ఒచ్చేస్తాది," ఇలా గుండీయండి– ఆ బాబు ఆలోసెన్లు.

ఊర్లో ఏ ముష్టోడికి ఒళ్ళు సాలొచ్చినా ఆ బాబే ఆస్పత్రిల్లో జేర్పించాలన్న మాటండి.

కూలోళ్ళ కొంపలు కాలిపోతే అన్నదానం ఆ బాబే సెయ్యా లండి. మరోడికాడ ఆడెదు బియ్యం కూడా అడక్కుండా.

మునసబింట్లో పెళ్ళయినాసరే, మాలాడింట్లో పెళ్ళయినా సరే– పిలవాలే గాని ఆ బాబు వెళ్ళేవోడు. ఆ బాబొస్తే ఏ పెళ్ళి పందిరైనా– సరే– గేసునైటులా గెలిగిపోయ్యాదండి.

ఓ పాలి...ఆ బాబు పొలాల్లో– నూర్పులౌతున్నాయండి.

నూర్పులంటె బండెడూ, గరిసెడూనా? ఆ బాబు ధాన్యం ఆడ్డానికే– పెత్యేకంగ ఓ మిల్లు ఉండిపోవాలన్నమాట.

పసువులు సరదాగా తొక్కుతున్నాయండి– గింజల్ని.

"సంతకెళ్ళాల మాం– బేగెళిపోతాం" అన్నారండి కూలాళ్ళు. ఏటి జేస్తాం? కాదన్లేం కదా? సరే పొమ్మన్నానండి.

ఆళ్ళెల్తావుంటే ఎందుకోగాని అటేపు జూసినానండి. యెంటనే యెఱ్ఱి కోపం వచ్చేసినాదండి– కూరవఁమ్మని– వొర సకి నాకు సెల్లెలౌద్దండి– దాని కొంగున మూట అగుపడి నాదండి.

కొంగిప్పమన్నానండి.

"ఏట్నేదు పోనియ్యన్నా" అని బతిమిలాడినాదండి.

"ఇప్పుతావా? నాలుగెయ్యమన్నావా?" అని కఱ్రెత్తానండి. ఇలాటిషయాల్లో సుట్టరికాలు సూసుకోగూడదు కదండి–

మరిక తప్పదని యిప్పినాదండి కొంగు.

సేరు గింజలు రాల్నాయండి.

"నాకు శివఁవెఁత్తిపోనాదండి."

"కడుపుకి నేకపోతే ఆ బాబుని అడుక్కోవాలగాని యీ దొంగపనెందుకే తప్పుడు నంజా!" అన్జెప్పి కొప్పట్టుకొని యీడిసి కళ్ళి బుల్లిబాబు కాళ్ళకాడ పడేసినానండి.

ఆ బాబు నన్నోపాలి– ఎగాదిగా జూసి "నాను సూసు కుంటాను, నువ్వు పోరా" అని నన్ను తగిలీసినాడండి.

ఆ మాయదారిముండేం సెప్పిందో– ఈ బాబేటి యిన్నాడో గాని నన్ను పిలిసి దానికి కుంచెడు గింజలు కొలిపించినాడండి.

నాను తెల్లబోనానండి.

అదెళిపోనాక "అది దొంగముండ" అన్నానండి.

అందుకా బాబు చిన్న నవ్వోటి నవ్వి, "దొంగ కానోడెవఁడ్రా? నిజానికి యీ ఊరికి నానురా గజదొంగని" అన్నాడండి.

అలాంటి దరమబుద్దండి ఆ బాబుది. అందుకే సూఁద్రోడైనా– బేపనోళ్ళ సేత మొక్కించుకునీవోడండి.

దేశానికి గాంధీగోరు ఎలాటోడో, మా వూరికి ఆ బాబు అలాటోడనిపించీదండి మా అందరికీని.

ఊర్లో ఏ తగువొచ్చినాసరే మొగుడు, పెళ్ళాం తగువు కాడ్నించీ తండ్రీ కొడుకుల తగువువొరకూ ఏదైనా సరే– ఆ బాబు తెగ్గొట్టవలసిందే నండి.

"కోరటుకెక్కినోడూ గాడిదెక్కినోడూ ఒకటేరా" అనీవోడండి యెప్పుడూను.

"ఎవుడు గొప్పైనా పెళ్ళయ్యావొరకే. పెళ్ళవనీ ఇతగోడి పెద్దరికం ఎన్నాళ్ళుంటుందో సూద్దాం" అనీవోరండి గిట్టనోళ్ళు.

కాని ఆ బాబు పెద్దరికం పెళ్ళయినాక పెరిగినాదేగాని తరగనేదండి.

కాంతమ్మగోరిది–అంటే–ఆ బాబు బార్యగోరిది– యిజా నగరం అవతల అగ్గురోరవండి. ఆ యమ్మా– కన్నోరికి వొక్కర్తే నండి. అగ్గురోరం సగం ఆళ్ళదేనండి.

ఆ బాబుకి నానంటే పేనం. ఎక్కడకెళ్ళినా సరేనండి– పొద్దుటినీడ నాగ– నాను ముందుండవొలసిందేనండి.

నన్నూ తీసికెళ్ళినాడండి తన పెళ్ళికి.

"ఆడు నా తోడపెళ్ళికొడుకు" అనీవోడండి– అందరికీ– నన్ను సూపెట్టి.

"ఒరేయ్– నువు నూలుపంచె కట్టినావ్. నాను జెరీపంచ కట్టినాను. నేకపోతే నువ్వే పెళ్ళికొడుకనుకుంటార్రా అంతా" అన్నాడండి నాతో.

పెళ్ళికి నాలుగు పంచలిచ్చినాడండి. "నా బతుక్కి బనీన్లు సాలు" అని మొత్తుకున్నా యినకుండా, నాలుగు సొక్కాలు కుట్టించినాడండి. అత్తోరి చేత జరీపంచకూడా ఎట్టించినాడండి.

"ముష్టోడికి ముత్తెం ఉంగరవఁని" నాకెందుకు– జల్తారు పంచె– ఒద్దన్నానండి.

"ఉండనీరా–పెళ్ళికి సోకుజేద్దువుగాని" అని ఆసికం ఆడ్నాడండి.

ఆ బాబు–తనకి–పెళ్ళయిన మూణ్నెల్లకే–నా పెళ్ళీ జరిపిం చేసినాడండి. మా యాడదాన్నీ కాంతమ్మగారూరే నండి.

నాకు తొలిసుట్టు బొట్టెడు- పుట్టినప్పటికి కాంతమ్మగోరికి సీవంతం జేసినారండి.

"మొత్తానికి నాకన్నా నువ్వే నయ్యింరా" అన్నాడండి ఆ బాబు- నా బుజమ్మీద సెయ్యేసి.

వొల్లమాలిన సిగ్గేసిపోనాదండి నాకు.

ఏటి బాబూ? "కట్టుకున్నదానికే కట్టుబదుండిపోనావా?" అనడుగుతున్నారా? కట్టుకున్నదాన్తోనే కాపరం జేసే వోపిక వుండదండి మాలాటోళ్ళకి-ఇంక మరోకర్తి కూడానా అండి మా బతుకులకి? కంచం గురించేగాని- మంచం సంగతి ఆలోసించడానికి- టయాం వుంటాదేటండి మాకు?

ఒకేళ వున్నా- మరొకరికాడ కెళ్ళినా- మాఁవుఁ మీలా పెళ్ళాల్ని పుట్టిళ్ళకంపకంఎట్టీవండి.

నా సంగతెందుకు గానండి-

బుల్లిబాబుగోరు మాత్తరం- పెళ్ళానికి కట్టుపడిపో నాడండి.

కాంతమ్మగోరు కూడా- శానా మంచి మనిషండి.

బగమంతుడంటే బక్తండి.

బర్తంటే కుసింత బయం తక్కువనే జెప్పాలండి.

నెలకిపదేన్రోజులు పూజగదిలోనే వుండిపోయీదండి ఆ యమ్మ. మిగతా పదేన్రోజులూ- మంచంమీదుండి పోయీదండి. పాపం ఆ యమ్మకి ఉబ్బసవండి.

మరింక-ఆ యమ్మ ముత్తేల్లాంటి ముగ్గురు పిల్లల్ని ఎలా కన్నాదో-యిసిత్తరంగానే వుండీదండి.

ఆ యమ్మకి లేనోళ్ళంటే శానా జాలండి.

ఆరింటికొచ్చినోడు-ఎవుడన్నా సరే - ఉత్తిసేతుల్తో తిరిగెళ్ళ లేదండి.

ఆ యమ్మ సెయ్యని పూజనేదండి.

మొక్కని సెట్టూ పుట్టా గూడా నేవండి.

ఆ యమ్మ బతుకంతా పూజలూ, నోవుఁలూ, కొబ్బరి కాయలూ, కర్పూరాలతోనే తెల్లారిపోనాదండి.

అయితే అయ్యన్నీ ఊరికేపోనేదండి.

ఆ యమ్మ కాలెట్టినాక మాబాబు దశ- పాలకుండలా- పొంగి పోనాదండి. పుచ్చుగింజలు పాత్తే పుట్ల కొద్దీ పండీసీయండి పొలాలు. ఆ యమ్మ సేత్తో పేణ్నీళ్ళు జల్లితే పన్నీర్లై పోయీదండి.

ఆళ్ళకి మొదట్లో పసందైన జటకా ఒకటుండీదండి. లోపల పట్టు పరుపులూ, సిలుకుతెరలూ నండి.

అది గుర్రం కాదండి- పంచకల్యాణి అండి. దాన్ని ఆ యమ్మ-కన్నోరికాడనుంచి తెచ్చుకున్నాదండి.

ఆ యమ్మే యెట్టాలండి, దాణా.

దానికి- మాలీసు నానే జేసీవోడినండి. దానికికనువుఁ నాడు-ఉడుకునీళ్ళు తాన వాడించి-కుంకవెఁట్టి, హారతిస్తే-యుద్ధానికెళ్ళే యువరాజునాగ ఉండీదండి ఆ గుర్రం.

దరిమిలా- మాబాబు జీపు కొన్నాక, జటకా అమ్మేసినాడండి! కాని గుర్రాన్ని అమ్మనివ్వనేదండి ఆ యమ్మ.

"నాతోటే వొచ్చింది. నాతోటే పోవాలనీదండి."

సెప్తే నమ్మరుగానండీ, మా యమ్మకి పెద్ద జబ్బుచేసి ఓ రేత్తిరి పూట-పోనాదండి. ఆ రేత్తిరి గుర్రాన్ని జూసినోళ్ళు నేరండి. తెల్లారి సూస్తే ఏవుందండీ? సాల్లో సచ్చిపడున్నా దండి గుర్రవుఁ!

ఆ యమ్మ సెప్పినట్లే యిద్దరూ ఒక్కపాలే ఎల్లిపోనారండి.

అంత సల్లని తల్లిని మరి సూడవండి.

ఆ యమ్మ సూపు తగిల్తే సాలండి- సచ్చిన సెట్టుకూడా సిగురెట్టీసీదండి.

ఊర్లో ఎవరి పెళ్ళయినా సరేనండి- ఆ యమ్మ కొత్తకోక యెట్టవొలసిందే. ఆ కోక్కట్టిన ఆడకూతురు కంట నీరెట్టకుండా కాపరం చెయ్యవొలసిందే- అది రూలేనండి.

జరీ అంచు లాగుండీదండి ఆ యమ్మ నవ్వు.

ఏటైతేనేం- ఎన్నుంటేనేం అయిదోతనం ఇచ్చిన ఆ యమ్మకి ఆయుసు యివ్వనేదండి- ఆ మాయదారి దేవుఁడు.

ఆ యమ్మ పోనాక- మా బాబు పిచ్చెత్తినట్లైపోనారండి- చాన్నార్లు. కొన్నేళ్ళకి గాని తేరుకోలేకపోనాడండి.

ఆ యమ్మ పోయిన పదో రోజు కాడ్నించీ- యింటి మీద పడిపోనారండి- మిడతల దండునాగ సుట్టాలూ సుట్టు పక్కలా ళ్లూను- మావుఁ పిల్లనిస్తానంటే- మావు పిల్లనిస్తావని.

కాని నేను ముందరే మనవి జేసినాను గదండి- ఆ బాబు గాందీగోరి శిష్యుడని.

మరింక ఆ బాబు ఏ ఆడదాని వేపూ కన్నెత్తి సూడ్నేదండి.

# 8

అప్పుడు ఆ బాబుకి పెళ్ళయిన కొత్తరోజులండి..

ఓ పాలి– జిల్లా హోల్ మొత్తం కాంగిరెస్సోళ్ళంతా జీవులేసుకుని దిగిపోనారండి మా ఇంటికి. సంగతేటంటే– ఆళ్ళకి డిల్లీ నుంచి ఆర్డరొచ్చినాదటండి– యీ బాబు నెలాగయినా సరే ఒప్పించి – కాంగిరేస్సు టిక్కెట్టు యియ్యమనీ, ఎమ్మెల్యేకి నిల్సోమని సెప్పమనీని.

ఆ టికెట్టు కోసరవఁని– అప్పటికే ఎవురో ఇద్దరు కొట్టుకుసస్తున్నారటండి. అందులో ఒకడు మూడుసుట్లు ఎమ్మెల్యే జేసి నాలుగు మేడలు కట్టేసినాడటండి. ఇక రెండోవోడు– ఒక సుట్టున్నా ఎమ్మెల్యే జేసి ఒక్క మేడన్నాకడదావఁన్న ఆశ మీదున్నాడటండి.

ఆళ్ళలో ఎవుడికీ టిక్కెట్టు యియ్యకపోతే ఆడెళ్ళి అపోజిషన్లో కలిసి పోతానన్నాడటండి. ఇయద్దరూ యిబీసనులేనటండి. ఆళ్ళిద్దరూ ఏ సవుఁద్రంలో దిగి పోయినా పరవానేదు– బుల్లిబాబునే నిల్సోపెడదారని– ఢిల్లీ బాబుల ఉద్దేశవఁటండి.

ఆఁ–ఓ పాలి ఆ బాబులంతా దిగిపోనారని సెప్పేను గదండీ. ఆళ్ళందరికీ– "కేఫీ"లూ టిపిన్లూ అందించేసరికీ– పాడిగేదంటే పాల్తల్లి అనుకున్నారేటి? అడిగినప్పుడల్లా చేపడానికి– మూడో పాలి పొదుగుకాడ కెళ్ళి జూడండి. మూతి పళ్ళిరగదంతాది– నా పేనం సాలొచ్చేసినాదండి– ఆళ్ళకి "కేపీలు" టిపిన్లూ– అందించేసరికి.

ఇంతకీ ఆళ్ళు మా బాబుతో ఏటిజెప్పినారంటే–నీకెలా తెలిసినాదిరా అంటారా? నాను అక్కడే వున్నాను గదండి– అవీ యివీ అందిస్తూ... "నువ్వు నిల్సోకపోతే ఏ కమ్యూనిస్తోడో– గెద్దనాగ– తన్నుకుపోతాడు సీటు. పోనీ ఈ దేవులాడీ, యిద్దరెద వల్లోనూ ఒకడికి పారేద్దావాఁ అంటే యిద్దరూ యిబీషణులే. మరింక నువ్వు– బాబ్బాబు నిల్సోక తప్పదు. అన్నారండి ఆళ్ళంతాను.

అందుకు మా బాబేటన్నాడో ఎరికా?

"మీ సీటు రషియా వోడట్టుకుపోయినా సరే– చెయినావోడు తన్నుకు పోయినా సరే నా కొకటే–నాకీ రాచకీయాలొద్దు. అసలు నిజెంగా దేశాన్ని ఉద్దరించాలనుకుంటే ముందు ఊర్ని ఉద్ధరించాల. ఊర్ని ఉద్దరించాలనుకుండీవోడు ముందు తనిల్లు ఉద్ధరించుకోవాల. ఇదీ నా "తీరీ" అన్నాడండి మా బాబు.

ఇన్నోళ్ళంతా నోళ్ళెళ్ళబెట్టేసినారండి. ముక్కుమీద ఏళ్ళేసుకున్నారు. ఏటీ ఎఁర్రిగొల్లోడు. ఎమ్మెల్లే ఇస్తానంటే వద్దంటాడని–

అందుకే ఆ బాబు గొప్పోడన్నానండీ.

వచ్చినోళ్ళంతా ఏటి జేసేరా?

ఏవుందీ సెయ్యడానికి?

తెచ్చిన పువ్వుల దండలు బుజాల మీదేసుకొని జీపులెక్కి యెళిపోనారండి– యీ బాబుకి దండల దండుగెందులకు? ముండలకైనా పనికొస్తాయనుకున్నారో– యేటో గాని.

ఆళ్ళు రాకముందు– బుల్లిబాబు మా ఊరికి వుట్టి పెద్ద. అంతేనండి.

ఆళ్ళెళ్ళిపోనాక– ప్రైమ్మినిస్టైపోనాడండి.

ఊరికో బుల్లి బాబూ, దేశానికో గాందీగోరూ వుంటే, నా సావిఁరంగ మరింకేటి? దేశం, సొరగం అయిపోదూ? అన్నారండి అంతాను–

అసలీ బాబుకేటి కావాల?

ఏటీ ఒద్దు.

ఆ బాబుకి....

ఆస్తొద్దు– అంతస్తు అంతకన్నా వొద్దు.

పవరొద్దు– పరపతొద్దు.

ఆడదొద్దు– మందొద్దు.

ఎమ్మెల్యే వొద్దు–ఎంపీ వొద్దు.

రాచరికం వొద్దు– రాజకీయం వొద్దు.

సరదా వొద్దు– సరసం వొద్దు.

బూడిద రాసుకున్న ప్రెతీవోడూ బైరాగి కాదు. కాని యీ బాబు మాత్తరం బూడిద రాసుకోకపోయినా బైరాగే–

ఆ బాబుకి ముందుసూపుంది.

యెనకాలోసెన కూడా ఉంది.

ఆ కాంగిరెస్సోళ్ళు అలాగెల్లినారో– నేదో యీ బాబు యిలాగ రంగంలోకి గెంతినాడండి.

"ముందు మనూర్ని బాగుజేస్తే సాలు" అంటూ.

అసలా మాటన్నా ఎవుడంటున్నాడు బాబూ – యింకా – యీ రోజుల్లో? తవఁరు గోరేఁవనుకోకండి. యియ్యాల ప్రెతీ

ఎదవ, "నాను బాగుపడాల" అనేగాని "అయ్యో పక్కోడి సంగతేటి?" అని సూస్తున్నాడా?

అంతెందుకు బాబూ? మనకి యింత మందిరి ఎమ్మెల్యేలున్నారు. అంత మందిరి ఎంపీలున్నారు.

ఏదీ, ఓ మంతర్నానిముండ టాన్సపరు సేయించ మనెల్తే- "నువ్వొస్తావా? నీ కూతున్నంపుతావా?" అనడిగే రకవేఁగాని మరో రకం ఉన్నారా?

మా ఊరికాడ- ముందటేడు- బొద్దేరుకి- అదేటీ? బ్రిడిజీ కట్టినారండి. దాని కాంట్రాక్టరెవుడూ? మన యం.పి. గోరి బావమరిదేనండి. మొదటిరోజు వొరసానికి బ్రిడిజి సెక్కుసెదర్నేదండి- రెండోరోజు వొరసానికి మొత్తం బ్రిడిజీయే- నేదండి. అసలు పునాదులెక్కడేసినారని? ఎవుడో- నాలాటోడు అడిగితే కాయితాల మీద ఎతికినారటండి. ఎక్కడేసేవాఁ అని.

అంతెందుకు బాబూ- మా పక్కూళ్ళో మూడేళ్ళ కింద స్కూలు కట్టినా రండి. అదెవడు కట్టినాడనుకున్నారూ? ఎమ్మెల్లే గోరి ఏలిడిసిన మేనల్లుడు- ఎదో, మన గుంటలకి నాలుగు ముక్కలబ్బుతాయి కదా అని అంతా తెగ సంతోసపడిపోనారండి. కానా సంబరం సల్లారిపోడానికి ఎంతో టయాంపట్టనేదండి....ఆ ఏడు వొరదా నేదు, వొరసం నేదండి-కానైతే మాత్తరం ఓ పాలి పొద్దుపోనాక, కుసింత గాలేసినాది. అంతే. ఏట్రాబాబూ కాలం కాని కాలంలో యీ గాలీ-అనుకుని ఎవురి కొంపల్లో ఆళ్ళు తొంగున్నారండి.

తెల్లారి సూద్దురూ! ఊరికి ఓ పక్క ఏటో బోడిగా అనిపించినాదటండి. సంగతేటా అని ఊరంతా అనుకుండీ టయాములో ఓ సంటాడు సప్పట్లు కొడుతూ మా స్కూలు పడిపోనాదోస్ అని గెంతినాడటండి.

అందరి గుండెలు ఒక్కపాలే నల్లబడిపోనాయటండి. యింకా నయ్యం-అది రేతిరైంది కనక మూడు గాడిదల సావుతో సరి పోనాది- గాని- నేపోతే ఊరి గుంటలంతా అయ్యోర్లతో సహా సచ్చిపోయీవోరు అనుకున్నారండి.

అదండీ బాబూ మన సంగతి.

యిక-మా బాబు రంగంలోకి దిగీటప్పటికి మా వూరి పంచాయితీ గతేటంటారేటి? "ఇదేటి పంచాయితీ ఆపీసా? పాకీ దొడ్డా?" అనుకుండీ వోరంతా.

అనుకోవడవేఁటండి ఆ మాటే అడిగీసినాడు ఓపాలి సడన్‌గా సైకిలు మీద దిగిన కుర్ర కలక్టరు-ఒకడు.

'హొరిజినల్‌గా పాకీదొడ్డే సార్. స్థలంలేక అందులోనే ఆఫీసు కట్టినారు" అన్నాట్ట ఓ మాలనెంబరు.

"నువ్వు మెంబరుగాదు-పెసిడెంటు అవ్వాలిసిన వోడివి" అన్నాడట ఆ కలక్టరు.

"నిజవేఁ మరి" అన్నాడట ఆ మెంబరు.

రేత్తిరిపూట ఆఫీసు అరుగులమీద గాడిదలు తొంగుండీవండి. ఆడోళ్లు కాంపొండులో మరుగుకి కూకుండీ వోరండి.

రోడ్లమీద ఎక్కడ సూడండి- కుళ్ళుగుంటలూ- గుంటల నిండా పందులూను, సుబ్బరవైఁన రోడ్డెయ్య కూడదా అని మీలాటి బాబులెవరన్నా అడిగితే-

"గువఁస్తాల జీతాలకే సాల్డంలేదు డబ్బు. గవర్నమెంటుకాడ అప్పుతెస్తన్నాం" అనీవోడండి ప్రెసిడెంటు.

పట్టుకెళ్తున్న పన్నులన్నీ ఏటై పోతున్నాయి అని అడిగీవోడే లేక పోనాడండి.

"రోడ్లేయిస్తాం, సెరువులు తవ్విస్తాం" అని గవర్నమెంటు కాడ డబ్బు తేడం, నలుగురూ పంచుకొని తినీడం, అంతేనండి పని.

పంచాయితీ ఏ పని చెయ్యకపోయినా పారిటీలు మాత్తరం రెండుండీవండి.

రెండు పారిటీలవోళ్ళూ-ఒకళ్ళమీదొకళ్ళు కోడికేసో, కుక్క కేసో ఎట్టుకోడం, కోరటుసుట్టూ తిరిగి గుమస్తాల్నీ, ప్లీడర్లనీ మేపడం, ఊర్నిసెడిపీడం.

ఇదండి వొరస.

ఏ పండుక్కో, పబ్బానికో ఎపుడన్నా- సరే- ఓ సుక్కేసుకుంటే సాలు- అవతల పారిటీవోడు వచ్చీసి యీడి పెళ్ళాన్ని బైటికి నాగి, కన్నోరింటికి అంపించీసి, దాన్నేత మనోవర్తికి కేసెట్టిం చీడం- యీ కేసు తేలీలోగా ఆడొకర్తినీ, అదొకడ్నీ- తగులు కోడం- సీ! సీ! అడక్కండి బాబూ ఆ ఊసులు.

మనుషులు సెడిపోనారు. ఊరు కుళ్ళిపోనాది.

కూటికి లేనోడు వస్తే కాటికీడిసేవోడే నేడు.

వోనా వొరదా వొచ్చి కూలీ, నాలీ తిండినేక సస్తావుంటే అయ్యో అనే వోడుకూడా నేదండి-

అదిగో సరిగ్గా ఆ టయాంలో దిగినాడండి బుల్లిబాబు రంగం లోకి.

ఊళ్ళో పెద్దలు పదిమందికి కబురెట్టినాడండి– రమ్మని.

కానైతే పిల్లా పాపల్తో–ఊరు ఊరంతా ఇరగబడిపోనా దండి మా యింటిమీద.

నిజానికి ఆ బాబు అంతమందిరిలో మాటలాడ్డం–అదే తొలిసుట్టు–అయితే నేవండి? తొలిసుట్టు పురుళ్ళా ఆ బాబేఁ వీఁ నొప్పులు పళ్ళేదండి.

మందిని జూసి ఉషారెక్కిపోనాడండి.

జంగంవోడి గంటలా– గింగురెట్టేసినాడండి.

"మనవంతా ఎవరం? ముందు మదుసులం. తరువాతే– బేపనోళ్ళం, కోవఁట్లం, కాపోళ్ళం, మాలోళ్ళం. మనందరిదీ ఒకటే కుటుంబం. ఊర్లో మాలోడికి జబ్బుచేస్తే పట్టించుకోని వోడు–ఆడు ఎవుడన్నా సరే–బేపనోడైనా సరే– ఆడమ్మ మొగుడైనా సరే–ఆడు మాలోడికన్న కనికష్టం.

ఊళ్ళో ఎవురైనా సరే పస్తు పడుకున్నాడంటే ఆడు కూలోడైనా, మాలోడైనా సరే ఆడికి ఆ నీరసం యీయేళుంటాది. రేపు ఏదైనా తింటే పోద్ది. కాని ఆ నీరసం పదేళ్ళుపోనాక దేశాన్ని పట్టుకుంటాది. దేసెం సచ్చీ వొరకూ మరింక ఒగ్గదు. యీ మాటలు నాయి గావ్.

సచ్చి సొరగాన్నున్నాడే– గాందీగోరు? అదిగో ఆ బాబువి.

ఎవురేటన్నా ఏట్నాబం?

మనకి గవుర్నమెంటు నేదా? రెండున్నాయి.

ఆఫీసర్లు నేరా? వేలకొద్దీ ఉన్నారు.

ఎమ్మెల్యేలు? ఎం.పీ లు? సెప్పక్కర్లేదు.

ఎందరుంటే మాత్తరం ఏటొరుగుతున్నాది?

బతుకు లొరిగిపోతున్నాయి. అంతే.

ఎవుడూ పక్కోడి సంగతి పట్టించుకోడు.

ఎవుడిమట్టు కాడు తన కడుపూ, భోషాణం నింపుకుంటున్నాడు. అంతే.

నానేదో నీతులు సెప్తున్నానుకోకండి.

ముందు మనూరు బాగుపడాల.

అప్పుడు జిల్లా దానంతటదే బాగుపడుద్ది.

జిల్లా బాగుపడితే రాష్టరం బాగుపడుద్ది.

రాష్టరం బాగుపడితే దేశం బాగుపడుద్ది.

దేశం బాగుపడితే పెపంచకవేఁ బాగుపడుద్ది.

ఊరు బాగుసెయ్యడవంటే ఇక్కడో సింతపిక్కా, అక్కడో ఏప మొక్కా పాతి నాబంనేదు.

ఇక్కడ ముష్టోడి కిన్ని గింజలూ, అల్లా కుష్టోడి కిన్ని మందు నీళ్ళూ పోసి నాబంనేదు.

ఇది ఒకడి వొల్ల అయ్యేపని గాదు– ఆవదు.

అందరం కల్సి సెయ్యాల మరామ్మతు.

దానికి సంగాలు, సందాలు అక్కర్లేదు. ఉన్న పంచాయితీ సాలు.

ఊరంతా ఒకే పారిటీ గావాల.

నాకేం వొద్దు.

ఇక్కడున్న– సిన్నా, పెద్దా–అంతా కలిసి–ఆలోసన సెయ్యండి. పంచాయితీ మెంబర్లందరి పేర్లూ ఒక లిస్టు ఎయ్యండి – నా పేరు మాత్తరం వొద్దు.

ఆ పేర్లలో లాటరీ తీద్దాం.

ఎవుడి పేరొస్తే ఆడే పెసిడెంటు.

ఏటంటారు? లాటరీలో వొచ్చినోళ్ళే మెంబర్లుకూడా. అని కూకుండి పోనాడండి.

ఆ బాబంత సక్కగా పనసపండొల్చి పళ్ళెంలో ఎట్టినట్టు సెప్పే ఎవుడు మాత్తరం ఏవంటాడండి?

అయితే కిష్టప్పబాబని ఓ సావుకోరు– లెగిసినాడండి– పుట్ట లోంచి పావు– లెగిసినట్టు.

లెగిసి ముందు బుల్లిబాబుకి దణ్ణవెఁట్టినాడండి.

ఆనక జెనానికో దణ్ణవెఁట్టినాడండి–

దణ్ణాలైనాక "బుల్లిబాబూ, యింతసేపూ నీ మట్టుకు నువ్వు మాటాడినావు. నాను మాత్తరం ప్రెజ తరపున మాట్టాడు తున్నాను. వొల్లకాదనడానికి నువ్వెవడివి?

నీ పేరు ఎక్కడా వుండకూడదన్నావు.

అసలు లిస్టులో మొదటి పేరు నీదే ఉండాలంటాను. పెసిడెంటువీ నువ్వే అంటాను" అని కూకున్నాడు.

జనం సప్పట్లు కొట్టేరు సూడండి బాబు– సెవులు సిల్లులడిపోనాయి.

అంతమందిరి మాట కాదన్లేకపోనాడు మా బాబు.

“మెంబరుగా– మా వుండవంటే మావుండం” అన్నారండందరూ.

యీ బరువు మావుఁ మొయ్యలేవంటే మాఁవుఁ మొయ్య లేవనీసినారండి.

ఎలాగైతేనేం మా బాబు అందరికీ నచ్చజెప్పి వొప్పించి, మెంబర్ల లిస్టు తయ్యారు చేసీసరికి రేత్తిరి పద్దాటిపోనాది.

నీకు మెంబరూ వొద్దు– పెసిడెంటు పనీ వొద్దన్నావు. అలాగ నడానికి–నువ్వెవడివి. పెసిడెంటుకి లాటరీ యెట్టాలన్నావ్– నాను కాదంటాను– ఎలక్సనుండాలంటాను” అని ఆగినాడండి. జెనం తెల్ల మొకాలు ఏసీసినారండి–ఈ లోగా మళ్ళీ కిష్టప్పబాబే అందుకున్నాడండి– ఇక్కడ ఊరంతా ఉన్నారు. నిన్నే పెసిడెం టుగా ఏకుమ్మడివి– ఎన్నుకుంటున్నాం– నువ్వు సెప్పినోళ్ళే మెంబర్లౌతారు” అని కూకున్నాడండి.

## 9

నెల తిరక్కుండా పంచాయితీ ఎలక్సన్లొచ్చినాయి. బుల్లిబాబు లోగడ తయారీ సేయించిన లిస్టులో వోళ్ళే మెంబర్లయినారు.

బుల్లిబాబు పెసిడెంటైనాడు.

యీ యిసయం పేపర్లలో ఏసినారు.

పేపరోళ్ళు మావూర్లో వోరంవేసి రోజులు మకావుఁలు ఎట్టేసీ వోరండి.

ఆళ్ళు ఏటి? అంకుపాలెం, నరసయ్య పేట్నుంచీ వొచ్చేరను కుంటున్నారేటండి?

ఢిల్లీ, కలకత్తా, చెన్నపట్నం నించి కూడా వొచ్చినారు.

అయిద్రాబాదు నుంచి ఏ మినిష్టర్నా మా జిల్లా కొచ్చి నాడంటే మా వూరు రావొలసిందే. ఆపీసరైనా సరే అంతేనండి.

ఊరిమీద గౌరవంతో పదిమందిరొస్తే బుల్లిబాబుగోరింటి బోజనం కోసరం తొంబైమంది వొచ్చీవోరండి.

మెంబర్లయిన వోళ్ళలో బుచ్చిబాబని ఒక బాబున్నాడండి. యీ బాబు తాతా, బుల్లిబాబు తాతా అన్నదమ్ములండి.

కాని యీ బాబులు మాత్తరం తోడబుట్టినోళ్ళలా ఉండేడీ వోరండి.

ఒకఏడు అటూ, ఇటూగా–యిద్దరి వొయసులూ ఒకటే నండి. మరి ఆస్థులూ అంతేనండి.

కాకపోతే బుచ్చిబాబు సదువు మాత్తరం ఐస్కూలుతో ఆగి పోనాదండి.

తెల్లారి ఆ బాబు యీ బాబింటికన్నా రావాల, నేకపోతే యీ బాబు ఆ బాబు ఇంటికన్నా ఎల్లాల, మద్దినేల వొణ్ణం యిక్కడతింటే, రేత్తిరిపూట అక్కడ తినాల ఇద్దరూ.

కుశలవుల్లా వుండీవోరండి.

ఊర్లో ఏ తగువొచ్చినా సరే–గట్టుకాడ తగువైనా, పుట్టకాడ తగువైనా–మొగుడుపెళ్ళాల తగువైనా–ముండ తగువైనా – ముందు ఆ బాబులు కాడికెళ్ళాల. ఆ బాబులుదాన్ని తీరిసి పారెయ్యాల. ఇది రూలేనండి.

యీ రూలెట్టింది–ఎవురనుకుంటున్నారూ?

ఊరి వోళ్ళేనండి.

యింకేటుంది? అప్పటి కాడినించీ ఎపుడూ కోరటు కెళ్ళ నేదండి.

ప్లీడర్లకి మా వూరిమీద కోపాలొచ్చీసినాయండి.

మా వూరోడెవడైనా దండమెడితే అందుకోడంకూడా మానీసి నారండి–ప్లీడరు గుమాస్తాలు.

ఎక్కడో మొదలెట్టి–ఏటో పోతున్నానండి.

పంచాయితీ తొలిసుట్టు మీటింగు నాడు సూడండి బాబూ – సూడ్డానికి రెండు కళ్లు సాలవండి. యెయ్యికళ్ళ యిందురుడు రావొలసిందే.

ఏం జనం! ఏం జనం!

కాకినాడ పోతుకీ, మాదుగుల పోతుకీ (గొౖరెపోతు) పందెం నాడు కూడా అంతమందిరి రానేదండి.

బేండుమేళం ఎట్టించినారండి.

పూజ్జేసినారండి.

పెసాదాలిచ్చినారండి.

యిదేటిది? పంచాయితీ మీటింగా?

తిరిపద్దేవుడి పెళ్ళా? అనిపించీసినాదండి–అందరికీ.

ఆకర్న బుల్లి బాబూ, బుచ్చిబాబూ మాట్టాడినారండి.

ఏవంటండీ?

"మంచిపన్లు మంత్రాల్తో అవవ్." మరి దేనితో అవుతాయ్?

డబ్బుతో.

డబ్బెక్కణ్నించి వొస్తాది?

గవుర్నమెంటు కాడ్నించి.

గవుర్నమెంటు కెక్కడనుంచి వొస్తాది.

ప్రెజల కాడ్నించి.

ప్రెజలు వూరికే యిచ్చేస్తారేటి? డబ్బు.

ఆళ్ళు కంచి మేకలూ–కాసి గోవులూనా యేటి. అడగ్గానే ఇచ్చేదానికి?

మరెందుకు యిస్తారు?

ఆళ్లు యియ్యరు. గవర్నమెంటే పీకుద్ది.

ఎలా పీకుద్ది? పన్ను లేసి పీకుద్ది.

మరి పంచాయితీ బోర్డూ పన్నులేస్తాది–

ఇంటిపన్ను, మెట్లపన్ను, నీటిపన్ను అంటూ.

మరైతే యిప్పుడేస్తున్న పన్నులు దేనికి సరిపోతన్నాయ్?

పాకీవోళ్ళ జీతాలకీ, గుమస్తాల జీతాలకీ కూడా సాలడంనేదు.

మరింక పంచాయితీ ఏటి జేస్తున్నాది?

ఏటీ జెయ్యటంనేదు.

ఊరెలాగుంది? సెండాలంగుంది.

వోరానికి–ఏడ్రోజులూ–పనికెళ్ళిన మాలోళ్లున్నారా? నేరు.

సగంరోజులు జబ్బుతో తొంగుంటున్నారు.

మిగతా రోజుల్లో పనుల్లేక తొంగుంటున్నారు.

ఆళ్ళిళ్ళకాడ కుళ్ళు ఎక్కడ కెళ్తున్నాది?

ఎక్కడికీ ఎళ్ళడంనేదు. ఆళ్ళిళ్ళకాడే వుంటున్నాది.

ఆళ్ళ పేటల్లో దీపాలెలుగుతున్నాయా?

ఎలుగుతున్నాయి....ఏం దీపాలు? కిరసనూనె బుడ్లు.

మరి ఊరు బావుపడాలంటే ముందు కూలోళ్ళు బాగుబడాల.

బాగు సేయించడానికి డబ్బు కావాల.

డబ్బు సెర్లో వొలవేస్తే దొరుకుతాదా?

ఆకాశంలోంచి రాల్తాదా?

బూఁవిఁలోంచి పుడతాదా?

మరంచేత పన్నులెయ్యాల. యిప్పుడున్నవి మన తాతల నాటివి –కావు. ముత్తాతలనాటివి మరంచేత పన్నులు పెంచాల.

ఆ డబ్బుతోనే ఊర్ని బాగుసెయ్యాల"

కాదన్లేక పోనారు– మిగతా మెంబర్లు.

ఆళ్లు సెప్పినట్టే–పన్నులు పెరిగినాయండి. కాని ఒక్క విషయ మండి.

ఆ డబ్బు బీదోళ్ళ పేటలు బాగు సెయ్యడానికే కర్సెట్టినారండి.

"యీళ్ళు సేసే పెద్దపని అల్లా పన్నులు పెంచడవా?" అని ఊరి పెద్దల్లో మూలుగులు బయలెల్లినాయండి.

ఊరి సివర్న యిరవై యకరాల సెరువున్నాదండి. అది నిండాల. మా ఊరు పండాల.

దాని సేపల్ని– యీర్నాయుడని, మా వూరి జాలరోడే– నాలుగు వొరకూ సదివినాడు– ఆడు ఏటికి ఎయ్యి రూపా యిలకి పంచాయితీకాడ కొనీ వోడండి.

ఆడి కులపోళ్ళు మరో పదిమందిరున్నారండి.

ఆళ్ళకి సేతులు దులిపి, మిగతాది తను మింగీసీవోడండి ఈర్నాయుడు.

ఓ పొద్దు–యీ బాబులిద్దరూ– యీర్నాయుడ్ని పిలిపిం చినారండి.

ఆడొచ్చి దండాలెట్టి కూకున్నాడండి పందిట్లో.

కూకున్నాడే గాని గుండె దడదడలాడతానే వుందండి– ఏం సెవుతారో– ఏటోనని– ఆ దడకి ఆడి సేరబద్ద కాలు వణకడం ఆరంబించినాదండి.

"ఒరే యీరిగా! నువ్వు యిన్నేళ్ళూ యేలం పాడతానే వున్నావు. సేపలమ్ముతానే వున్నావు. కాని ఆ యేలాలన్నీ లాలూచీవి. యిప్పుడింక అయ్యి సాగవు. పై ఊరోళ్ళకి, కాకి సేత కబురెట్టి నానంటే– పాట పదివేలకి కళ్ళకద్దుకొని మరీ తన్నుకుపోతారు. ఆళ్ళలా గెద్దల్లా తన్నుకుపోడం మాకూ యిష్టంనేదు. ఆ నాబవేఁ దో మనూరోళ్ళే తినాల. అంచేత జాగరత్తగా యినుకో. పాట ఐదుఏలకి పైసా తగ్గదు. పట్టిన సేపంతా పట్నానికి అట్టుకు పోడాని కీల్లేదు. సగంమనూర్లో మాఁవు సెప్పిన రేటుకే అమ్మాల? ఏటంటావు?" అన్నారు ఆ బాబులు.

ఆడికి ఆళ్ళ మాటలు యినగానే గుండె ఆగిపోనాదండి. నోట మాట నేదండి.

ఏటంటాడండి? ఏటనగలడండి?

సరేనన్నాడండి.

ఏసంగొచ్చేసిందండి.

సెరువెండిందండి.

సేపలు పట్టేరండి.

"ఊరి నంజికొడుకులకి సేపల పులుసుల్లేవనే– మాఁవుఁ పాట పాడినట్టున్నాది– యవ్వారం జూస్తే" అని సణుక్కున్నారండి, యిర్నాయుడూ, ఆడి కులపోళ్ళూను.

## 10

కిష్టప్ప సావుకోరుకి మా ఊళ్ళో టూరింగు టాకీసుం దండి. ఆ బాబూ పంచాయతీ మెంబరేనండి.

ఆ బాబు హాలుకాడ అమ్మేవి సినీమా టిక్కట్లో– బస్సు టిక్కట్లో ఆ బాబుకే తెల్దండి.

అయితే ఆ హాలు టిక్కట్ల పన్నులో పంచాయితీ బోర్డుకి పెద్ద వోటా వుంటాదటండి.

ఓ పాలి మా బాబులిద్దరూ ఆ కిష్టప్ప బాబుకి కబురెట్టినారండి.

ఏం కొంప ములిగిందో– ఏటోనని– ఆ బాబు పరుగెత్తు కొచ్చినాడండి.

కుసింతసేపు– ఆ మాటా యీ మాటా మా బాబులు సెప్పినారండి. సెప్పినాక "మసూరికి సంత ఉంది కదా" అనడిగినారండి,

లేదన్లేకపోనాడండి కిష్టప్ప.

నిన్ను మీ అబ్బ కన్నాడా? అమ్మ కన్నదా? అనడిగితే నాకేం తెల్దు, అనీసీ రకవండి అసలు ఆ బాబు.

"సంతమీద అసీలు–నీ సినీమాహాలు పన్నుకన్నా– ఎక్కువే వస్తున్నాది" అన్నారండి మా బాబులు.

కిష్టప్పబాబుకి మాటా– మంతీ– రెండూ పోనాయండి.

ఆడసలు తక్కువోడేం కాదండి. మనం ఆవలించ కుండానే ఏటి తిన్నావోఁ సెప్పేగల్డండి.

"యింతవొరకూ దాన్యవోఁ, శెనక్కాయలో పుచ్చుకొని– జెనాన్ని నేల గేటుకి అంపేసినా పరవానేకపోనాది. యిప్పుడేటి? యీళ్ళు నా హాలు బడ్డీకొట్టుతో సహా కమర్షల్ టాక్సోళ్ళకి అప్పగించీసేటట్లున్నారు.

ఏపకొమ్మ గోడన్సెప్పి–పెసిడెంటుగ కూకుండపెట్తే– అమ్మోరి అమ్మ మొగుడై కూకుండిపోనాడు.

యీళ్ళకున్నన్ని బూవుఁలుంటే ఉట్టినే సూపించీసీవోడ్ని సినీమా–ప్రెజలకీ.

ఆఁ. ఇంతకీ–ఈళ్లు కొత్తసీపురుగోళ్ళు.

యీళ్ళ పాతివ్రొత్యాలు యెన్నాళ్ళుంటాయో నానూ సూడ్నా?

కాని యీళ్ళు సెడీవొరకూ నాను సెడక తప్పదు" అనుకున్నాడో– ఏటో గాని మొత్తానికి హాలుపన్ను పంచాయితీకి పెరిగిపోనాదండి ఆ తరువాత.

మరోపాలి బుచ్చిబాబు పనిమనిషి–పట్నంలో పాలమ్ముతాదండి– పాలల్లో నీళ్ళు కలిపి పట్టుబడి పోనాదండి– శానిట్రీ యినసపెట్రుకి.

ఆ శానిటరీవోడు వూరికే వొగ్గేస్తాడేటండి?

యిది– పాతికో, పరకో సదివించుకుంటే ఒగ్గీసుందు నండి.

కాని యిదివ్వలేదండి. మా బుచ్చిబాబు సెప్తే ఒగ్గకేంజేస్తాడనుకున్నాదండి.

అది వొచ్చి బుచ్చిబాబు కాళ్ళట్టుకొని గోలెట్టినాదండి.

ఆ బాబు బుల్లి బాబుకాడికొచ్చి 'పాలు అమ్ముకునీది– పాలల్లో నీళ్ళు కలపకపోతే పంచదార కలుపుతాదా? నువ్వోపాలి సెప్పు అన్నా ఒగ్గేస్తాడు" అని బతిమాల్నాడండి.

"అదెంతసేపు. సెప్తాలే" అంటాడనుకున్నాడండి బుచ్చిబాబు.

కాని బుల్లిబాబు కుసింతసేపు ఏం మాట్లాడనేదండి. ఆనక "ఒరే బుచ్చీ, నీ కింత పిసరు బుద్ధినేదట్రా? ఓ పాలి గనక పాలకేసులో ఎల్తే మరోపాలి పాలికాసోడి కేసులో ఎళ్ళాలి. రేపు పీకలు కోసిన కేసులో ఎళ్ళాలి. యిప్పుడు మనోళ్ళ యవ్వారం అని ఎళ్తే, యింక మనూరి యవ్వారాలన్నిటికీ ఎళ్లాల."

"అయినా నీళ్ళు కలిపినప్పుడు తెలొద్దా ఆ ముండకి– పట్టుకుంటే ముప్పొస్తాదని? దానికి తెలకపోతే నీకు తెలొద్దా?" అని దులిపేసినాడండి.

బుల్లిబాబు ఆ పాలదానికి సాయం జెయ్యనందుకు బుచ్చి బాబేం బాదపడ్నేదు గాని తననలా సింతకాయలు దులిపి నట్టు దులిపేసినందుకు శానా బాదపడ్డాడండి.

ఆకరికి ఆ మేస్ట్రేటు బాబెవడోగాని ఆర్నెల్లేసేసినాడండి ఆ ముండకి. ఎయ్యి రూపాయల జెరిమానా కూడా కట్టమన్నాడు.

దాంతో కోరటోళ్లు ఆ ముండ మంచాన్నీ– కంచాన్నీ– సేట పెయ్యతో సహా దాని గేదెనీ అన్నీ దప్పు కొట్టేసినారండి. కాని, బుల్లిబాబు దరమబుద్ధి అలాగే వుండిపోనాదండి.

## 11

కత యెనకా ముందూ– అవుతున్నాదని తఁవఁరు గోర్లు– యేటీ అనుకోకూడదు. పసువుల్ని తోలుకుండీ వోళ్ళం. మాలా టోళ్ళకెలా గొస్తాదండి– పోయింట్లు ప్రెకారం జెప్పడం.

అప్పటికి మా బాబు ప్రెసిడెంటై యింకా నెలకానేదండి.

ఆయేళ ..............................

ఇంకా బాగా తెల్లారనేదండి. సిన్న మసక సీకటి వుందండి. మా బాబుకి సీకటితోనే లెగడం అలవాటండి. "సీకటితోనే నెగిసీ వోడి బతుకులో ఎప్పుడూ సీకటుండదురా" అనీవోడండి ఆ బాబు.

ఆయేళ–మా బాబు పందిట్లో కూకుని– "కేపీ" పుచ్చుకుం టున్నాడండి. నాను ఆ బాబు కాళ్ళకాడ కూకున్నానండి.

అప్పుడొచ్చినాడండి అతగోడు.

సూపుకి ముప్పైఏళ్ళ వాళ్లాగున్నాడండి.

కద్దరు పంట్లాం–కద్దరు సొక్కా యేసినాడండి.

అవైనా మూడు నిద్దర్లు తీసినట్టు నలిగిపోనాయండి.

ఏవో సందాలకంటూ వొస్తారే– అదిగో ఆళ్ళలా– ఉన్నాడండి.

అతగోడు సైకిల్‌మీద– రఁయ్‌ఁమని వొచ్చేసినాడండి– ఈదురు గాలిలా–

మా బాబు అతన్ని కుర్సీలో కూకోబెట్టి– "కేపీ" యిచ్చి– ఆనక "ఏటి కావాల మీకు?"అనడిగినాడండి..

ఆ బాబు ఇంగిలీషులో ఏటో అన్నాడండి.

దానికి మా బాబు నవ్వి, ఏటో తెగ సెప్పినాడండి. కుసింత మన బాస– కుసింత ఇంగిలీషులోనూ– సెప్పినాడండి. అంచేత నాకు అంతా అరదం గానేదు గానండీ– అరదం అయినకాడికి ఇసయం ఏటంటే–

"అసలింతవొరకు మాంజేసినది– ఒట్టి పునాది మాత్తరవేఁ – కట్ట వొలసిందంతా– ముందరే ఉంది! ఉరికైనా, బరికైనా ఊరంతా ఒక్కలైన్లో నిలబడతాది. తప్పకపోయి యీపాలి నాను పెసిడెంటైనాను గాని వొచ్చేపాలి– యింకోడికి యీ పెసిడెంటు గిరీ కట్టేస్తాను. పనిజేసీవోడికి పదవి లక్కర్లేదు– పైగా పదవి కాళ్ళకి బందవేఁ" అన్నాడండి మా బాబు.

ఆళ్ళిద్దరూ అలా ఊసులాడుకుంటూ వుంటే బారెడు పొద్దెక్కి పోనాదండి.

యీలోగా దిగిపోనారండి– జీపుల్లోనూ– సైకిళ్ళమీదాను, ఎవరనుకున్నారూ? తాసిల్దార్లూ, రివిన్యూ యినాస్పెట్రూలును.

అందరికీ కురిసీలేసినాం. గానండి ఎవుడూ కూకోడే!

"కేఫీ"లు యిచ్చినాం.

ఎవుడూ పుచ్చుగోడే.

ముసిలి మొగుడు పడుసుపెళ్లాన్ని బతిమిలాడినట్టు బతిమిలాడినాం గూడానండి.

అబ్బే ఒక్కడూ కూకోనేదండి.

"కేఫీ" పుచ్చుకోనేదండి.

ఏటి ఇసిత్తరం అనుకున్నానండినాను. ఎంచేతంటే– ఉట్టి "కేఫీ" ఇస్తే, ఇద్దెన్లేవిరా– అనడిగీ రకవండి– మా రివిన్యూ ఇనస్పెట్రు బాబు.

ఆకరికి తెలిసినాదండి.

ఆ కద్దరు గుడ్డలోడు కలకటేరని.

ఆ బాబు తాసిల్దార్లకి మొగుడటండి.

రెవిన్యూ యినాసపెట్రల్లకి రంకు మొగుడట.

గవర్నమెంటుకి అమ్మ మొగుడటండి.

మా బాబు మా ఊర్ని మారిసేద్దారనుకున్నట్టే– ఆ బాబూ మా జిల్లాని మూడేళ్ళలో మారిసేద్దారనుకుంటున్నా డటండి.

"మూడేళ్ళు పోనాక నా జిల్లాని జూస్తే– ఆకరికి నెహ్రూ అయినా సరే– మొకం మాడిసేసుకోవలసిందే" అనీవోడటండి.

"మందు పారిటీ– ముండ పారిటీలగాడ్ని కాను.

పేదోళ్ళకి పెదతమ్ముడ్ని.

కూలోళ్ల పారిటీ నాది.

గొప్పోళ్ళకి గొయ్యి తవ్వడానికి పేదోళ్ళని పైకి తేడానికీ యీ ఔతారం ఎత్తినాను.

నా కడ్డొచ్చిన- నా కొడుక్కి- ఎడ్రసు మిగల్దు.

నాకు సెయ్యిచ్చినోడికి బగమంతుడు సెయ్యిస్తాడు.

నాను- కాంగిరేస్సోళ్ళలో కమ్యూనిస్టుని.

కమ్యూనిస్టుల్లో కాంగిరేసోడ్ని.

నాకు పార్టీ, గీర్టీ- జాన్తా నై-

ప్రెజే నా పారిటీ"

అని మేకై కూకున్నాడటండి- జిల్లాలో.

ఆ బాబుని బదిలీసేయిద్దారని- శానామందిరే- అయిదరా బాదుకి పరిగెత్తినారటండి.

"ఓలమ్మ! ఆడేటి? బదిలీ ఏటి? ఆడ్ని మాఁవుఁ బరాయిం చనేకనే- మీకు తోలినాం. యీస్వెరుడు యిసం మింగనట్లు- మీరూ మింగకుండా- ఉమ్మకుండా- కొన్నాళ్ళు వొల్లకుండండి."

అనీసినారటండి, అయిదరాబాదోళ్లు.

"నాకు ట్రాన్సఫరు జేయిస్తారా- సేయించండి- సేయిం చండి- అక్కడా ఉంటారు మీ పెదబాబులు. మీకు మొగుడైతే, ఆళ్ళకి రంకు మొగుడ్ని ఔతాను. ఇక్కడ నా వల్ల మీకు నిద్దర్లు పట్టకపోతే అక్కడ మీ పెదబాబులకి పీడకలలు వొస్తాయి" అన్నాట్టండి ఆ బాబు.

మరింకేటి జేస్తారండి?

అమ్మోర్ని బరిస్తున్నట్లు బరిస్తున్నారటండి-మా జిల్లా పెద్దలు.

ఆ బాబు చారిజీ తీసుకున్న వోరం నాటికే- మూడు సినీమా హాళ్ళు మూయించీసినాడటండి పట్నంలో.

ఆరు దాన్యం మిల్లులు ఆపీసినాడటండి.

పది ఫేక్టరీలకి లైసెన్సులు పీకేసినాడటండి.

ఆ బాబు యెలిపోతూ- యెలిపోతూ మా బాబుతో యేట న్నాడంటే- "నువ్వు జేస్తున్నది మంచి పని- అంతా నాను యిన్నాను- యిటుపైన నా బుజం అట్టుకొని నడు. నీకు ఏటి మంచి దనిపిస్తే అది జేసీ- డబ్బు సంగతి నాను జూసుకుం టాను. కాని ఒక్క ఇసయం- రంగం ఒదలక, రాజకీయాల్లోకి దిగక, యీలు జూసుకొని ఓ కోపరేటివు బేంకు కూడా పెట్టు" అని సలహా ఇచ్చి మరీ యెల్లినాడండి.

యింక జూసుకోండి. ఆ బాబిచ్చిన బరోసాతో- మా బాబు పెద్దపులైపోనాడు.

నెల తిరిగేసరికి- ఊరికి యెలట్రీదీపాలొచ్చీసినాయి.

తొలిసుట్టు ఎలిగించడానికి-ఎవుడో మెల్లకన్ను మంత్రి- వొచ్చినాడు. ఆ కద్దరు బట్టల కలకటేరూ ఒచ్చినాడు. ఆ మంత్రిగారికి రేచీకటి ఆట- అదీ గాక రేత్తిరివొరకూ ఉండడా నికి టయాం నేదట. అంచేత మద్దినేలే- ఎలిగించీసినాడు దీపాలు.

ఎలిగిస్తూ "నాను మీ ఊరికి దీపాలెలిగించినాను గాని- మీరు దేశానికే దీపమవ్వాల" అంటూ శానా లెచ్చరు దంచి నాడండి.

ఆనక ఆ కలకటేరుబాబు "అసలీ ఊరు యింత బాగు పడ్డానికి- ఎనకున్నది. యీ బుల్లిబాబూ బుచ్చిబాబూ- ఆళ్ళకి మంచి మనసుంది. ఎనక ప్రెజ ఉన్నారు. ఆ బలవుఁన్నోళ్లు- దేశవేఁటి? పెపంచికాన్నే ఎలిగించీగల్రు" అన్నాడండి.

నిజం జెప్పాలంటే- అంతవొరకూ పట్టించుకునే మొగుణ్నేక గానండి- నేకపోతే ఎప్పుడో రావొలసిందండి మా ఊరు- యెలట్రీ.

## 12

ఓపాలి ఏటైందో యెరికా?

మా వూళ్ళో పార్వతమ్మని ఓ గుంట ఉందండి.

గుంట జూస్తే- యిలాగెలా గుండీదంటే? యుద్దాని కొచ్చి నట్టు గుండెలూ- ఇదీను గజ్జెల గుర్రంలా గుండీదండి. నాలుగో క్లాసో, ఐదో క్లాసో- చదివింది కూడానండి- కాని ఆ గుంటకా సదువు- బూతు పుస్తకాలు సదవడానికి, "లౌవ్ లెటర్స్" రాయ డానికే పనికొచ్చినాదండి గాని బాగుపడ్డానిక్కాదండి; ఏటిబాబూ అలా చూస్తున్నారు? యింగ్లీషు ముక్కలు ఈడికెలా గొచ్చి నాయనా? యీ కెప్టెనుగోడు రాకమునుపు నానే- మా బాబుకి "పి.య్యే"గా వుండేవోడినండి. ఆ బాబెనక- తిరిగి తిరిగీ- నానూ పట్టినానండి- ఆ మాత్తరం ఇంగిలీషు. నా సదువు కేటొ

చ్చింది గానండి- ఆ పార్వతమ్మ కలిగినోళ్ళ బొట్టేనండి. పైగా యింటికి పెద్దకూతురు గూడానండి.

ఆ యమ్మ బాబు- జోగయ్యని- మా వూరు పెద్దసేతుల్లో ఒకడండి. పంచాయితీ మెంబరుగూడానండి. ఆళ్ళ కులంలో కట్నాలు పెద్దగా లేవు గానండి. కావాలంటే- ఓ పాతికవేలు దిగదుడిసి పారీగలడండి- ఆ జోగయ్య యీ గుంట పెద్దమని షైన కాడ్నించీ సంబంధాలు యెతకడం మొదలెట్టేడండి.

పార్వతమ్మని జూసిన ఏ పెళ్ళికొడుకన్నా- కోడిపిల్లని గెద్ద తన్నుకెళ్లుకుపోయినట్టు ఎగరేసుకు పోతాడండి. గుంట రంగు నలుపే గానండి సెందన బొమ్మకి చేవవొచ్చినట్టుండీ దండి. నలుపులో మంచి ఇలువైన నలుపండి- ఆ గుంటది.

కోటేరేసిన ముక్కు- జాంపళ్ళల్లాంటి బుగ్గలు- జెర్రిపోతు ల్లాంటి జెడ- తక్కువ కులపోణ్ని కాబట్టి మరింక వొర్ణించ కూడదండి. ఒక్కమాటలో చెప్పాలంటే పల్లెటూరి యేసంలో వున్న సినీమాస్టారులా గుండీదండి.

ఆ యమ్మనిజూస్తే యిస్వామిత్రుడు కాదు- ఎవుడూబాబూ- ఆ బాబు? మరిసిపోన్ను- రాఁవుఁలోరి పెళ్ళిజేయించినాడే! ఎవడా బాబు? ఆ గేపకం వొచ్చినాది. వొసిస్టుడు- వొసిస్టుడు గూడా పార్వతమ్మని జూసినాడంటే తపస్సు మానీసి పులితోలునుంచి లెగిసిపోయి పెళ్ళిపీటల మీద కూకుండిపోతాడు. అలా గుండీదా గుంట.

మరంచేత- మంచి పెళ్ళికొడుకునే పట్టినాడు జోగయ్య బాబు. అతగోడిది శుంగారపు కోటకాడ ఏదో వూరట- పదో క్లాసు పోనాదట- అయితేనేం? ఫస్టు క్లాసు ఆస్తిపరుడట. ముగ్గ రన్నదమ్ముల్లో సివరోడట-ఏవో ఆక్టు లొచ్చేస్తాయని జెప్పి- కాయితాల మీద పంపకాలై పోయినారుగాని- అన్నదమ్ములంతా అసలు ఉమ్మడిగానే ఉంటున్నారట-ఓ వంద ఎకరా- ఓ రైసు మిల్లూ ఉన్నాయట-ఆళ్ళకి.

ఏటో, మరీ మతిమరుపొచ్చీసినాది, పెళ్ళికొడుకు పేరేటో మరిసిపోన్ను....

పిల్లని సూసుకోడాని కొచ్చినప్పుడు ఆళ్లంతా-మా బుల్లిబాబు గోరింట్లోనే దిగినారు. ఆడా, మగా, సిన్నా, పెద్దా అంతా ఓ పాతిక మందున్నారు.

ఆయేళే మంచిరోజట. మరంచేత పిల్లనచ్చితే ఆయేళే ప్రెదానం కూడా జేసీసుకుంటావఁన్నారు. ఆళ్ళతోపాటు మావంతా కూడా బయలెల్లినాం పిల్లని సూడ్డానికి.

పెళ్ళికొడుకూ- యిద్దరన్నలూ వొరస కుర్చీల్లో కూకున్నారు. మిగిలినోళ్ళూ, బుల్లిబాబు అంతా మరో సైడుకి కూకున్నారు.

పెళ్ళికూతుర్ని తీసుకొచ్చినారు.

సినీమాల్లో- ముదరస్టారుకి పల్లెటూరీ యేషం కోసరం- ముదర ముండకి లంగాలు కడతారే అదిగో అలాగుంది పార్వతమ్మ.

బెత్తెడు జెరీ అంచున్న పట్టుపరికిణీ, కళ్లు జిగేల్ మనీటట్టు- జెరీవోణీ- కాళ్ళకి పట్టీలు- మొలకి మువ్వల వొడ్డాణం- జెబ్బలకి దండకడియాలు- అరచెయ్యంత పైటపిన్ను, మెడ తిరక్కుండా బంగారం, పాపిట పిందెలు, నాగరం, జెడగంటలు. యిక సూసుకో పండుగనాడు తోట పెద్దులాగుంది గుంట.

యే మొగోడి గుండెల్లో నన్నాసరే- గునపంలా దిగిపోయీ టట్టున్నాది.

పెళ్ళికొడుకునీ- అతగోడి అన్నల్నీ జూస్తే యీళ్ళలో పెళ్ళికొడుకెవరా అనిపిస్తాది- అలాగున్నాయి ఆళ్ళ సూపులు- అలాగ నచ్చీసినాది- పార్వతమ్మ ఆళ్ళ ముగ్గురికీ.

"యేరే పెదానం ఎందుకు? యీ పొద్దే పెళ్ళిజేసేసుకుం టాను" అన్నట్టున్నాడు పెళ్ళికొడుకు.

పెదానం అయిపోనాది. అయితే వొచ్చీది మూఢమాసం- అనక పుష్కరాలు- మరంచేత మూణ్నెల్లు పెళ్ళి ఊసు ఎత్తొద్ద న్నాడు పంతులు. ఆ పెళ్ళి కొడుకు సూపుజూస్తే పంతులు పీక కొరికేస్తాడేమో ననిపించినాది నాకు.

"యీ మూణ్నెల్లు ముట్టు కింద లెక్కెట్టీసుకుందారి" అనుకున్నాడో- యేటోగాని- ఒల్ల కుండిపోనాడు పాపం.

పెళ్ళికొడుకు- పోతూ పోతూ- పావలో- అర్ధో నా సేతిలో యెడతాడనుకున్నాను-గాని నా సేతిలో పదిరూపాయలు యెట్టి నాడు.

యిలా- పెదానం అయి- పదిరోజులైందో లేదో పెళ్ళి సెడిపోనాదన్నారు.

యిదేట్రాబాబూ! యీ తిరకాసు అనుకున్నాం. అసలు- ఇషయం యేటంటే- పెళ్ళికొడుకు పెదానం జేసుకుని తిరిగెళ్ళిన నాల్రోజులకి అతగాడికో పార్శిలు అందినాదట. యేటా అని యిప్పిజూస్తే- ముప్పై 'లౌ లెటర్లు'- పార్వతమ్మ రాసినవే

ఉన్నాయట– మొదట తనకే అనీసుకొని– తెగ పొంగిపోనాట్ట అతగోడు. తీరా తారీకులు జూస్తే తిరకాసు యవ్వారవఁని అరదమై పోనాదట–

ఉత్తరాలు– ఎవరికి రాసిందో తెల్దుగాని మంచి 'పవరు పుల్'గా వున్నాయట. మీ సదువుకున్నోళ్ళు రాస్తారే– ఏటమ్మా ఆ మాట– అన్నిట్లోనూ ఆ మాటే ఉందట.

ఆ ఉత్తరాలన్నీ సదివినాక – యీ వుత్తరాల్ని బట్టి సూస్తే మా పిల్లడు మీ పిల్లతో గనక– కాపరంజేస్తే – నీరసంతో మూడోరాల్లో మందులోకి కూడా మిగల్దు– దీని సిగదరగ– మా వోడికి పెళ్ళికాకపోతే– పకీరోళ్ళలో కలిసైనా పదికాలాలు బతకనియ్యండి. యింకొంచెం సదివించి నారంటే– మీ పిల్ల సినిమాలకి కతలు రాసి బతికేస్తాది" అని కబురెట్టినారట.

"ఎవుడికి రాసేవే నంజా?" అని యీపు సీరేసినాట్ట జోగయ్య.

యీపు యిచ్చీసినాది గాని నోరు మెదపనేదట–ఆ గుంట.

ఆనక ఎక్కడో– దూరాన్నుంచి యిద్దరో ముగ్గురో పెళ్ళి కొడుకులు వొచ్చినారు. "యిష్టరీ" అంతా తెలసినాక– పార్వ తమ్మకో దణ్ణం– పెళ్ళికి రెండు దణ్ణాలు యెట్టీసినారు. ఇషయం యిలాగుండగా.

ఆ యమ్మకి పాతికేళ్లు ఎలిపోనాయ్.

పెళ్ళికానేదు సరిగదా– ఔతాదన్న ఆశకూడా మిగల్నేదు.

ఒకనాడు– తెల్లారి లెగిసీసరికి– పార్వతమ్మ అగుపళ్లేదన్నారు.

దొడ్లూ– సెరువులూ– నూతులూ అన్నీ ఎతికీసినారు. ఎక్కడా శవఁవైఁనా ఆవుపళ్లేదు.

జోగయ్యగోరి ఏడుపు ఎవురూ ఆపనేకపోనారు.

పదిరోజులు పోనాక పార్వతమ్మ ఆ ఊళ్ళోనే ఉందన్నారు. అంతే కాదు తురకోళ్ల ఇళ్ళలో ఉందన్నారు.

ఎవరింట్లో?

నజీరుగాడింట్లో.......

అన్నట్టు సెప్పడం మరిసిపోన్ను– మా ఊర్లో ఓ యాభై గడప ఉంటారు. తురకోళ్ళు– కుటుంబాని కొకడు పటాలంలో ఉంటాడు.

యింకేటుంది?

జోగయ్య కులపోళ్లంతా "ఆ తురకోళ్ళ యిళ్ళమీదపడి– అవసరవైఁతే ఆటిని తగలపెట్టేనన్నా సరే– పార్వతమ్మని అట్టు కొచ్చేస్తా"వఁన్నారు.

"యుద్ధాని కొస్తారా? రండ్రా–రండి–పేనాలన్నా ఒగ్గు తాంగాని– పార్వతమ్మని ఒగ్గం. అసలే మాఁవుఁ తురకోళ్ళం. ముగ్గిర్ని సంపితేగాని మాలో ఒకడు సావడు" అన్నారు సాయిబులు.

యీ సంగతంతా తెలిసింది బుల్లిబాబుకి. తెలిసినాక యెంటనే– బుచ్చిబాబుకి కబురెట్టి– పిలిపించినాడు.

ఆ బాబొచ్చేక– "మన పెజ కొట్టుకుంటే మనం బతికున్నా సచ్చినట్టే లెక్క. మరంచేత పంచాయతీ సేద్దాం?" అన్నాడు.

"తండ్రికీ– రంకుమొగుడికీ మజ్జె పంచాయితీ ఏటి? యిదేటి సెర్లో సేపలయవ్వారవాఁ? సినీమా టిక్కట్ల యవ్వారమాఁ? మన మాట సెల్లడానికి? రంకు తగువుల్లో ఏలెడితే యేలు గాదు– సెయ్యేపోద్ది. తొందరపడకు" అనీసినాడు బుచ్చిబాబు...

"సెయ్యిపోద్దని, కాలుపోద్దని బెదిరిపోతే మనం యింక గాంధీగోరి సిస్యులం ఎలాగౌతాం? పేణాలు పోయినా– పేరు పోయినా పంచాయతీ సెయ్యావొలిసిందే" అన్నాడు బుల్లిబాబుగోరు.

ఇష్టం వున్నా– నేకపోయినా– అన్నగోరి కెప్పుడూ ఎదురు సెప్పడు బుచ్చిబాబుగోరు.

అంచేత "మరైతే నీ యిష్టం"అని అన్నాడండి.

"ఇదేటి పంచాయతీనా? పశువుల సంతా?"

అనిపించీసి టట్టు– జేరి పోనారు జెనం. పందిరి సాలక పైకి మిగిలిపోనారు.

అన్ని కులాలోళ్ళూ– మాలోకూడా ఒచ్చినారు.

అన్ని కుటుంబాలోళ్ళూ– తురకోళ్ళూ ఒచ్చినారు.

"మా పిల్ల మాగ్గావాల" అన్నారు జోగయ్య కులపోళ్లు.

"మా కోడలు మాగ్గావాల" అని తురకాళ్లు.

"యిసయం ఏటన్నారు?" పంచాయతీ పెద్దలు.

ఆకరికి తేలిన యిసయం ఏటంటే– రేత్తిరికి రేత్తిరీ– పార్వత మ్మని పట్నం పట్టుకుపోయి– అక్కడ మతం యిప్పించేసి– నజీరుగోడికిచ్చి పెళ్ళి జెయిస్సీనారట తురకాళ్లు.

"మాతో సెప్పకుండా మా పిల్లలకి మతం ఎలా గిప్పించీసి నారు?" అని యీళ్లగోల.

"పిల్లట పిల్ల, మైనారిటీ తీరడవేఁ గాదు, మరో మూడే

ళ్ళాగితే– ముట్లే ఉడిగి పోతాయ్. అలాంటి దానికి మీ పర్మిస నెందుకూ?" అన్నారు ఆళ్లు.

"ఇంతకీ మతం పుచ్చుకున్నట్టు మీ అరుపులేనా, సాచ్చీకం ఏదన్నా ఉందా?" అని యీళ్లూ.

"సాచ్చీకం యిదుగో" అని ఓ మూరెడు గెడ్డపోడ్ని సూపించినారు.

ఆడు పట్నంలో సాయిబుల గురువట. ఆడ్ని "ముల్లా" వో ఏదో అంటారట.

"రొట్లమ్మికుండీవోడిలా ఉన్నాడు యీడు గురువేఁటి?" అని నాననుకున్నాను.

ఆ గెడ్డపోడు "ఔను. మతం యిప్పించింది నానే; మనువు కట్టించిందీ నానే; సాచ్చీకం యీ పుస్తకాలే" అన్నాడు మారువాడీ సిట్టాల్లాంటి పుస్తకాలు జూపిస్తూ.

పక్కనున్నోడు– మనోడొకడు– ఓ పుస్తకం తీసి– కాయితాలు తిప్పి "యిదే టిదీ? అన్నీ తెల్లకాయితాలే" అన్నాడు.

"ఎనక్కితిప్పి సూడు. "మాఁవూఁ యెనకనించి రాస్తావఁ నితెల్దా?" అన్నాడా గడ్డపోడు.

"మతానికీ– మనువుకీ– మా అమ్మాయి ఒప్పుకుందా? నేకపోతే పీకమీద కత్తి పెట్టి ఒప్పించేరా?" అనడిగేడు మరోడు.

"పాయింటే" అన్నాడు బుచ్చిబాబు.

పార్వతమ్మని అట్టుకురమ్మని ఆర్డ రేసేరు పంచాయితీ దార్లు.

పదిమంది సాయిబులెళ్ళి– పార్వతమ్మని తీసుకొచ్చినారు.

నెత్తిమీంచి పాదాలదాకా నల్లని బురకాలో అచ్చం సినీమాలో దెయ్యం లాగుంది గుంట.

"పార్వతమ్మా" అని పిలిసినాడు బుల్లిబాబు.

"హాఁ" అందావిడగోరు.

"పదిరోజులు– తురకాళ్ళతో ఉండీసరికి తెలుగు మరిసి పోనాదిగావాల– "ఁఆ" అనడం మానీసి "హాఁ" అంటున్నాది అన్నారు కొంతమందిరి.

"అసలీవిడ పార్వతమ్మేనా?" అన్నాడు మరోడు.

"బురకా తియ్యండి" అన్నాడు ఇంకొకడు.

"ఆడదాని ముసుగూ– మొగోడి గెడ్డం– తియ్యడానికి మా మతం ఒప్పుకోదు" అని పట్టుపట్టీసేరు– సాయిబులు.

సివర కెలాగైతేనేం– ఆ యమ్మతో కుసింతసేపు మాట్టాడి నాక, ఆ బురకా మడిసి పార్వతమ్మేనని తేల్చేసినాడు బుల్లిబాబు గోరు.

తేల్చీసేక "నీకు దేవుఁడిలో నమ్మకం ఉందా? మతం మారుసుకున్నావా?" అనడిగినాడు.

"దేవుళ్లో నమ్మకం లేదు– గాని మతం మారుసుకున్నమాట నిజం" అందావిడగోరు.

"దేవుఁడ్ని నమ్మనిదానివి– మతం ఎందుకు మారిసినావ్?" అనడిగేడు బుల్లిబాబుగోరు.

"నజీర్ని పెళ్ళాడ్డానికి" అందావిడగోరు.

"ఇష్టపడే జేసుకున్నావా?" అడిగేడా బాబు.

"హు"– అన్నదాయమ్మ.

ఆ యమ్మని అలా అడిగినాక– తీరుపు జెప్పినాడు బుల్లి బాబుగోరు.

తీరుపు ఏటంటే "పార్వతమ్మ మైనేరు కాదు. పాతికేళ్ళు ఎళ్ళిపోనాయి. మరంచేత– మతం మారుసుకున్నా– ఏ మొగుడ్ని కట్టుకున్నా ఆవిడిష్టం. ఆ యమ్మ హక్కు ఎవరూ కాదనడానికీ ల్లేదు. మరింక ఆవిడ్ని పుట్టింటికి పంపే హక్కు కూడా ఎవురికీ నేదు" అని హైకోర్టు జెడిజీలా గనీసినాడు.

గొల్లుమన్నారు జోగయ్య గోరివాళ్ళు.

"బుల్లిబాబు జిందాబాద్" అన్నారు సాయిబులు.

"నువ్వేటంటావ్?" అన్నాడు బుచ్చిబాబుతో జోగయ్య.

"మా యన్నమాట కాదన్ను" అన్నాడతగోడు.

"సూసినావా– మా యన్న మాట కాదన్ను" అన్నాడేగాని– "మా యన్నమాటే నామాట అన్లేదు" అని గొణుక్కున్నారు శానామంది.

ఏటో బాబూ, మాఁవుఁ కానకోనేదుగాని– ఆ బాబులిద్దరూ యిడిపోడానికి యిత్తనం ఆయేళే పడ్డాది.

ఆనక ఎవరిళ్ళకి ఆళ్లు ఎళిపోనారు.

స్మశానం కాడ్నించి ఎళ్ళినట్టు ఎల్లిపోనారు జోగయ్య గోరివాళ్లు.

పెళ్ళికాడ్నించి యెళ్ళినట్టు యెల్లినారు సాయిబులు.

# 13

ఏటో బాబూ, తవcరిగోర్లా నాకేటి సదువా? సందే? కతల్చెప్పడం కూడా సేతకాదు మాలాటోళ్ళకి-

యెనకది ముందు.

ముందుది యెనకా.

ఎప్పుడేది గేపకం వొస్తే అదే సెప్తున్నాను. తవcరుగోరే సరిజేసుకోండి.

ఆయేళ ఆ కద్దరుగుడ్డల కలకటేరు బాబొచ్చినాడని జెప్పినానా? సెప్పేనుకదా!

ఆ బాబటు ఎల్లిన మర్నాడో, మూడోనాడో దిగిపోనాడు మా యమ్మల్లేబాబు- జీపులో.

జీపులో సీటు సాలక- సగం పైకి మిగిలిపోనాడు. మడిసిని జూస్తే- కద్ద మృగానికి కద్దరుగుడ్డలేసినట్టున్నాడు.

ఆ బాబు కూకున్నఏపు జీపు- అదెవడాడు- ఆయేళ హరి కతలో యిన్నాను- ఆcకరుణుడు- కరుణిడి రదంలా కుంగి పోనాది జీపు- ఓ యేపు.

ఆ బాబు మా ఊర్రావడం అది రెండోపాలి.

తొలిసుట్టు ఆళ్ళ సుట్టాలెవరో సస్తే దినాని కొచ్చినాడు.

యీ బాబు జీపుదిగిన టయాముకి- మా బాబు లిద్దరూ పందిట్లో కూకుని- ఆ కబురూ ఈ కబురూ సెప్పుకుంటున్నారు.

"రండి. రండి" అంటూ అతగోడ్ని తీసుకొచ్చి కుర్చీలో కూకుండబెట్టినారు.

అచ్చంగా- సర్కసులో ఏనుగు కుర్చీలో కూకున్నట్టు కూకు న్నాడా బాబు.

"కేపీ పుచ్చుకుంటారా? కొబ్బరి బొండాలు దింపించ మంటారా!" అనడిగినాడు బుల్లిబాబు.

"కేపీ" తాగుతాను- బొండాలు తాగుతాను. వొణ్ణcవూc తింటాను- అంత సంతోషమైపోనాది మన కలకటేరు మీ ఊసు సెప్తావుంటే....

రాచ్చసుల్ని సంపీ రావcలచ్మనులే- కాదు మీరు.

తప్పుజేస్తే రావుcలోర్ని గూడా దమాయించీ కుశలవులు మీరు." అంటూ ఉబ్బెయ్యడం ఆరంబించినాడు.

బుల్లిబాబు నన్ను పిలిసి "కేపీ, వొణ్ణాల సంగతి సూడు" అన్చెప్పినాడు.

"మూడు కోళ్ళు ఈకలూ- ఎవిcకలూ- గూడా ఒగ్గకుండా తినీగల్డు యీ బాబు" అనుకొని నాను లోపలికెళిపోనాను. ఏర్పాట్లుజేసి- మళ్ళీ వొచ్చి మా బాబుల కాడు కూకున్నాను.

"వొచ్చీపాలి ఎమ్మెల్యేకి నిలుసుంటారా?" అనడిగినాడు ఎమ్మెల్యే బాబు.

"నిల్సుంటే తన సీటు యిచ్చేస్తానన్నాడు."

"నిల్సోవొద్దని సలా (సలహా) కూడా యిచ్చినాడు. పెతీవోడు తను బాగుపడితే, మరింక దేశం బాగుపడిపోయినట్టే" నన్నాడు.

అయిదరాబాదెళ్ళి తాగడం నేరుసుకోడానికి తప్ప- యీ ఎమ్మెల్యే పని ఎందుకూ పనికిరాదన్నాడు.

బుద్ధి గడ్డితిని తను ఎమ్మెల్యేనయ్యే నన్నాడు.

అందుకే- దేశానికేం సేవజెయ్యలేక పోతున్నానన్నాడు.

ఎప్పుడూ తిరుగుళ్ళే అయితే మరింక పనికీ టయాం ఎక్కడుంటుందన్నాడు.

ఆ రేత్తిరి ఆళ్ళు బోజనాలు జేస్తున్నప్పుడు జీపు డ్రైవరు "ఉట్టి బోజనాలు- కంచం యేరుపాటూలేనా? మంచం యేరు పాట్లు ఏవైనా ఉన్నాయా?" అనడిగినాడు. నా కరదం కాదను కున్నాడో ఏటో- కన్ను గూడా గీటేడు- దొంగనంజికొడుకు.

"మంచం యేరుపాటులూ జేస్తాం. అందిమీంచి దింపీ వొలసివోస్తే- మోసీసీ ఏరుపాట్లూ జేస్తాం" అందారను కున్నానుగాని- ఈ కుక్కగోడితో మన కెందుకులే అనుకొని నవ్వీసూరుకున్నాను.

# 14

ఇదైన మరో నెలకి- పట్నంలో క్లబ్బువోళ్ళట- పేరేటో మరిసిపోన్ను- మూడు కార్లలో దిగిపోనారు. ఆళ్ళందరికీ పట్నంలో పెద్ద పెద్ద యాపారాలు ఉన్నాయట. ఆ యాపారాలు జేసుకుంటూనే- కలకటేరులాంటి పెద్దాపీసర్లు మెచ్చుకునీ మంచిపన్లు కూడా జేస్తారట.

ఆళ్ళ ఆడోళ్ళకి ఏరే క్లబ్బు- ఆళ్ళ పిల్లలకి మరో క్లబ్బూ కూడా ఉన్నాయట. ఆళ్ళ ఆడోళ్ళు గూడా యీళ్ళలాగే- ఊళ్ళ మ్మట పడి సేవలు జేస్తారట.

మా ఊరి గురించి ఆ కలుకటేరు బాబు సెప్తే యిన్నారట. సేస్తే యిలాటి ఊరికే జెయ్యాల అనుకున్నారట- ఏటి సెయ్య మంటారని అడిగినారు మా బాబుని.

మా బాబు నవ్వి "మీ కేటి జెయ్యాలనిపిస్తే- అది సెయ్య" మన్నాడు.

సరేనని యెళ్ళిపోయి మరో వోరంనాటికి సిబ్బందితో మరీ దిగిపోనారు- యుద్ధానికి దిగినట్టు.

ఇద్దరు కంటి డాక్టర్లు- ముగ్గురు నర్సులు- కంపౌండర్లు- తోటి వోళ్ళు- అంతమందితోనూ దిగిపోనారు.

ఆళ్ళందరూ మా బుల్లి బాబుగోరి ఇంట్లోనే బస.

మా సుట్టుపక్కల ఊళ్ళలో వున్న కంటిజబ్బులోళ్ళని, కళ్లు కనిపించనోళ్ళనీ అందర్నీ రప్పించమన్నారు.

కంట్లో పువ్వులేసినోళ్ళకి- తోటలో పువ్వులు కోసేసినట్టు ఆపరేషన్లు జేసి పారేసినారు.

కళ్ళజోడు కావలసినోళ్ళకి డబ్బు పుచ్చుకోకుండానే యిచ్చి నారు- జోళ్లు.

అన్నీ మా బుల్లిబాబుగారింటి కాడేనేమో! యే గదిలో జూసినా, ఏ వొరండాలో జూసినా యిళ్లే.... జెనం సుట్టుపక్క ఊళ్ళనుంచి గూడా- తీర్థంలా దిగిపోనారు.

పదిరోజులు రేత్తిరీ, పగలూ కూడా పనిజేసినారు. ఆ పది రోజులూ మా ఊరికి- పెదపండుగలాగ అయిపోనాది బాబూ.

అదురుష్టం వుండి సూపొచ్చినోళ్ళు ఆ బాబులికి దణ్ణవెఁట్టుకొని మరీ ఎళ్ళినారు.

యీ జెనం కోసరం మా పందిట్లోనే ఓ సోడాకొట్టూ, ఓ సిగరెట్టు దుకాణం కూడా ఎట్టేసేరు మా ఊరోళ్లు.

పది రోజులైనాక ఆళ్ళంతా మీటింగు యెట్టి మా బాబులుకి దండలేసి- స్పీచిలిచ్చి మరీ ఎలిపోనారు. ఆళ్లు ఎళ్ళే ముందు నాడు- మా బాబు ఆళ్లందరికీ పెద్ద 'డిన్నరి'చ్చినాడు.

ఆళ్లు అటుయెళ్ళినారో నేదో యిటు మరో క్లబ్బువోళ్లు దిగిపోనారు- యీ క్లబ్బులో గూడా అంతా గోప్పోళ్ళే ఉంటారట. ఈళ్ళూ సేవ గోళ్ళేనట-ఆళ్ళలో ఇద్దరు ఆడమనుషులు కూడా ఉన్నారుబాబు- ఆళ్ళళ్ళో ఒక ముండని నాను జూసేనంటే- ఇద్దరూ మీకు కల్లోకి రావాలన్న మాట- అలాగున్నారు బాబు.

ఆళ్ళు మా బాబుకాడకొచ్చి కంటి ఆపరేషన్లు జేయిస్తా మన్నారు.

అవి అయిపోయినాయన్నాడు మా బాబు.

"పది రోజులు ముందు రాలేకపోయావేఁ" అని శానా యిదైపోనారు బాబు, ఆళ్ళు.

"మరేటి సెయ్యడం" అన్నారు.

ఏదో ఒకటి సెయ్యకపోతే యిల్లేదన్నారు.

ఏ మూర్తాన కాలెట్టినారో తెల్దుగాని ఆళ్ళు ఇలా మాట్టాడు కుండగానే- అలా మాలోళ్ళ కొంపలు అంటుకుపోనాయ్.

ఒక్క కొంపన్నా మిగిల్తే మీమీదే వొట్టు బాబూ.

మాలోళ్ళు- వున్నదంతా మసైపోయి రోడ్డుమీద నిలబడి పోనారు బాబూ.

అలా కొంపలు కాలిపోయినందుకు ఆ క్లబ్బువోళ్లు సంబరపడి పోయి "మాఁవొచ్చిన ఏళ మంచిది. ఒంటి గది కొంపలు ఓ యాభై కట్టించీ యిస్తాం" అని సంతోషంగా ఎలిపోనారు.

అన్నట్టుగానే కట్టించి యిచ్చినారు కూడా.

ఆ కొంపలు కాలిపోక మునుపు అదంతా మాలగూడెం అనీవోరు. యిప్పుడీ కొత్త ఇళ్లు కట్టించినాక దాని పేరు "గాందీ పేట" అయిపోనాది.

## 15

సెరువుకి కొత్తనీరొచ్చినట్లు మా ఊరు నిండుగా ఉంది.

పెతి ఇల్లూ పచ్చతోరణాలూ, పువ్వుల దండలూ కట్టినట్టు కళకళలాడీది బాబూ.

అయితే మంచిరోజులు యెల్లకాలం ఉండవండి.

అన్నదమ్ములపొత్తూ, తోడికోడళ్ళ పొత్తూ ఎన్నాళ్ళో నిలవ్వు బాబూ. రావణాసురుడులాటోడే- తమ్ముడ్ని కంట్రోల్లో పెట్టు కోనేకపోనాడు.

మా బాబులిద్దరూ ఇడిపోతే బావుండునని- మా ఊరోళ్ళు శానామంది ఆశపడీవోరు. గాని ఆళ్ళ ఆశ ఇంత బేగి తీరి పోతాదని నాననుకో లేదండి.

ఎలాగంటారా? అదే సెప్తున్నాను. ఇనుకోండి.

బుచ్చిబాబు మరదలు- అంటే పెళ్ళాం సెల్లెలు- ఆ బాబింటి కాడే పెరిగినాది. యీ బాబింటిలోనే ఉంటాది.

తిండి ఎక్కువా, సదువు తక్కువా అయిపోయి- ఒంగోలు పడ్డలా పెరిగిపోనాది బాబూ.

పిల్లది తెల్ల తొక్కే.

కన్ను, ముక్కూ పరవానేదు బాగానే ఉంటాయ్.

కాని ఉట్టి మొరటు గొడ్డు, నాజూకు నేదు బాబు.

పేరు సెప్పటం మరిసిపోన్ను.

పద్మావతండి.

ఆ యమ్మ వయసు యిరవై దాటనేదుగానీ- సూపుకి పదేళ్ళె కాపరం జేస్తున్న పిల్లల తల్లిలా గుంటాది. ఆ యమ్మకి- అమ్మా అయ్యా నేకపోవడంతో- ఆ యమ్మకి- పెళ్ళి బుచ్చిబాబే సెయ్యాల. మరంచేత ఆ బాబు బుల్లిబాబు కాళ్ళట్టుకున్నాడు.

"సమందం సూసిపెట్టు, కట్నం ఎంతైనా పారేద్దాం" అన్నాడు.

"సొమ్ము పారేస్తే పట్నం నుంచి సినీమాష్టార్లే దిగిపోతారు. యింక ఆ సంగతి నాకొగ్గే" అన్నాడు బుల్లిబాబు.

ఆ తరవాత ఇద్దరు బాబులూ కలిసి ఆళ్ళ కులవంతా గెలికిపారేసినారు. ఆకరికి బుల్లిబాబే పట్టినాడో కుర్రాడ్ని.

ఆ కుర్రోడిది అసలు గణపతినగరవంట.

అమెరికా ఎళ్ళొచ్చినాడట.

కలకత్తాలో యింజనీరట.

రాజుకి పుట్టినోడో- ఏటోగాని- కుర్రోడు మాత్తరం దంతపు చాకులాగున్నాడండి.

కుర్రోడూ, సుట్టాలూ అంతా కలిసి- ముప్పైమందిరి దాకా- దిగినారు స్పెషల్ బస్సేసుకొని- పెళ్ళిసూపులకే ఇంతమంది రొచ్చినారూ? మరింక పెళ్ళికి ఎంతమందిరొస్తారో అనుకు న్నావండి మాలాటోళ్ళవంతా.

"కతికితే అతకదు" అన్చెప్పి ఆళ్లు బుచ్చిబాబుగారింటికాడ మానేసి- మా యింటికాడ దిగినారు. ఆ ఏళ వంటకో ఏట పోతుని ఎయ్యాల్సొచ్చిందడి.

మద్దేనేల వొణ్నాలు తిన్నాక- బైలెల్లినారు పెళ్ళి సూ పులికి ....రేత్తిరి వంట ఏరుపాటు కోసరవని నాను యింటికాడే ఉండిపోనానండి.

ఆళ్లు అటు ఎళ్ళినారో- నేదో- యిటు బస్సు దిగినాది లలితమ్మగోరు.

లలితమ్మంటే- మా కాంతమ్మగోరి సచ్చిపోయిన అప్పకూతురు.

ఆ యమ్మ బాబు రాజమండ్రంలో డాక్టరట? యేలకియేలు సంపాయిస్తున్నాట.

ఆ యమ్మ- యిశాపట్నంలో ఎమ్మేనో- ఏదో- సదువు తున్నాదట. పొరపాటు పడి సదువులో పడ్డాది గాని- సినీమాల్లో గనక జేరివుంటే- యీ సావిత్తిర్లూ, వాణిశ్రీలూ- మంచాలు పట్టేసుందురండి.

సాగదీసిన మల్లె మొగ్గలాగుంది పిల్ల.

సురుకుకి- లేడిపిల్ల.

ముద్దుకి బొచ్చుకుక్కే.

పెళ్ళిసూపుల కెళ్ళినోళ్లు తిరుగొచ్చేసరికి హాల్లో కూకునుంది. ఏదో సదువుకుంటూ.

రేత్తిరి వొణ్నాలు తిని ఎళిపోనారు పెళ్ళివోరు.

"ఏ సంగతీ- ఓ ఉత్తరంముక్క రాయమన్నాడు" బుచ్చిబాబు.

"తప్పకుండా" నన్నారు ఆళ్లు.

ఆళ్ల బస్సులోనే యెళ్ళినాడు బుల్లిబాబు- ఏదో పనుండి- పట్నానికి.

ఆళ్లు ఎళ్ళి వోరవైంది.

ఉత్తరంముక్క రానేదు.

పదిరోజులైంది. మా బాబులిద్దరికీ సుబలేక లొచ్చినాయి. ఆ కుర్రోడికీ లలితమ్మకీ- తిరపతిలో పెళ్లని.

పెళ్ళికి- బుల్లిబాబు కుటుంబం మాత్తరం ఎల్లినారు.

అన్నట్టు సెప్పడం మరిసిపోన్ను. మొదట్లో మా ఊరికి బస్సు లుండియ్యికాదు బాబు. అడ్డరోడ్డుకాడికి- మా వూరికి రెండు కోసులుంటాది. నడిసెళ్ళి- పడిగాపులు పడితే- జావుంకో బస్సొచ్చి- సీటు లేదనీవోరు.

మా బాబు పెసిడెంటైన- కొత్తల్లో- సీటికీమాటికీ- పట్నం ఎళ్ళాల్సి వొచ్చీది. యీ బస్సులకోసరం కాపలాలు కాయలేక మోటారుసైకిలు కొన్నాడండి-

అది మోటారుసైకిలా?

డిల్లీ పోతుకి ఇంజను బిగించినట్టుండీది.

కొనడం బుల్లిబాబేగానండి- యిద్దరూ వోడుకునీవోరండి.

బుల్లిబాబు తిరపతికెళ్లినాడని జెప్పినానా– ఆ బాబు తిరిగొచ్చీ లోపల– బుచ్చిబాబు పట్నంనుండి ఒక కొత్త మోటారు సైకిలు కొనుక్కొచ్చినాడండి.

ఆ బాబుది డిల్లీపోతుకి ఇంజను బిగించినట్టుంటే– యీ బాబుది–అడివిపోతుకి ఇంజను బిగించినట్టున్నా దండి.

ఆ యేళ బుల్లి బాబు తిరిగొచ్చీసరికి పొద్దుపోనాదండి. ఆ బాబు పడుకున్నాడండి. నాను కాళ్ళు పడుతున్నానండి.

"ఏట్రా ఊరి ఇశేషాలూ?" అనడిగినాడండి.

"మన సాకల్దాని కూతుర్ని మొగుడు వొగ్గేసినాడండి" అన్నానండి.

"దాన్ని మనూరేగదరా ఇచ్చినారూ?" అన్నాడండి ఆ బాబు.

"మనూరేనండి" అన్నానండి నాను.

"ఎందుకొగ్గేసినాడ్రా?" అనడిగినాడండి.

"ఆడు తాగుతాడని ఇదంటాదండి. ఇది రంకుముండని ఆడంటాడండి. రెండూ నిజవేఁ అవొచ్చండి." అన్నానండి నాను.

"సాకలి కబుర్లూ– సవఁర్తీ కబుర్లూ ఒగ్గేసి– ఇంకేటన్నా ఇసేషాలుంటే జెప్పు" అన్నాడండి ఆ బాబు.

"తమ్ముడుగోరు మోటారుసైకిలు కొన్నారండి" అన్నాను.

"ఎలాగుందిరా?"

"మన్దానికంటె– ఓ మూరెడు పొడుగుంటాదండి" అన్జెప్పినానండి.

"రేపోపాలి అట్టుకురమ్మన్జెప్పు తమ్ముడితో" అన్నాడండి ఆ బాబు. "అలాగే" నన్నానండి నాను.

## 16

మర్నాడు పొద్దున– నాను అంబటి ఏళకి– ఇంటికి పోతూ– పోతూ– బుచ్చిబాబు గారింటికాడ కెళ్లినానండి. ఆ బాబూ, ఆ యమ్మా, అరుగుమీద కుర్చీల్లో కూకున్నారండి, ఆళ్ళ పాలికాపు– మోటారుసైకిలు తుడుస్తున్నాడండి.

రెండోరోజు గర్భాదానం పెళ్లి కూతుర్లాగున్నాదండి– బండి!

మొదటిరోజు పెళ్లికొడుకులా ఉన్నాడండాబాబు!

నానెళ్లి ఆళ్లిద్దరికీ– అంటే సైకిలుకీ, పాలికాపోడికీ కాదు– బాబుకీ అమ్మగోరికీ దణ్ణవెఁట్టినానండి.

"మీ అయ్యగోరు వొచ్చినారట గదరా?" అందండాయమ్మ. మూతి మూరెడూ– మాట బారెడూ సాగదీస్తూ.

"ఏట్రా సంగతులూ?" అన్నాడండా బాబు.

"తవఁరుగోర్ని ఓ పాలి సైకిలు అట్టుకురమ్మన్నారండి అన్నయ్య గోరు" అన్నానండి.

"ఇయ్యేళ సైకిలొట్రమ్మంటాడు, రేపు– సాకల్దాన్ని తోలుకు రమ్మంటాడు" అనీసిందండి ఆ యమ్మ. అసలలా మాట తుళ్లీ రకం గాదండావిడగోరు.

"ఇష్" అని ఆ యమ్మతో అని "అలాగే అన్జెప్పు" అన్నాడండాబాబు.

అంబలి తాగినాక నాను మా బాబుగారింటి కెల్లినాను– కానండి– బుచ్చిబాబుగోరింటికాడ జరిగింది మాత్తరం నాను మా బాబుతో సెప్పనూ లేదు– ఆ బాబు అడగనూలేదండి.

ఆ మర్నాడు మా సాకల్ది– సుక్కమ్మా, దానికూతురు ముత్తెవూఁ వొచ్చినారండి– ఇలాగొచ్చినారోలేదో– అలా గోల గోల ఎట్టేసినారండి. గోల తరవాతెడుదురు గాని సంగతేటో సెప్పండే అని మా బాబు అడగ్గా అడగ్గా సెప్పినారండి.

ముత్తెంగుంట మొగుడు– నారిగోడు– రేత్తిరి తాగుతాట్ట– మద్దేనం తాగుతాట్ట– పొద్దున్న తాగుతాట్ట. కోకకాదు సరిగదా రుమాలగుడ్డయినా ఉతకడట. ముత్తెంగుంటే బండెడు బట్టలూ ఉతకాలట, అది ఉతుకుతుంటే ఆడు గట్టున కూకుంటాడట. అది వంచిన నడుం ఎత్తకూడదట.

యెత్తితే "ఏ రంకుమొగుడికోసవేఁ అలా మిట మిట జూస్త న్నావూ" అని. బట్టలుతక్క పోయెనా– దాన్ని రెవెట్టాస్తాడండి.

రోజూ యిదే యవ్వారవఁట.

దానికి పేనం ఇసిగిపోనాదట. ఓ పాలి "ఎవుడికోసవేఁ అలా జూస్తన్నావూ?" అని ఆడంటే, ఇది ఒళ్లుమండి "నీ బాబుకోసంరా" అందటండి.

మరంతేనండి.

సాకలిపొయ్యిలో కొరకంచు తీసుకొని దానెంట పడ్డాడటండి ఆడు.

తాగుబోతెదవ! దాంతో పరిగెత్తనేక ఆ కొరకంచు దానిమీదకి యిసిరీసి– కిందపడిపోనాట్ట.

ఆడి సిటికెనేలు యిరిగిపోనాదట.

దీని ఈపు కాలిపోనాదట.

యీష్మీద మచ్చకూడా సూపించినాదండి పాపం.

వోరం కిందట– పాపం– దానికి ఆరోనెల కడుపు– కడుపు మీదతన్ని 'ఎవుడిసేత కడుపు సేయించుకున్నావో– ఆడికాడకే పోవే నంజా" అని తన్ని తగిలీసినాడట.

అదింక ఓరుసుకోనేక పుట్టింటికి వచ్చీసినాదట.

"బాబ్బాబు, తవఁరుగోరే యీ తగువు తెల్లార్సియ్యాల– మనువు తెగ్గొట్టీసినా పరవానేదు, పేనాలు దక్కుతే అంతేసాలు" మా బాబు కాళ్ళమీద పడిపోనారు తల్లీ కూతుళ్ళు– యేడుస్తూ.

అప్పుడు మా బాబు ఆళ్లిద్దర్నీ కూకోమని, మా మనిషి– శివుడు గోదని– ఆడ్ని అంపినాడు– నారిగోడ్నీ, బుచ్చిబాబునీ ఎంటనే తోలుకురమ్మని.

ఓ గంట పోనాక ముందు పోస్టుమేనూ, తరువాత శివుడు గోదూ ఒచ్చినారు.

పోస్టుమేను ముత్తేనికి ఒక రిజిస్ట్రీ ఉత్తరం యిచ్చినాదండి.

"బుచ్చిబాబుగోరు– సిటీ ఎల్లాలన్నారండి. నారిగోడు ఇంటి కాడ నేడు– రేవుకాడా నేడు– సారాదుకాణంకాడా నేడండి" అన్నాడండి శివుడు గోదు.

"సదువొస్తే నా రాక యిలాగెందుకుంటాదండి. తవఁరుగోరే సదివి పెట్టండి" అని ఉత్తరం యిచ్చిందండి ముత్తెం– మా బాబుకి.

మా బాబు ఉత్తరం సదివినాడు– కానండి– ఏం మాట్టా డనేదండి.

"ఉత్తరం వేఁసింది ఎవురండి?" అడిగిందండి సుక్కమ్మ.

"ప్లీడరు" అన్నాడండి మా బాబు.

"ఏం పొయ్యేకాలవండి ఆడికి?" అందండి అది.

"నీ అల్లుడే ఏయించినాడు ప్లీడరుగోరి సేత– ఆడు– అంటే నారి గోడు– గాందీగోరట– నీ కూతురే సెడిపోనాదట–ఒకడూ, ఇద్దరూ కారట నీ కూతురికి– ఓపాలి సీకటిపడ్డాక సాకిరేవులో నీ కూతురు ఆడి తమ్ముడితో తొంగోడం ఆడు సాయంగా జూసేడట– తమ్ముడిమీద కలబడితే ఆడు తన సిటికెనేలు అగ్గి పుల్ల యిరిసీసినట్టు యిరిసీసేడట– నీ అల్లుడు నీ కూతుర్ని యెంబడిస్తే యీళ్ళిద్దరి ఎనకా ఆడి తమ్ముడు పడ్డాడట– కాలు తున్న కొరకంచు పట్టుకొని– అకిరికి ఎలాగైతేనేం నారిగోడు– దాన్ని పట్టుకునే టయాముకి ఆడి తమ్ముడు కొరకంచు యిసిరీసి నాట్ట– అది నారిగాడు తప్పించుకుంటే నీ కూతురికి తగి ల్నాదట–టిదే నారిగోడి తమ్ముడికీ– ఆడి పెళ్ళానికి పడకుండా జేసీసిదంట– అందుకే ఆడి పెళ్లాం ఆడ్ని ఒగ్గీసిందట– నీ కూతురు సానిపనికే గాని సాకలిపనికి పనికిరాదట– వొణ్ణం తినడానికేగాని, ఒళ్ళు వొంచడానికి పనికిరాదట– నీ అల్లుడికి ఊష్టం వచ్చి రేవుకెళ్ళమంటే అలాగేనని మాయజేసి కన్నోరింటికి పారిపోనాదట.

యిదీ యిసయం.

"మరంచేత ఎంటనే ఒచ్చీమంటాడు ప్లీడరు" అని యివ రంగా సెప్పినాడు మా బాబు.

"ఎవురికాడికి? ప్లీడరు కాడికా?" అని 'లా' పాయింటు తీసింది సుక్కమ్మ.

"కాదు నీ యల్లుడికాడికి" అన్నాడు మా బాబు.

"ఈడి జిమ్మడ–ఈడ్ని గోతల కప్పెట్ట– ఈడి నాలిక పురు గులడిపోను– ఈడి పెళ్ళాం తాదు తెగిపోను" యిలాగే తిట్టినాది ప్లీడర్నీ, అల్లుడ్నీ కలిపి.

దానికడుపు మంట సల్లారినాక మా బాబు అడగ్గా, అడగ్గా అది సెప్పిన యిసయాలు ఏటంటే– ముత్తెం మరిదీ, ఆడి పెళ్ళాం - సెట్టుమీద పిట్టలా– సుకంగా కాపరం జేసుకుం టున్నారట.

నారిగోడు రావుఁడైతే– ఆడితమ్ముడు సాకలి లచ్మనుడట– అన్న మాట కాదనట. మరంచేత ప్లీడరు రాసిన యిసయాలు అన్నీ నిజవేఁనని కోరట్లో ముప్పైసార్లూ– పైని తొంబైసార్లూ పెమాణికం జేసి జెప్పేస్తాడట.

"సరే సూద్దాం" అన్నాడండి మా బాబు.

"సూద్దాం అని నువ్వూరుకుంటే మాఁవుఁ సస్తాం-ఏదో ఒకటి బేగి సెయ్" అని దణ్ణాలెట్టుకుంటూ మరీ ఎళిపోనారండి, తల్లీకూతుళ్ళు.

## 17

ఆనక మూఁడ్రోజులు జూసినాదు మా బాబు– బుచ్చిబాబు వస్తాడేమోనని.

రానేదు.

అంతేకాదు.

మా బాబు ఇంటిమీది కాకులు బుచ్చిబాబు ఇంటిమీద వాల్తున్నాయి. కాని బుచ్చిబాబు ఇంటిమీది పిచ్చిక పిల్ల కూడా మా ఇంటివేపు రావడం లేదు.

మరీ అంచేత నాలుగోనాడు తనే పెళ్లాన్ని తీసుకొని మరీ బయ లెల్లినాడండి బుచ్చిబాబింటికి. నానుకూడా యెనక ఎల్లి నానండి.

మాఁవుఁ ఎల్లీసరికి– ఆ బాబు యీదరుగుమీద– పడక్కుర్చీలో కూకుని పేపరు– సదువుతున్నాడండి– వాకిట్లో మోటారు సైకిలుందండి.

మాఁవు రావడం ఆ బాబు జూసినాడో నేదోనండి మరి.

బుల్లిబాబు మాత్తరం మోట్రుసైకిలు కాడ ఆగి– దాన్ని అటూ, యిటూ తిప్పి "బండి మా బాగుందిరా తమ్ముడూ" అన్నాడండి.

"పదివేలు యింకా బావుంటాయ్" అనీసినాడండి బుచ్చిబాబు– ఇలా కత్తి ఇసిరినట్టు.

ఆ మాటకు మా బాబు తెల్లబోనాడండి.

కాంతమ్మగారి మొకం నల్లబడిపోనాదండి.

ఈళ్ళు తేరుకునీ లోపల–బుచ్చిబాబు గోరే–మెట్లు బద్దకంగా సగం దిగి "రండి. రండి" అన్నాడండి.

కాంతమ్మగోరు ఇంట్లోకి ఎలిపోనారండి.

బాబులిద్దరూ యీదరుగుమీదే కూకున్నారండి. ఆ ఊసూ, యీ ఊసూ సెప్పుకున్నాక, సాకల్దాని సంగతి జెప్పినాడండి బుల్లిబాబుగోరు. సెప్పేక–

"తమ్ముడూ. మనం పవర్లోకొచ్చేక ఇంతవొరకూ– మనూరి తగువు– పొలిమేర దాట్నేదు– కోరటు కెళ్ళడం మాట అలా ఒగ్గీ– కానిప్పుడు– నారిగోడు, ప్లీడరుకాడి కెళ్ళినాడు. అంచేత– తర్వాత మనం తగువు తెగ్గొట్టినా– ముందీ– ముత్తెంగుంట తరపుని జెవాబు ప్లీడరుసేత ఇప్పించాల మరంచేత– రేప్పొద్దుటే "సిటీ" కెల్దాం. తయారగుండు" అన్నాడండి మా బాబు.

మా బాబు మాటకి యే పుల్ల ఇడుపు మాట్లు బుచ్చిబాబు గోరంటాడోనని నాను మా బయపోద్నండి.

కాని ఒక్కిషయవండి. ఆ బాబు కోపం తెచ్చుకొనేదండి. తాపం తెచ్చుకోనేదండి– బేమ్మడు– మంత్రాలు సదివినట్టు గొంతుక పెంచకుండా– దించకుండా మాట్లాడినాదండి.

యేటన్నాడంటే– "నువ్వేటీ అనుకోకపోతే– నానోమాట చెప్తా నన్నయ్యా, సాకలోడు నోటీసు యిచ్చే ముందరే– మార్కం డేయుడు శివుడు కాళ్ళట్టుకున్నట్టు– నా కాళ్ళట్టుకున్నాడు.

ఆడి పెళ్ళాం నిజంగానే మంచిది కాదట– అయితే ఆడు తాగుతాడు కనక ఆడి మాట పంచాయితీలో ఎవరూ నమ్మరట– అది పోయింది ఆడి తమ్ముడితోగాదట– యింకెవడితోటో నట– జూసింది కూడా ఆడొక్కడేనంట....."

"మరంచేత" బాబ్బాబు యీ తగవు పంచాయితీకి పీక్కండి. కోరట్లోనే తెల్లారనియ్యండి– తఁవఁరుగోరు ఏ ప్లీడరుకాడి కెళ్ల మంటే ఆరికాడికే ఎల్తాను– ఎంత ఫీజు యిమ్మంటే అంతా– ఊరోళ్ళ బట్టలు అమ్మీసైనా యిచ్చుకుంటాను" అని నన్ను నారి గోడు బతిమిలాడినాడు. సాయం జేస్తాననీవొరకూ కాళ్ళు ఒగ్గలే నేదు.

అంచేత నానే ప్లీడరుకాడికి అంపించినాను ఆడ్ని. సాకలోళ్ళ పెళ్ళాల తగువుల్లోకి, మంగలోళ్ల ముండల తగువుల్లోకి మనం ఎల్లడం బాగోదు, అన్నయ్యా–

నన్ను చెమించు.

నీ క్కావాలిస్తే ఆ సాకల్దాన్ని తీసుకొని సిటీఎల్లు. నన్ను మాత్తరం ఈడవక" అనీసినాడండి.

మా బాబు మొకం తెల్లబోయిందండి. నోట మాట రానేదు.

అయినా నిలదొక్కుకొని, మరో కుసింతసేపు ఊసు లాడి నాడండి. తరవాత మావంతా యింటికొచ్చీసినావండి.

తోవలో కాంతమ్మగోరు "ఏటండీ" – ఈ యిచిత్తరం! ఇంత సేపూ– కిరసనాయిలు డబ్బాలా నాను మాటాడినాను గాని ఆ సెంద్రమతి (అంటే బుచ్చిబాబుగోరి భార్యండి) "ఆ" "ఊఁ" అంటాదే తప్ప మాటే ఆడనేదు. తన సెల్లెలు పెళ్ళి మనవేఁ సెడిగొట్టేసీనాం అనుకుంటున్నాదో ఏటో" అన్నాదండి.

"ఎక్కడో తిరకాసుంది. తమ్ముడు కూడా సరిగ్గా నాతో మాటాడ్నేదు" అన్నాడండీ– మా బాబు.

"మరి మీరే నచ్చజెప్పాల. ఆ పెళ్ళికీ మనకీ ఏఁవీఁ సంబం దంనేదని" అందండి ఆ యమ్మగోరు.

"ఏదో సెయ్యాల" అన్నాడండి మా బాబు.

❖ ❖ ❖

మరో పదిరోజులు పోనాక నానూ, బుల్లిబాబుగోరూ మళ్ళీ ఎల్లినావండి బుచ్చిబాబు గోరింటికి.

"రా అన్నయ్యా" అన్నాడండి బుచ్చిబాబుగోరు.

"మినిస్ట్రు" ముందు ఎమ్మెల్యేలా ఒదిగి కూకున్నాడండి మా బాబు.

"పైనెల్లో ఎలక్సన్లొస్తన్నాయి" అన్నాడండి, మా బాబు.

"ఎంత బేగి తిరిగిపోనాయ్ ఐదేళ్ళు!" ఆశ్చర్యపోనాడండి బుచ్చిబాబుగోరు.

"యీసారి కూడా ఊళ్ళో పోటీ నేకుండా జూసుకోవాల మనం" అన్నాడండి మా బాబు.

"పోటీ నేకుండా జూసుకోవాలంటే– యిదేటి? అద్దంలో మొకం జూసుకోడవఁనుకుంటున్నా వేటన్నయా? పైకి నిండిన సెరువునాగ ఊరు తొణక్కుండా వున్నాది గాని లోపల ఎన్ని ఊబిలున్నాయో దిగివొరకూ తెల్దు– నాకు తెలిసిందేటంటే– ఊర్లోమాత్తరం– ఏటో గుడగుడలాడుతున్నాది. ఇవరాలు నాకూ తెలవనుకో" అన్నాడండా బాబు.

"సర్లే. ఊబిలో నేను సిక్కడితే పీకడానికి నువ్వు– నువ్వు సిక్కడితే పీకడానికి నాను– వున్నాం గదా" అన్నాడండి మా బాబు.

"కురుచేత్తరవంటే కిష్ణుడూ, అర్జునుడూతో సరిపోద్దేటి? ఇంకా శానామందికి పోర్షన్లుంటాయ్– మందిలేందే యుద్ధం అవదు" అన్నాడా బాబు.

"పోనీలే. ఆ గొడవలన్నీ పైనెల్లో కదా! యిప్పుడు నీతో ఓ యిసయం మాట్టాడాల" అన్నాడండి– మా బాబు.

"మళ్ళీ సాకల్దాని గొడవేఁనా?" అనడిగినాడండా బాబు.

"సాకలి గొడవగాదు, సొంతగొడవే" అన్నాడండీ మా బాబు.

అన్నాక "ఏంనేదు– తమ్ముడూ, నీ మరదలి పెళ్ళి మాఁవేఁ సెడగొట్టినావఁని మీరిద్దరూ అనుకుంటున్నారేమో....?" అని మా బాబు అనీ లోపల– పాత దొంగని సూసి పోలీసోడు రెచ్చిపోయినట్టు రెచ్చిపోనాడండి బుచ్చిబాబు–

"నా మరదలి పెళ్ళి నువ్వు సెడగొట్టినాఁవని నా నన్నానా? నేకపోతే మా యాడదన్నాదా? ఎవరితోనన్నా అన్నానని నువ్వు ఋజువుచేస్తే అదిగో– ఆ పాత సెప్పుతో పళ్ళురాలగొట్టీ– "అమ్మా" అని కూడా అన్ను. అయ్యేళ మీ రిద్దరో కలిసొచ్చినప్పుడే – ఏటో వుందనుకున్నాను– నా మరదలికి నేదుగాని యిప్పుడు నిజంగానే అనుమానం వొస్తన్నాది– నా మరదలికి మొగుడు దొరక్కపోడు.

పెళ్ళికి పిలుస్తాను. ఇష్టవుంటే వొచ్చి అచ్చింతలెయ్యి. కాని ముందే నా నెత్తిన అచ్చింత లెయ్యక. అనని మాటలు అన్నానని అనక.

నాకన్నా వొయసులో పెద్దోడివి.

సదువులో పెద్దోడివి.

పరపతిలో పెద్దోడివి.

బుద్ధిలో పెద్దోడివి.

మరంచేత ఇలాటి సిన్నబుద్ధులు నాకు అంటగట్టకు" అని రెండు పక్కలా డోలు వోయించేసినట్టు వోయించేసినాడండి.

సిన్న పెళ్ళాం యెదుట– సెప్పుదెబ్బలు తిన్న పెద్దపెళ్ళాం లాగై పోనాడండి– మా బాబు– అక్కడ నా నుండబట్టి.

"పోన్లే నీ కనుమానం నేదన్నావు అంతే సాలు" అన్నాడండి, మా బాబు.

"కాని నీ కనుమానం వొచ్చినాది. మరంచేత– యింత వొరకూ రామలచ్మనుల్లా ఉన్నా రావఁణ యిబీషణులవై– పోతావేఁమోనని నా బయం" అన్నాడండా బాబు.

"అలాగైన్నాడు లంకంతా నీదే తమ్ముడూ" అంటూ నెగిసి పోనాడండి మా బాబు.

## 18

మరో వోరం గడిసిపోనాదండి.

ఆ యేళండి–

బుల్లిబాబుగోరి పెద్దకొడుకు పుట్టిన్రోజండి. మా బాబెప్పుడూ కొడుకు పుట్టిన్రోజుని– పట్టాభిషేకంనాగ జేస్తాదండి.

యీపాలి కూడా ఊరందరికీ భోజనాలు సెప్పినాదండి.

పిలిసిన పెతీవోడూ వచ్చినాడండి గాని– బుచ్చిబాబుగోరూ– ఆళ్ళ కుటుంబవూ– ముందునాడే సిటీ ఎలిపోనారటండి.

మా బాబు మనసులో ఏటనుకున్నాడోగాని పైకి ఏం తేల లేదండి.

"మొగుడూరుకున్నా– మాఁవఁ ఊరుకోదన్నట్టు– మనం ఒల్లకున్నా, ఊరు ఒల్లకుంటాదేటండి?"

వొణ్ణాలకాడే– గుసగుసలు బైలెల్లినాయండి– బాబులిద్దరికీ పడడం లేదని.

ఈపాలి పెసిడెంటుకి పోటీ తప్పదనీని.

యీదేటి? హరిదాసునాగ– యింత ఇవరంగా సెప్తున్నా దనుకుంటున్నారేటి?

యివరాలెక్కువైతే యిసేషాలు ఔతాయండి.

యిసేషాలెక్కువైతే యుద్ధాలౌతాయండి.

యీ బాబుకి అనుమానవఁని ఆ బాబూ– ఆ బాబుకి అనుమానవఁని యీ బాబూ– ఎంతదూరం పోనారో తఁవరే సూద్దురుగాని.

పుట్టిన్రోజు అయిన మర్నాడే ఊరిని పొగజుట్టేసినట్టు సుట్టేసినాదండి పుకారు–బాబు లిద్దరికీ బెడిసిపోనాదని.

పేటకి ఇద్దరు రౌడీలుండకూడదండి.

ఊరికి ఇద్దరు పెద్దలుండకూడదండి.

మరంచేత యీ యిద్దర్లో ఊరికి పెద్దెవరో యీ పాలి తేలిపోవాల" అన్నారండి ప్రెజ.

యీ లోపల

ఏటినీరులా సల్లగా వొచ్చినాదండి కార్తీకమాసం.

గుళ్ళల్లో దీపాలు బంగారం కడ్డీల్లా వెలుగుతుండేయండి.

సలి సరదాగా వొణికించీదండి.

కార్తీకదీపాలూ– వొనబోజనాల్తో ఊరు పెళ్ళిల్లులాగున్నాదండి.

ఆయేళ సోమవారవండి...

ఊరవతల రెండెకరాల తోటండి అది. ఇద్దరు బాబులకీ జాయింటు తోటండి.

ఆ తోటలో ఊరంతా సంతర్పణ జేసుకుంటున్నారండి.

వంటల వోసన తోటని జుట్టేసినాదండి.

ఆ వోసనకి పక్కూరి కుక్కలు కూడా పరిగెత్తుకొచ్చీసి నాయండి.

పెద్దోళ్ళంతా సెట్లకింద సేరి–పేకాడుతున్నారండి.

మా ఇద్దరు బాబులూ మరికొంతమందిరీ– పనససెట్టుకింద కూకొని– "మూడు ముక్కలాట" ఆడుతున్నారండి.

లచ్చింతల్లి గల్లుగల్లుమంటూ గెంతుతున్నాదండి.

ఆట బిగిసిపోనాదండి.

సత్తరకాయగోళ్ళంతా తప్పుకున్నారండి.

ముచ్చటగా ముగ్గురు మిగిల్నారండి ఆటలో.

మా ఇద్దరు బాబులూ– సుబ్బారావూ నండి.

సుబ్బారావు పేకాటలో దరమరాజుకి దద్దండి.

పెళ్ళాన్నీ, ముండనీ కూడా ఒడ్డీసీ రకఁవండి.

ఆడోళ్ళు బియ్యం దంపినట్టు– ముగ్గురూ వొరసగా కొడతన్నారు రూపాయలు–

మిగతా సెట్లకాడ జెనంకూడా సుట్టూ జేరీసినారండి.

నాను ముందరే ఆళ్ళ ముక్కలు జూసీసినానండి.

సుబ్బారావుకాడ మూడు జాకీలండి.

బుచ్చిబాబుకాడ మూడు రాజులండి.

మా బాబుకాడ మూడు ఆసులండి.

సుబ్బారావుకాడ పెట్రోలు అయిపోనాదండి. ఆట ఒగ్గీసినాదండి.

ఆట యెయ్యికి తక్కువుండదండి.

బుల్లిబాబు– ముందు– మద్దెనున్న డబ్బుని జూసినాదండి.

ఆనక తనాట మరోపాలి జూసినాదండి.

సివర్న తమ్ముణ్ని జూసినాదండి.

ఆనక "పంచీసుకుందావాఁ తమ్ముడూ" అనడిగినాదండి.

"తమ్ముడు తమ్ముడే– పేకాట పేకాటే అంటారన్నయ్యా" అన్నాదండి బుచ్చిబాబు నవ్వుతూ–

మా బాబే మరో పది రౌండ్లు అయినాక తిప్పించీసి నాదండి – తనకాడ మూడు ఆసులున్నా సరే....

మా బాబే గనక తిప్పించకపోతే, బుచ్చిబాబుకాడ కట్టుగుడ్డలే మిగిలేవండి. అంత రోషంగా ఆడుతున్నాడండి– ఆ బాబు.

ఈ లోపల వోణ్ణాలకి నెగిసిపోనారండి జెనం.

యింతలో పోస్టుమేను మా బాబుకాడ కొచ్చి ఒక రిజిష్టీ ఉత్తరం యిచ్చినాదండి.

సదువుకొని సల్లగా జోబీలో యెట్టీసుకున్నాదండి– మా బాబు.

"ట్యూబులైటు" ఒక్కసారి ఆరి– మళ్ళీ ఎలుగుద్దిజూడండీ– అలాగై పోనాదండి మా బాబు మొకం.

ఆనక మాత్తరం తోడపెళ్లికొడుకులా తెగ సందడి జేసినాడండి.

ఒక్కపాలి ఉన్నట్టుండి తోటలోకి సూరీడు దిగొచ్చినట్టయ్ పోనాదండి.

తోటకే ఎలుగై పోనాడండి మా బాబు.

వొంటాలకాడా– వొడ్డన్లకాడా– ఎక్కడ జూసినా మా బాబే–

❖ ❖ ❖

కాని ఇంటికొచ్చినాక– వొరండాలో కురిసీలో– నడుం యిరిగినట్టు కూలబడి పోనాదండి.

"ఏటైందండీ" గాబరపడిపోనాదండి కాంతమ్మగోరు.

"ఊరికి అమ్మోరొస్తున్నాదంతే– నువ్వు ముందుకుసిన్ని మంచినీళ్ళట్టుకురా" అన్నాడండి.

ఆ యమ్మకంటె ముందు నానే పరిగెత్తుకెళ్లి తెచ్చినానండి– మంచినీళ్ళు– మూర్ఛ ముష్టివోడిలా తాగేసినాడండి నీళ్ళు– గటగటా– నీళ్ళు తాగేక సెప్పినాడండి కత.....

"అంతకు ముందు వోరం–సిటీనుంచి–ఏదో కంపెనీ వోళ్ళండి– అయిదొందలమంది ఉంటారండి– యీ జాయింటు తోటలోనే– సంతర్పణ జేసుకున్నారండి.

గాడిపొయ్యిలోకి మా బాబు నడిగే– సచ్చిన సింతమాను– బారెడు లేదు– దాన్ని కొట్టుకున్నారండి– ముందే మా బాబు నడిగి మరీ కొట్టుకున్నారండి.

ఆ సంగతే మురిసిపోనాదండి మా బాబు. యిప్పుడా సెట్టు కోసం బుచ్చిబాబు "లాయరు నోటీసు" యిప్పించినాడటండి– నోటీసు యేటంటాదంటే....

తోట జాయింటుదిట–

దానిలో వున్న గన్నేరుకాయా, గడ్డిపరకతో సహా– అన్నిట్లో బుచ్చిబాబుకీ– వోటా ఉందట. తోటలో సింత సెట్లూ అవీ తనతో సెప్పకుండా కొట్టించేస్తున్నాడటండి మా బాబు.

అంచేత సింతసెట్టు కరీదులో సగం కట్టి మరియాదగా తోట పంచుతావా?

కోరటు కీడవమంటావా?

ఇదండి ఆ నోటీసు.

"పూర్వం రావణాసురుడి మీదికి రావుఁడు యుద్ధానికెల్లేదు– కలికాలం– ఇప్పుడు రావుఁడిమీదికే రావణాసురుడు యుద్ధాని కొస్తన్నాడు.... ఇచిత్రం" అందాయమ్మ.

ఏ మూర్తాన అందోగాని ఆ యిల్లాలు– తరవాత అన్నీ యిచిత్రాలే జరిగిపోనాయండి.

ఆ తరవాత మా బాబులిద్దరూ మాటలు మానీసినారండి.

ఇద్దరిమద్దెనీ– ఐసుముక్కెడితే అగ్గి నిప్పు అయిపోయిాదండి.

ఇక్కడ అననిమాట అక్కడా–అక్కడ అననిమాట యిక్కడా మోసీ తారుపుగుల్లగోళ్ళు ఎక్కువై పోనారండి.

బేపనోడికీ యీ ఇంటమ్మ శేరు బియ్యం ముష్టేస్తే, ఆ యమ్మ కుంచెడు కొలువ్వాలసిందేనండి.

ఎలక్షన్లో ఇటు మొగుడు నిల్సుంటే– అటు పెళ్ళాం నిల్సుం టాదన్నట్టయి పోనాదండి ఊరు.

యీదికీ– ఇంటికీ– రెండేసి పారిటీలండి.

ఇవతల పారిటీవోడు అర్ధరేతిరికాడ నల్లిని జంపితే, ఆ అర్ధరేతిరే అవతల పారిటీ వోళ్ళకి తెలిసిపోయిాదండి.

మా బాబులిద్దరూ ఏకంగా ఉన్నప్పుడు ఒకపాలి వొచ్చిన ఎమ్మెల్లే– వోరానికి మూడుసుట్లు రావడం– యీ సుట్టు బుచ్చి బాబు యింటికాడ దిగితే– మలిసుట్టు మా బాబింటికాడ దిగడం పేరంబించినాడండి.

ఇంక సమితి పెసిడెంటు సరేసరండి– సంకురేత్తిరి టయాంలో జంగం ముష్టోడిలా రోజూ తెల్లారీసరికి తయారై పోయివోడండి.

"సేపలోళ్ళు ఎగేనెష్టు

సినీమా హాలోడు ఎగేనెష్టు

కిరాణావోడూ

కిల్లీకొట్టువోడూ ఎగేనెష్టే,

హిందువులెగేనెష్టు

మనకి యింక మిగిలిందెవరు?

తురకోళ్ళూ– దూదేకులోళ్ళూ"

అన్నట్టయి పోనాదండి బుల్లిబాబుగోరి పారిటీ.

"మరంసేత మనం గెలవాలా అంటే కొంత కరుసొద్ది" అన్నా రండి మా పారిటీ వోళ్ళు.

"బంగపడి బతిమాలమంటే– ఓటర్లని– బతిమిలాడతాను. సిలక్కాదు–కోడికి సెప్పినట్టు సెప్పమంటే నచ్చజెప్తాను గాని కాణి కరుసెట్టమంటే మాత్తరం– ఎలక్షనూ– ఊరూ రెండూ ఒగ్గేసుకు పోతాను గాని కరుసు మాత్తరం పెట్టను. ఇది కచ్చితం" అనీసినాడండి బుల్లిబాబు మాత్తరం.

"ఓసోస్!" కరుసుపెట్టని ప్రెతీ కక్కురితిముండాకొడుకూ – అనే మాటే ఇది– మాయజేసి వోట్లేయించీసుకుని– మోట్రు సైకిలెక్కీ తిరగమంటే– బుల్లిబాబే గాదు– మొగుడొగ్గేసిన ముండ కూడా జేస్తాది– ఆ పని.

యుద్ధంలో గుండు పేల్చడం

ఎలక్సన్లలో డబ్బు ఎదజల్లడం మొగోడిపని.

డబ్బైపోద్దని మాసంమానీసి– గాందీగోరి వోరసుడ్ని అని సెప్పుకు తిరిగే కక్కురుతిగోడు బుల్లిబాబు.

అంతడబ్బు కరుసు పెట్టలేనోడు– ఆడూ–ఆడిపారిటీ వోళ్ళూ – తోకలు ముడిసీసికొని– తొంగోవొచ్చుగదా. కొసకీ నిలబడ్డం దేనికి?

మూడు వోట్లు తెచ్చుకొని ముండలా– ముసుగేసుకొని– తొంగోడం దేనికి?

ఆస్తి నాకన్నా ఎక్కువుండొచ్చు. కరుసు మాత్తరం– నా నెత్తి మీద పండు ఎంట్రుక పీకి–యిసుర్తే– అది బుల్లి బాబు కంటె ముప్పైరెట్లు కరుసు పెట్టుకొస్తాది.

నా దగ్గర సెప్పక యీడి నీతికబుర్లూ– గాంధీ కబుర్లూను.

అస్తమానం తీస్తే పెట్రోలై పోద్దని జెప్పి– ముప్పైపన్లు మోపు అయితే గాని తీసీవోడు కాదు మోట్రసైకిలు.

ఓ పాలి– సెప్పుకుంటే సిగ్గుజేటు– సిటీలో– సినిమా కెళ్దా రన్నయ్యా అంటే యేటన్నాడో– యెరికా? మేడ టిక్కెటెందుకు? కింద టిక్కెట్టు కెళ్దాం– అన్నాడు– ఆ సిగ్గు పళ్ళేక నాను సినీ మాయే మానీసుకున్నాను.

కాపీ హోటేలుకెల్తే– కరుసైపోద్దని జెప్పి– సల్దన్నం తిని వెళ్ళేవాడు కాలేజీకి– కరుసు లెగ్గొట్టడానికే– యీ గాందీ కబుర్లు!

అతగోడే గాందీగోరి శిష్యుడైతే– గాందీగారినాగ ఎలక్సన్లకి నిల్సోడం మానీమను– గాందీగోరు ఎప్పుడన్నా ఎలక్సన్లకి నిల్చు న్నాడా?

కాని ఒక్క యిసయం ఒప్పుకోవాల– గాందీగోరికీ, మా అన్నయ్యకీ ఒకటే పోల్కి.

గాందీగోరు తనకి ఉత్తరం ముక్క వొస్తే దాన్ని అల్పి (గుండు సూది) తీసిదాచీసీ వోడట. అదిగో– ఆ కక్కురితి మాత్తరం మావోడి కొచ్చినాది.

"నాకూ మంగలోడే క్షవరం జేస్తాడు. నెహురూకీ మంగలోడే జేస్తాడు. అంచేత నానూ, నెహురూ ఒకటే అన్నట్టుంది మనోడి యవ్వారం" అని బుచ్చిబాబు అన్నాడటండి.

దానికి మరో ముప్పై ముతకమాటలు కలిపి మరీ జేరేసి నారండి– బుల్లిబాబుకి.

ఆ బాబు అసలే పులిలాటోడు.

అయితే తపస్సులో వున్న పులిలా గుండీవోడు యిన్నాళ్ళు.

కాని యీ సెప్పుడు మాటలు యిన్నాక పిచ్చెత్తిన పులినాగ అయిపోనాడండి.

యింకేటుంది మరి?

సంచులుకి మూతలు కోసినాడు.

డబ్బు యిరజిమ్మీసినాడు.

ఆ ఎలక్సను యిచిత్రాలు– ముప్పైరోజులు హరికద చెప్పొచ్చుండి! రాసుకుంటే– ముప్పై పుస్తకాలు అవతాయ్!

మరంసేత అయన్నీ సెప్పను– గానండి– ఒకటి మాత్తరం సెప్పక తప్పదండి.

రెండు పారిటీలోళ్ళూ సెరోమాలనెంబర్నీ నిల్సోబెట్టినారండి.

కాని "మాయలపకీరు" గోడని– ఆడూ– మాలోడే ఆడూ నిలబడ్డాడండి– ఆడు ఏ పారిటీకి సెందడండి– సొంతంగా నిలబడినాడండి. మరేవార్డులోనూ మూడోవోడు నిలబళ్ళేదండి.

ఆ మాయలపకీరుగోడ్ని రెండు పార్టీలవోళ్ళూ 'ఇత్ద్రా' అయిపోమన్నారండి.

పో! పొమ్మనీసినాడండి ఆడు. డబ్బిస్తాం అని ఆశ జూపినారండి.

"నాను గెలిసినాక యింకా యిద్దురుగాని" అని మొండికెత్తి నాడండి.

ఆ గాడిదకొడుకు– ఏ మూర్తాన అన్నాడోగానండి– అలాగే ఐనాదండి.

ఎలక్సన్లు అయిపోనాయండి.

ఇద్దరు బాబులూ గెలిసినారండి.

ఎవురికీ మెజారిటీ రానేదండి.

ఇచిత్తరం ఏటంటే మాలపల్లిలో మాయలపకీరు గోదు గెలిసేదండి.

మరంసేత-ఆడు దీవించినోడే రాజౌతాడన్నమాటండి.

"దచ్చిన ఇవ్వందే- దేవుఁడే దీవించడు. నా నెందుకు దీవించలా?" అనడిగాడండి- నంజికొడుకు.

యింకేటుందండి?

రెండుపారిటీలోళ్ళూ రాయబారాలు ఆరంబించినా రండి- ఆడితో.

"నాను హైకోరటు జెడిజీలాటోణ్ని- నాను తీరుపుజెప్పే వొరకూ- అంటే పెసిడెంటు ఎలక్సను అయ్యావొరకూ నన్నెవురూ కలగూడదు" అన్నాడండి.

అనీసి ఎంటనే బస్సెక్కి సిటీ ఎలిపోనాడండి.

ఆడిదసలు మావూరే కాదండి. తల్లి సస్తే తాతదగ్గరికి- అంటే మా ఊరు జేరినాడండి. అయిదో క్లాసు సదివినాడటండి- సిటీలో.

ఆఁ! ఆడు సిటీ ఎలిపోనాదని జెప్పినానా?

మా ఊర్లో సగంమందిరి ఆణ్ణి ఎతకడాని కెల్లినారండి. అప్పటికి ఎలక్సనుకైన కరుసులో సగం ఆడ్ని ఎతకడాని కయ్యాటట్టుందండి.

ఆకరి కెలాగైతేనేం- దొరికినాడండి- ఆడి నేస్తం యింటి కాడ- సిటీలో.

మా పారిటీవోళ్లు కబురంపినారండి ఆడికి.

"రేప్పొద్దున సరీగ్గా తొమ్మిదయ్యేసరికి- కోమలవిలాస్ కాఫీ క్లబ్బుకి మీ బాబుని అట్టుకురండి. నానూ వొస్తాను" అన్నాడటండి.

ఆనక బుచ్చిబాబు పారిటీవోళ్ళు కూడా ఎళ్ళేరని ఇన్నానండి.

మర్నాడు పొద్దున్న-ఆడు సెప్పినట్టు సరీగ్గా తొమ్మిదికి ఒక బల్లకాడ బుల్లిబాబు- మరో బల్లకాడ బుచ్చిబాబు- మూడో బల్లకాడ మాయలోడు- కూకుని- "కేపీలు" తాగి ఎలిపోనారండి.

అలాగేడిపించేసినాడండి- గుంటనంజికొడుకు, మళ్ళీ పట్టుమని పాతికేళ్ళు ఉండవండి- ఎదవకి-

రెండు పారిటీలనీ యిలాగే రేపు ఎలక్సను అనీవొరకు ఏడిపించి, ముందునాడు దిగినాడండి ఊళ్లోకి.

# 19

ఎలక్సన్నాడు- బోర్డు ఆపీసుకాడ- ఊరు ఊరంతా యిరగపడి పోనాదండి.

పోలీసు లొచ్చినారండి.

రిజర్వోళ్ళండి-

మామూలోళ్ళండి.

"ఆర్టీవో" అండి.

అంతా కిష్టతులబారం నాటకంనా గుందండి.

తులసికొమ్మ- ఎటుపడితే తాసు అటు మొగ్గుద్దండి.

కొమ్మా- సెట్టూ ఆ మాయలోడి సేతుల్లో వున్నాయండి.

ఎలక్సను మూడుగంటల ముందు జేరేసినారండి నెంబర్లు- సపోర్టర్లూ- డబ్బు తినేసినోళ్ళూ- తినదల్చుకున్నోళ్ళూ- అంతానండి.

ఆడా- మొగా

ముసలి- ముతకా కూడా జేరినారండి.

సపోర్టర్ల కేకలండి.

పోలీసోళ్ళ గావుకేకలండి.

సంటిపిల్లల ఏడుపులండి.

సెప్పడం మురిసిపోన్ను- బుల్లిబాబూ, బుచ్చిబాబూ యిద్దరేనండి నిల్సున్నది- పెసిడెంటుపనికి-

ఎవురి మెళ్ళో పట్టపు ఏనుగ దండేస్తాదో ఎవరికీ తెలదండి.

ఆయేళ-ఆడు అంటే ఆ మాయలోడు నిద్దరనెగ్గానే తాన్నవాఁడినాడండి.

ఎవుడెళ్ళినా "దేవుడు పెత్తక్షం అయినా దెయ్యం ఒగ్గనేదని ఏటి మీ గోల? - నాను దేవుడితో మాట్లాడతన్నాను. మళ్ళీ పలకరించినారంటే పీక్కొరి కీసీది దేవుఁడు కాదు. నాను. ఎల్లెల్లు" అని తగిలేసినానండి ఎవుడెల్లినా.

అలాటోడు సమంగా ఎలక్సను టయాముకి దిగబడినాడండి.

యిజయనగరం మారాజుకి తోవిచ్చీసినట్టు– తోవిచ్చీసినా రండి– ప్రెజా– పోలీసులూ– కూడా.

ఎలక్సను మొదలైందండి.

బుచ్చిబాబు పేరు ఎవుడో ఔనన్నాడండి.

మరోడు "సెకండ"న్నాడండి.

బుల్లిబాబు పేరు ఒక మెంబరు ఔనన్నాడండి.

మాయలోడు నెగిసి "సెకండ"న్నాడండి.

అంతేనండి.

సెకండనవలసిన సుబ్బారావు గుడ్లు తేలీసీనాడండి. ఆడు ఓటెయ్యకుండానే పేనాలొగ్గెస్తాడేటో ననిపించీసినాదండి నా మట్టుకు– నాకు.

మాయలోడు, బుల్లిబాబుని ముద్దు పెట్టుకోనియ్యనేదండి– బుచ్చిబాబు పారిటీవోళ్ళని సంపీ నివ్వనేదండి– ఎవరా?– పోలీ సోళ్ళండి.

బుల్లిబాబు గెలిసినాడండి.

దండ లేయించుకున్నాడండి.

దణ్ణాలు పెట్టించుకున్నాడండి.

దండయాత్ర కెల్లినట్టు ఊరేగినాడండి.

ఆ రేత్తిరి– వొచ్చిన పోలీసోళ్ళకీ– ఆఫీసర్లకి డిన్నరిచ్చినాడండి.

వొచ్చిన మాలోళ్ళకి, కూలోళ్ళకి సంతర్పణ జేసినాడండి.

సంతర్పణ కొచ్చినాళ్ళలో బుచ్చిబాబుకి ఓటేసినోళ్లు కూడా ఉన్నారండి– మాలోళ్ళూ– కూలోళ్ళూ కాదండీ.

అరవయ్యో ఏట అన్నప్రాశన అయినోళ్ళలా తింటున్నారండి జెనం.

ఇంతట్లోనుండి– పందిట్లోకి ఒక్కసారి యెర్రటి యెలుగొచ్చి నాదండి– వెంటనే ఎదుళ్ళ సప్పుడు యినిపించినాదండి.

యింకేటుందండి?

ఎక్కడి వొణ్ణాలు అక్కడే ఒగ్గీసి పరిగెత్తినారండి కూలోళ్ళూ– మాలోళ్ళూను.

ఆళ్ళిళ్ళు తగలడిపోతన్నాయండి.

అప్పుడు ఆరంబమైందండి ఊరు తగలడ్డం.

మరి ఆరనేదండి. పకీరుగోడిల్లే ముందంటుకుందండి.

## 20

మాలపేటంతా మసై పోనాదని సెప్పినాను గదండీ. మర్నాడు మావోళ్ళు పోలీసు రిపోర్టు యిచ్చినారండి– బుచ్చి బాబు పారిటీవోళ్ళే కొంపలు కాలిసేసినారని.

మా పారిటీవోడే– లచ్చప్పగోడని– ఆడు గెంజినీళ్ళే తాగి బతుకుతాడండి– ఆడు వణ్ణంతిని ఎన్నేళ్ళో ఐపోనాదండి– మరింక యిప్పుడు వణ్ణంతింటే పడదండి ఆడికి– అదుగో, ఆడు సూసేట్టండి– బుచ్చిబాబు పారిటీవోళ్ళు కొంపలకి నిప్పు పెట్టడం.

తెల్లారేసరికి– బుచ్చిబాబుపారిటీ మాలోళ్ళు పదిమందిరి ఎరెస్టయి పోనారండి. మరో ముప్పైమంది పరారీ అయి పోనారండి.

మనలో మనమాటండి. పాపం బుచ్చిబాబు పారిటీవోళ్ళ కొంపలు కూడా కాలిపోనాయండి– కాని అగ్గిమాత్తరం మాయ లోడి కొంపల్లోనే పుట్టినాదండి.

బుచ్చిబాబుని కూడా ఎరెస్టు జేస్తారని ఊరంతా గుప్పు మందండి– దానితో ఆ బాబు ఇంటికి తాళవెట్టేసి పెళ్లాంపిల్లల్తో– సుందర్రామంగోరని– సిటీలో పెద్ద ప్లీడరండి– ఆళ్ళింటికి ఎలి పోనాదండి.

కొంపలు కాలినోళ్ళంతా బుల్లిబాబు ఇంటిమీద పడ్డారండి– కొంపలు కట్టించి యిమ్మని, ఏటిజేస్తాడండి ఆ బాబు మాత్తరం, కట్టించేడండి. ఆ ఇళ్ళకి మూడువేలో, నాలుగువేలో అయి నాయండి.

ఎలక్సను కరుసులు ఎంతయినా యనుకుంటున్నా రండి?

సెరికో లచ్చా అయ్యేయని ఊళ్ళో పుకారు గానండి– సెరికో పాతికా దాట్నేదని నా నమ్మకవండి.

పోలీసు రిపోరటు యిచ్చినారుకదండీ.

మన పోలీసులు తక్కువోళ్ళు గాదండి. ముద్దాయి– పాకి స్తాను పారి పోయినా పిలకట్టుకొని యీడ్చుకొచ్చేస్తా రండి– కొంపలు కాలిన మూడ్రోజుల్లో పారిపోయిన ముప్పై మందిర్నీ అట్టుకొచ్చి మూసేసినారండి.

మొత్తం నలభైమందిర్నీ– బెయిలు మీద పీకడానికి– సుంద ర్రామం లాటోడికి– ఆ బాబు కోరట్లోకి అడుగెట్టి నాడంటే నల్లమబ్బూ– సలిపిడుగూ కలిసొచ్చినట్టుంటాదండి– అలాం టోడికి పదిరోజులు పట్టినాదండి.

ఎర్రప్టయిన నలబై మందిర్నీ బెయిలు మీద యిడపించినాక– పూలదండ లేసి స్పెషల్ బస్సులో ఊరికి తెచ్చినాడండి బుచ్చిబాబు.

ఆ ఎలక్సనయినాక అయేదేతొలిసుట్టు పంచాయితీ బోరదు మీటింగండి.

మీటింగుకాడి కెల్లడానికి మామూలోళ్ళకి దమ్ములేవండి. అలాగని పనుల్లోకి పోనేదండి– ప్రెజలు.

ఆయేళ ఏటో ఒకటి జరుగుద్దని అందరికీ తెలుసండి– ఏటి జరుగుద్దో మాత్తరం దేవుండిక్కూడా తెల్దండి.

ఊరంతా– ఏ అలికిడీ నేకుండా– సావు యిల్లులా సల్లగా ఉందండి.

పొద్దున పది దాటినాదండి– మా వంతా సల్దులు తిని బైలెల్లినావండి– బోరుడు కాడికి– నానండి– మా పారిటీవోళ్ళే మరో ముగ్గురండి– మాయ లోదండి– మొత్తం ఐదుగురివండి– ఏవోఁఊసులాడుతూ రచ్చబండకాడి కొచ్చినావండి.

అంతేనండి.

అట్నుంచి బుచ్చిబాబు– ఆ బాబు పారిటీవోరు పరసురావుఁ దూ– పరసురావుఁడంటే బుచ్చిబాబు గోరి పారిటీలో మాల నెంబరుగా నిల్చుని ఓడి పోయినోడండి– మరో పదిమందిరి ఆళ్ళపారిటీవోళ్ళేనండి– వొచ్చినారండి.

బుచ్చిబాబు ఓ పక్కన నిలబడినాదండి. మిగిల్నోళ్ళంతా మమ్మల్ని సుట్టేసినారండి. ఆళ్ళంతా వొళ్ళుతెలీకుండా తాగే ఉన్నారండి. పరసురావుఁడు గోదు ప్రెపంచికవేఁతెలవకుండా తాగేసినాదండి.

మడిసి తూలిపోతున్నాడండి.

మాట తూలిపోతున్నాదండి. అదంతే లెండి. నోట్లోనుంచి రావఁడవేఁనేదండి.

తూల్తానే ఎండిపోయిన కాలిసెప్పు తీసినాదండి.

తీసి "ఇటు డబ్బు మెయ్యడం. అటు ఓటు ఎయ్యడవూనా? నీతి మాలిన నంజికొడకా" అని మాయలోడి సెంపమీద సెళ్ళున కొట్టేసినాదండి.

కొట్టగానే కింద పడిపోనాదండి. ఎవుదూ? మాయలోదు గాదండి. పరుసురావుఁడుగోదండి– ఆ పద్దంతో ఆడి బుర్రెళ్ళి రాయికి కొట్టుకొని– సిట్లి పోనాదండి.

సెప్పుమేకు మాయలోడి బుగ్గమీద గుచ్చుకొని రకతం బొటబొటా కారిపోనాదండి.

మావుఁకర్రలెత్తినావండి.

కాని "కర్రలు పని యిప్పుడే గాదు రండి" అని మమ్మల్ని బుల్లిబాబు కాడికి తీసికెళ్ళినాదండి మాయలోదు. ఉన్నదున్నట్టు సెప్పినాదండి ఆ బాబుతో.

అంతేనండి.

వెంటనే ఆ బాబు మమ్మల్నందర్నీ జీపులో ఏసుకుని ఆచారి గోరి కాడికి సిటీ తీసికెళ్ళిపోనాదండి.

అన్నట్టు సెప్పడం మరిసిపోనానండి– మా బుల్లిబాబు అత్తోరికాడ్నుంచి ఎలక్సన్ల కోసరం జీపు అట్టుకొచ్చినాదండి. ఆనక అది కొనీసినాదండి.

ఆచారిగోరు జెడిజీకోరట్లో ఉన్నారండి. బుల్లిబాబు ఆ బాబుని రెక్కట్టుకొని లాక్కొచ్చి సెట్టుకింద నిల్సోబెట్టి– జరిగిం దంతా సెప్పినాదండి.

అంతా యిన్నాదండి ఆచారిబాబు.

యిన్నాక కుసింతసేపు ఏం మాటాడనేదండి. మావంతా ఆ బాబేటి సెప్తాడోనని అలా బొమ్మల్లా నిల్సుండిపోనావండి.

ఆనక సెప్పినాదండి ఆ బాబు "పోలీసు కేసొద్దు. ఆళ్ళకి ఎంత మేపినా అవతల ప్రక్క కతక్క మాన్రు. అంచేత ప్రైవేటు కేసెడదాం– మా జూనియరు రంగనాధాన్ని అంపుతాను– అత గోదు మిమ్మల్ని పెద్దదాఁ్రటుకాడికి తీసికెళ్తాదు. ముందు సర్టిపికెట్టు అట్టుకురండి. ఎంటనే అర్జీ రాసేస్తాను. రేపు దాకలు సేద్దారి" అన్నాదండి.

ఆ బాబు సెప్పిన ప్రకారవేఁ– మావుఁ సర్టిపికెట్టు అట్టుకొచ్చి నావండి. ఎన్ని పన్లున్నా, ఆయన్నీ ఎనకపెట్టి ఆచారిబాబు అర్జీ రాసినాదండి.

బాబూ– ఏమాటకామాటే జెప్పాల కదండీ! ఉన్నదున్నట్టే రాసినారండి. ఆనక ఆచారిబాబు ఆపీసులో కెళిపోనాదండి, మావంతా వొరండాలో కూకున్నావండి. రంగనాదం బాబూ– సుబద్రమ్మగోరూ– ఆయమ్మ అతగోడి సెల్లెలండి– ఆయమ్మ మొగుడు సిన్నప్పుడే ముండలు మరిగి యీ యమ్మనొగ్గేసేదండి– ఆనక ఏదో రోగఁవొచ్చి సచ్చిసినాదటండి– ఆయమ్మ సక్కగా సదువుకొని ప్లీడరైనాదటండి– అన్నా, సెల్లి ఆచారిగోరి ఆఫీసు

లోనే పని జేస్తారండి– ఆళ్ళిద్దరూ మా సెలాకీగా సెప్తారండి కబుర్లు– మావుఁ వొరండాలో కూకొని ఆళ్ళకబుర్లు యింటు న్నావండి.

కొత్తమునిసీబుకి రెండో పెళ్ళావటండి– కోరటు అయి పోనాక మాపిటేళ ఆ బాబుయింటికెళ్తే ఆ యమ్మ "నువ్వు కోరటుకంపూ, సెవఁటకంపూ కలిపి కొడతన్నావు. అంచేత పనై పోనాక కోరట్లోనే స్తాన్నవాఁడి వొచ్చేవా సరే, నేకపోతే నువు కిందుండు, నాను మేడ మీదుంటాను" అంటాదటండి. ఆ యమ్మ పెట్టే బాధలకి జవాన్లంతా స్ట్రైకుజేద్దారను కుంటు న్నారండి. బట్టలుతికినప్పుడు పాతకోక సిరిగినా సరే కొత్తకోక కొనిస్తావా జీతంలో కొట్టేసుకోమంటావా అంటాదటండి. ఆ బాబు ఉజ్జోగంలో సేరినాక–ఆయమ్మ ఒక్క కోకన్నా కొన్లేదటండి. అన్నీ జవానుగోళ్ళసేత కొనిపించినయ్యేటండి.

యిలాగ ఆళ్ళిద్దరూ కతలు సెప్తూవుంటే మావంతా నవ్వుకుం టున్నావండి. ఇంతలో దిగిపోనారండి ఓ జీపునిండా పోలీసులు.

ఏటి సంగతని అడిగినాడండి. పరిగెత్తుకొచ్చిన ఆచారిబాబు.

"మా అందరిమీనా పరసురాంగోడు పిర్యాదీ యిచ్చే డటండి– మాం అంతమందివీఁ– ఆడ్ని రచ్చబండకాడ సుట్టేసినా వటండి– బుల్లిబాబు కొట్టమన్నాడటండి– అంతే, మాయలోడు కఁర్రతో బుఁర్ర బద్దలుకొట్టేసినా డటండి. ఆదటండి కేసు– మమ్మ ల్నందర్నీ– బుల్లిబాబుతో సహా– జెయిలుకి తీసుకు పోతా రటండి!"

రంగనాదంబాబు సబిన్సపెఁట్రుని పక్కకి తీసికెళ్ళి మాట్లాడి నాడండి. ఆనక మాకాడ కొచ్చినాడండి.

"ఐదొందలకి బేరవాఁడినాను, డబ్బిస్తే ఎంటనే కోరట్లో హాజరు పెడతాడట. మేస్ట్రీటుకాడ బెయిలు పుట్టించుకోవచ్చట. నేకపోతే అందరికీ రేత్తిరి వొణ్ణాలు జెయిల్లోనేనట" అన్నాడండి ఆ బాబు.

మా బాబు అగ్గయిపోనాదండి, ఏటీ దారుణవఁని.

మనవెంత అగ్గెయినా, బుగ్గెయినా పోలీసు లూరుకుంటారే టండి? మరింక మా బాబు ఒప్పుకోక తప్పనేదండి.

మా బాబు లంచం యివ్వడం అదే తొలిసుట్టండి. కాని ఆ మూర్తం మా గొప్పదండి.

మా వందరం పోలీసు జీపుల్లో ఎల్లినావండి.

మా జీపులోనే ప్లీడర్లొచ్చినారండి కోరటుకి.

బెయిలుమీద యిడుదలై, గుమస్తాలకి మామూళ్ళిచ్చి– బైట పడేసరికి గబ్బిలాలు తిరుగుతున్నాయండి. అంత సీకటై పోనా దన్నమాటండి.

ఆ బెంగకి నాకు ఆకలెక్కువై పోనాదండి.

మల్లా అంతమందివీఁ ఆచారిబాబిల్లు సేరినావండి.

ఆచారిబాబేటీ అన్లేదుగానండి, రంగనాదం బాబే మా బుల్లిబాబుకి సెప్పడం మొదలెట్టినాడండి.

"నా మాటిని యిందాకటి అర్జీకి అగ్గెట్టేసి కొత్తది రాయించు – బుచ్చిబాబు కొట్టమంటేనే పరసురాంగోడు మాయలోడ్ని కొట్టేడని రాయించు. బుచ్చిబాబుని కూడా యిరికించి, కోరటు సుట్టూ తిప్పు– నేకపోతే నువు కోరటుకి పెదచ్చిణాలు జేస్తు న్నప్పుడు, ఆడు పెళ్ళానికి పెదచ్చినాలు జేస్తూ ఉంటాడు. అన్నేయంగా నీ మీద కేసు యెట్టినాడా, లేదా? నువు యెనక అడుగు యెయ్యక– నాను గాందీగోర్నని కూకుంటే నాబనేదు. గాందీగోరికి నెహురూలాటోళ్ల సపోర్టుండీది. నీకెవరున్నారు? సన్నాసిగోడూ– సన్నాసిగోళ్ళూ తప్ప? నీలాంటి దేశం మరమ్మత్తు గోళ్ళని ఇదిగో యీ నెత్తిమీద ఎన్ని ఎంఁట్రుక లున్నాయో అంత మందిర్ని జూసినాను.

ఈ దేశబక్తి గోళ్ళంతా– ప్రెతీవోడూ ఎప్పుడో ఒకప్పుడు జారుకోక తప్పదు. జారుకున్నోళ్ళే అంతా– నానోటి సెప్తాను. నువ్వే ఆలోచించుకో.

గాందీగోరు సచ్చేడు.

ఆనక మరో గాందీ పుట్టేడా?

నేదు కదా!

ఆ బాబన్నా "సత్తెం, సత్తెం" అని తొలిసుట్టు మనదేశంలో అన్నాడా?

అన్లేదు.

మరెక్కడన్నాడు?

ఆఫ్రికాలో అన్నాడు.

అక్కడా బాబుకి నల్లోళ్ళు సపోర్టు ఇచ్చేరు.

దాంతో ఆ బాబుకి ఏనుగు బలం వొచ్చేసినాది.

ఆ బలంతోనే వచ్చినాడు మనదేశం.

అంత బలం వొచ్చినాక "సత్తెం" అన్నా సెల్లుద్ది. 'అబద్దవఁ న్నా సెల్లుద్ది.'

నా మాటినుకో–

సివరి సుట్టుగా– గాందీగోరికి మనసులో ఓ దణ్ణవెఁట్టీసి– ఆ బాబుని ఒగ్గీ.

బుచ్చిబాబుకి శకునిలాటోళ్ళ సపోరటుంది.

నువ్వు దరమరాజునాగ పెళ్ళాం, తమ్ముళ్ళతో అడివిలు పట్టీకు.

శకునిగోడు నన్ను జూస్తే "దణ్ణంగురూ" అంటూ పాదాలు పట్టీసుకుంటాడు.

మరంచేత కొత్త ఆర్జీ బరుకుతాను. నువ్వు "ఊఁ" అంటే సాలు, బుచ్చిబాబు పెళ్ళాం, పిల్లల్ని కూడా మరో కేసులో కోర టుకి యీడుస్తాను. యిప్పుడు మాత్తరం ఆడ్నీ, ఆడితోపాటు అక్కడున్నోళ్ళనీ మాత్తరం యిరికిద్దాం, ఏటంటావు?"

"ఊఁ" అను అన్నాడు రంగనాదంబాబు. ముమ్మారు ఆలో చించుకొని "ఊఁ" అనేసినాడు మా బాబు.

మరింకేటుంది?

పీటసెక్కనాంటి ఆర్జీ రాసీసినాడు రంగనాదంబాబు. దాన్ని సరిదిద్దింది సుబద్రమ్మ తల్లి. పీటకి యెండిపువ్వు లతికినట్టు.

మర్నాడు దాన్ని మేజీట్రేటు కోరట్లో దాకలు జేసినాడు మాయలోడు.

అదిగదే మొదలండీ కోరట్లంట తిరగడం.

మాలాటోళ్ళంతా ఓ పూట కూడు ఇంటికాడ తింటే– మలి పూట కూడుకోరట్లో నేనండి– ఏదో మా బాబు దయవల్లా– అదురుష్టం వల్లా– మా ఊరు బస్సులు ఏసినారుగాని, నేకపోతే– తిరగనేక మా కాళ్ళు మామూలు రోళ్ళు కాదు– ఇనపరోళ్ళు అయిపోయీవండి.

## 21

మా బతుకులు కోరటు పాలైపోనాయని జెప్పినాను గదండి. యిక జూసుకోండి బాబూ!

మీ కుక్క, మా పిల్లిని ఎంటబెట్టినాదని ఓ కేసైతే,

మీ పిల్లి– పిల్లికాదు– సిరతపులి– అది మా కుక్క కళ్ళు పీకేసినాదని మరో కేసు.

నా పెళ్ళాం నాకాడ తొంగోడం నేదని మొగుడి కేసు.

ఆడికి తొంగోడం రాదు– యిడాకులు యిప్పించీమని పెళ్ళాం కేసు.

ఊరు కేసుల గంపై పోనాదండి.

యీ కోరట్ల సుట్టూ తిరగ్గా తిరగ్గా నాకోటి అరదవైనాదండి. ఏటంటారా?

అబద్దం కేసుకి సాచ్చీకం సంపాదించడం కష్టవైఁతే– నిజం కేసుకి సంపాదించడం యింకా ఎక్కువ కష్టవఁనండి.

మా బాబుకి ఒక ఎడ్ల జత ఉండీదండి. అవి రూపుకే ఎడ్లుగానండి– గుణాలకి పులులేనండి– మడిసిగాని, పశువుగాని అగుపడితే– ముందు పొడిసీసి ఆనక ఎవరా అని జూసీవండి.

ఆ ఎడ్లు నాకూ, ఎంకటరత్నం గోడికే లొంగీవండి.

ఆ యేళ ఏరువాక పున్నవండి.

ఎంకటరత్నంగోడు ఆ ఎడ్లని సేలో మేపి తోలుకొస్తున్నా డండి. గోర్జీ కాడ కొచ్చినాడండి.

గోర్జీకవతల– బుచ్చిబాబు కళ్ళవూఁ– ఆ కళ్ళంలో కరాచీ ఆవూ అగుపడ్డాయండి ఆటికి.

మరంతేనండి.

ఫిరంగి గుళ్ళలా దూసుకెళిపోనాయండి– ఆవుకాడికి.

మారీచ సుబావుల్లా– యిటోటీ– అటోటీ– దాన్ని తగులు కున్నాయండి. తగులుకొని కడుపు సీరీసినాయండి.

పాపం తొమ్మిది నెలల సూలండి– దానికి.

ఆవూ, పెయ్యా కూడా సచ్చీసినాయండి.

బుచ్చిబాబు ఒల్ల కూరుకుంటాడేటండి? దావా ఏసినాడండి.

"మీ ఆవు సావుగురించి మాకు తెల్దు. మా ఎద్దులు దాన్ని పొడవనే లేదు" అని మావు వోదించినావండి.

నిజానికి– ఆవు సావు సూసింది ముగ్గురే ముగ్గురండి– బుచ్చిబాబుగారి పాలికాపు పోతురాజుగాడూ– మావోడు ఎంకట రత్నం– మూడోవాడు యీరిగాడని– ఆడిది లచ్చింపురవండి– ఆడప్పుడు గోర్జంట ఎల్తున్నాడండి– అదిగో ఆ ముగ్గురేనండి సూసింది.

మా ఎంకటరత్నంగాడికి నత్తండి– కొత్తోళ్ళని జూస్తే ఆ నత్తి మరీ ఎక్కువై పోతాదండి– మడిసి నిజం కూడా సెప్ప లేడండి.

"యీడి వోలకం జూస్తే ఆవుని యీడే సంపేసినానని ఒప్పేసుకుంటాడు– యీడొద్దు– మరోడ్ని యేద్దాం" అన్నాదండి సుబద్రమ్మ.

మరంచేత ఆడికి బదులు నాను నిలబడినానండి సాచ్చీకానికి.

ఆ యేళ మా కేసు మొదలైనాదండి. పోతురాజుగాడ్ని బోనె క్కించినారండి.

"ఆ ఏళ అంటే– ఏరువాక పున్నమినాడు– నువ్వు బుచ్చి బాబుగోరి కళ్ళంలోనే ఉన్నావా?" అనడిగినాదండి సుబద్రమ్మ.

ఉన్నానన్నాడండి పోతురాజుగోడు.

"బుల్లిబాబుగారి ఎడ్ల ఎనక ఎవరున్నారు? సన్నాసిగోడా? నేకపోతే బుల్లిబాబుగోరే సొయంగా తోల్తున్నారా? ఆలోసించి మరీ సెప్పు" అనడిగి ఆలోసించడానికి టయాం యియ్యకుండా "ఊఁ సెప్పు– ఊఁ సెప్పు– అని ఆడ్ని రగడాయించీసినాదండి.

ఆడు గాబరా పడిపోయి "నాకు తెల్దు. నాను సూడ్నేదు" అనీసి నాదండి.

ఆనక లచ్చింపురం యీరిగోడు బోనెక్కినాదండి. ఆడు పాపం సూసింది సూసినట్టు జెప్పినాదండి.

సుబద్రమ్మ నెగిసినాదండి.

ఎలాగనుకున్నారేటి?

సిమ్మాసనమ్మీంచి అమ్మోరు నెగిసినట్టు నెగిసినాదండి.

నెగిసి 'శెపించినట్టు ఆడి కళ్ళల్లోకి జూసినాదండి.

జూసి "నాను రెండంటే రెండు ప్రశ్నలు ఏస్తాను" అన్నాదండి.

మరంతే ఆగిపోనాదండి.

ఈ రెండు పెశ్నలతోనూ నా రెండు గుండెలూ చీల్చిపారేస్తాది కాబోలన్నట్టు బయపడిపోనాదండి యీరిగోడు.

ఆడికాళ్ళు లొటలొటలాడిపోనాయండి.

అప్పుడు ఆడికి భగమంతుడు అగుపడి "నీకు లచ్చ రూపా యలు కావాలా? యిక్కడ్నించి ఎలిపోడం కావాలా, ఈరిగా?" అనడిగితే "లచ్చావొద్దు, కోటీ వద్దు. ముందిక్కడ్నించి పంపించీ" అనడుగుతాడండి. అలాగై పోనాడండి–పాపం.

ఆ పొడిసిన ఎడ్లు ఎవరివో నీకు ఎరికా?" అనడిగినాదండి సుబద్రమ్మ.

"తెలుసునన్నాడండి" యీరిగోడు.

"అయి మామూలు ఎడ్లేనా? కంచుకొమ్ములున్నాయా ఆటికి?" అని నిలదీసినాదండి.

"మామ్మూలుయే" అని వొప్పీసుకున్నాడండి ఆడు.

"ఆటిని అప్పుడు ఎవరు తోల్తున్నారు? ఇడుగో– యీ సన్నాసి గోడేనా– నేకపోతే మరోడా?" అని రెట్టించినాదండి.

"ఈడుగాడు– మరోడు" అన్నాడండి ఆడు.

మరింక అడగననేసినాదండి– ఆ యమ్మ.

ఆచారిగోరు ఆ యమ్మ సెవిలో ఏదో గొణిగారండి. ఆ యమ్మ ఇనిపించుకోనేదండి.

తరువాత సాచ్చీకం నాదండి.

"ఆ యేళ– అంటే– ఏరువాక పున్నంనాడు ఎడ్లని పొలం కాడ్నించి ఇంటికి నానే తోలుకొచ్చినాను. అయి ఎడ్లుకావు– గంగిగోవులు– నోట్లో గడ్డి పెట్టి బతిమలాడితేనే గాని తప్ప మెయ్యలేవు– ఒక్కోపాలి మెయ్యవు. అవి ఎప్పుడూ బుచ్చిబాబు కళ్ళంలోకి ఎళ్ళనేదు. ఆవుని పొడవనూ నేదు." అని సెప్పినానండి.

సుందర్రామం బాబు నన్ను కిందా మీదా ఎట్టడానికి జూసే దండి. నాను కిందవడానికీ– మీదవడానికీ– నాను సెప్పిన సాచ్చీకంలో ఒక్క ముక్కన్నా సత్తెం వుంటే గదండి?

కోరట్లో నిజం సెప్పి నమ్మించలేం గానండి బాబూ, అబద్దం సెప్పి నమ్మించడం శానా సులువండి.

మరంచేత సుందర్రామం బాబు ఎంత గింజుకున్నా– నాను ఉడుంపట్టు పట్టీసినానండి.

సుబద్రమ్మ వోదనండి– శానా సింపులండి.

"సన్నాసిగోడు ఎడ్ల ఎనక నేదని బుచ్చిబాబు పాలికాపు పోతురాజుగాడే అన్లేదు. మరింక ఎడ్లకాడ నానే ఉన్నానన్న సన్నాసిగోడి సాచ్చీకానికి తిరుగునేదు.

ఇక– యీ ఈరిగోడు– యీ ఈకగోడి సాచ్చీకం ఏటి?

"పొడిసిన ఎడ్ల ఎనక సన్నాసిగోడు నేదు" అని.

ఒకేళ ఆ యావు ఎద్దు పొడుపులకే సస్తే– దాన్ని పొడిసిన ఎడ్లు బుల్లిబాబువి కావు.

ఇదండి ఆ యమ్మ వోదన–

ఆ యమ్మ వోదన యింటుంటే పొడిసిన ఎడ్లు నిజంగానే మనయికావు అని నాకే అనిపించీసినాదండి.

మరంతేనండి.

మునసబు కేసు కొట్టేసినాదండి.

కరుసులు బుచ్చిబాబుని యిచ్చుకోమన్నాడండి.

యిలాటి కేసులు లచ్చా తొంబయ్యండి.

## 22

"ఎంతని సెప్పనండి?

ఎన్నని సెప్పనండి?"

ఎలక్సను కయిన కరుసులు మరసిపోదావఁన్నా- యీ కేసుల కరుసులు ఎలా మరిసిపోతావండి?

సిటీ ఎల్తే- ట్రిప్పుకి- మడిసికి పదిరూపాయలండి-

ఒకో కేసులో పాతికా, ముప్పైమందిరి ఎల్లాల్సి వొచ్చీదండి.

ప్లీడర్ల ఫీజులండి.

ఆళ్ళ గుమాస్తాల వోలంట్రీలండి.

కోరటు గుమాస్తాల మామ్మూళ్ళండి.

యియ్యన్నీ తడిసి మోపెడుగాదండి- బండెడు అయ్యావండి.

కొన్నాళ్ళు కొన్ని కరుసులు బుల్లిబాబే ఎట్టుకున్నాడండి. కరుసులు ఎక్కువవుతూ వుంటే మా పారిటీ మెంబర్ల మీటింగు ఎట్టినాదండి.

"అంతా సందాలు ఏసుకుందాం" అన్నాడండి.

"సందాలేసుకోడానికి యిదేం దిక్కుమాలిన సెవదహనవాఁ?" అని ఒక దడిగినాదండి.

"పాత పెసిడెంటు పురుషోత్తంగోడు డాబామీద మేడ, బోరుదు కరుసుతోనే యేసేదు" అని మరోడన్నాడండి.

'ఈ బోరుదు తగువుల్లో మన మేడలు ఏం కాకుండా వుంటే అదే పదివేలు" అని యింకోడండి.

"బోరుదు డబ్బు సొంతానికి వాడుకోడం తప్పుగాని బోరుదు తగువులకే కరుసు పెట్టడం తప్పునేదు" అని కొందరన్నారండి.

ఎవడేటన్నా సివరికి తేలిందేటంటే "ఎవుడూ కాణీ సందా యివ్వడూ" అనండి.

"ఇంక సొంత డబ్బు కరుసుపెట్టడం బుల్లిబాబుకీ యిష్టం నేదని" కూడా తేలిపోనాదండి.

అదిగదేనండి మొదలు-

బోరుదుకి మళ్ళీ పాతరోజు లొచ్చేసినాయండి.

"రోడ్లు ఏసేం" అని కరుసులు రాసీవోరండి, యెయ్య కుండానే.

"రోడ్లు ఎక్కడేసేరు? కాయితాలమీద రోడ్లకి కరుసులేటి?" అని బుచ్చిబాబు పారిటీవోళ్ళు పిటీషన్లండి.

ఆ పిటీషన్లకి ఎంక్వయిరీలండి.

"రోడ్లూ ఏసేరు. ఆటికి రిపేర్లూ జేసేరని" ఆఫీసర్ల రిపోర్టులండి.

ఆటికోసం ఆఫీసర్లకి లంచాలండి.

యిరవై ఏల సేపల పాటకి- జమ అయిదు ఏలేనండి.

"సేవలపాటే నేదు" అని పిటీషన్లండి.

అయినా కరుసంతా బోరుదునుంచి వచ్చీదికాదండి. మరంచేత-

కిరసనాయిలు కోటాలూ,

పంచదార లైసెన్సులూ,

చవకబియ్యం డిపోలూ-

తాసిల్దారుతో మాటాడి బుల్లిబాబు యిప్పించీవోడండి. యిప్పించి నందుకు కరుసులు వందైతే- ఎయ్యి తీసుకునే వోడండి.

ఆ లైసెన్సులు, కోటాలమీద పది ఏలు సేసుకున్నప్పుడు, ఎయ్యి యియ్యడాని కేవండి? సావుకార్లు సంతోషంగా యిచ్చీ వోరండి.

యీ పారిటీల్తో, కేసుల్తో ఊరు ఎప్పుడూ తగలబడుతూనే వుండీదండి.

పగ పెరిగిపోనాదండి.

పరువు, మరియాదా మరిసిపోనారండి.

అబిమానాలు పోనాయండి.

ఇవతల పారిటీవోడు ఒక్కడే వుండి అవతల పారిటీవోళ్ళు యిద్దరుంటే, యీడు సచ్చేదన్నమాటేనండి.

అటొకడూ, యిటొకడూ వుంటే ఎవుడు సస్తాడో తెలదండి.

యిలాగుండీయండి తగువులూ, దెబ్బలాటలూను. కొట్టి నోడు ఒకడైతే, కేసు ముప్పైమందిరి మీదండి. ఒక దెబ్బ తగిల్తే, పది తగిల్నాయని డాట్రు సర్టిఫికెట్లండి.

ఊరు సెదపట్టిపోనాదండి.

అసలీ వూళ్ళో ఎవుడన్నా మంచోడు ఒక్కడన్నా ఉన్నాడా అని అనిపించీసినాదండి అంతమందికీను.

పొద్దు పొడుస్తే ఎవడి తల పగుల్తాదో తెలదండి. యెవుడి పరువు తగలబడతాదో తెలదండి.

సెప్తే మీ కబద్దం– నాకు నిజెవూఁనండి.

సివరకీ పారిటీలు ఎంత లెక్కకి పోనాయంటేనండీ– రంకు తనం జేస్తే సొంత పారిటీదాన్తోనే సెయ్యాలన్న మాటండి.

ఎదుటి పారిటీ ఆడది ఎంత పిల్సినా ఎల్లగూడదన్న మాటండి.

ఒక పారిటీలో పేరున్నోడు ఎవుడన్నా సస్తే– రెండో పారిటీ వోళ్ళు పండగ జేసుకోవలసిందేనండి.

ఒక్క పెళ్లాం కాడికి తప్పిస్తే– పొలానికన్నా సరే– యెవడూ– ఒక్కడూ ఎల్లకూడదండి.

ఎల్తే పదిమంది రెళ్ళాలి. నేకపోతే ఇంటికాడ తొంగోవాల.

ఇక మాలోటోళ్ల సంగతి అడక్కండి బాబూ.

దెబ్బలాటకెళ్తే తాగుడు– దెబ్బలు కొట్టొస్తే– తాగుడు. దెబ్బలు తినొస్తే– ఇంకా తాగుడు.

ఓ పాలండి.–

మా పారిటీవోడే– సిమ్మాద్రిగోడని–

ఆడికి తాగితే ఒళ్ళు తెలదండి.

తాక్కపోతే– పెపంచికవేఁ తెలదండి.

ఆడోనాడు– తప్పతాగేసి– సీకటి పడ్డాక– సాకిరేవుకాడఒక సాకల్దాని రెక్కట్టుకున్నాడండి. ఆ సాకల్ది కేకలేస్తే– అక్కడున్న సాకళ్ళంతా వొచ్చి సావగొట్టేసినారండి.

ఆడు మరో గంటకి సచ్చీసినాదండి.

అప్పుడు బుల్లిబాబుగోరు ఊళ్ళో నేరండి.

ఆ బాబు నేకపోతే మాకు నరసింగరావని– ఆ బాబే పెద్దండి – అతగోడు పోలీసు స్టేషనుకి పారెళ్ళినాదండి.

సిమ్మాద్రిగోడ్ని, బుచ్చిబాబూ, ఆడి పారిటీవోళ్ళు మరో పదిమందిరీ కలిసి సంపీసేరనీ, తొలిదెబ్బ బుచ్చిబాబే ఏసేడనీ– రిపోర్టు యిచ్చినాదండి.

నన్నూ, మరో యిద్దర్నీ సాచ్చీకం ఏసినారండి.

ఆ కేసులో బుచ్చిబాబు నెల్లాళ్ళు జెయిల్లో ఉండిపోనాదండి.

సెప్పకేం–మన్లో మనమాట–నాకూ ఓ రెండు కేసుల్లో జెరి మానాలు ఏసేరండి.

మరో సుట్టు– ఆ మేస్ట్రీటుబాబుకి దెబ్బలాట కేసులంటే అసయ్యవఁటండి. అంచేత నన్ను మూణ్నెల్లు జెయిలు కట్టీసి నాడండి ఓ కేసులో.

సేస్తున్నది మంతర్సాని పనైనాక, నాకు ఆడదంటే అసయ్య వంటే ఎలాగండి మరి?

అయితే మా యాడదాని అదురుష్టం బావుండి అపీల్లో తరిగి పోనాదండి సిచ్చ.

యింకోపాలి ఎంకటాద్రిగోడిని– ఆడూ బుచ్చిబాబుగోరి పాలికాపేనండి– ఆడు సింతసిగురు కోద్దావఁని సెట్టెక్కినాడండి. సెట్టు సివర కెక్కినాడండి– సటుక్కుని పాఁవొకటి కరవబోతే, పట్టు ఒగ్గీసి, కిందపడి పచ్చడైపోనాడండి.

ఆళ్ళు మాత్రం ఊరుకుంటారేటండి?

మాం అబద్దం కూనీకేసెడితే, ఆళ్ళో కూనీకేసు బనాయించి నారండి మామీద.

అందులో నానూ, మా బాబూ కూడా ముద్దాయిలవేఁనండి, మావూఁ రిమాండులో నెలున్నావండి.

అయిదరాబాదు హైకోరట్లో దొరికినాదండి బెయిలు.

ఏమాటకామాటే సెప్పుకోవాలండి–

పారిటీ పెద్దలమీద ఎవరూ సెయ్యి జేసుకొనీ వోరుకాదండి.

ఇద్దరు బాబులుమీదా ఎవరూ నోరు పారేసుకోనేదండి.

ఒంటరిగా తిరగడానికి బయపడీదీ, దెబ్బలు తినీదీ, అంతా మాలాంటి సరుకేనండి.

ఆయేళ అవతలి పారిటీ పెద్దలందరి మీదా మేస్ట్రీటు కోర టులో కేసున్నాదండి. అయితే ఆ పొద్దు మేస్ట్రీటుగోరి తండ్రి దినవటండి. అంచేత ఆ బాబు సెలవెట్టిసినాదండి. మావెవ్వరం కోరటు కెళ్ళనేదండి.

నేనూ మా బాబూ పొలంనుంచొస్తున్నావండి.

అటూ, ఇటూ సెయ్యెత్తు సెరుకుతోట్లండి.

మద్దెన మూడుమూళ్ళ తోవండి.

మాఁవుఁ వొచ్చీ తోవలో మూడు నాగు పావుఁలు కాళ్ళలో పడ్డాయండి.

పల్లెటూరోళ్ళం. పావుఁలకి అలవాటే గానండి, కాని మూడు పావుఁలకి అలవాట్లేదండి. అంచేత మనసులో బితుకు బితుకు మంటూనే నడుస్తున్నావండి.

యింకా నాలుగుబార్ల పొద్దున్నాదండి.

ఊరు అరమైలుంటాదండి.

నాను బుర్రొంచుకొని నడుస్తున్నానండి– యీ పాలి కాళ్ళలో పడీది నాగుపాఁవా? జెర్రిగొడ్డా? అని ఆలోచిస్తూ.

ఇంతలో సెరుకు తోట్లోంచండి– ఇలా గాలిలో నాగుపాఁవుఁలాగ ఎగిరొచ్చినాదండి.

మా బాబు 'అమ్మా' అని ఒక యెర్రి అరుపు అరిసినాడండి.

ఎనక్కి తిరిగి సూసీసరికి, మా బాబు బుజంకాడ రకతం కారుతున్నాదండి. సొక్కా సిరిగిపోనాదండి బుజంమ్మీద.

"యీాటె యిసిరినార్రా, ఎంటపడరా" అని అరిసినా డండి.

నాను తోట్లో పడ్డానండి.

నానో సంగతి సెప్పడం మరిసిపోనానండి.

నన్ను జూసినారు గదా!

నలుగుర్ని ఒక్కసారి కొట్టగల్నండి.

కాని పరిగెత్తలేనండి.

సిన్నప్పుడు యిదుగో ఈ పాదంమీంచి బండి ఎలిపోనాదండి. పాదం సిట్లిపోనాదండి. అంచేత పరిగెత్తలేనండి.

అంచేత తోట్లో జొరబడ్డాను కానండి ఎవరూ కానరానేదండి.

మా బాబు సేతికి తగిలిన దెబ్బ పెద్దది కాదండి.

కాని మనసుకి తగిలిన దెబ్బ మాత్తరం మొయ్యలేనిదండి.

మడిసి పీచుపీచు అయిపోయి– మెత్తబడిపోనాడండి.

నన్ను జూసినప్పుడు కూడా– పుల్ని జూసిన మేకలా– ఎర్రి సూపులు జూస్తున్నాడండి.

దెయ్యాన్ని జూసిన మడిసిలా అయిపోనాడండి.

బుజం సాయంయిచ్చి యింటికి తీసుకెళ్ళినానండి.

అంతేనండి.

పడవలా పడిపోనాడండి–

మంచంమీద ఏసినావండి.

వొళ్ళు కాలిపోతన్నాదండి.

పరాకు మాట్లు ఆడతన్నాడండి.

పక్కూర్నించి డాట్రుని తీసుకొచ్చినావండి.

ఆ బాబు, సేతికి కట్టుకట్టి– యిండీషను జేసినాక కుసింత కునుకట్టినాదండి.

తొలిజాఁవుఁకి తెలివొచ్చినాదండి.

పొద్దుపొడిసీసరికి కుసింత సరుదుకున్నాడండి–

ఆనక జీపేసుకొని ఆచారిగోరికాడి కెళ్ళినాఁవండి. అప్పుడే నండి ఈ కెప్టెనుగోడ్ని తొలిసుట్టు సూడ్డం.

## 23

"నువ్వాగరా సన్నాసీ, యింతవొరకూ కత నాకు తెల్దు కాబట్టి ఆడ్ని చెప్పనిచ్చినానండి. యిటుపైని కథకి సైడుహీరో లాటోడ్ని – అంచేత నానే సెపతానండి;

"ఆ పొద్దే నాకూ బుల్లిబాబుగారికీ–ఆచారిబాబు బేరం కుదిర్చి సేదని సెప్పినానా? బేరం కుదిరిన కాడ్నించి బుల్లిబాబుకి బాడీగార్డు అయిపోనానండి.

ఆ సాయంత్రం వొరకూ బుల్లిబాబుకి– ఆచారిగోరూ– రంగనాథం బాబూ– సుబద్రమ్మగోరూ– ఎయ్యో కాయితాలు రాయడం– పోలీసు స్టేషన్ కెళ్ళడం– రాసిన కాయితాలు సింపీయడం– మళ్ళీ రాయడం– మళ్ళీ స్టేషను కెళ్ళడం– యిలాగై పోయిందండి– ఆ సాయంత్రం అంతా–

ఆకరికి ఎలాగైతేనేం– అయిదొందలు లంచం యిచ్చి, ఒక ఆర్జీయిచ్చినారండి– పోలీసోళ్ళకి–

ఆ రాత్రండి...........

రంగనాదంగోరి డాబామీదండి– రంగనాదంగోరు– సుబద్రమ్మ– డాట్రు– సత్తెనారాయణా– బుల్లిబాబుగోరూ– కుర్చీల్లో కూర్చున్నారండి.

రంగనాథంగోర్ని మాలాటోళ్ళే రంగనాదవంటోరండి. తెలిసినోళ్ళంతా మందునాదం అంటారండి.

ఆ బాబు కోరట్లో నేకపోతే, 'కుజరహు" బార్లో ఉంటాడండి. తెలివికి ఆచారిబాబుని కూడా ఆటపట్టించీ గలడండి. ఆ బాబు సొంతంగా ఆపీసెట్టుకుంటే– ఆచారిబాబు కన్నా ఎక్కువే ఆర్జించ గలడండి.

అయితే ఈ బాబుకీ, ఆచారిబాబుకీ సిన్న తేడా వుందండి.

ఆచారిబాబుకి ముగ్గురు పిల్లలండి. ముగ్గుర్నీ తల్లికడుపుకోసే తీసేరండి. డాకటర్లు రెండాపరేషన్లూ జేసినప్పుడు ఆచారిబాబు జెడిజీ కోరట్లో ఉన్నాడటండి. మూడోదానికి మునసబు కోరట్లో ఉన్నాడటండి.

మరింక నాలుగో ఆపరేషను అవసరం నేకపోయినాదటండి. ఆచారి బాబంటే బార్యకి అసయ్యంవొచ్చేసి మరింక దగ్గిరికి రానియ్యనేదండి– ఆ యమ్మ–

అసలా బాబుకి వొణ్ణం అక్కర్నేదండి.

కేసుకట్టలు తినీసి బతకీగలడండి.

పార్టీగాడొచ్చాడంటే వొణ్ణం కాడ్నించికూడా లెగిసిపోతాడండి ఆ బాబు.

పెళ్ళాన్ని ఒగ్గీమన్నా ఒగ్గేస్తాడండి.

ఆ బాబు కోరట్లో కురిసీలో ఏం కునుకుతాడో అంతేనండి.

యింటికాడ రేతిరంతా పుస్తకాలు ముందేసుకొని కూకుం టాడండి– నిద్దర్నేకుండా!

సదివిన కాయితం ముమ్మారు సదివితేనేగాని ఆ బాబుకి సంతుష్టి ఉండదండి. రంగనాదం బాబలాకాదండి.

కాయితం– మొదలూ– కొసా– సూస్తే సాలండి. అత గోడికి– మద్దెన ఏటుందో అరదవై పోఁతాదండి.

"యీ బాబుకీ వొణ్ణం అక్కర్నేదండి" మందుంటే.

యీ బాబుకి శాన బద్దకవండి.

యితగోడు నిద్దర్లెగిసేసరికి– మునసబులూ– జెడిజీలూ బెంచీలెక్కేస్తారండి.

మందుకాడ కూకున్నాడంటే– పారిటీగోడు కాస్సరిగదా– జెడిజీ బాబొచ్చినా సరే– "మళ్ళీ రమ్మను" అనేస్తాడండి.

ఓ పాలి ఏవైందనుకున్నారూ?

ఓ జెడిజీగోరు పిల్లకి పెళ్ళి జేస్తూ– పిలవడానికి– యీ బాబింటికి ఎల్లినారటండి.

ఎరక్క– రేతిరిపూటెల్లినాడటండి.

మన బాబు "ఫుల్ డోసు" మీదున్నాడటండి.

తన సేతిలో గళాసు జెడిజీ సేతిలో ఎట్టేట్టండి. ఎట్టి "మందుకీ అమృతానికీ ఎంగిల్నేదు. పరవాలేదు– పుచ్చుకో" మన్నాడటండి.

అక్కడితో ఆగినా బాగుండిపోయీదండి.

కాని ఆగనేదండి.

"ముందుటోరం కూనీకేసులో ఉరిసిచ్చ ఎయ్యాలన్న బుద్ధి నీకు పుట్టినాదా? మీ ఆడదానికి పుట్టినాదా?" అనడిగీసి నాదటండి.

మడిసి మంచోడేనండి.

"మందు" లేనప్పుడు మహాత్మాగాందీగోరేనండి.

స్నేహానికి పేణం యిచ్చేస్తాడండి.

డబ్బు కరుసులో–

సేతికి ఎఁవిఁకా

పెట్టికి తాళం ఉండదండి.

అసలా బాబు సిన్నప్పుడు యింకా మంచోడటండి. అతగోడు సదువుకునీ రోజుల్లో– ఎవర్తో జాణ– పెళ్ళాడతానని మూడేళ్ళు తిప్పుకున్నాదటండి. మూడ్రోజులు ఆ బాబుకాడ తొంగున్నాది కూడా నటండి.

నాలుగోనాడు–

"నీ నడుంమీద నల్లటి మచ్చున్నాది. అదే జబ్బో? ఏటోనని బొంకి మరో డబ్బున్నోడ్ని పెళ్ళాడీసినాదటండి.

అదిగో. మరప్పట్నుంచీ మందు మరిగేడండి బాబు.

పేరుకేనండి ఆ బాబు ఆచారిబాబు జూనియరు. "లా"లో ఆచారి లాటోళ్ళని ఐదుగుర్ని మంచినీళ్ళడక్కుండా మింగీసి అరాయించుకుంటాడటండీ. అంచేత ఏ పెద్దకేసొచ్చినా సరే రంగనాదం బాబు సలహా నేకపోతే కాయితం నలుపు చెయ్య దండి ఆచారిబాబు.

మరింక కూనీకేసైతే– సరేసరి– రంగనాదంబాబు పక్కన నేకపోతే కడుపో కాళ్ళో పట్టుకొని వోయిదా ఏంచీసుకుం టాడండి.

అసలీబాబు ఆచారిబాబు ఆఫీసులో సేరి యిరవై ఏళ్ళయి పోద్దండి.

ఎరక్క– ఆచారిగారోపాలి "మందు మానీరా రంగనాదం" అన్నాడటండి.

దానికి బాబు ఓ నవ్వు నవ్వి 'ఆచారిగోరూ! కోరటు పారి టీలు నేకపోతే మీరు బతకనేరు. మందు పారిటీలు నేకపోతే

నాను బతకలేను. ఒకేళ మీ కాలం– కరమం కూడి నాను మందు మానేస్తే మీ పారిటీల్లో మీకాడ ఒక్కడుండడు. అంతా నాకాడ జేరిపోతారు. ఆలోసించుకోండి" అన్నాడటండి.

ఇంక సుబద్రమ్మ తల్లండి.

ఆ యమ్మ రంగనాదంబాబు సెల్లెలని సన్నాసిగోడు సెప్పి నాడు గదండీ.

ఆ యమ్మ సిన్నప్పుడే బియ్యే సదివినాదటండి. సదువైపోగానే పెళ్ళి జేసేసినారటండి.

ఆ యమ్మ కేటితక్కువండి.

బంగారబ్బొమ్మండీ.

కానేట్నాబవండి? ఆ యమ్మ బరతకి నచ్చనేదటండి. సీకటడే సరికి సందుల్లో పడిపోయేవాడటండి– నాటు ముండ కోసరం.

ఆ బాబుకి అంటుకోని రోగం నేదటండి.

అంతే గాదండి.

పులుసులో ముక్కెయ్యలేదనో, మజ్జిగలో ఉప్పెయ్యలేదనో– ఏదో వంక పెట్టి–తొక్క వొలిచేసేవోడటండి. పెళ్ళానికి.

మందు ఏసంగిలో–

మద్దేనపేళ–

సిమెంటు నాకట్లో–

సెప్పుల్లేకుండా

మూడు గంటలు నిలబెట్టేసేనాడటండి.

దానితో బంగారుబొమ్మలాంటి– అమ్మల్లా– కాలిన కొర కంచునాగ అయిపోనాదటండి.

ఓనాడు ఓ జట్కాముండని యింటికి అట్టుకొచ్చి– ఈ యమ్మ కాద పుస్తే–పూసా లాక్కుని– అరదరేతిరి యింటిలో నుంచి తగిలేసేడటండి.

యీ యమ్మ బాదలు సూళ్ళేక– పక్కింటోళ్ళు కన్నోరింటికి దిగబెట్టేసి నారటండి.

కన్నోరింటికాడ ఆ యమ్మకి ఒకటే పనటండి.

యేడ్డం.

వొణ్ణం నేదటండి–

నీళ్ళు నేవటండి–

నిద్దర్నేదటండి–

అలా మూడ్నెల్లు ఆ యమ్మని ఏడవనిచ్చేడటండి రంగనాదం బాబు. ఆ యెనుక ఏవో పెద్దపెద్ద పుస్తకాలు సదివించినాదటండి. ఆ యమ్మసేత.

అంతే.

అయి సదివినాక మళ్ళీ మామూలు మనిషై పోనాదండి.

ఆనక ఆ బాబే బలవంతంగా ఆ యమ్మసేత ప్లీడరీ సదివించి నాదటండి.

ఆ యమ్మ ప్లీడరుపట్టా పుచ్చుకున్నప్పుడు "ఆడముండ లాయరేటని?" అన్నారటండి అంతమందిరీను. కాని మూడేళ్ళు తిరిగేసరికి మొగోడికి మొగుడై పోయినాదటండి బార్లో.

"రంగనాదంబాబు సలహా జెప్తే అయిదరాబాదెళ్ళినా తిరుగుండదు."

అన్నా, సెల్లీకలిసి సెప్తే డిల్లీ యెళ్ళినా తిరుగుండదు, అన్న పేరొచ్చేసినాదండి.

కాని ఆళ్ళిద్దరితోటి ఒకటేనండి సిక్కు.

స్తిరంనేదండి యిద్దరికీ.

ఆశకూడా నేదండి.

ఆ బాబుకి బోలెడాస్తి అని జెప్పినాను గదండీ. ఆ యమ్మ బరత ఏదో పెద్దరోగం వచ్చి పోనాదటండి. ఆ బాబు ఆస్తంతా ఆ యమ్మకే దక్కినాదటండి.

ఒక యిచిత్తరం జెప్తే తవఃరు కూడా నమ్మరండి మరి.

ఆ యమ్మకి మందు అన్నగారే మప్పినాదటండి. కాని ఏ మాట కామాటే సెప్పాలండి.

ఆ యమ్మ రోజూ తాగదండి.

ఏదో పారిటీలో కూకున్నప్పుడు రెండు పెగ్గులేస్తాదటండి. అంతే. నా మట్టుకు నేను సూడ్నేదండి ఆ యమ్మ తాగడం. మందు ఏసుకున్నా– యేసుకోకపోయినా ఒక్కలాగే హుషారుగా ఉంటాదండి.

ఆ బాబునీ, ఆ యమ్మనీ పెళ్ళాడుదారని శానామందిరి తిరిగినారటండి. కాని ఆళ్ళకో 'తియరీ' ఉందంటండి.

మడిసి నచ్చుతే రమ్మంటారంటండి.

నేకపోతే పొమ్మంటారంటండి.

కాని ఎవర్నీ పెళ్ళాసు ఎత్తొద్దంటారంటండి.

యిక డాట్రు సత్తెనారాయణండి– మనం పది మాటాడితే ఒక "ఊం" అంటాడండి.

ఏ రేత్తిరీ రెండు పెగ్గులు దాటనివ్వడండి.

రెండు పెగ్గులు తగ్గనివ్వడండి.

మామూలుగా అయితే మనం మాటాడితే "ఊం" "ఆం" అంటాడని సెప్పినానా!

మందేసుకుంటే "ఆం" "ఊం" కూడ వుండరండి.

బారతం కాడ్నుంచి, బూతు కబుర్ల వొరకూ ఎవరేటి సెప్పినా మాత్తరం యింటాడండి.

ఆ బాబుని అప్పుడప్పుడు సుబద్రమ్మగోరు రానిస్తారటండి. అదీ ఆ బాబు "యిష్టరీ".

ఆళ్ళు నలుగురూ కూకున్నాక సుబద్రమ్మగోరు లైటేసి నాదండి.

ఈటెదెబ్బ తిన్నప్పుడు– దెయ్యాన్ని సూసినట్టు సూసినాదని సన్నాసిగోడన్నాడా? అదిగో మళ్ళీ ఆసూపు వచ్చీసినాదండి బుల్లిబాబుకి.

ఉండుండి సేతికున్న కట్టు తడువుకుండీవోడండి.

"ఎవరు యీటేసినారో ఎవురూ సూడ్నేదే, ఎదవ కర్మ" అన్నాడండి రంగనాదంబాబుతో.

"సూస్తే ఆడిమీదే కేసెట్టాల. మహా అయితే మరో ముగ్గుర్ని కలపొచ్చు. సూడకపోతేనే నయ్యం, డబ్బిస్తే ఊరందర్నీ యిరికిం చేస్తారు పోలీసోళ్ళు "కాన్సిపిరెసీ' కేసెట్టి" అందండి సుబద్రమ్మగోరు.

"నిజవేఁనా?" అన్నాడండి మా బాబు ఆశగా.

ఆవిడగారేం మాట్లాడనేదండి.

లోపల కెళ్ళిందండి.

ఒక సేత్తో "జిన్ను" సీసా, మరో సేత్తో "లైంజూసు" సీసా అట్టుకొచ్చినాదండి. అయక్కడపెట్టి మళ్ళీ లోపలకెళ్ళినాదండి.

ఎల్తూ, ఎల్తూ నన్ను రమ్మన్నాదండి.

పకోడీలు తెమ్మంటాదో– ఏటోనని–నాను ఎంటెల్లి నానండి.

"ఐస్‌వాటరు" బాటిలిచ్చిందండి.

"రమ్ము" ఓ క్వార్టరు ఇచ్చిందండి.

సేతిలో ఓ రూపాయెట్టిందండి "పకోడీలు కొనుక్కో" అని అంటూ.

అంతేనండి. కిందికి పొమ్మందండి.

ఆ యమ్మ మనం ఆవలించకుండానే ఊపిరితిత్తులు జూసేస్తాదనిపించినాదండి నాకు. మనం "రమ్ము" గోళ్ళవఁని ఎలా తెలిసిపోనాదో ఆ యమ్మకి.

చెమించాల "మనం" అనీసినాను. తవఁరిగోరి సంగతి తెలకుండానే.

మనకి "హేబ్బాటిలు" అరగంట రాదండి.

కాని యింటికెళ్ళి మా బీగానికి కబురు సెప్పి దానికో "పెగ్గిచ్చి", మనం మందు కాళీజేసేసరికి గంట దాటిపోనాదండి.

నాను మళ్ళా రంగనాదంగోరి డాబామీద కెళ్ళీసరికి– అంతా మందు మీదే ఉన్నారండి.

ఏటో? యీ సన్నాసిగాడు– బుల్లిబాబు పులిలాటోడు– గాందీగోరి శిష్యుడంటారండి.

గాందీగోరి శిష్యుడుగా వున్నప్పుడు– తపసుజేసీ పులిలా వుండి ఉండాలండి.

"మందు" మీదున్నప్పుడు మాత్తరం ఎదకొచ్చిన పులిలా అగపడ్డాదండి.

నాను డాబామీద కెళ్ళీసరికి ఆ బాబేటంటన్నాడో యెరికా?

"ఆ ఎదవ–వెదవన్నరెదవ– జెష్టెదవ– బడాచోరు ఎదవ–ఆ బుచ్చిబాబుగోడు వొరసకి– తమ్ముడైపోనాడు– అంచేత తిట్లలో కూడా ఆడి తల్లినీ, సెల్లినీ ఎత్తదాని కీల్లేదు.

కాని ఆ జెష్టెదవని సంపి బూడిద జేసి– యిదిగో– యీ మందులో కలిపీసి– సోడా కూడా అడక్కుండా తాగేస్తేనేగాని నాకు నిద్దరపట్టదు– వొణ్ణం సయించదు.

ఈటె యిసిరేస్తాడా నామీదకి?

ఒకప్పుడు గాంధీగోరి శిష్యుడ్నే. కాదన్ను.

కాని– యియ్యేళ– ఎదవన్నరెదవ– నా పేనానికే ఎసరెట్టి నాక– యింక నాను హిట్లర్ని.

ఆడి అంతు జూస్తాను.

అడ్ని ముప్పతిప్పలు పెట్టి– మూడు సెరువులుగాదు– మూడుసంద్రాల నీరు తాగించకపోతే నా పేరు బుల్లిబాబే కాదు.

నా నేటైపోయినా పరవానేదు.

ఆడు మాత్తరం నెత్తిమీద సెంగైనా నేకుండా- ఊరిడిసి ఎల్లిపోవాల" అంటున్నాడండి.

"ఆ యిషయం నాకొగ్గీ- రావుఁలోరితో అనుమంతు డన్నట్లు - మీ మీదికి ఈటిసిరినారు. ఆ యిరిసినోడ్ని ప్రైమినిస్టు అంపేడా? చీప్‌మినిష్టు తోలినాడా? కాదు గదా.

ఇసిరినోడు ఎవడు?

ఎవడో సత్తరకాయగోడు.

ఇసిరింపించింది మాత్తరం- ఆ తొత్తుకొడుకు బుచ్చిబాబే- తమ్ముడని తఁవఁరు తిట్టగూడదు గాని నాను తిట్టొచ్చు.

ఊర్నించి ఒక తొత్తుకొడుకుని అంపించీడానికి తొమ్మిది తప్పుదు కేసులన్నా పెట్టొచ్చు. తప్పునేదు.

ఈటిసిరినోడ్ని మనం జూళ్ళేదంటే- ఈ సుట్టు యిసిరి నప్పుడు జూసి వొచ్చి- కేసు పెట్టు అంటాది కోరటు.

మరంచేత-

సినరాఁవిగాడు యిసిరేడనీ,

మీరూ, సన్నాసిగోడూ సూసేరనీ,

దీనెనక బుచ్చిబాబూ, ఆడి పార్టీ "కాన్సిపిరసీ" ఉందని పోలీసు రిపోర్టులో రాసినాను.

బుచ్చిబాబూ అతని పారిటీవోళ్ళూ మిమ్మల్ని సంపడానికి ప్లాను ఏస్తున్నప్పుడూ- సినరావిగోడ్ని ఈటె యిసరమన్న ప్పుడూ- ఒక సాచ్చి కావాలి.

మన మనుషులున్నప్పుడు ఆళ్లు యిలాటి ప్లానేస్తారా అని నన్నడగొద్దు. మనవాడ్నే ఒకడ్ని నిలబెడదాం. ఆడు "జై ప్రకాస నారాయణ" లాటోడు. ఆడికి పారిటీలతో పన్లేదంటాం. ఆడు బుచ్చిబాబుగోరింటికి- ఎద్దులు ఎరువడగడానికో- దేనికో రేత్తిరి పూట ఎళ్ళేడనీ- వొరండాలో నిల్చుని ప్లానంతా యిన్నాడనీ- బయటపడిపోయి ఎడ్లు అడక్కుండానే ఎలిపోనాడనీ అంటాం.

ఆ పనంతా- ఆ ఎలగ్గొడ్డుగాడు- తాలూకా యినస్పె ట్రుకి ఒగ్గేద్దాం. కుట్ర కేసులో స్పెషలిస్టు ఆడు,

కేసు నిలబడతాదా అని అడగొద్దు.

ఏలకొద్దీ పోలీసుల్ని- కోట్లకొద్దీ రూపాయల్ని కర్సెట్టి- నకస లైట్లమీద కుట్రకేసులు బణాయిస్తారు- ఆ కేసులే నిలబడవు.

కాని యీ కేసు వొల్ల బుచ్చిబాబుకి "బ్లడ్‌పెషరు" పెరుగుద్ది.

ఆళ్ళ ప్లీడరు సుందర్రామం తక్కువ్వోడేంగాదు. యిలాటి కేసులు మూడు తగిల్నాయంటే బుచ్చిబాబు పెళ్ళాం పుస్తెలు కూడా అమ్మించీగల్డు. కాని మంచోడు కాబట్టి మంత్రాలు సద వందే మంగళసూత్రాలు తియ్యనివ్వడు.

కాని ఒక్క యిసయం.

మనకీ కరుసవుద్ది.

మనం సెయ్యబోయీది యుద్ధం-

యుద్ధానికెళ్ళినా, ముండకాడి కెళ్ళినా- అన్నిటికీ సిద్ధపడే ఎళ్ళాలి.

మన కెందుకీ కరుసు అనుకున్నారా- ఆ సంగతి ఆ ఎలుగొడ్డుగాడికి సెప్తే సాలు. ఎగిరి గెంతేస్తాడు- కేసు నీళ్ళు కారిసేస్తానని బుచ్చిబాబుకాడ కూడా పిండొచ్చని." ఇంకా ఏటో సెప్తానే ఉన్నాడు రంగనాదంబాబు.

మా బాబుకీ, నాకూ నిదరొచ్చీసినాది.

## 24

"యేం నిద్దర! యేం నిద్దర!" అంటూ-పొద్దుట పదిగంటలకి - నెగిసి నాడు మా బాబు.

ఆ యేళ-మాం జేసిన పనల్లా పోలీసుటేషను చుట్టూ - ప్రెదచ్చినం జెయ్యడవేఁ!

"సాయింత్రం నాతో మా ఊరొచ్చీ-మీ యాడదాన్ని గూడా - రేపో, యెల్లుండో వొచ్చీమను" అన్నాడు మా బాబు నాతో.

ఓ యాభై ఎడ్వాన్సు కూడా యిచ్చినాడు.

మకాం మారవడం సంగతి మా యాడదాన్తో మాట్టాడినాను - ఆ తరవాత.

ఆ సాయింత్రం జీపులో బయలెల్లినాం.

ఈటి పోటు మరువుకొచ్చినట్టు నేదు ఆ బాబుకి....

అంచేత నాకూ, డ్రైవరుకీ మద్దెల కూకున్నాడు.

ఈటొచ్చినా, బాకొచ్చినా మా ఇద్దర్లో ఎవడో ఒకడు సావాల నుకున్నాడో-యేటో!

అన్నట్టు సెప్పడం మరిసిపోన్ను-మాఁవుఁ బయలెల్లీ ముందు - మా బాబు రెండు ఆల్సేసియను కుక్కల్ని కొన్నాడు.

ఆటికి ఆర్నెల్లు యెల్లనేదట.

అమ్మినోడు ఆటిని కుక్కలన్నాడు కాబట్టి నమ్మాలి గాని, అయిమాత్తరం తోడేళ్ళ పిల్లల్లా కూడా గాదు–పెద్ద తోడేళ్ళలాగే ఉన్నాయి.

మాం ఊరుజేరీసరికి–సీకటడిపోనాది.

మరింక ఊరెలాగుందో ఏటో తెల్నేదు.

మర్నాడు పొద్దుటే–నెగిసి సూద్దునూ–

మనసుకి మంచుముక్క కట్టుకున్నట్టు,

ఎండలో తిరిగి తిరిగి ఏటినీళ్ళు తాగినట్టు అనిపించినాది ఊరుజూస్తే.

సిటీలో ఉన్నోడు పల్లెటూరెప్పుడు జూస్తాడు బాబు – సినీమాల్లో తప్ప! ఇక సినీమాల్లో అంటారా?

సిటీలో "సీకటి సందుల సరుక్కి" మోకాళ్ళ వొరకూ కోకలు ఎగ్గట్టేసి–ఆళ్ళనే పల్లెటూరిపిల్లలనీసికో మంటారు. ఇడ్లీకి – మినపరొట్టెకీ ఉన్నంత బేదం ఉంటాది–సిటీ సరుక్కీ, పల్లెటూరి సరుక్కీ.

సిటీలో ఓ సెట్టు సూడాలంటే మూడు మైళ్ళు నడవాల.

కాకి తప్ప మరో పిట్ట అగుపడదు యెంత తిరిగినా. మరంచేత ఆ ఊళ్ళో ఆ సెట్లూ, సెరువులూ–పిట్టలూ జూస్తే నాకు మతిపోనాది.

యెంటనే ఓ మూరెడు ఏపకొమ్మ యిరిసి పళ్ళు దోవిఁనాను.

సెరువుకెళ్ళి తనివితీరా స్తాన్నవాఁడినాను. ఆనక మా బాబు యింటి ముందు పందిట్లో కూకుని–పేపరు జూస్తున్నాను.

అప్పుడు–పొద్దుట పదొద్దనుకుంటాను.

అప్పటికే–మన ప్రెతాపం ఊరంతా తెలిసిపోనాదనుకుంటాను.

ఇంతలో–పకీరుగోడని–మా బాబుగారి పాలికాపే– ఆడొచ్చినాడు. ఒచ్చి–సాప పక్కన కూకున్నాడు.

ఆడు నా ఏపు జూసీవోటం జూస్తే నాకే సిగ్గేసిపోనాది.

ఆడదైతే నాతో నెగిసొచ్చీసిటట్టున్నాడు.

పేరడిగినాడు.

ఊరడిగినాడు.

పెళ్ళీ, పేరంటం అడిగినాడు.

పిల్లా, పీచూ అడిగినాడు.

సివర్న నాను జేసిన కూనీలు మూడా? నాలుగా? అనడిగినాడు.

నాకు సిర్రెత్తుకొచ్చి "ఒకటి తక్కువ ముప్పయ్యి" అన్నాను.

మరంతే....

ఆడదైతే నాతో నెగిసొచ్చీసినట్టుగాదు, నన్నే లెగదీసుకు పోయిటట్టు అయిపోనాడు.

మరింక జూసుకోండి.

ఆయాల కాడ్నించీ–నాను నోట్లో బీడీముక్కెడితే–అగ్గిపుల్ల కొట్టీది ఆడే.

ఆ మద్దేన్నం కేపీ తాగేక అడిగినాడు–మా బాబు "ఊరు జూసివొస్తావేట్రా" అని.

ఇదే సిటీలో అయితే యీ పాటికి పోలీసుల్ని తప్పించు కోవడానికి పదిమైళ్ళు నడిసీసి ఉండీవోడ్ని.

అంచేత "ఓ" అన్నాను.

"ఉండు" అని లోపలకెళ్ళి ఒక దంతంపిడి బాకు యిచ్చేడు, "మొలనెట్టుకో. ఊరు మంచిదికాదు" అంటూ.

నాను బయలెల్లబోతూ వుంటే "కుక్కల్ని కూడా తీసికెళ్ళు. పొద్దుట్నుంచీ కట్టీసేం" అన్నాడు.

యింక జూసుకోండి బాబూ.....

నాను కుక్కల్తో ఊళ్ళో ఎళ్తుంటే–రెండు ఎనుబోతులు తోలు కొస్తున్న యెముడ్ని–జూసినట్టు జూసినారు ప్రెజ.

నాకు దణ్ణాలెట్టేరు కొందరు.

"ఆహాఁ! ఈళ్ళు మన పార్టీవోళ్ళన్నమాట" అనుకున్నాను.

"అదుగో! ఆడే కెప్టెనుగోడు" అని కొందరు గుసగుసలాడేరు. యెవరూ? 'ఎగస్పార్టీ' వోళ్ళు.

నాను ఎన్నో కూనీలు జేసేనన్న పేరు కూడా అప్పటికే ఊర్లో పాకిరీసినాది. ఆ పేరుతో బతికీ వొచ్చుననిపించీసినాది నా మట్టుకు– నాకు.

అసలు మడిసికన్నా, దేవుడికన్నా సరేబాబూ– ఓ పేరు రావాల.

మన యీది సివర, గుడికెళ్ళి "నాను జెయిలు కెళ్ళకుండా

సూడు బాబూ–నీ గుళ్ళో గుండు కొట్టించీసుకుంటాను" అని మొక్కుతాఁవాఁ?

మొక్కవుఁ గదా!

ఎంచేత?

యీది సివర దేవుఁడికి ఆ పేరు నేదు కాబట్టి.

మరంచేత పేరున్న తిరుపద్దేవుడికే ఆ మొక్కు మొక్కుతాం.

ఆ దేవుడికి సెయిర్మన్‌గోడు ఎమ్మెల్యే అవాలని మొక్కుతాడు.

ఎమ్మెల్లే మినిస్టు అవ్వాలంటాడు.

మినిస్టర్ సీ.యం. అవాలంటాడు. సీ.యం. పీ.యం. గావాలంటాడు.

సి.యం. నా నెప్పటికీ యిలాగే ఉండి పోవాల అని మొక్కుతాడు.

ఇచ్చిత్తరం ఏటంటే–ఆళ్ళల్లో కొందరి కోరికలన్నా తీరతాయి.

దాంతో తిరపద్దేవుడు పేరు ఇంకా పెరిగిపోద్ది.

నిజంగా ఆ దేవుడికే పవరుంటే–నానూ మా యాడదీ కూడా కలసి గుళ్ళు కొట్టించీసుకుంటాం–మా యిద్దర్లో ఒకర్ని పంచాయితీ నెంబరు–సెయ్యమనండి, చూద్దాం.

కత మళ్ళించేస్తున్నా ననుకోకండి–బాబూ.

పేరు నేకపోతే రౌడీ అయినా దేవుడయినా సరే బతకనేదు.

బద్రాసెలం రాఁవులోరూ దేఁవుఁడే. తిరుపద్దేవుడూ దేవుడే.

సివాచెలం అప్పన్నా దేవుడే.

మరి తిరపద్దేవు డొక్కడే కోటీశ్వరు డెలాగై పోనాడు?

ఆ బాబుకున్న పేరునుబట్టి

పల్లెటూళ్ళో అమ్మోరికి "మా పిల్ల పెళ్ళి జేయించు తల్లీ" అని మొక్కుతావాఁ?

మొక్కం.

మరేటని మొక్కుతాం?

"మాకూ, మా పశువులకీ జబ్బులు రాకుండా సూడు తల్లీ. నీకు జాతర జేస్తాం" అని మొక్కుతాం.

ఎంచేతంటారూ?

ఆ తల్లి పవరు జబ్బులు తెచ్చేవారకే. గాబట్టి ఊరిదేవుడు బెంచి మేస్ట్రీటు లాటోడైతే– తిరపద్దేఁవుఁడు సుప్రీంకోరటు లాటోడన్నమాట.

మరంచేత–ట్రాన్సుఫర్లూ, ప్రమోషన్లూ, పెళ్ళిళ్ళూ – అలాటివన్నీ తిరపద్దేవుడి వొంతు. దేవుడి మాటలా ఒగ్గీ యండి.

ఓ మనిషికే మంచి పేరుందనుకోండి. దానిమీద – మహాత్మా గాంధీ నాగ బతికీవొచ్చు.

సలా (సలహా) జెప్పమని కొంతమంది వొస్తారు. సందాలు పుచ్చుకోమని మరికొందరొస్తారు.

మంచిపేరు గాదు–సెడ్డపేరు ఉందనుకోండి.

కిరాణా షాపుల్లోను, కూరల దుకాణాలకాడ మామ్మూళ్లు వొసూలు జేసుకొని బతికీవొచ్చు.

మనకి–మళ్ళీ చెమించాల–తవఁరుగోర్ని కూడా – కలిపి నందుకు–నాకు సిటీలో గూడా కుసింత పేరున్నాది గానండీ – యీ ఊర్లో వొచ్చిన పేరుతో పోలుసుకుంటే, సూరీడుతో కిరసనూనె బుడ్డిని పోలిసినట్టే.

నాను ఆ రెండు కుక్కల్నీ అట్టుకొని రోడ్డుమీద యెల్తా వుంటే – ఇలాగ రాజుగోరికి తోవిచ్చీసినట్టు యీచ్చీసీవోరు జనం.

ఇంక మా కుక్కలంటారా?

ఆటిని జూస్తే–పోతులు పరిగేతీసియ్యి.

ఆవులు పాలిచ్చీవి గావు.

సంటిపిల్లలు ఏడుపులు మానీసివోరు.

నాను ఊరు సుట్టీసి–తిరిగొచ్చీసరికి సెంద్రుడు అప్పుడే నెగుస్తున్నాడండి.

పందిట్లో పదిమందిరితో ఊసులాడుతున్నాడండి మా బాబు.

నానెళ్ళి–ఓ రాటకి జేరబడ్డానండి.

"ఎలాగుందిరా ఊరూ?" అనడిగినాడండి మా బాబు.

"మర్యాద్దెల్సిన ఊరండి" అన్నానండి.

"సెబాసో" అన్నాడండి అతగోడు.

ఆ ఎనక పట్నంలో ఎట్టిన కేసు గురించి సుట్టూ వున్నోళ్ళకి మా బాబు జెప్పేసరికి వొణ్ణాల టైమైపోనాదండి.

## 25

ఇలా రెండు రోజులు గడిసిపోనాయండి.

మరోనాడు–

నానూ–మా బాబూ, పంచాయితీ బోరుదు ఆపీసుకని బయ లెల్లినా' వండి. యీ రెండ్రోజుల్లోనూ–నాకు పోలిటిక్సు కుసిన్ని తెలిసినాయండి.

రెండోనాడు మాంవెంళ్లావుంటే–మొగోళ్ళు కాలుస్తున్న సుట్టలూ, బీడీముక్కలూ పారేస్తున్నారు మా బాబుని సూడగానే.

ఆంహా! యీళ్ళు మనోళ్ళన్నమాట అనుకున్నానండి.

ఒకడు మాత్తరం–పూరీ పేసింజెర్లా–గుప్పుగుప్పుమని పొగ వొదుల్తూ ఎదురొచ్చినాడండి. మాంవుం యింకో బారెడు దూరం వున్నావంనగా జేబులోంచి లాగి–ఎడంసేత్తో సుట్టతీసి–మా యేపు ఒదిల్నాడు బాబూ–పొగ.

మరంతేనండి.

సేతిలో వున్న సేపాటి కఱ్ఱతో–ఆడి సేతిమీద ఒక్కటేసినాను. బాబు–నా కబద్దం వొద్దండి.

నాను కొట్టింది సెయ్యిరగ్గొట్టాలని కాదండి.

సుట్టెగరగొట్టాలనండీ–గానండి–

సుట్టా యెగిరిందండి. సెయ్యా ఇరిగిందండి.

యెంటనే ఆదు కుడిసేత్తో కఱ్రెత్తినాడండి.

కండలూ, గిండలూ తిరిగినోదేనండి.

పైలాపచ్చీసు గోడేనండి.

తంవంరుగార్లాటోళ్ళని యిద్దర్ని కొట్టగలిగే రకవేంనండి.

కాని నన్నేటి సెయ్యగల్డండి.

అసలే ఎడంసెయ్యి యిరిగిపోనాది–అంచేత మన పని సుళువై పోనాదండి.

యీ పాలి సేతిమీద కొట్టనేదండి.

కఱ్రమీద కొట్టినానండి.

కఱ్రెళ్ళి ఆరిళ్ళవతల పడ్డాదండి రెండు ముక్కలై.

ఆడెళ్ళి మూడో యింట్లో దూరి–తలుపేసీసు కున్నాడండి.

ఇంట్లో దూరినాక ఆడి కుడికాలి పిక్క ఉండి ఉండదండి.

దాన్ని మా ఆడకుక్క పీకీసినాదండి.

మా బాబు మొకం "ట్యూబునైటు" నాగ ఎలిగిపోనాదండి.

ఆ పిక్కపోయినోడి–అసలు పేరు ఎరుకు నాయుట్టండి – మారుపేరు కోడిగాడటండి.

ఆడు సీకట్లో సిరతపులటండి.

ఎల్తుర్లో ఎలుగ్గొడ్డే నటండి.

బుచ్చిబాబు పారిటీలో నెంబర్ వన్ రౌడీ ఆటండి.

ఆది వొరకు ఆడి కెలాటి పేరున్నా–ఆ తరవాత మనకొచ్చిన పేరేటంటేనండీ–? మనం పగలూ–రేత్తిరీ కూడా పులివేం నటండి.

మన పేరు మాట అలా ఒగ్గీయండి. కోడిగాడి సెయ్యిరిసీసేక కాళ్ళు ముడుసుకొని తొంగుంటే లాబంలేదు గాదండీ–మరంచేత బయలెల్లినావండి–సిటీ–నానూ మా బాబూను, జీపేసుకొని రంగనాదం బాబింటి కెళ్ళినావండి.

కదంతా సెప్పినాం ఆ బాబుకీ–అతగోడి సెల్లికీ గూడా.

అంతా యిన్నాక "మీ పారిటీవోళ్ళలో తెలివైన ఆడోళ్ళవి ఆరు పేర్లు" సెప్పమన్నాదండి ఆ యమ్మ.

యిదేటిదీ. పోలీసు రిపోర్టు రాయమంటే ఆడోళ్ళ పేర్లడుగు తున్నాదీ?" అనుకున్నానండి.

బుల్లిబాబుగోరే జెప్పినాదండి–ఆరుగాదు–పదిమందిరి పేర్లు.

పేర్లు యిన్నాదండి. యిన్నాక "నా క్కావలిసింది–మామూలు తెలివితేటలున్నోళ్ళు కాదు–మొగుడ్ని అమ్మీసీ రకాలై ఉండాలి" అన్నాదండాయమ్మ.

"ఈళ్ళు మొగుడ్ని–రంకు మొగుడికి అమ్మీసీరకం" అన్నా దండి మా బాబు.

"భేషో" అన్నాదండి తొల్త.

తరవాత "దెబ్బలాట–దెబ్బలాటేటి నా మొకం–సుట్ట కాలుసు కుండీవోడి సెయ్యిరిసీడం దెబ్బలాటెలాగౌద్ది? సరే–యీ సెయ్యి రిసీడం ఎక్కడ జరిగినాది? ఆ యీది మనదా? అవతల పారిటీ వోళ్ళదా?" అనడిగినాదండి.

"మనోళ్ళూ ఉన్నారు. ఆళ్ళూ ఉన్నారు" అన్నాడండి మా బాబు.

అలాగైతే (Scene) 'సీను" "షిఫ్టు" (Shift) సెయ్యక్కర్నేద న్నాదండి. అని ఆలోసెన్లో పడిపోనాదండి. కాని కురిసీలో కూకో లేదండి–హాల్లో పచార్లు సెయ్యడం ఆరంబించినాదండి.

మా బాబూ, రంగనాదంబాబూ ఏవోం కబుర్లు సెప్పుకుంటు న్నారండి.

సెయ్యిరిసినందుకు ఏడాదేస్తారా-మూడేళ్ళా అని ఆలోసెన్లో పడిపోనానండి నాను.

ఈలోగా యెప్పుడు తీసినాదోనండి టేబిలుమీది రూళ్ళకఱ్ఱ – మావుఁ ఎవరం సూడ్నేదండి–దాంతో మా బాబు భుజంమీద ఒక్కటేసిందండి.

ముండకోసరం శ్రోతలు కెళ్తే అక్కడ పెళ్ళాం అగుపించినట్టు బుల్లిబాబు కెవ్వున ఒక్కరుపు అరిసినాడండి.

ఆ యమ్మ సరస్వత్తల్లి నెమిలి పిట్టెక్కిపోయిన దట్టు – కురిసీఎక్కి పోనాదండి.

ఎక్కి తాపీగా ఓ సిన్న నవ్వు నవ్విందండి.

నవ్వేక, "మరేంలేదు. ఆ కోడిగాడు మీ బుఱ్ఱమీద దెబ్బ ఎయ్యబోయేడు. మీరు తప్పించుకున్నారు. కాని దెబ్బ బుజంమీద తగిల్నాది. ఆడు మరోసారి మీ బుఱ్ఱమీద దెబ్బ ఎయ్యబోతూ వుంటే కెప్టెనుగోడు ఆడ్ని కొట్టినాడు. అంతే. సెల్ఫ్ డిఫెన్సు" అన్నాదండి,

రంగనాదంబాబూ, మా బాబూ అలా–బొమ్మల్లా గుండి పోనారండి–ఆ యమ్మ ఆలోసెనకి–ఆళ్ళంతా ఉండగానే ఆ యమ్మే మళ్ళీ అన్నాదండి. "ఇప్పుడు డాట్రుకాడి కెళ్ళి దెబ్బకి సర్టిపికెటు అట్టుకు రండి. యెళ్ళీ ముందు అవతలపారిటీ ఆడోళ్ళని–మొగుడికాడ తొంగోడంగూడా–తెలని వాళ్ళవి–ఓ నాలుగు పేర్లు సెప్పండి. ఆళ్ళని కూడా సాచ్చీకం ఏద్దాం" అందండి.

"ఆళ్లు మనకి సెప్పరే" అన్నాడండి మా బాబు.

"ఏఁవోఁ. ఆడోళ్లు నీళ్ళు తెచ్చుకునీ టయాం–మొగోళ్ళెవరూ యింకా ఇళ్ళకి రానేదు, యిది జరిగీ టయాంకి మరింక జూసి నోళ్ళంతా ఆడోళ్ళే. జూసినోళ్ళందర్నీ సాచ్చీకం ఏసుకున్నాం. అందులో ఆళ్ళ ఆడోళ్ళు కూడా ఉన్నారు. నిజెం సెప్తారనే యేసు కున్నాం. ఆళ్ళు అవతలి పారిటీవోళ్ళతో కుమ్మక్కు అయిపోయి నిజం సెప్పకపోతే మాఁవేఁటి సేస్తాం?

సత్తెం మాపక్కున్నాది.

ఇప్పుడాళ్లు కాదంటే మిగతావోళ్ళు కూడా సూసినోళ్లు ఉన్నారు కదా. ఆళ్ళని నమ్మండి అని ఆర్గుమెంటు సెప్తాం. సాచ్చీకం అంతా ఆడోళ్ళే కాబట్టి కోరటు నమ్మేస్తాది" అన్నాదండి.

ఈ తికమక ఏఁటో నాకు అరదం గాకముందే మిగతావోళ్లు "వహ్వా" అన్నారండి.

"అంతేగాదు. అవతలి ప్లీడరు సుందర్రామం. ఆడు ఆడ దెయ్యం అగుపడితే పక్కలోకి రమ్మనీ రకం. కాని ఆడసాచ్చి అంటే ఆడలి సస్తాడు. ఆడు జూనియర్‌గా ఉన్నప్పుడు ఆడికో సొంత కేసుండీది.

కాణీదీ–పరకదీ కాదు.

పదెకరాలది.

ఆడి కేసు నిజం.

ఆడమ్మ సాచ్చీకం మాత్తరం అబద్ధం.

ఆవిడ కోరట్లో గాబరాపడిపోయి–ఒక్క ముక్కకూడా నిజెం సెప్పలేకపోనాది.

కేసు సంకనాకిపోనాది.

మరప్పట్నుంచీ ఆడు అన్నం మానీమన్నా మానేస్తాడు గాని, ఆడసాచ్చిని బోన్లో ఎట్టడు. అంతా మొగోళ్ళనే ఏసుకుంటాడు. ఆళ్ళకి తలలూ, తోకలూ ముడెట్టేసి, మన సాచ్చుల్లో కొంత మందిరన్నా ఉన్నారని వొప్పించి నావాఁయింక జూసుకో – అంతేకాదు కోడిగాడు అప్పుడు తాగీసున్నాడని కూడా మాఁ వాఁ అని పిలవొచ్చు." అని యిడమరిసి సెప్పినాదండి.

"ఇన్నాళ్ళూ–ఆచారి, ఆచారి అంటూ ఆ బాబు కాళ్ళటు ట్కున్నాను గాని యీ యమ్మ కాళ్ళూ అట్టుకొనివుంటే–మళ్ళీ ఆ బాబు జూనియరే యీ యమ్మ యిన్నిసుట్లు జెయిలు కెళ్ళీవోడ్ని కాదుగదా–యీ యమ్మ "తేప్పకేసు" డిఫెండు జేసిందంటే – కేసుపెట్టిన పోలీసోడ్నే జెయిలుకి కట్టించీసీరకం" అని నాను శానాయిద్దై పోనానండి.

మాఁవుఁ డాట్రుకాడికి బయలెల్లబోతూవుంటే ఆ యమ్మే అన్నాదండి "కరుసు అయినా పర్వానేదు. ఆ దెబ్బని కుసింత పెద్దది సెయ్యమని డాట్రు బాబుతోసెప్పండి" అని హుషారి చ్చిందండి.

"ఆ యమ్మ మాటలు యింటుంటే–యీ యమ్మ ఉండా ల్సింది ఢిల్లీలో–శానా పొరపాటు–అమెరికాలో వుండాల్సిన మడిసి–అనిపించీసినాదండి నాకు.

మా బాబుతోపాటు నానూ లెగవబోయేనండి.

కాని "నువ్వుండు–ఆ బాబెల్తాడు" అన్నాదండి.

మా బాబెల్లిపోనాదండి.

యీ యమ్మ కూకొని రిపోర్టు సెప్తూవుంటే-రంగనాదం బాబు రాసి నాడండి.

యిది పూర్తి అయ్యీసరికి మా బాబొచ్చీసినాదండి. మా బాబు తెచ్చిన సర్టిపికెట్టు సదువుతూంటే ఆ యమ్మ మొకం - సేటంతగాదండి-దాగరంతై పోనాదండి.

"ఈ సర్టిపికెట్టు సూస్తే అర్నెల్లు కట్టేస్తాడు. ఏ మేస్టీటైనా నన్ను-మొత్తానికి మంచి సర్టిఫికెట్టే పుట్టించేరే గాంధీగోరు" అన్నాదండి మా బాబు ఏవు జూసి.

## 26

అవతలోళ్ళూ యిచ్చినారండి ఓ రిపోర్టు. ఆళ్ళు జరిగింది జరిగినట్టు రాసినారండి-కోడిగాడు మా బాబుమీద సుట్టపొగ ఊదడం తప్పిస్తే.

ఆడు అవతలిపార్టీ వోళ్ళలో ముఖ్యుడట-అంచేత ఆడిమా నాన ఆడు పోతూవుంటే మా బాబు సెప్తే నాను ఆడి సెయ్యి సెరుకుముక్కిరిసీసినట్టు యిరిసినానట.

ఇదండి ఆళ్ళ కేసు. కేసులో మా బాబుని కూడా ఇరికించి నారండి.

పాపం కోడిగాడికి సంకకాడ్నించి సిటికినేలు వొరకూ - సిమెంటు కట్టు కట్టీసినాదండి డాట్రు-ఆడికి మూణ్నెల్లు పాటు వొణ్ణం తిండానికీ, యీపు బకురు కోడానికి ఒకటేనండి సెయ్యి.

నాను ఆ ఊరెళ్ళిన రెండ్రోజులకే ఆడి సెయ్యిరిసేసినానండి. నిజానికి మా బాబు నాతో ఎవుడి సెయ్యీ కాదు సరిగదా - ఏలు కూడా యిరవమని సెప్పనేదండీ నానుకూడా అవతలి పారిటీ వాళ్ళ ఏళ్ళు కాదుగదా మెటికలు కూడా యిరుద్దామను కోనేదండి.

కాని ఏటో అంతా సిటంలో జరిగిపోనాదండి.

ఇంతకీ మనకి పేరొచ్చీ మారాజు యోగం ఉన్నాదండి.

వచ్చేసినాదండి-అంతే.

మడిసికైనా-దేవుడికైనా పేర్రావాలని నానుతొలతే మనివి జేసినాను గదండీ.

మనకొచ్చిన పేరేటంటారా?

అవతల పారిటీ సత్తెరకాయగా డెవడన్నా సరే సుట్టట్టుకొని మా బాబు కంట పడినాడా, ఆడి సెయ్యిరగ్గొడతాను.

కర్రట్టుకొని అగుపడినాడా కాళ్ళిరగ్గొడతాను.

కీడు తలపెట్టినాడా-తల తీసేస్తాను. ఇదండి మనకొచ్చిన పేరు.

యీ పేరుమీద పదికాలాలు బతికీవొచ్చు అనిపించీసి నాదండి.

అంత పేరొచ్చినాక యింక పన్సెయ్యక్కర్నేదండి.

మరైతే-మన పనేటంటారా?

పొద్దుటేళా-మాపిటేళా-ఆ దెయ్యం కుక్కల్ని ఎంటేసుకొని ఊరంతా బలాదూరు తిరగడవండి.

మీ కబద్దం నాకు నిజెంగాని-ఊళ్ళో ఎళ్తూవుంటే పారిటీ వోళ్ళ దణ్ణాలందుకోనేక సేతులు పీకెట్టీసీయండి. నానింకా మార్యాదున్నోణ్ణి కాబట్టి అందుకునీవోన్నండి-అదే మరోడైతే ఆ మాత్రానికే బుర్ర తిరిగిపోయి, తలెగరీసి ఉండిపోయీ వోడండి.

నాను బీడీముక్క నోట్లో ఎడితే సాలండి-పక్కన ఎవడుంటే ఆడు అగ్గిపుల్ల కొట్టే వోడండి. అలా పెరిగి పోనాది మన పరపతి.

అవతల పారిటీవోడు ఎవడన్నా-మనకి ఎదురైతే దయిర్యం వున్నోడు తల దించుకునీవోడండి.

లేనోడు తోక ముడిసీసీవోడండి.

యిందాక సన్నాసిగోడు సెప్పినాడు గదండీ-కుక్క కేసూ-పిల్లి కేసూ-పెళ్ళాంకేసూ- ముండకేసుల్తో ఊరంతా కేసుల్తోనే తగలబడిపోయిందని.

అసలీ కేసులూ, ఆటికయ్యీ కరుసూ తలుసుకుంటే గుండె బేజారై పోతాదండి.

అదేటి డబ్బా? నీరా? అన్నట్టు కరుసైయ్యిందండి. ఆ కేసు లకి ఎట్టిన డబ్బు గనక ఊరుమీద కరుసుపెట్టి వుంటే-బాబూ ఇదేటి యిండియానా? అమెరికానా? అన్నట్టు ఊరు అయి పోయి ఉండీదండి. కరుసులేటుంటాయంటారా!

కేసు పోయినోడు కోరట్లో ఏడుస్తాడు-

గెలిసినోడు యింటికెళ్ళి ఏడుస్తాడు-అని మీరెప్పుడూ యిన్లేదా బాబూ.

కోరటు కెక్కాలంటే ముందు ప్లీడరుకాడి కెళ్ళాలి గదండి.

సింతామణికాడ శ్రీహరిలా, ప్లీడరుకో గుమాస్తా ఉంటాడండి.

సింతామణికైనా అరువెట్టొచ్చుగాని, శ్రీహరి ముండకి మాత్తరం "కేష్" యియ్యావొలసిందేనండి.

యిక కోర్టల్లో గుమాస్తాలండి–యీళ్ళలో శానా రకాలుం టారు బాబూ. సేతకానోళ్ళూ, కొత్తోళ్ళూ అయితే కాపీ, టిఫినుతో కడుపు నిండి పోతాదండి ఆళ్ళకి.

కొందరు ముదర సరుకుంటారు సూడండి బాబూ–ఆళ్ళ కడుపులు "కేష్"తో గాని నిండవండి.

యిక పోలీసోళ్ళండి–ఆళ్ళ కడుపులు మనల్నీ మన కుటుం బాల్నీ మింగేసినా నిండవండి, ఆళ్ళు జెలగల్లా మనల్ని పీలిచేస్తా రండి–పొరపాటు బాబూ–జెలగ సుట్ట సూపిస్తే ఒగ్గేస్తాదండి. పోలీసోడు మరో సుట్ట కూడా యియ్యమంటాడండి.

సెవాల్ని ముట్టుకోదండి జెలగ.

పోలీసోడు శవాన్ని గూడా ఒగ్గడండి.

యీ గుమాస్తాల్నీ, ప్లీడర్లనీ, డాక్ట్రల్లనీ, పోలీసోళ్ళనీ – యీళ్ళందర్నీ మేపేసరికి బాబూ–ఒళ్ళూ, యిల్లూ గుల్లయి పోతాదండి.

అదంతే బాబూ.

## 27

నాను ఆ ఊరెల్లిన మూడ్రోజుల్లో వొచ్చేమన్నానండి మా యాడదాన్ని.

మూడ్రోజులైందండి–రానేదండి.

ఆర్రోజులైందండి–రానేదండి.

ఏటా ఇది? కొంపతీసి ఓ పాలి పోలీసోళ్ళు మళ్ళీ అల్లరి పెట్టడం నేదు గదా అని బయపడిపోనానండి. మా బాబుతో సెప్పి ఓ సారి ఎళ్ళి సూసొద్దాం అనుకుంటుం దగా – ఏడోనాడు దిగబడి నాదండి. యింకెవర్తో కొత్త గుంటతో.

కొత్త పుస్తెలతాడులా గున్నాదండి ఆ గుంట.

నల్ల కోకా, తెల్ల రవికా కట్టుకొని కోడెతాసులా గున్నాదండి.

మా యాడది వొస్తూ, వొస్తూ హోటేలు సామాను కూడా తెచ్చి నాదండి.

అదొచ్చేసరికే– మా కోసరం–ఊరి సెంటర్లో మా పారిటీ వోడిదే ఓ యిల్లు కాళీజేయించేసి నాడండి మా బాబు.

ఆ సాయింత్రం–ఆ గుంట–పేరు సెప్పడం మరసి పోనాను –సుబ్బులు–అది నీళ్ళకెళ్ళినప్పుడు అడిగినానండి మా యాడ దాన్ని "యీ గుంటెవర్తే?" అని.

"సిటీ సరుకే. యిప్పుడిప్పుడే సెడుతున్నాది. సెడ్డానికి సిటీయే అక్కర్నేదే–నా ఎంటొచ్చీ. నా యింట్లో ఉండు. నా హోటేల్లో సాయం జెయ్యి. తర్వాత దేఁవుఁడేటి సెప్తే అదే జరుగుద్ది. నాల్రోజులు బాగున్నావంటే అక్కడే ఎవడో ఒకడ్ని కట్టేసుకో వచ్చునని నచ్చజెప్పి తీసుకొచ్చినాను" అని నా యేపు ఓ పాలి ఎగాదిగా జూసి "దాని జోలికి మాత్తరం పోకు" అన్నాదండి.

"సీ; స్సీ; నాసంగతి నీకు తెల్దా;" అన్నానండి.

అది నవ్వి "తెలుసుననుకో. అయినా మొగబుద్ధి గదా" అన్నాదండి.

దాని ముందుసూపుకి సేతులెత్తి దణ్ణవెఁట్టేసినానండి.

మరింకదే మొదలండి–

పాలు పొంగినట్లు పొంగిపోనాదండి మా యెవ్వారం.

మాఁవుఁ ఎల్లకముందు ఆ ఊళ్లో రెండు పాక హోటేళ్ళు ఉండీయండి.

ఆ హోటేళ్ళలో,

ఒక్క "టీ" మాత్తరం యీ యేళదండి.

గారెలు నిన్నటియ్యండి.

పకోడీలు మొన్నటియ్యండి.

ఆటి ప్రొప్రైటర్లు నెలకోపాలి గెడ్డం గీయించేవోరండి.

వోరానికో పాలి స్తానవాడీవోరండి.

వంటకీ ఆళ్ళే–

వొడ్డనకీ ఆళ్ళేనండి.

ప్లేట్లు కడగడం–ఆళ్ళేనండి.

ఆళ్ళ దురదృష్టం– మరోటేటంటే ఆళ్ళు ఏ పారిటీవోళ్ళూ కాదండి.

మరింక మా యాడది హోటేలు ఎట్టినాక–

పొయ్యీ, గల్లాపెట్టే తను జూసుకుండీదండి.

ప్లేట్లు కడగడానికో గుంటడ్ని ఎట్టినాదండి.

"సెర్వింగు" సుబ్బులికి వొప్పగించేసినాదండి.

సుబ్బులు గుంట

సిటీ సరుకండి.

సెడవలసినంతే సెడ్డాదండి.

మరంచేత

సేతులూ కళ్ళూ కలిసీ తగిలించీ

ఇది జేసీ

అది జేసీ

మొగోడి సేత పిడకలు కూడా తినిపించీ గల్దండి.

దానికి సదువు తక్కువై మాకాడ జేరినాది గానండీ, ఏ ఆఫీసులో నన్నా జేరితే–ఆపీసర్ల పెళ్ళాలు పుట్టిళ్ళ కాడ ఉండ వొలసిందేనండి.

గుంట జరీపోగులాగ మంచి నాజూగ్గా ఉండీదండి.

నడుం సన్నం.

గుండెలు బారం.

ఎప్పుడూ నల్లకోకలే కట్టేదేమో మరీ తెల్లగా అగుపించీసీదండి గుంట.

మనిషి కూడా పొడుగేనండి.

తవఁరుగోరు కనిపెట్టినారో నేదోగాని– పొడుగాడదంటే ప్రెతి మొగాడూ పడిసస్తాడండి– అందులో– పొట్టోళ్ళు మరీనండి.

గుంట తెల్లారనిచ్చీది కాదండి– జుత్తు దువ్వడానికి.

తొంగున్న కోకతో అగుపడీది కాదండి– తెల్లారితే.

అదే పెద్ద "ఎట్రాక్షనై" పోనాదండి మా హోటేలుకి.

దానికి తోడు– మా యాడది– తురకదేమో– "టీ" బెమ్మాండంగా కలిపీదండి.

మరింక సెప్పడాని కేటుందండి?

ముందు మా పారిటీవోళ్ళంతా కాతాలు మా హోటేలుకి మారిసీసినారండి. ఆ యెనక అవతలి పారిటీ కుర్రసరుకు వలస వలసగా రావడం మొదలెట్టినారండి. ఆళ్ళకి మరీ మరి యాద జేసీవోరండి మా యాడదీ, సుబ్బులూను.

యిదేటే అంటే "ఒల్లకో. నీది పారిటీల యెవ్వారం. మాది హోటేలు యెవ్వారం" అనీసీవోరండి.

సుబ్బులుగుంట ఏ సెరువుకో ఎల్లినప్పుడు– మా పారిటీ కుర్రోళ్ళ కన్నా ముందు–అవతలి పారిటీ కుర్రోళ్ళే సెరువుకాడ మాటు ఏసీవోరండి–దాని కోసరం.

ఆ సుబ్బులుగుంట సూపుకి లేడిపిల్లే గానండి–

తెలివికి ముదర నక్కేనండి.

ఆళ్ళ మాటులో ఆళ్ళనే తోసీసీ రకవండి.

మా యాడది పగలంతా హోటేల్లో వున్నా రేత్తిరి నాకాడి కొచ్చీసీదండి మా బాబుగారి లోగిలీకి.

## 28

ఇందాకే సెప్పినాను గదండీ– మా బాబు కొట్టమంటేనే నాను కోడిగాడి సెయ్యిరగ్గొట్టేసినాననీ–ఆళ్ళు కేసు పెట్టినారనీ.

అంచేత నా మీదెట్టిన కేసులో మా బాబుని గూడా జేర్చినారండి– రెండో ముద్దాయిగా.

మేం ఎట్టిన కేసు మాత్తరం ఒక్క కోడిగాడి మీదేనండి.

రెండు కేసులూ ఒక్కపాలే యిచారణ కొచ్చినాయండి. మా కేసులో సాచ్చి సమన్లు అవతలి పారిటీ ఆడోళ్ళకి ఎల్లినప్పుడు, ఆళ్ళు హడలెత్తి పోనారటండి. ఆనక ఆళ్ళ మొగుళ్ళని పిల్చి "మీరీ పారీటీలు ఒగ్గుకుంటారా? మిమ్మల్ని ఒగ్గీమంటారా?" అని అదర గొట్టీసినారటండి.

కేసు యిక పది రోజులకి యిచారణ కొస్తాదనగా– మా ఆడసాచ్చులకి "ట్రైనింగు స్కూలె" ట్టీసినాదండి సుబద్రమ్మ తల్లి.

ఆ యమ్మ నేర్పించినట్టు మాటలు నేరుపుతే సిలక్కికాదు బాబు–కోడి క్కూడా మాటలొచ్చేస్తాయండి.

ఆ పదిరోజులయ్యాసరికి స్కూలు పిల్లలు కాదు బాబు – స్కూలు మేష్టరు యెక్కాలు అప్పగించీసినట్టు అప్పగించీడం మొదలెట్టినారండి–మా సాచ్చులు.

మొదట యిచారణ కొచ్చింది మామీదొచ్చిన కేసండి.

కోడిగాడు ఆడి సాచ్చీకం సక్కగా సెప్పినాదండి.

ఇంతకీ ఆడు సెప్పింది అబద్దవైతే గదండీ!

కాని యీ సక్కగా సెప్పడం ఎంతవరకూ అంటే–

రాణీగోరు సిమ్మాసనమ్మీంచి లెగిసినట్టు–సుబద్రమ్మ తల్లి కురిసీ మీంచి లెగిసీవారకేనండి.

ఆ యమ్మ నెగిసిందండి.

ఇలా నాగుపాఁవు– నడిసినట్టు– దర్జాగా సాచ్చి బోనుకాడికి ఎళ్ళిందండి.

యెళ్ళి–పులి పంజా ఇసిరినట్టు బోనుమీద ఓ సెయ్యేసిందండి.

అప్పుడాయమ్మ– నాతో సెప్పినట్టే– నాను దగ్గినానండి.

నా దగ్గుకి పిడుగు పడ్డట్టు జెడిసిపోనాడండి కోడిగాడు.

జడిసిపోయి– ఓ పాలి నా యేపు జూసినాడండి.

సూసినాక– దెయ్యాన్ని జూసినట్టు మరీ జడిసిపోనాడండి.

"సూడు కోడీ– ఏం బయపడక, నాను నాలుగంటే– నాలుగే మాటలడు గుతాను. ఆటికి జవాబులు సెప్పి" అన్నాదండా యమ్మ.

అని పొద్దుల ఆడదాన్ని ప్రైవేటు డాట్రు జూసినట్టు జాలిగా సూసినాదండి.

"అలాగే నమ్మగోరూ" అన్నాడండి. అంత వొరకూ ఆ యమ్మ ముక్కు కోసీక ముందు సూర్పణక లాగున్నాదండి.

"కోడీ, నా మాట నీ కరదంగాకపోతే అరదం కానేదని సెప్పు. మళ్ళీ సెప్తాను.అంతేగాని నానేదో అడిగినాను కదా, నువ్వేదో సెప్పాలికదా అని సెప్పకు". అని యీపాలి కంటున్న ఆడదానియేపు డాట్రు సూపు సూసినాదండి.

"అలాగేనండమ్మగోరూ" అన్నాడండి– ఆడు దయిర్నం తెచ్చుకొని.

అంతేనండి.

ఎంటనే పోజు మారిచీసినాదండి.

గొంతుకు మారిచీసినాదండి.

ముక్కు కోసీసిన సూర్పణకలా మారిపోనాదండి.

"నువు కోళ్లు దొంగతనం జేస్తావు?"

"ఏటమ్మగోరూ?" ఆడు గాబరా పడిపోనానండి.

"నువ్వు– కోళ్ళు– గుడ్లు పెడుతాయే? అయి! ఆట్ని దొంగ తనం జేస్తావు. యేం?"

యీపాలి మెత్తగానే అడిగినాదండి.

"నానా అమ్మగోరూ?"

"నువ్వు గాకపోతే–నేనా? నువ్వే?"

"ఎవరి కోళ్ళమ్మగోరూ?"

"ఊర్లోవాళ్ళవి."

"ఎందుకు జేస్తానమ్మగోరూ!"

"సూడు కోడీ– నువ్వు జేసీపన్లకి– ముక్యంగా యిలాంటెద వపన్లకి– నువు కారణం సెప్పమంటే నానేటి జెప్తాను. ఎందుకు దొంగతనం చేస్తావో ఆనక నానడిగి నప్పుడు సెప్పుగానీ– ముందు దొంగతనం జేస్తావో నేదో సెప్పు" అని రేసుకుక్కలా తగులుకున్నాదండి.

"నా కెందుకమ్మగోరూ– దొంగతనం."

"ఇదిగో, మళ్ళీ సెప్తున్నాను. నీ ఎదవ పన్లకి కారణాలు నన్నడక్కు. సేస్తావో, సెయ్యవో సెప్పి. ఒక్క ముక్కలో తేలిపోద్ది."

"సెయ్యనండి."

"మరైతే, నీకు 'కోడి' అన్న పేరెందు కొచ్చినాది?"

ఆడికి ఒక్క పాలి పాంవుంలు సుట్టుకున్నట్టయిపోనా దండి.

ఆడికి 'కోడి' అన్న పేరెందుకొచ్చిందో ఆడికే తెలదండి. ఎవుడికీ తెలదండి. సిన్నప్పట్నుంచీ అందరూ అలాగే పిలుస్తున్నా రండి. ఆడు పలుకుతున్నాడటండి. ఆడి అసలు పేరు ఎరుకు నాయుడండి.

"ఊఁ సెప్పు" రగడాయించడం మొదలెట్టినాదండి.

ఆడికిఁ ఏఁవీఁ తోసడం మానీసినాదండి.

సిచ్చపడ్డా పరవానేదూ, ముందీ బోను ఒగ్గేస్తే సాలు అనిపిం చేసినాదండి ఆడికి. ఏటీ తోసక అడ్డం దిరిగినాదండి.

"నా పేరు కోడి కాదండి" అన్నాడండి–నీరసంగా.

"మరైతే నా నింత సేపూ 'కోడీ! కోడీ!!' అని కోడినాగ కూస్తూ ఉంటే ఎందుకు పలికినావు?"

గొల్లుమన్నారండి–కోరట్లో వాళ్ళంతా.

ఇంకంతేనండి.

ఆడేటి మాటాడుతున్నాడో ఆడికే తెల్దండి.

సచ్చీముందు సందివచ్చి నట్టయిపోనాడండి.

ఆడ్ని కిందామీదా ఎట్టేసి చీడికాడ తోటపెద్దు కుమ్మీసినట్లు కుమ్మీసి నాదండి ఆడ్ని.

"నీ సెయ్యిరిగినప్పుడు ఆడోళ్ళు కూడా ఉన్నారు. ఏం?"

"తెల్దు."

మాం ఏసుకున్న అవతల పారిటీ ఆడోళ్ళ పేర్లు సెప్పి "ఆళ్ళున్నారా?" అనడిగినాది.

"నేర"న్నాడండి ఆడు.

మా పారిటీ ఆడ సాచ్చుల పేర్లు సెప్పి "ఆళ్ళున్నారా?" అనడిగినాది.

"నేర"న్నాడు ఆడు.

"మరైతే నేరం జూసిన ఆడోళ్ళపేర్లు సెప్పు" కావిణీ దెయ్యంలా పట్టుకున్నాదండి.

"గేపకం నేదు."

యిలా సెప్పుకుపోతే రెండు వోరాల అరికద ఔద్ది బాబూ.

ఆళ్ళ కేసు పాతకాయితం నింపేసినట్టు నింపేసినాదండి సబద్రమ్మ తల్లి.

ఇసక పిండి నూనె తెప్పించీగలదండాయమ్మ.

మా అబద్దం కేసు మాఁవేఁ నమ్మీసీటట్లు సాచ్చీకం ఎట్టీసినాదండి.

ఆకర్న ఆర్గుమెంటు సెప్పినాదండి.

ఏటని?

ఎందరికి దెబ్బలు తగిల్నాయి డాట్టర్ల ప్రెకారం?

ఇద్దరికి.

ఎగస్పార్టీవాళ్ళ ప్రెకారం ఎంతమందికి తగిలినాయి?

ఒక్క కోడిగాడికే.

మా ప్రెకారం ఎందరికి తగిల్నాయి? యిద్దరికి.

మరంచేత ఎవరి కేసు నిజెం?

ఇంతేనండి ఆ యమ్మ వోదన.

జడిజిమెంటు నాడు నాను తాగింది "స్కాచ్చే" నండి.

కోటిగోడికి రెండేళ్ళేసినారండి.

ఆడి పెళ్ళాం గోలెట్టేసినాదండి.

ఆడి పిల్లలు గగ్గోలు పెట్టిసినారండి.

ఆడికి నోట మాట రానేదండి.

## 29

ఎన్ని కేసులని సెప్పనండి?

ఎన్ని తగువులని సెప్పనండి?

ఈళ్ళో నిజం కేసెడితే, ఆళ్ళు మూడబద్దం కేసు లండి...ఇలా కోరట్లు ఎంత అలవాటైపోనాయంటే నండీ – మేస్ట్రీటుబాబు కూతురికి పెళ్ళి జేస్తే మనకి సుబలేక ఎయ్యడా అనిపించీసీదండి.

అవతల పారిటీ కాకి యివతల పారిటీ కాకి ఏపు సూడ్డం కూడా మానీసినాదండి.

ఆకరికి సాకళ్ళూ-మంగళ్ళూ గూడా ఏదో పారిటీలో జేరిపోనారండి.

ఎపుడన్నా ముండదగ్గర కెళ్ళాలంటే-ఆడిపారిటీ ముండ కాడికే ఎళ్ళాలండి.

సన్నాసిగోడు సెప్పినట్టు ఊరంతా సెదపట్టిపోనాదండి.

అదిగో-

ఆ టయాంలో దిగినాదండి మా ఊరు సిట్టిబాబు.

ఆ బాబు సిటీలోనే డాట్రు పరీక్ష సదివినాడటండి. అత గోడు-కైలాసం బాబని-మా ఊరే- ఆ బాబు కూతురి కొడు కండి. కైలాసం బాబుకి కొడుకుల్నేరండి.

ఉన్న ఒక్క కూతురూ సిట్టిబాబుని కని పురుట్లోనే సచ్చిపోనా దటండి. సిట్టిబాబు ఆళ్ళ తండ్రి సత్తెన్నారాయణకాడ సిటీలో పెరిగినాడండి. సెత్తెన్నారాయణ ఆ మజ్జెనే పోనాడటండి.

సిట్టిబాబు తాతగోరి కాడికి ఏడాదికో అర్నెల్లకో- ఓ సారి వొచ్చి వోరం రోజులుండి ఎళిపోయివోడటండి. కైలాసం బాబుకి జబ్బు జేసినప్పుడు- వొచ్చి- సిటీ తీసుకుపోనాడటండి. మూడ్నెల్లు తీసుకొని కైలాసం బాబు సచ్చిపోనాడటండి. తాతగోరు పోనాక – సిట్టిబాబు మా ఊరు పెర్మనెంటు గుండిపోదావఁని వచ్చీసి నాడండి.

కైలాసం బాబుకి ఆ వూర్లో ఒక పడిపోతున్న పెంకుటి కొంపా- ఐదెకరాల బూవీఁఉన్నాయండి.

సిట్టిబాబొచ్చినాకే మా ఊరికి ఎలుగొచ్చినాదండి.

ఆ బాబు మా ఊరికి-సల్లగా-పొద్దుటేళ సూరీళ్ళా ఒచ్చినాడండి.

ఒస్తూనే తాతగారింట్లో ఆస్పత్తిరి ఎట్టినాడండి.

ఆస్పత్తిరి తెరిసినప్పుడు మీటింగెట్టి నాడండి.

మీటింగుకి గొప్పా, బీదా అందర్నీ పిలిచినాడండి.

పట్నం నుంచి ఎవురో "లీడర్ని" పిలిపించినాడండి.

మీటింగు హడావిడి అంతా మాయల పకీరు గోడిదే నండి. ఆడ్ని మరిసిపోనారేటండి.

ఆడే-పంచాయితీ మాల మెంబరు గోడండి.

ఎప్పుడూ రానివ్వని ముండ–కోరి కబురెడితే ఎలాగుంట దండి ఎవురికేనా?

అదిగో అలాగై పోనాడండి–మాయలోడు.

బుల్లిబాబు పారిటీవోళ్ళు–బుచ్చిబాబు పారిటీవోళ్ళు కూడా ఎల్లినా రండి, మీటింగుకు.

కురుచ్చేత్రంలో కుష్టుడు నెగిసినట్లు నెగిసినాడండి పట్నం "లీడరు."

లెగిసి కుష్టుడు బగవద్గీత సెప్పినట్టు–ఓ "స్పీచ్చి" నాడండి. అతగోడు ఏటన్నాడంటే–

మనుషుల్లో రెండే రకాలు.

ఆడా–మగా కాదు.

పొడుగూ–పొట్టీ కాదు.

నలుపూ–తెలుపూ కాదు.

మరేటి?

డబ్బున్నోళ్ళూ–లేనోళ్ళూ.

ఈ రెండే రకాలు.

గెద్దా–కోడీ

కుక్కా–పిల్లీ

పులీ–మేకా

కలిసుండొచ్చుగాని యీ రెండురకాల మనుషులు మాత్తరం కలిసుండలేరు.

మరి– గొప్పోళ్ళా బీదోళ్ళని యెందుకు బతకనిస్తున్నారూ అంటే–

అడవిలో పులి అన్ని మేకల్నీ ఒక్కపాలే ఎందుకు తినీదు?

సెర్లో కప్పలన్నింటినీ పాఁవుఁలన్నీ ఒక్కపాలే ఎందుకు మింగెయ్యవు?

అంతే.

మేకలు పెరిగితేనే పులులకి తిండి.

అలాగే కప్పలు కూడా. అయితే యిక్కడో సిన్న యిచిత్తరం – పులి మేకని ఆకలైతేనే తింటాది.

అవసరానికే తింటాది.

గొప్పోడు బీదోడిని అవసరం కోసం కాదు–ఆశకొద్దీ తింటాడు.

అయినా బీదోళ్ళని ఎందుకు బతక నిస్తున్నారూ? అంటే

ఆళ్ళ పన్లలోకి పనికివస్తారు కాబట్టి.

గొప్పోళ్ళు ఆళ్ళ భూఁవుఁలు ఆళ్ళు దున్నుకోగల్రా?

ఆళ్ళ ఫేక్టరీలు ఆళ్ళు అరచ్చెనం నడుపుకోగల్రా?

యియ్యన్నీ సెయ్యడానికి బీదోళ్ళు గావాల. బీదోళ్ళవల్ల యింకా ఏటి నాబాలంటే–బీదోళ్ళని ఎందుకు బతక నిస్తున్నారూ అంటే–గొప్పోళ్ళ బూఁవుఁల్లో పండినగింజలు–బీదోడు పండించి నయ్యే–ఆడుకొంటాడు కాబట్టి.

గొప్పోళ్ళ మిల్లులో నేసిన గుడ్డలు కొంటాడు కాబట్టి.

బీదోడు పుట్టినప్పుడు తాగే ఆఁవఁదం కాడ్నించీ– సచ్చేక కాలీ కర్రల వొరకూ–

ఆడి తినీ వొణ్ణం

ఆడు కట్టీ గోసీ

కాలిసీ సుట్టముక్కా

ఎలిగించీ అగ్గి పెట్టే

అన్నీ గొప్పోళ్ళ కాడ్నించే రావాల.

యిలాగైతే ఏటౌద్ది?

గొప్పోడు యింకా గొప్పోడౌతాడు.

ఐదెకరాల వోడు పదెకరాల వోడౌతాడు.

ఇయ్యేళ ఒక పేక్టరీలో ఒక వోటా ఉన్నవాడు రేపు రెండు పేక్టరీ లెడతాడు.

యీయేళ బీదోడు రేపు యేటౌతాడు?

ఏటీ అవడు.

అదురుష్టం బాగుంటే బీదోడుగానే ఉంటాడు.

నేకపోతే ముష్టోడైపోతాడు.

మరంచేత పెపంచికం బావుఁపడాలీ అంటే అసలీ గొప్పా, బీదా తేడాలుండకూడదు.

యీ తేడాలున్నంతవొరకూ

ఒక మడిసి మరో మడిసిని నమ్మడు సరికదా పుల్ని జూసి నట్టు జూస్తాడు.

గొప్పోళ్ళకీ తెలుసు యీ ఇసయం.

ఆళ్ళు జేసీ తిరకాసేటంటే–యీ సంగతి బీదెదవకి అరదం గాకుండా ఉంచదవే.

అలా ఉంచడానికి ఏటి జేస్తాడు.

నానూ మహాత్ముడ్నే అంటాడు.

బీదోడికి జబ్బు జేస్తే నీళ్ళమందు లియ్యడానికి ఆడి గవర్న మెంటు సేతే ఆస్పత్తిర్లు కట్టిస్తాడు.

బీదోళ్ళ ఇళ్ళు కాలిపోతే ఆళ్ళతాసిల్దారు తలకో పాతికా యిచ్చి తలోపదీ మళ్ళీ పీక్కుంటాడు.

బీదోళ్ళ పిల్లలు సదువుకోడానికి ఆడి గవర్నమెంటుసేతే బళ్ళు ఎట్టిస్తాడు.

కాని బీదోడు తన పిల్లాడ్ని గోసెట్టిన కాడ్నించీ పన్లో ఎట్టక పోతే గడవనట్టు జేసేస్తాడు.

సేతకాని బీదోడు

సదువులేని బీదోడు

యేటనుకుంటాడంటే "అయ్యో యీ డబ్బున్నోళ్ళు నా కోసరం ఆస్పత్తిర్లెట్టినారు. నా పిల్లలకి బర్లెట్టినారు. ఈళ్ళు సెట్టోళ్ళేటీ?" అనుకుంటాడే తప్ప.

ఆడు ఆస్పత్తిరికి ఎందు కెల్తన్నాడో ఆడికి తెల్డు.

ఆడిది అన్నంలేని జబ్బని అడికి తెల్డు.

గొప్పోడి పెపంచికంలో తన పిల్లలకి సదువురాత ఉండదని ఆడికి తెల్డు.

నాకు రిచ్చా కొనుక్కోడానికి గవర్నమెంటు అప్పిచ్చింది – సాయం జేసినాదని సంకలు కొట్టుకుంటాడే తప్ప ఆ అప్పుమీద వడ్డీవుందని–

గొప్పోళ్ళలో నాసిరకం గోళ్ళ జల్సాలకి రిక్షాలుండాలని ఆడికి తెల్డు.

ఇయ్యేళ నాకు వొందెకరాలున్నాయీ అంటే అరదవేఁటి.

ఎక్కడనుంచొచ్చేయి నాకా ఎకరాలు?

నా బాబు కాడ్నించి,

ఆడి కెక్కడ్నుం చొచ్చేయి?

ఆడి బాబుకాడ్నించి.

ఆడి బాబుకి?

ఆడి బాబుకి??

ఇలా ఎనక్కిఎల్తే నా వొంశంలో ఎవడో ఒకడు–వందేళ్ళ కిందటో–వెయ్యేళ్ళ కిందటో–దమాయించో–దగా చేసో ఆ బూఁవిఁలాక్కున్నాడన్న మాట.

యియేళ నాకు అస్తుంటే–నాను గాకపోతే–నా ముందు తరాలోళ్ళేనా–దాన్ని పాపాలు జేసి సంపాదించినారన్న మాటే.

బూఁవిఁ పుట్టినప్పుడు–బగమంతుడు ఎవరికీ పట్టాలిచ్చీనేదు.

నిజంగా బగమంతుడే పట్టాలిస్తే– అయి తురకోళ్ళు మన దేశాన్ని ఆక్రమించినప్పుడేటయ్యేయి?

ఇంగిలీషోడు మన దేశాన్ని ఆక్రమించినప్పు డేటయ్యేయి యీ పట్టాలు?

బూఁవిఁ పుట్టినప్పుడు అందరిదీ.

ఇప్పుడు మాత్తరం–అతి తక్కువ మందిది.

మరో ముక్క యిసయం.

పీకలు కోసో–పాతులు తవ్వో–నాటరీ వచ్చో–ఎలాగో ఓలాగు ఒక బీదోడు గొప్పోడు అయ్యేడంటే–ఆ అయిన కాడ్నించీ ఆడు ఎగస్పార్టీలో కలిసిపోయి ఆడికి బీదోడిగాలే ఇసపుగాలై పోద్ది.

ఈ ఇసయాలన్నీ ఒక్కపాలి సెప్పాలంటే ఒక ఏడాది సాల్దు. ఆయన్నీ ఆనక ఒకటీ ఒకటీ సిట్టిబాబు సెప్తాడు.

ఇది బీదోళ్ళ ఆస్పత్తిరి.

డబ్బివ్వలేనోడు కాణీ కూడా యివ్వొద్దు.

యిదీ ఆ 'లీడరిచ్చిన' స్పీచ్చి.

ఆనక మాయలపకీరు గోడు లెగిసినాడు.

మావంతా సేరబడిపోనాం–ఈడు కూడా స్పీచిస్తాడేట్రా అని.

ఆడు ఒక్కటే మాటన్నాడు "నాను మాటలు సెప్పను. చేసి సూపిస్తాను" అనీసి కూకుండిపోనాడండి.

"ఏటా యీడు సూపించీది" అనుకున్నావండి.

మరి నాలుగు రోజులుకి "మాయల పకీరుగోడు సిట్టిబాబు ఆస్పత్తిరికి ఎనిమిదివేలు సందా యిచ్చినాట్ట" అన్న పుకారు పొగనాగ సుట్టేసినాదండి ఊర్ని.

"ఇంత దబ్బెక్కడిదిరా" అంటే

"ప్రెసిడెంటుని జేసినప్పుడు బుల్లిబాబు ఐదేలు యిచ్చినాడు. అతగోడ్ని వొచ్చీనెల దింపీడానికి బుచ్చిబాబు మూడువేలు యిచ్చి నాడు" అన్నాడటండి.

ఏదేటైనా ఆడు–సిట్టిబాబు ఆస్పత్తిరి ఎట్టిన కాడ్నుంచి – కూలిపనీ, గీలిపనీ మానీసి ఆస్పత్తిరి పనిలోనే ఉండి పోనాడండి.

## 30

ఆస్పత్తిరెట్టిన యిల్లు కైలాసం బాబుదని సెప్పినాను గదండి. అది పెంకుటి కొంపైనా–పాతదండి.

ముసిలి గేదె యీపునాగ దాని కప్పు వొంగిపోనాదండి.

అక్కడ కొచ్చీవోళ్ళు–శానామంది బీదోళ్ళేనండి.

ఎక్కడ కూకుంటే అక్కడ తుపుక్కున ఉమ్మేసీరకవండి. అయినా ఆసుపత్తిరి కొత్త పందిరినాగ సల్లగుండీదండి.

సిట్టిబాబు ఎవుర్నీ "యింత యియ్యి" అని అడిగేవోడు కాడండి. "నీ ఫీజెంత" అని ఎప్పుడైనా అడిగితేనే సెప్పేవోడండి. ఇచ్చుకో లేనోళ్ళు అడిగేవోరు కారండి.

అలాటోళ్ళ కోసరం మూలగదిలో "సీలు డబ్బా ఎట్టి నాడండి. ఆళ్ళు అందులో పావలా పరకా యేసినారా సంతో షం – లేకపోతే యింకా సంతోషం అనీ వోడండి–గారడీ వోడు నాగ.

యేసంకాలం ఏరునాగ మొదట పల్చపల్చగా ఉండీదండి ఆసుపత్రి. కాని మూణ్నెల్లయ్యేసరికి ఒక్కపాలి వొరదొచ్చినట్టు పొంగిపోనాదండి.

ఆ సుట్టుపక్కల పదూళ్ళకి డాట్రు నేడండి.

ఆళ్లు డాట్రుకాడి కెళ్ళాలంటే పదిమైళ్ళెళ్ళాలండి మరంచేత సిట్టిబాబుకి సవడాని క్కూడా టయాం ఉండీది కాదండి.

సూర్యుడు లెగకుండా లెగిసీవోడండి.

ఎనిమిది గంటలకి ఆస్పత్తిరి తీసెవరకూ–ఎయ్యో పుస్తకాలు సదువుకొనీవోడండి.

ఆనక పనండి–పని రేత్తిరి పదికి అయిపోతే అదురుష్ట వేనండి. అంతపన్జేసినో డెవ్వడికీ రంబవొచ్చి రమ్మన్నా వోపి కుండదండి.

మద్దేన్నవేళ వొణ్ణానికో అరగంట టయాం దొరుకుతే గొప్ప అదురుష్టవే ననుకోవాలండి.

మూణ్నెల్లలో సిటీనుంచి ఓమంచి కాంపౌదర్ని తెచ్చినాడండి.

"బుల్లిబాబూ, బుచ్చిబాబూ మొదట్లో సేవలు జేసినారు గారా?! సిట్టిబాబు ఇంద్రజిత్తుగాళ్ళాటివోడై యుండాలి. వొచ్చీ పాలి ప్రెసిడెంటు అవడానికే యీ సేవంతాను" అన్నారండి ప్రెజ.

"నాను నిలబడ్ను అని కాయితం రాసిస్తాను" అన్నాడండి సిట్టిబాబు.

"అయితే ఎమ్మెల్లే ఔదారని ఇంకా పెద్ద ప్లానేసి ఉంటారు" అనీసి నారండి.

"నాను ఎలక్సన్ల ఊసుకు ఎల్లనుగాక ఎల్లను" అన్నాడండా బాబు.

"మరైతే నకసలైటై యుంటాడు" అనేసేరండి జెనం.

యింక ఆ బాబువొయిజ్యం అంటారా–ఎవరూ ఏలెత్తి సూపడానికీల్లేదండి.

శెవాన్ని పాతీసినా పరవానేదు–తగలెట్టీకుండా ఉంటే సాలు పేనం పోసీగలడండి.

ఆ బాబు ఆపరేషన్ సెయ్యాల్సినకాడ ఇండీషను యిచ్చీ వోడండి. ఇంజీషను ఇవ్వాల్సినకాడ మాత్తర్లే యిచ్చీవోడండి.

యింక దెయ్యంపట్టిన కేసులకి–ఆ బాబు పెట్టింది పేరండి.

మా ఊళ్ళోనే ఓ గుంట–పేరు మరిసిపోనాను – పెళ్ళీడు కొచ్చిందే –

ఇలాగ ఎర్రకోక కట్టుకున్న అమ్మోర్లా గుండీదండి. అదోసారి సెరువునుంచి నీళ్ళు తెస్తుంటే గాలి వోలినాదండి.

పట్టుకున్నది మామూలు దెయ్యం కూడా కాదండి. తురక దెయ్యవంట.

ఆ ముందటేడు ఎవడో సాయిబు పెళ్ళాన్ని సంపేసి సెర్లో పారేసినాడటండి–అప్పట్నుంచి ఆ సచ్చింది దెయ్యమైం సెట్టుమీద కూకుంటాదటండి.

ఆడోళ్ళకైతే పట్టపగలే కనిపిస్తాదటండి.

రేత్తిరిపూట ఏ మొగాడు సెరువుకాడి కెళ్ళినా తెగ అల్లరిపెట్టి సీదటండి.

యింకా యీ దెయ్యంపట్టిన గుంట–

వోరవేంసి రోజులు వొణ్ణం ముట్టీది కాదండి.

తాన్నం ఆడీది కాదండి.

తల దువ్వేది కాదండి.

నిద్దరబోయాది కాదండి.

అలాగున్నా బావుండిపోనండి.

ఊరు తగలెట్టేస్తానని కూకుండీదండి.

మరింక రేత్తిరీ, పగలూ దానికి కాపలాలండి.

పోనీ మంచానికేసి కట్టేద్దావనుకుంటే ఓ పాలి అలా కట్టబోతే ముగ్గురు మొగోళ్ళని ఎడంసేత్తో యిసిరీ సిందిటండి. మిగతా వాళ్ళమీద రుబ్బురోలు–యిలా ఆల్చిప్పనేదూ, ఆల్చిప్పలా – యిసిరీసిందిటండి. అది తగిలి ఒకడి కాలిరిగిపోనాదటండి.

వోరానికో, పదిరోజులకో వొణ్ణానిక్కూకుంటే, వంటంతా తినీసి, యింకా తెమ్మనీదిటండి.

దాన్ని సివచలం కొండకి తీసికెళ్ళి నారండి.

మస్తాను దరగాకి తీసికెళ్ళినారండి.

పోగులు కుట్టించినారండి.

పొగలు యేయించినారండి.

నిమ్మకాయలూ; కోడిపిల్లలూ కరుసుతప్ప నయంకా లేదండా గుంటకి.

దాన్ని తీసుకొచ్చినారండి సిట్టిబాబుకాడికి.

ఆ బాబు మందులిచ్చినాడండి.

అంతేనండి.

పగలూ–రేత్తిరీ ఒకటే నిద్దరండి. దెయ్యంనిద్దర.

పదేను రోజుల్లో మామూలు మనిషైపోనాదండి.

దాంతో ఎన్నెల రేతిరి సెంద్రుళ్ళా పెరిగి పోనాదండి ఆ బాబు పేరు.

కూలీల కుర్రోళ్ళు–సాయంత్రం వేళ కాలచ్చేపానికి– ఎళ్ళేవో రండి ఆస్పత్తిరి కాడికి.

ఆ బాబు ఆళ్ళ కెన్నో యిసయాలు సెప్పేవోడండి.

ఇలాగుండగా ఓసారి పోలీసులు లారీల్లోదిగిపోనారండి మా వూరు.

అమ్మోరి పండగ యింకా నెలుంది గదా? ఎందుకొచ్చి నారు సెప్మా అనుకున్నానండి నాను. ఆళ్ళెవరింటిమీద పడ తారోనని ఆళ్ళెనక పడ్డానండి.

ఆళ్ళు ఇంటిమీద పళ్ళేదు.

గుడిమీద వళ్ళేదండి.

ఆస్పత్తిరి సుట్టేసినారండి.

ఆళ్ళలో ఆఫీసర్లు ఆస్పత్తిర్లో జొరబడి ఆస్పత్తిరంతా తల్ల కిందుల జేయిసినారండి. కోడి గెలికీసినట్టు ఆస్పత్రంతా గెలికీసి నారండి.

ఆపరేసను కేసులు కుట్లూడదీసి జూళ్ళేదండి – అదొక్కటే నండి ఆళ్ళు సెయ్యని పని.

నానుగ్గంటలసేపు సిట్టిబాబుని ఏటేటో అడిగినారండి.

ఎళ్తూ ఎళ్తూ "యీ ఎల్లడం మళ్ళీ రాడానికే అన్నార టండి.

## 31

ఇదైన వోరానికి నానూ, మా బాబూ సిటీ ఎళ్ళినావండి.

సిటీ ఎల్తే సానింటి కెళ్ళవొాలసిందేనని శానా మందిరను కుంటే–సిటీ ఎల్తే ఇనస్పెక్టరుకాడికి ఎళ్ళవొాలసిందేనని మా బాబు "తియరీ" అండి.

మరంచేత సర్కిలుబాబుకి సలాం కొట్టినావండి" నాను బైటుండిపోనానండి–అంచేత ఆ బాబులు ఏటి మాటాడు కున్నారో నాకు తెలదండి.

కాని ఇంటికొచ్చినాక మా బాబు నన్ను పిల్సి "ఒరే కెప్టెనూ! నానో మాట జెప్తాను. అది నీ ముండక్కాదు సరికదా– గాందీ గోరు వొచ్చి అడిగినా సెప్పకూడదు" అన్నాడండి.

"మళ్ళీ మీకే సెప్పను" అన్నానండి నాను.

"మరేం నేదు. సిట్టిబాబు నకసలైటని పోలీసోళ్ళ నమ్మకం. అంచేత నువ్వా బాబుతో నేస్తంకట్టి–

ఆ బాబేటి సేస్తాడు?

బాంబులు సేస్తాడా?

బరిసెలు సేస్తాడా?

ఆ బాబుకాడికి సిటీ నుంచి ఎవరొస్తారు?

ఆళ్ళతో ఏటి మాటాడతాడు?

యియన్నీ కనిపెట్టి నాతో సెప్పాల" అన్నాడండి.

"ఓస్! అదెంత పని? ఆ బాబు సేసే బాకులూ, బాంబులూ తెచ్చీమన్నా తెచ్చేస్తాను" అన్నానండి నాను.

అప్పట్నించీ ఆ బాబుకాడికి ఎల్లడం మొదలెట్టినానండి నాను. తొలిసుట్టు ఆ బాబుకాడి కెళ్ళినప్పుడు సాయింత్రం అయి పోనాదండి.

ఆ బాబు గదిలో ఉన్నాడండి. ఆ బాబు కెదురుగ్గా–ఓ మొగుడూ, పెళ్ళాం కూకున్నారండి.

ఆళ్ళు కూలోళ్ళని ఆళ్ళు సెప్పక్కర్నేదండి.

తల్లి సేతిలో వున్న పిల్లని చూస్తే సాలండి.

ఆళ్ళది ఆకలి జబ్బయితే పిల్లకి మరో రోగం కూడా ఉందని సూడగానే తెలిసిపోతాదండి.

"బాబుకి దణ్ణమెట్టు" అందండి తల్లి.

పిల్ల సేతులు జోడించి "దణ్ణం" అన్నాదండి.

దెయ్యం మాట్టాడినట్టయిపోనాదండి నాకు.

అంతవొరకూ ఆ పిల్లకి ఆర్నెల్లే ఆనుకున్నానేమో తుళ్ళిపడి పోనానండి.

"ఎళ్ళొస్తానండి" అన్నారు మొగుడూ, పెళ్ళాం లెగిసి.

"మంచిది" అన్నాడండి సిట్టిబాబు.

కాని ఆళ్ళెళ్ళనేదండి.

ఆ మొగుడుగోడు బనీను జోబీలన్నీ ఎతకడం మొదలెట్టి నాడండి.

మేజిక్‌వోడి కోటుకి ఎన్ని జోబీ లుంటాయ్యో ఆడి బనీనుకి అన్ని జోబీ లున్నాయండి.

ఎతికి ఎతికి–యీ జోబీలోంచి కుసిన్ని–ఆ జోబీలోంచి కుసిన్ని పాతనోట్లు– అన్నీ రూపాయిపీ– రెండుపీ– తీసి బల్లమీద పోగెట్టినాడండి.

పోగు ముప్పైకి తక్కువుండదండి. నలబైకి యెక్కువా వుండ దండి.

"ఏటిది?" అన్నాడండి సిట్టిబాబు.

సెల్లెలు ఫీజు యిచ్చినట్టు ఎట్టినాడండి మొకం.

"బాబూ! ముప్పై రోజులూ మీ ఆస్పత్రిర్లో ఉన్నాం. వొయిజ్జెం జేయించుకున్నాం– బాబ్బాబూ– కాదనకు–యింతకన్న యిచ్చు కోలేం" ఆ తల్లి మాటాడుతున్నాదే గానండి, గుడ్లమ్మట నీరు కక్కేస్తున్నాదండి.

సిట్టిబాబు లెగిసినాడండి.

టేబిలు మీదున్న పోగు ఒక సేత్తో తీసేడండి. రెండో సెయ్యి ఆ తల్లి బుజం మీద ఏసి ఆ నోట్లు సేతిలో ఎట్టి "పిల్లదు నీర సంగా వున్నాడు. పాలు కొని పట్టు" అన్నాడండి.

అంతేనండి.

మూర్చొచ్చినదాన్లా ఆ బాబు కాళ్ళకాడ కుప్పలా పడిపోనా దండి ఆ తల్లి.

ఏడుస్తూ కాళ్ళని సుట్టేసినాదండి.

ఆ బాబు ఆ యమ్మని లెగదీసి మెట్లు వొరకూ దిగబెట్టి నాడండి. ఆళ్ళు నడిసెళ్ళి పోతూవుంటే అలాగ సూస్తూ నిలబడి పోనాడండి.

ఆ తరువాత మూర్ఛలోంచి తేరుకున్నట్లు తేరుకొని లోపలి కొచ్చి నాడండి.

నన్ను సూసి "రాయికైనా జబ్బు సెయ్యొచ్చుగాని నీకు జబ్బే విఁటోయ్!" అనడిగినాడండి.

నాను అబద్దాలు ఆడే బతికేనండి.

దేవుఁడి నెత్తిమీద సెయ్యేసి మరీ ఆడగలనండి.

కాని అప్పుడు ఆ బాబుతో "కడుపు నొప్పి" అని అబద్దవాఁ డినప్పుడు మాత్తరం–ఇంతకంటె ఆర్నెల్లు సెంట్రలు జెయిల్లో ఉండడం, సుళువఁనిపించినాదండి.

"తిండి తగ్గించు. యీ మాత్తర్లేసుకో. బీదోడివఁని బిల్లు మాపుజేసీమంటావా? మీ బాబుసేత కట్టించేస్తావా?" అన్నాడండి నవ్వుతూ.

అసలు ఆ బాబుకాడ కెళ్ళగానే నానేదో "షాక్" తినీసినానండి.

ఆ తల్లీ పిల్లమీద ఆ బాబు సూపించిన అబిమానం–నాను పుట్టినాక జెన మంతటికీ ఒక్కపాలి–ఒక్కపాలి–ఎవడన్నా ఒక్కడు నా మీద సూపించుంటే–నా బతుకిలాగుండీది కాదనిపించీసి నాదండి.

నాను తిరుపద్దేవుఁడి కళ్ళల్లోకి తేరిపార జూసినాను.

ఇనస్పెట్టర్లనీ, మేస్ట్రీట్లనీ కూడా జూసినానండి.

కాని యిదిగో–యీ బాబు కళ్ళల్లోకి సూళ్ళేకపోనానండి. కారణం సెప్పలేను గానండి–బయం మాత్తరం గాదండి.

సేస్తే యీ బాబుకాడే పన్జెయ్యాల.

సస్తే యీ బాబు సేతుల్లోనే సావాల – అనిపించీసి నాదండి.

యింక నా బుర్ర పన్జెయ్యడం మానీసినాదండి.

ఆ బాబు కాళ్ళకాడ కూకుండిపోనానండి కాళ్ళు పడుతూ. "యిదే పీజు" అన్నానండి.

పోలీసోళ్ళ దెబ్బల క్కూడా ఏడిసీరకం కానండి నాను.

కాని నాకు తెలకుండానే నాకళ్ళంట నీళ్ళు కారిపోనాయండి.

ఆ బాబు కాళ్లు లాగీసుకున్నాడండి.

"ఎర్రోడా? ఏడుపేటి? ఎల్లిరా, ఎప్పుడేనా వొస్తూ ఉండు" అని నన్ను లెగదీసినాడండి.

మా యమ్మని నా నెప్పుడూ సూడ్నేదండి.

మా అయ్యేవడో నాకు తెల్దుబాబూ.

కాని యీ బాబే నా యమ్మా, అయ్యా అనిపించీసినాదండి – ఆ బాబు నాకంటే బాగా సిన్నోడైనా.

ఈ బాబుమీద నాను "యిన్పార్మర్నా?"

ఈ బాబు బోగట్టా పోలీసోళ్ళకి అందించాలా!!

యింతకంటె తల్లి పీక కోసీడం సుళువు అనిపించిందండి.

"రేపొస్తాను బాబూ" అని ఎలిపోనానండి.

## 32

ఎలిపోనానంటే ఎలిపోనానన్న మాటేగాని–ఆ బాబుకాడ నాకేదో మరిసిపోయినట్టూ–

నా శెవం మాత్తరం నడిసెల్తున్నట్టూ

అనిపించినాదండి నాకు.

తిండి తగ్గించమన్నాడు ఆ బాబు.

కాని ఆ రేత్తిరి తిండే సయించనేదండి.

కూలోళ్ళకాడ ముప్పై రూపాయలు ఒగ్గీసినాడని ఆ బాబు గొప్పోడనుకోలేదండి నాను.

ముప్పైలొగ్గీసి మూడొందలు లాగీసీ వోళ్ళని శానా మందిర్ని సూసినానండి.

అసలు నా యవ్వారాలన్నీ పోలీసోళ్ళ తోటీ, ప్లీడర్లతోటీ గదండి.

ఆ బాబులో–గుండెలు తవ్వీసీ–యిసయం ఏటంటే–

ఆ బాబుకి బీదోళ్ళమీదున్న అభిమానం.

ఇంతభిమానం ఎందుకు పడ్తున్నాడు?

యెమ్మెల్లే ఔదారనా?

యంపీ ఔదరనా?

యీ బాబుకి పదవొద్దు. పవరొద్దు. పోనీ, మరీ డబ్బాశన్నా ఉందా? అంటే అదీ అగపడదు. సిటీలో డాట్టర్లు ఉట్టి మైక్రో స్కోపెట్టి మిద్దెలు కట్టేసినోళ్ళున్నారు. సేంపిల్సు అమ్మీసుకొని మేడలు కట్టినోళ్ళూ ఉన్నారు.

మరీ బాబు–ఒక్క సినిమాహాలన్నా, ఒక్క సుబ్రవైన హోటే లన్నా లేని ఊళ్ళో–

నవ్వకుండానే కంపుకొట్టేసీ మనుష్యుల్లో కలిసిపోయి,

ఆళ్ళు తింటే తను తిన్నట్టే అని సంబరపడిపోయి ఎందుకుం టున్నాడు?

మరి సేవజేస్తావంటూ ఇన్ని పారిటీల వోళ్ళున్నారే? ఆళ్ళెం దుకు యీ బాబులాగుండరు!

మీదు మిక్కిలి పోలీసోళ్ళకేటి యీ బాబుమీద నిగా?

నాకు బుర్ర తిరిగిపోనాదండి.

వొణ్ణం సయించలేదు సరికదా కునుకు కూడా పట్టనేదండి రేత్తిరి.

కోడిగుజ్జావుఁని ఓ సిన్న కునుకట్టి నాదండి. గాని పోలీ సోళ్ళు నా మీద బాంబులు యిసురుతున్నట్లు పీడకలొచ్చి నెగిసిపోనానండి.

తెల్లారకుండా నెగిసినానా! తిన్నగా సెరువుకాడకెళ్ళి సెర్లో గేదె మునిగీసినట్టు మునిగీసినానండి. వొస్తావుంటే తోవలో అమ్మోరి గుడి అగుపడ్డాదండి.

ఆ ఏళవొరకు నాను ఎప్పుడూ దేవుడికి బక్తితో దండవెఁ ట్టనేదండి.

కానా పొద్దు అమ్మోరికి దండవెఁట్టి "అమ్మా! నీ వున్నావో నేదో నాకు తెల్దు. సిట్టిబాబు గుండెల్లో సత్తెం ఉంది

నాయం ఉంది.

దరమం ఉంది.

దయుంది.

ప్రేముంది.

మరంచేత నువ్వంటూ ఉంటే ఆ బాబు గుండెల్లో ఉంటావు గాని యీ రాయిలో ఉండవు" అనుకున్నానండి.

వొస్తూ, వొస్తూ తోవలో ఆలోసించినానండి. నాను తినీది మా బాబు వొణ్ణం. మామూలు నీతి ప్రెకారం సిట్టిబాబుకాడ కూపీలు లాగి-అయి మా బాబు కందిం చాల. ఆట్ని ఆ బాబు పోలీసోళ్ళ సెవులకి జేరేస్తాడు.

నిన్నటి వొరకూ యిదే నీతి అనుకున్నాను.

కాని యియాళ అలాగనిపించనేదండి.

ఎవుడి డబ్బు తిన్నా-దరమానికే సపోర్టియ్యాల.

మంచోడి కూడు తిని, ఆడ్ని ఎత్తడం మంచిదే.

కాని సెడ్డోడి కూడు తిని, మంచోడికి సపోర్టు యియ్యడం ఇంకా మంచిది.

మరంచేత యియ్యాల్టినుంచీ-మనం సినీమాల్లో నాగ "డబుల్ యాక్సన్" మొదలెట్టాల.

ఎనకటి కెవర్తో "నా పాతివ్రొత్యెం గురించి నా రంకు మొగుడ్ని అడుగు" అందిట.

నేకపోతే "ఈడు నన్ను సంపేస్తాడు. ఆడు నన్ను పొడి సేస్తాడు" అన్జెప్పి నన్నీ ఊరు లాక్కొచ్చినా-తీరా వొచ్చినాక "సిట్టిబాబు ఆపరేషన్లు సేస్తాడా? ఆటంబాంబులు వేస్తాడా?

మొగ ఫ్రెండొస్తే రాచకీయాలు సెప్తాడా?

రంకు కబుర్లు సెప్తాడా?

ఆడ ఫ్రెండొస్తే కమ్యూనిస్టు కబుర్లు సెప్తాడా?

కావఁలించుకుంటాడా?"

అని బోగట్టా తియ్యమంటాడా?

ఎనకటి కెవడో-నాలాంటేడే-ఓ సేతకాని మొగుడు-"నా సేత డాఫరు పన్జేయించ డానికా-యేరింటి కాపురం ఎట్టించి నావు" అన్నాట్ట.

అలాగుంది నా యెవ్వారం.

ఆలా ఆలోసించి, ఆలోసించీ ఆ యేళే నిశ్చయించీసుకున్నాను నా డూటీ.

నాను-యిశ్వాసం లేనోడ్ని గాను.

బుల్లిబాబు కూడు తింటున్నందుకు-ఆ బాబుమీద బుచ్చిబాబు గోరి ఈగ కాదు సరికదా దోవఁపిల్లని కూడ వోలనివ్వను.

నా డూటీ అంతవొరకే.

కాని అల్లాడింటికి ఎవరొస్తన్నారో కన్నేసుంచు.

ఇస్లీ రంకుముండ అడ్రస్సేట్టి?

అంటే మాత్తరం-అది నా పనిగాదు.

మరాయేళ అలాగనీసుకున్న కాడ్నించీ-సిట్టిబాబుకాడికి రోజూ ఓపాలన్నా ఎళ్ళీవోడినండి.

ఆ బాబు పేషెంట్లకి దయిర్యం సెప్పడం కాడ్నించి మొక్కలకి నీళ్ళు పొయ్యడం వొరకూ సేతికందిన పనల్లా జేసీవోడినండి.

ఆ బాబుక్కూడా నామీద అబిమానం పుట్టుకొచ్చినాదండి.

అంతవొరకూ ప్లీడర్లూ,

పోలీసులూ,

గుమాస్తాలూ,

జవాఁనుగోళ్ళూ,

యిలా ప్రెతి నంజికొడుకూ-

నా కాడ డబ్బు తీసుకున్న ఎదవలే, నన్ను అసయ్యించుకునీ వోరండి.

నన్ను అభిమానించిందీ,

మడిసిగా జూసిందీ,

మొదట మా యాడదీ-తర్వాత సిట్టిబాబూనండి.

మా యాడదానికైతే సాయం జేసినాను. కాని యీ బాబుకేటీ సెయ్యనేదు సరికదా మోసం జేద్దారని మొదట కాలెట్టినాను-ఆ బాబు గడపలో.

"నా గోల మీకెందుగ్గాని మీపని మీరు కానిచ్చీయండి" అందిట యెనకటి కెవర్తో.

అలాగ నా గోల మీకెందుకులెండి.

సాయింత్రవేళ సిట్టిబాబుకి కుసింత టయాం దొరికీ దండి -అదిగో అలాటప్పుడు జేరీవోరండి కూలోళ్ళూ-మాలోళ్ళూను. మొదట్లో కుర్రోళ్ళే వొచ్చీ వోరండి. కాని తర్వాత్తర్వాత-పెద్దోళ్ళు కూడా జేరీవోరండి. ఆ బాబు తనంతట తను, నోరిప్పి ఆళ్ళకేటీ సెప్పీవోడు కాదండి. కాని ఆళ్ళేటడిగినా-పాలు తాగీ పిల్లడ్కి కూడా అరదవఁయిూటట్టు సెప్పీవోడండి.

ఆ బాబు సెప్పీ సంగతులు తరువాత సెపుతాగాని వోరానికో-పది రోజులకో మా బుల్లిబాబు నన్నడిగీవోడు. "ఏట్రా చిట్టిబాబుకాడ సంగతులూ?" అని.

పనై పోనాక సావిదాని సెయ్యట్టుకు మళ్ళీ లాగితే దాని కెలాగుంటాది? దాన్లాగే నాకూ మండిపొయ్యాదండి. కాని నమ్మకం పుట్టడానికి ఉన్నయ్యీ, లేనియ్యీ–కలిపించి మరీ జెప్పీవోద్నండి.

ఆ బాబన్నీ కమ్యూనిస్టు కతలు సెప్తాడనీ–

ఆ బాబుతో నిన్న రేత్తిరి ఎవురో యిద్దరు సైకిళ్ళేసుకుని వచ్చి గదిలో గుసగుసలాడినారనీ.

యిలా నా నోటికేదొస్తే అది వోగీసీవోణ్ణండి–కత మరిసి పోయిన హరిదాసులాగ.

ఓ పాలి ఓ మందుల కంపెనీవోడు–కోడిగుడ్డంత మాత్తర్లు ఆ బాబు టేబిలు మీదెట్టినాడండి.

అయి మాత్తర్లు కావు. నాకూ తెలుసు.

అడ్వరుటైజుమెంటు కోసరం యిచ్చినాడండి.

ఆటిని ఆ బాబు సెత్తబుట్టలో పారీసేడండి.

ఆటిని జాగర్తగా–జోబీలో ఎట్టుకున్నానండి.

ఆనక అట్టుకెళ్ళి "యియ్యి బాంబులై యుంటాయండి. సిట్టి బాబు బెడ్‌రూమ్‌లో దొరికినాయని" జెప్పి బుల్లిబాబు కిచ్చి నానండి.

ఎక్కాలు మరిసిపోయిన పిల్లళ్ళా అమాయకంగా మొకవెఁట్టి "యియ్యి బాంబులు కావురా ఎర్రిమొగవాఁ ఎడ్వరుటైజు మెంటు కోసరం యిచ్చీ కేపుసూల్సురా." అన్నాడండి మా బాబు అమాయకపు పెళ్లానికి ముద్దులు నేర్పుతున్నవాడిలా.

ఎనకటికెవర్తో మొదటి రేత్తిరి మొగుడితో "గరబాదానవంటే ఇదేనా? యిదే అయితే మా మేనమాఁవఁ ఎప్పట్నుంచో సేస్తు న్నాడు" అందిటండి. అలాగుంది నా యవ్వారం. "అలాగైతే యిాచ్చీ బాబూ, తీసినకాడే ఎట్టేస్తాను. అనవసరంగా ఆ బాబుకి నా మీద అనుమానమొస్తాది" అని తీసేసుకున్నానండి.

సిట్టిబాబుకాడికి ఎపుడూ రానప్పుడు "నిన్న రేత్తిరి యిద్దరు సైకిళ్ళ మీదొచ్చీ వోర"ని అబద్దవాడీవోడినా!

ఆ బాబుకాడికి నిజంగా సిటీనుంచి ఎవరైనా వస్తే మాత్తరం జెప్పీవోణ్ని కానండి–మాబాబుతో.

## 33

పకీరుగోడని మా ఊర్లో ఒక దుండీ వోడండి. ఆడి సదువు అయిదో క్లాసుతోనే ఆగిపోనాది. అయితేనేం ఆడు సిటీలో పన్జేశేడండి శాన్నాళ్ళు. అదిగో, ఆడు సిట్టిబాబు దగ్గర సేరీ వోడండి. జేరి–ఏటో, ఏటో పెశ్నలడిగీవోడండి. అన్నిటికీ సిట్టిబాబు సక్కగా యివరంగా–సెప్పీవోడండి.

మాలాటోళ్ళడిగీ సిన్న, సిన్న వాటికి మాత్తరం సమాధానం – పకీరు గోడే సెప్పీసీవోడండి. ఆడెప్పుడేనా తప్పు చెప్తే సిట్టి బాబు దిద్దీవోడండి.

ఇంతకీ ఆళ్ళు సెప్పే ఇసయాలేటంటే–

మనూరి రెండు పార్టీల్లోనూ ఏది మంచిది అనడిగితే – యిద్దరు లంజెల్లో ఏది పతివ్రొత అనడిగినట్టే.

గొప్పోడు బీదోడికి ఎప్పుడూ సాయం జెయ్యడు–అక్కడో ముష్టోడికి కుసింత దరమం సెయ్యొచ్చు–యిక్కడో కూలోడికి జబ్బు జేస్తే–మందియ్యడానికి ఆస్పత్తిరి ఎట్టించొచ్చు. కాని ఆయన్నీ సేయాలనుకుంటే అది మన తెలివితక్కువ.

అసలు గవర్నమెంటంటే ఏటి?

ఓట్లు.

గవర్నమెంటు ఎవుడి సేతుల్లో వుంది?

గొప్పోడి సేతుల్లో.

మరి ఓట్లు ఎవురికాడ ఉన్నాయి?

పేదోడికాడ.

ఆడు మామూలుగా "బాబ్బాబు, మేవుఁ గవర్నమెంటు నడుపుతాం. నీ ఓటు యియ్యి" అంటే యిస్తాడా?

ఇయ్యడు.

మరేటి సెయ్యాల?

ఆడికి కళ్ళుమూసి జెల్ల కొట్టాల.

మామూలు జెల్ల కాదు.

కందు జెల్ల.

ఎలా కొట్టాల?

దానికి శానా మార్గాలున్నాయి.

ఈ ఊర్లో బంజరు బూఁవుఁలకి బీదోళ్ళకి పట్టాలిస్తాది గవర్నమెంటు–వచ్చే ఏడు ఎల్లి సూడు–ఆ బూఁవుఁ లెవఁరికాడ ఉంటాయో!

గొప్పోడికాడ.

సేతగానివోడికి పెళ్ళిసేస్తే-యిప్పుడేటి జెయ్యమంటా వని అడిగినాట్ట బేమ్మడ్ని-అలాగే ఏరూ-ఎద్దూ లేనోడికి బూఁవిఁ స్తే ఆడేటి జేసుకుంటాడు? దున్నడానికి అప్పు సేస్తాడు.

ఎవురికాడ?

గొప్పోడికాడ.

లేనోడు అప్పుజేస్తే ఏటౌద్ది?

బూఁవిఁకి కాళ్ళొస్తాయి.

రిచ్చాలు కొనుక్కోడానికి అప్పులిస్తాది గొప్పోడి గవర్నమెంటు.

రెండోపెళ్ళి జేసుకున్నా పుట్టకపోవచ్చు గాని, అప్పుకి మాత్తరం రెణ్నెల్లకే కవలపిల్లలు పుట్టేస్తాయి. యీ వొడ్డీ ఎవురి కెళ్తాది?

బేంకుకి.

బేంకెవరిది?

"రాణీగోరు-రాజుగారి పెళ్ళావా? రాళ్ళుకొట్టేవోడి పెళ్ళావా?" అనడిగేట్ట ఎనకటి కెవడో.

పల్లెటూళ్ళల్లో స్కూళ్ళెట్టించినారు-

గొప్పోళ్ళ పిల్లలు సదువుకి పక్కూరికి ఎళ్ళక్కర్లేకుండాను.

కూలోడెందుకు సదివించనేడు తన పిల్లల్ని?

గోసెట్టిన కాడ్నించి గుంటడు గడ్డికొయ్యాల.

గొప్పోడి పశువుల్ని మేపాల.

గొప్పోడి పొలాలు దున్నాల....

ఆడికి నూర్నెంబరు బట్టలు నెయ్యాల.

ఆడి మిల్లులో పన్జెయ్యాల.

ఆడి పెళ్ళానికి నగలు సెయ్యాల.

యియన్నీ సేస్తేగాని బీదోడికీ, ఆడి పిల్లలకీ ఓ పూట కడుపు నిండదు.

ఒక్క ముక్కలో సెప్పాలంటే బీదోళ్ళంతా గొప్పోళ్ళకి డబ్బా ర్జించి పెట్టడానికే ఉన్నారు.

డబ్బే ముక్యం అయిన దేశం యేటౌద్ది?

రాచ్చసుల రాజ్యం ఔద్ది?

మనిషి పుట్టగానే-ఆడిలో మంచితనం సచ్చిపోద్ది.

ఆడు సోకు జెయ్యొచ్చు.

ముండకెళ్ళి జెల్సా జెయ్యొచ్చు.

కాని ఆడి బతుక్కి యిలవ ఉండదు.

మరి కూలోడికి కూలిస్తన్నారు గదా అనొచ్చు.

రైటే యిస్తన్నారు.

కాని ఏ కూలోడైనాసరే సచ్చిన్నాడు కాల్సడానికి కఱ్ఱల డబ్బు నిలవేసుకు సస్తన్నాడా?

యివ్వల్సిన డబ్బు దరమంగా యిస్తే యీ సందాల సావులెం దుకుంటాయి?

మరి గొప్పోడికి? ఆడు రిటైరైతే-ఆడికి యీ ఫండు-ఆ ఫండు-పించను-యిలాగ రకరకాల డబ్బొస్తాది. ఆ పించను డబ్బుతో ముగ్గురు ముండల్ని ఉంచుకోవచ్చు. ఆడు సస్తే ఆడి శవానికి టి.ఎ. ఇస్తాది గవర్నమెంటు. తఁవఁరిగోరికి తెల్దేటోగాని.

అంచేత పెపంచికంలో రెండు రకాలు.

రెండే పారిటీలు.

ఒకటి- డబ్బున్నోడు.

రెండు- పదిరూపాయల నోటు జనమలో పట్టుకోనోడు.

అంతే.

రావణాసురుడు పువ్వుల్లో పెట్టి సీతమ్మని రాఁవుఁలోరికి అప్పగించీ వొచ్చునేమోగాని గొప్పోడు మాత్తరం పేదోడితో పవరు పంచుకోడు.

గొప్పోడు ఎలాటోడంటే బీదోడెళ్ళి గొప్పోడ్ని- ఆడి పెళ్ళాన్ని అంపించీమంటే అంపించేస్తాడేమో గాని పవరు మాత్తరం ఒగ్గడు.

ఒక గొప్పోడు, బీదెదవలకి సేవజేస్తానని ఓ పారిటీ ఎడితే - మరో గొప్పోడు నానూ సేవజేస్తానని మరో పారిటీ ఎందు కెట్టాల?

నాకు తెలకడుగుతానూ- సేవ జేసీవోళ్ళకి పారిటీలేటి? అందరూ ఓ పారిటీలోనే జేరి సేవజెయ్యొచ్చును గదా!

మరదుగో-అక్కడే ఉన్నాది పితలాటకం. మరంచేత దేశం లోనే కాదు- పెపంచికం హోల్ మొత్తం మీద రెండే రెండు పారిటీలుండాల.

గొప్పోళ్ళదీ-

బీదోళ్ళదీ-

అయితే బీదోళ్ళంతా ఓ పారిటీ గనక అయిపోతే, గొప్పోళ్ళూ, ఆళ్ళ పారిటీ మరింక మందులోక్కూడా మిగల్రు.

ఆ సంగతి బీదెదవకి తెల్దు.

కాని గొప్పోడికి బాగా తెలుసు.

అంచేత గొప్పోడు తన జాగర్త తను పడతాడు.

ఆడిక్కావల్సింది, యీ పారిటీలూ, సేవా సెత్తా కాదు.

బీదోళ్లు కలకుండా సూడ్డం.

అంతే. అదే ఆడిక్కావలసింది.

అంచేత ఆళ్ళని ఎన్ని రకాలుగా సీలవాలో అన్ని రకాలు గానూ సీలుస్తాడు.

మనిషి నిలువునా సీలుస్తే అతకొచ్చేమో కాని బీదోళ్ళని మాత్తరం అతకడానికి యీల్లేకుండా సీలుస్తాడు.

ముందేటంటాడు?

కులాలంటాడు.

మాదిగోడి కంటె మాలోడు గొప్పంటాడు.

ఆడికంటె గొడారోడు యింకా గొప్పంటాడు.

యిలా ఎయ్యి కులాలెడతాడు.

అంటే ఎయ్యి సీలికలు సీలుస్తాడన్నమాట.

అయినా ఆడి దాహం తీరదు.

ఆడి గుండెదడ తగ్గదు.

ఏమో! ఏ ఒక్క కులపోళ్ళన్నా ఏకవైంపోతే నా మాటేటి? అదీ ఆడి గాబరా.

అంచేత ఒక్కొక్క కులాన్ని మళ్ళీ సీలసాల.

మాటకి-మాలాళ్ళనే తీసుకుందాం.

ఆళ్ళలో కొందర్ని సదివిస్తాడు.

సదివించినాక.

ఆళ్ళల్లో ఒకడ్ని- కలక్టరంటాడు.

మరోణ్ని తాసీల్దారంటాడు.

మూడోవాడ్ని, రివిన్యూ యినస్పెట్రంటాడు.

నాలుగోవాడు గుమాస్తా.

అయిదోవాడు జవానుగోడు-

మిగతా వాళ్ళని మీరు మాలాళ్ళలాగే ఉండండంటాడు.

బస్. దాంతో మాలాళ్ళపని సరి.

మాల జవానుగాడు మిగతా మాలాళ్ళకంటె గొప్పనీసుకుంటాడు.

ఆడికంటె గొప్పనుకుంటాడు గుమాస్తాగోడు.

ఇలాగే మాల కలక్టరు,

మాల మంత్రి,

అనుకొని-అనుకున్నంత మాత్తరాన ఏటైపోద్ది? అంటారేమో.

కన్ను గీటినంత మాత్తరాన కడుపైపోద్దా-అనుకోవచ్చు. కాని అయిపోద్ది. ఆ యవ్వారం అంతే.

అదిగో అక్కడే ఉంది తిరకాసు.

మాల కలక్టరు, మాల తాసీల్దారు కంటె గొప్పనుకున్నన్నాళ్ళు – ఆ తాసీల్దారు కలక్టరవకుండా జూస్తాడు.

అలాగే మాల జెవానుగోడూ మిగతా మాలోళ్ళని కంట్రోల్లో ఎడతాడు.

అలా ఒక్కో కులపోళ్ళు-ఆళ్ళలో ఆళ్ళే-ఒకరినొకరు కంట్రోలు జేసుకుండే-ఏర్పాటు జేస్తాడు గొప్పోడు.

ఒక కులపోళ్ళు-తవకంటే తక్కువ కులపోళ్ళని పైకిరాకుండా కంట్రోలు జేస్తారు.

అంటే ఏటన్నమాటా?

బీదోళ్ళంతా ఏకం కాకుండా ఎయ్యి-కాదు లచ్చకంట్రోళ్ళు ఏరుపాటు జేసేడన్నమాట.

ఆ తర్వాత ఆళ్ళనెత్తికెక్కి బరతనాట్యం జేస్తూ-ఆడీ ఆటకి ఆళ్ళజేత పాటపాడిస్తాడు.

ఆడి మోసం అంతటితో ఆగదు.

ఆడికి బక్తి తక్కువ.

బయం ఎక్కువ.

ఇన్ని గోడలు కట్టుకున్నా-యిన్ని కందకాలు తవ్వుకున్నా – బీదోళ్ళంతా ఏకవైం-ఆయన్నీ దాటీసొచ్చి-ఆడి పీక పిసి కేస్తారేమోనని ఆడి బయం.

అంచేత యియన్నీ దాటీసినా సరే తన మీదికి రాకుండా ఒక కంచుకోట కట్టేసుకున్నాడు.

అది కోరటు.

కోరట్లో గొప్పా-బీదా ఒకటే నన్నాడు.

మీ కన్నాయం సేస్తే మీరు కోరటు కెళ్ళండన్నాడు.

దాంతో యీ బీదెదవలంతా-తవఁకన్నాయం జరగలేదని నమ్మేస్తారు.

ఒక పాలి కూలెదవని గొప్పోడిమీద కోరటు కెళ్ళమనండి. ఏటౌద్దో చూద్దాం.

నువ్వు ఆడికాడ వంద రూపాయలు అప్పు తీసుకుంటావు. నూటికి అయిదు రూపాయలు వడ్డీ ఒప్పుకుంటావు-అంటే ఏడాదికి అరవై-అసలు గాదు-వొడ్డీ!

కాని ప్రోనోట్లో ఎంత రాయించుకుంటాడు?

వడ్డీ-రూపాయి.

నెలకి పది కట్టించుకుంటాడు.

మూడేళ్ళనాటికి ఆడి అసలూ, వొడ్డీ కూడుకుపోతాయి.

యీలోగా, ఓ నాడు నీ గుడిసె మీదెక్కిన గుమ్మిడిపాదు జూస్తాడు.

ఓ పదికాయలు పంపమంటాడు.

నువ్వు పంపవు.

ఆడేటి జేస్తాడు?

గుమ్మిడికాయల దొంగలా బుజాలు తడువుఁకోడు. సల్లగా - సిన్నలాయరు నోటీసు తగిలిస్తాడు-నోటు బాకీ తీరసమని.

నువ్వు తెలివైన వాడివైతే తీరిసేసినానని జవాబు యిప్పిస్తావు.

ఇంక జూసుకో నా రాజా- నీ పాట్లు నీ కుక్క కూడా పడదు.

ఆడు దావా ఏస్తాడు-నువ్వు ఓడిస్తావు.

నీ ప్లీడరు కూలిప్లీడరు. నువ్విచ్చీ ముష్టిపీజుకి పెద్దప్లీడరు కాస్సరి గదా ఆడి గుమాస్తాకూడా నీతో మాటాడ్డు.

ఇక నీ ఎగస్పార్టీ ప్లీడరెవరు?

నీ ప్లీడర్ని తవఁలపాకులోఎట్టి వక్క పలుకు నవిలీసినట్టు నవిఁలీసీరకం.

నీ సాచ్చులెవరు? కూలోళ్ళు.

ఆళ్ళ సాచ్చు లెవరు?

డబ్బునోళ్ళు-సదువుకున్నోళ్ళు-నువ్వు కూడా నమ్మీ సీటట్టు-అబద్ధాలాడగలిగే వోళ్ళు.

ఇక కేసు ఇచారణ టయాంకి

నీ సాచ్చులెవరూ కోరటుకి రాకుండా బయపెట్టేస్తాడు నీ ఎగస్పార్టీవోడు.

బయపడకపోతే బెదిరిస్తాడు.

ఆడి బెదిరింపులకి నీ పెళ్ళావేఁ నీతరపున సాచ్చీకం సెప్పదు.

తప్పీదారీ నీ సాచ్చి ఎదవ ఎవుడన్నా కోరటుకొస్తే ఆడ్ని డబ్బిచ్చి కొనీసి నట్టేట్లో కాదు-నడిసవుఁద్రంలో ముంచే స్తాడు-నిన్ను.

ఇంక ఇచారణలో...

"నెలకి పదిరూపాయలు కట్టేనంటావు కదా, నోటుమీద సెల్లులెట్టేవా?"

"నేదండి"

క్షవరం డబ్బులిస్తే మంగలాడిదగ్గర కూడా రసీదు పుచ్చుకోవాలని ముప్పై తీర్పులుంటాయి.

"ఎంచేత చెల్లు రాయించనేదు"

"నమ్మకవండి."

"ఆడు నీకు అప్పిచ్చినప్పుడు నిన్ను నమ్మి ప్రోనోటు రాయిం చుకోవడం మానీసినాడా?"

"నేదండి"

"అంటే ఆడు నిన్ను నమ్మలేదు గాని నువ్వు ఆడ్ని నమ్మే నంటావు!"

"మరంతేనండి"

"అప్పు తీరిపోతే అబద్ధం దావా ఎందుకు వేశేడోయ్?"

"గుమ్మిడికాయ లడిగినాడండి"

"ఆళ్ళింట్లో పెళ్ళా?"

"పెళ్ళి కాదండి. గుమ్మిడికాయలండి."

"వొడ్డీకింద అడిగినాడా?"

"కాదండి. ఉట్టినే యిమ్మన్నాడండి."

"ఏఁవిఁటేఁవిఁటి? ముప్పై ఎకరాలున్నోడు-నీకు సాయం జెయ్యడానికి అప్పిచ్చినవోడు-నిన్ను, నిన్నూ, నీ గుడిసెనీ, దాని మీద గుమ్మడిపాదునీ ఎడంసేత్తో పీకీగలిగినోడు, నిన్ను గుమ్మిడి కాయలు ముష్టి అడిగేడా? నువ్వు ముష్టి వెయ్యనన్నావా? అంచేత కోపవొఁచ్చి అబద్ధం కేసెట్టేడా?"

"ఔను" అందావంటే నీ కుంటాది. కాని నోరు రాదు. నాలిక తిరగదు.కాళ్లు సల్లబడిపోతాయి. కళ్ళు సీకట్లు కమ్మేస్తాయి. నీ వోదన అబద్ధవేఁమోనని– నీకే– అనుమాన మొచ్చేస్తాది.

ఆనక ఏటౌద్ది?

నీ వోదన పోద్ది.

ఖర్చుల్తో తడిసి మోపెడౌద్ది నీ అప్పు.

నిన్ను కాలిసీడానికి అరమోపెడు సాలు.

ఇంకా ఉన్నాయి గొప్పోడి ట్రిక్కులు.

ఆడు రోసానికి సింహం.

బలానికి ఏనుగు.

బుద్ధికి నక్క.

పగకి పాఁవుఁ.

బీదెదవల్లో ఎవుఁడేనా ఎదురు తిరిగినట్టు ఆడికి అనుమానం వొచ్చిందో మందుకొట్టేసిన ఎలుగ్గొడ్డు అయిపోతాడు. ఆడికాడ పదిరూపాయలు రాబట్టడం కోసరం–యెయ్యి కరుసు జేస్తాడు.

ఆడి బూఁవిఁ అమ్మించేస్తాడు.

ఆడ్ని జెయిలుకి కట్టించేస్తాడు.

ఆడి పెళ్ళాం నూతిలోకి గెంతీసీటట్టు జేస్తాడు.

ఆడి పిల్లలు ముష్టెత్తుకునేటట్టు జూస్తాడు.

ఇలా ఓ బీదోడ్ని నిప్పుల నూతిలోకి తోసేస్తే ఒక తరం ఏ బీదోడూ ఎదురు తిరగడు...

ఎయ్యి తరాలు–బీదోళ్ళంతా ఏకం కారు.

ఇదీ ఆడి అసలు వొజ్రాయుదం. ఆడి ఆటంబాంబు.

ఆడి ఆటలు కట్టించాలంటే బీదోళ్ళంతా ఏకం కావాలి. ఎక్కడ ఏ బీదోడికి అన్యాయం జరిగినా, అంతమందీ ఆడ్ని సపోర్టు జెయ్యాల.

బీదోళ్ళంతా ఏకవైతేఁ గొప్పోళ్లు యుద్ధానిక్కూడా రారు.

ఆ షాక్‌కి సచ్చేస్తారు.

## 34

ఈ మాటలన్నీ నాకు బాగా నెత్తికెక్కినాయి.

నాకంటె బాగా ఎక్కినాయి కుర్రోళ్ళకి.

అంతవరకూ ఊళ్లో పారిటీల్లో హుషారుగా తిరిగివోరు యిప్పుడు పారిటీలు ఒగ్గకోనేదు గాని–హుషారు తగ్గిపోనాది.

తవఁరుగోరు చెమించాల, నాను అసలు యిసయం సెప్పడం మరిసి పోనాను. మా ఊళ్ళో రెండు పారిటీలుండేయని సెప్పి నాను గదండీ!

ఏ పారిటీలోనైనా గాని–బీదోళ్ళ బతుకులు మామూలే.

ఏ పారిటీ పెద్దయినా సరే–ఆ పారిటీ బీదోడికి వొడ్డీ లేకుండా అప్పియ్యనేదు.

ఆకలేస్తే అన్నం యెట్టనేదు.

కూలి కూడా కాణీ ఎక్కువియ్యనేదు.

కష్టవొఁస్తే కాపాడనేదు.

మరైతే ఆళ్ళు ఏటి జేసేరు? జేసింది ఏటంటే–ఓ పారిటీ బీదోడు–అవతల పార్టీ వోళ్ళ సేతుల్లో సావుదెబ్బలు తినివస్తే – ఆడ్ని ఆస్పత్తిరికి తీసికెళ్ళడం–డాట్రుకి డబ్బియ్యడం– ఆడు కోరుటులో కేసుకెల్తే ఆడికి హోటేల్లో వొణ్ణం ఎట్టించడం– సినీమా సూపించి సారా పోయించడం–సాచ్చీకంనాడు ఆడికి కూలి డబ్బులు పోయినందుకు ఆడి సేతిలో ఐదో, పదో ఎట్టడం–

అంతే.

అంతకు మించి ఏ పెద్దా–జేసిందేఁవీఁనేదండి.

ఎనకటికి–"జరిగిన పెతి యిసయం సెప్పాలంటే శానా టయాం ఔద్ది" అందిటండి రంకుసేస్తూ దొరికిపోయిన ఓ ముండ. అలాగే పెతియిసయం జెప్పేనంటే తవఁరిగోరికీ యిసుగొచ్చే స్తాదండి.

నాకూ నాలిక పీక్కుపోతాదండి.

మరంచేత ముఖ్య యిసయాలే మనవి జేస్తానండి.

సిట్టిబాబు పావులారిటీ–సినీమా హీరోనాగ పెరిగిపోనాదండి.

ఆ బాబు మనసు మార్చుకొని ఎలక్సనుకే నిలబడి నాడంటే–పంచాయతీ పెసిడెంటేం కర్మ–ఎమ్మెల్యే అయిపోతా డనిపించిందండి.

ఆ బాబు బీదోళ్ళని వొరసగా నూతిలోకి గెంతీమంటే గెంతే స్తారండి.

వొణ్ణం మానీమంటే మానేస్తారండి.

పెళ్ళాల్ని ఒగ్గీమంటే ఒగ్గేస్తారండి.

పిల్లల్ని తనకి బలి యిచ్చీమంటే యిచ్చేస్తారండి.

యీ పెద్దోళ్ళ యిళ్ళకి అగ్గెట్టేసి, ఆళ్ళ నా మంటల్లో తోసేసి రండ్రా అంటే తోసేస్తారండి.

అలాగై పోనాదండి ఊరు.

కాని యీ యిసయం రెండు పారిటీలోళ్ళూ కనిపెట్టలేక పోనారండి.

"యీ సేవలు గోళ్ళని శానామందిర్ని జూసినాం. పదేళ్ళకో, పదిహేనేళ్ళకో యిలాంటాడు ఒకడొస్తాడు. ఐదేళ్ళో పదేళ్ళో సేవ జేస్తాడు. ఆనక పెళ్ళాం వొస్తాది. వొచ్చింది వొణ్ణం తిని ఊరుకుంటాదా? ఊరుకోదు.

ముందు కోకలంటాది.

అవొచ్చేక, అయి సిల్కుని కావాలంటాది.

సినీమా లంటాది.

సెవలకి తమ్మిట్లంటాది.

బోసిమెడాడది బాగుండాలంటే బట్టలు యిప్పేసుకోవాలి సిందే – మరం చేత మెళ్ళోకి మూడుపేట్ల గొలుసు కావాలంటాది.

తరవాత పిల్లల్ని కంటాది.

నువ్వూ, నేనూ సీకటడ్డాక ఏ సెట్లకిందో తొంగోగలం. గాని పిల్లల మాటేటి? అంచేత ఓ కొంప కావాలంటాది.

ఇల్లొచ్చేక, యిల్లు ఒట్టి కంచంలాటిది. అందులోకి వొణ్ణం కావాలంటే బూఁవిఁ ఉండాలంటాది."

అప్పటికి యీ సేవగోళ్ళంతా సేట్లు ఐపోతారు.

కాలంలో వున్న మొగోడికి పెళ్ళాం నేకపోతే పేదోళ్ళకి సేవంటాడు.

వొయసొచ్చినప్పుడు బుగ్గలమీద మొటిమలు వచ్చినట్టే యీ సేవ కోరిక కూడా పుడద్ది.

మొటిమలు ముప్ఫైఏళ్ళొచ్చీవరకూ ఉంటయ్యా?

ఉండవ్.

అలాగే యీ కోరికాను.

యీ డాౖటు ఏటి? గాందీగోరికంటె గొప్పోడు కాడు కదా? గాందీ గోరేటి జేసినాడు?

పెళ్ళాన్నీ, పిల్లన్నీ ఒగ్గేసినాడు.

ప్లీడరు ప్రాక్టీసొగ్గేసినాడు.

సేవ జేసినాడు.

మహాత్ముడనిపించుకున్నాడు.

అయితే ఆ బాబు బిరుదు కేటి యిలవ?

డబ్బు కరుసుపెట్టి, సబలు సేయించుకొని సినీమావోళ్ళు బిరుదులు పెట్టేసుకుంటున్నారా? నేదా? ఆళ్ళ బిరుదుల కెంత యిలవుందో ఆ బాబు బిరుదుకీ అంతే.

ఆ బాబుకా యిసయం తెలుసు.

ఎంత జెప్పినా ఆ బాబు కోవఁటోడు– అంచేత తెలివెక్కువ, అన్ని యిసయాలూ ముందే తెలిసీసుకున్నాడు. అందుకే ఒక్కటంటే ఒక్క ఎలక్సనుకి నిలబడినాడా? నేదు. ఎంచేత?

"సేవకి పెజ బిరుదులిస్తారు కాని ఓట్లియ్యరు.

అంచేత సిట్టిబాబుని సేవ జెయ్యనీ. అలాటోడు ఊళ్ళో ఉండడం మన్లాటోళ్ళకి మంచిదే. అలాటోడు ఊళ్ళో నేకపోతే పులావు అరగని ప్రెతీ ఓడూ పట్నం పరిగెత్త వొలసిందే" యిలాటి లెచ్చర్లిచ్చే వాడండి బుల్లిబాబు.

అడపా దడపా నన్నడిగీవోడండి "ఏరా? సిట్టిబాబుని ఎవ ర్తేనా ఇంకా తగులుకుందా లేదా?" అని.

మొదట్లో అయితే "ఆ బాబుకి ఆడ ఊసు అక్కర్నేదు బాబూ" అనీ వోడినండి.

కాని "మొగోడు  కాడేటో" అన్న బుల్లిబాబు మాటకి నా కొళ్లు మండి పోనాదండి.

మొగతనం సూపాలంటే ముండకే యెళ్లాలేటండి?

అన్నట్టు సెప్పడం మరిసిపోనానండి. ఆ మజ్జెన సిట్టిబాబు సిటీనుంచి ఓ మంతర్సాన్ని తెచ్చినాడండి పురుళ్లు పొయ్యడానికి, ఆ యమ్మ పేరు నర్సమ్మండి.

సూపుకి  యింపైనదేనండి.

మనిషి కూడా–మంచి సెలాకీగానే ఉండేదండి.

ఆ యమ్మ ఒచ్చినాక బుల్లిబాబు ఓ పాలి "ఏట్రా! పట్నం నుంచి మంతర్సాన్ని కొట్టుకొచ్చేట్ట–ఏటి యవ్వారం?" అనడిగినాడండి..

"బాబూ, సిట్టిబాబు సేవల మడిసి అవుతే అవొచ్చుగాని నర్సమ్మ కాదు. పగలు పేదోళ్ళకి పురుళ్ళు పోసినంత మాత్త రాన–కాలంలో ఉన్న గుంటకి రేత్తిరి నిద్దర పడతాదా? పట్టదు.

పక్కగదిలో పడుసోడున్నాడంటే కన్ను ముయ్యకుండానే కలలొస్తాయి దానికి. అంచేత ఓ నెల జూస్తాది, రెణ్నెల్లు జూస్తాది – మరియాదగా సిట్టిబాబు తన రెక్కట్టుకుంటాడా నేదా అని. అట్టుకున్నాడా మంచిదే. నేకపోతే యిదిగో బాబూ–పులి మేకపిల్లని మెడ కరుసుకొని అడవిలోకి ఎత్తుకుపోయినట్టు–ఆ గుంట ఆ బాబు పీక పట్టుకొని మరీ పక్కమీదికి లాక్కుపోద్ది. తఁవఁరుగోరు దయిర్యంగా ఉండండి. ఒక్క నెల్లాళ్ళాగండి. ఆళ్ళ “డైరీ” నేను రాస్తాను అనీసీనానండి.”

మా బాబు తెగ సంతోషించీసినాడండి.

కొన్నాళ్ళు పోయ్యేక మా బాబుతో “నిన్న సాయంకాలం ఆళ్ళిద్దరి చేతులు పట్టుక్కూకున్నారనీ, నన్నుజూసి ఒగ్గేసేరనీ” అబద్దవోడి నానండి. మరో వారానికి– ఆళ్ళిద్దరూ ముద్దులు పెట్టుకుంటున్నారనీ, నన్ను జూసి కూడా మాన్లేదనీ మరో అబద్ద వోడినానండి.

అబద్దం పాపమఁని తెలుసు బాబూ. అయినా బుల్లిబాబుని ఏడిపించడానికి అలా అబద్దా లాడాలనిపించిందండి.

## 35

ఇలాగుండగా ఓనాడు–ఒకటికాదు–రెండు యిసిత్రాలు జరిగి పోనాయండి. సినీమాల్లో సూపెడతారే–అదిగో అలాగ ఒక్కపాలే జరిగినాయండి.

అలాటియి యిదివొరకూ జరిగినాయండి–కాని సిట్టి బాబొ చ్చేక తొలిసుట్టు–జరగడం ఆయేళేనండి.

ఒకటేటంటే–

ఇస్సినాదంబాబని–మోతుబరి రైతేనండి–బుల్లిబాబు పారిటీ వోడండి–ఆ బాబుకి దేఁవుఁడితోటని ఓ కొబ్బరితోటున్నాదండి. తోటంటే తోటగాదు బాబూ–సల్లగా యిలా గెలాగుండీ దంటే –తోట్లో అడుగెట్టగానే–నాలాటోడి క్కూడా తపస్సు జేసువా కోలనిపించీదండి. ఆ తోట యిష్టరీ సాలా ఉందండి. రాస్తే పది పుస్తకాలకి తక్కువ అవదండి.

అది మొదట్లో దేవుడి మాన్యవటండి. యిస్సెనాదం బాబు తండ్రి దానికి దరమకర్తటండి–కలిపీసుకున్నాడటండి–పూజారిని కొనీసినాడటండి–కలకటేరాఫీసులో రికార్డు చింపించీసి నాడ టండి–దేవస్తానంమీద దావాయేసి–అవతల ప్లీడర్ని కొనీసి – దావా గెలిచీసి తోట కలిపీసుకున్నాడటండి.

ఇస్సెనాదం బాబుకి ఎంతాస్తుందంటే తనబాబు సేసిన పాపానికి–తన మిగతా ఆస్తంతా దేఁవుఁడికి దానవిఁచ్చేసినా – యీ ఒక్క తోటమీద బతికీగల్డు మనవఁల్లో సహా.

ఆ బాబు పంచాయతీ నెంబరు కూడానండి. సొంత అన్ననే ఓడిం చీసినాడండి– ఎలక్సన్లలో–సెప్పేనుగదండి ఆ బాబుకో తోటనీ, ఆ తోట కాపలావో డెవడనుకున్నారూ? రాఁవుఁడని – మన మాయల పకీరుగోడి పెత్తాత మనవడండి–ఆడు తోట్లోనే గుడిసేసుకొని పెళ్ళాం, పిల్లల్తో ఉండీవోడండి–ఆడి కిద్దరు పిల్లలు. పాపం యీ మద్దెలే ఓ కొడుకు సచ్చిపోనాడు పొంకరిసి – పదేళ్ళుంటాయేమో గుంటడికి.

ఓనాడు–సాయంకాల వేళ–యింకా సీకటిపడనేదు – వొరిసేను కోత పూర్తి చేయించేసి వొస్తన్నాట్ట యిస్సినాదం బాబు – గుమాస్తాతోటీ–కూలీల్తోటీ. వొస్తా వొస్తా తోవలో–తన తోట్లోకి జొరబడినాడట. తోటలో అటూ యిటూ కాలుగాలిన పిల్లిలా తిరిగి, తిరిగీ–రాలిపోయిన కాయలు సూపించ మన్నాడటడండి రాఁవులుగోణ్ని.

రాఁవుడు సూపించేడటండి.

సూసినాక–కాలు కాలుకాలిన పిల్లిలా గాదు బాబూ–పులిలా మళ్ళీ తిరిగినాడటండి.

తిరగడం అయిపోయినాక సెట్లనున్న కాయులు లెక్కెట్టమన్నాట్ట గుమస్తాని.

గుమాస్తా పదిసెట్లు లెక్కెట్టి “ముప్పయి కాయలు తక్కు వొచ్చినాయ్?” అన్నాడటండి.

“రావుఁడూ, ముందా ముప్పయి కాయలూ తేరా. మిగతా వోటి సంగతి తరవాత సూద్దాం” అన్నాట్ట యిస్సినాదం బాబు.

“అమ్మతోడండి. నాకు తెలవదండి” అన్నాట్ట రాఁవుఁ డుగోడు.

“అయితే గుమస్తా అబద్దవాఁడే దంటావా? నేకపోతే అత గోడికి లెక్కలు రావంటావా?” అనడిగినాట్టండి ఆ బాబు.

“నాను రొండూ అనను బాబూ–ఆ బాబెందుకు అబద్ధవాఁ డతాడు?కాయలేటైనాయో నాకు–సత్తె పెమాణకంగా తెల్దు బాబూ. కొబ్బరిసెట్టు ఎలకెక్కినా నెగిసి జూస్తున్నాను బాబూ. ఏ రేత్తిరి ఏ యెదవ నా కొడుకు దింపీసినాడో కాయలు” అన్నాట్ట రాఁవుఁడుగోడు.

అంతవొరకూ కొబ్బరిసెట్టు కాయలకి లెక్కలుంటాయని నాకు తెల్దుబాబు.

"నిన్నెందు కెట్టుకున్నాను?" అడిగినాట్ట యిస్సెనాదంబాబు.

"కాపలాకి" అన్నాట్ట రాఁవుఁడుగోడు.

"నువ్వేటి సేస్తన్నావు?"

"కాపలా పని."

"దొంగలు పడ్డారా తోట్లో!"

"నేదండి."

"నాను బెల్లం ముక్కట్టుకుని సెట్టెక్కి కాయలు–బెల్లం నంజుకుని తినీసినానా."

"నేదండి."

'కాయలు తినేసినావా? అమ్మీసినవా!"

"నాను దింపనేదండి."

"కాయలకి కాళ్ళొచ్చినాయా? రెక్క లొచ్చినాయా?"

"నాను దింపనేదండి."

"కాయలకి కాళ్ళొచ్చినాయా? రెక్క లొచ్చినాయా?"

"ఆ మాట నా నన్నండి."

"మరి కాయలేవిరా యెదవనంజ కొడకా?"

"నాకు తెల్దు బాబు. మీ పాదాల మీదొట్టు."

"నా కాళ్ళమీదొట్టు యెదుతున్నావు. నా కాళ్ళు పడి పోవాలఁ్రా బోసిడికే? కాయలన్నా కక్కు, డబ్బన్నా కక్కు."

"నాను తియ్యనేదండి. నా కేటీ తెల్దు బాబూ."

మిగతా సెట్లకాడ కాయలు నెక్కెడుతున్న గుమాస్తాయేపు తిరిగి "యింక కాయలు లెక్కెట్టకు. యీడి దెబ్బలు లెక్కెట్టు" అని ఓంఁద్రపెట్టినా డటండి యిస్సెనాదంబాబు.

ఆ తర్వాత అక్కడున్న కూలీలసేత గుడిసెలోంచి రెండు కొబ్బరి తాళ్ళు తెప్పించినాట్ట. ఒకదాంతో రాఁవుఁడ్ని సెట్టుకి తనే కట్టేసినాడట. అంతవరకే కూలోళ్ళు సమంగా సూసినారట. తరవాత ఆళ్ళ కళ్ళు జిమ్మని పోనాయిట యిస్సినాదం బాబు రావుడ్ని కొట్టిన దెబ్బలకి.

రావుడ్ని దెబ్బల్తో ఆసుపత్తిరికి తీసుకొచ్చేసరికి నా నక్కడే ఉన్నానండి. సిట్టిబాబు ఆస్పత్తిర్లో జేర్చుకొని వొయిద్యం జేసినాడు బాబు.

రావుఁడిగోడికి కట్లు కట్టి ఓ యింజీషను యిచ్చేడో లేదో – గొల్లుమంటూ వచ్చినారు మరికొందరు కూలోళ్ళు. ఆడోళ్ళూ, మొగోళ్ళూ అంతా కలిసి ముప్పైమంది ఉంటారండి. ఆళ్ళగోలకి కొంపలంటుకున్నాయేమోనని, మాం బయటికి పరిగెత్తి కెళ్ళీనావండి.

యేటి జరిగిందఁ్రా అంటే ముప్పైమందిరీ ఒక్క సుట్టే మొదలెట్టినారండి కత. ఇలా లాబంనేదని అందులో ఒకడ్ని–తెలివైనోడ్ని–పిలిసి సెప్పమన్నాం కత. ఆడి కత సెప్పే ముందు తఁవఁరిగోరికి రామనాదంబాబు కత కుసింత చెప్పాలండి. ఆ బాబు మా పారిటే–అంటే బుల్లిబాబు పారిటీ మడిసేనండి. శానా బూఁవుఁలున్నాయండి అతగోడికి. అతగోడి పిన్తల్లి కూతురు ముండమోసినదాన్ని యింట్లో ఎట్టుకున్నాడండి. అన్నవొరస–ఆ బాబు సేరదియ్యకపోతే యింకెవరు సేరదీస్తారండా యమ్మని.

ఆ యమ్మ ఓ ఏడాదిపాటు సచ్చిన మొగుడికోసరం యేడుస్తూ కూకున్నాదండి. అప్పటిగ్గాని ఆ యమ్మ కరదం అవనేదండి– ఏడిస్తే మొగుడు రాడని. మరంతే, మొగుడి యేట ప్రారంభించినాదండి. యీ సంగతి ఎలా క్కనిపెట్టేసినాడో గాని, మొత్తానికి కనిపెట్టేసినాడండి, రామనాదం బాబు.

ఆ బాబిలాటి యిసయాల్లో ఎకస్పర్టు.

మూర్తం (శోబనం) నాడే జెప్పీగల్డు కడుపెప్పుడొద్దో.

ఆ బాబుకి దరమబుద్ధిలేదని నానన్ను–ఆ పాడుమాట నానెందుకనాలండి?

కాని ఏ మాట కా మాటే సెప్పాలండి. ఆ బాబు "యీవిడ గోరు సచ్చిన మొగుడి కోసరం–అందరికంటే మరో ఆర్నెల్లు ఎక్కువే ఏడిసినాది. యిప్పుడూ యింకా ఏడుసును–వొయసు అడ్డురాకపోతే.

ఇప్పుడూ ఏడుస్తున్నాది పేనం వున్న మొగుడికోసరం.

దీని వొంటికి వొయసుంది.

సేతిలో ఆస్తున్నాది.

ఇలాటిది మొగుడు కావాలంటే ఊరి మొగోళ్ళంకా 'క్యూ' లో నిలబడిపోతారు.

తక్కువ కులపోడు తగులుకున్నాడంటే కడుపులు దించనేక నాను సావాల.

ఎక్కువ కులపోడు తగులుకుంటే మాత్తరం ముందు మడిసినీ, ఆనక ఆస్తినీ తన్నుకుపోయి, ఆస్తి రాయించీసుకుని, గుండు గీయించీసి మల్లుపంచె సుట్టబెట్టి మళ్ళీ నాకాడికే పంపించేస్తాడు.

మరంచేత మడిసినీ, ఆస్తినీ కాపాడుకోవాలంటే ఒకటే మారగం."

యిలా గనుకున్నాక ఏటి సెయ్యకూడదో–స్సి! స్సి!! సెల్లెలు వొరస– అదే జేసినాడండి.

అదీ ఆ బాబు కత.

మళ్ళీ ఎనక్కెళ్ళాలంటే– ఆ కూలోళ్ళలో ఒకడ్ని కత సెప్ప మన్నాం కదండీ.

ఆడు సెప్పిన దేటంటే–

ఆయేళ కూడ ఆళ్ళంతా మామూలుగా కోత కోసినారట.

ఇంతకుముందు కోసిన పంట కళ్ళంలో నూర్పు ఔతన్నాదటండి. కళ్ళం పాకలో రామనాదంబాబు తొంగున్నాడటండి–కుసింతసేపు–కోతా, నూర్పూ ఒక్కపాలే అయిపోయి నాయిటండి.

పాలికాపులు గింజలకా దున్నారటండి.

రంగనాదంబాబే కూలీల్ని ఒకరొకర్ని పాకలోకి పిలిసి కూల్డబ్బులు యిచ్చినాట్ట. డబ్బులియ్యడం అయిపోనాక ఆ బాబు పాక బయటికొచ్చి నిల్చున్నాడటండి. అప్పుడే పాలికాపులు సుట్ట కాలుసుకోడానికి పక్కకి తప్పుకున్నారటండి.

ఓ కూల్ది–మల్లమ్మండి, దానిపేరు– శేరు దాన్యం కొంగుని కట్టుకుంటూ ఆ బాబు కళ్ళపడిపోనాదట.

అంతే

ఆ బాబు సల్లగా, సప్పుడు నేకండా–కప్ప కాడికి పాంచుం పాకిరినట్టు–ఎల్లి–దాని కో కిప్పీసి–అందులో గింజలు కుప్పలో పోసీసి–దాని కోక మొహాన కొట్టి–కట్టుకోకుండా ఊరివొరకు నడవమన్నాడటండి. దొంగతనం సేస్తూ దొరికిపోయిన ముండ! అదేటి సెయ్యగలదండి?

పులొచ్చి లేడిపిల్లని కుంటమంటే కుంటక ఏటి జేస్తాదండి?

ఒక పక్క బగ్గీల్లేని పులిలాగ ఆ బాబు–

మరోపక్క కూలీలు ఆడా–మొగా–

యీళ్ళతోటి–సిరిగిన కోకతో–

పోయిన మానం కాపాడుకుంటూ–

కుక్క ఎంట తరువుతున్న సెవంల పిల్లిలా,

యీ సెట్టు సాటుకీ,

ఆ తుప్ప ఎనక్కీ

పరిగెత్తినాదటండి.

యిచిత్రం ఏటంటే అది ఏడనేదటండి.

ఏడ్డానిక్కూడా దాన్లో సిగ్గు మిగల్నేదటండి.

ఊరు దగ్గరవుతుందనగా "యిక కోక సుట్టుకోయే" అన్నాడటండి రామనాదం బాబు.

అది కోక కట్టుకుంటూ వుంటే మొగ కూలీ లెళ్ళిపోనారటండి.

కోక కట్టుకున్నాక అది నూతిలోకి గెంతేస్తానన్నదిటండి. కాని దానికి తోడున్న ఆడకూలీలు దాన్ని సావనివ్వనేదుటండి.

"సస్తే నీ కూతు రేటౌద్ది?" అని అన్నారటండి.

మల్లమ్మ దొంగముండే–నాను కాదన్నండి.

అదీ కాదన్దు.

దాని వొయసు నలభై ఏళ్ళుంటాయండి.

ముండమోసి పదేళ్ళౌద్దండి.

దాని మొగుడు–బంగారిగాడని–ఆడు దీన్ని రోజూ సాకిరేవు ఎట్టినట్టు ఉతికీసీ వోడండి తాగడానికి డబ్బులివ్వమని. దాని కూలిడబ్బులు తిండికే సాలవు. మరింక తాగుడికి ఎక్కడ్నుంచి తెస్తాదండి? అంచేత ఆడి కోసం దొంగతనాలు జేసీదండి.

ఆడు సచ్చేక కూతురికోసం జేస్తన్నాదండి.

దానికూతురు–చెల్లమ్మని–పాతికేళ్ళుంటాయండి – మూడేళ్ళ కిందట వొరకు ముగ్గురు మొగాళ్ళని సింకిగుడ్డలు ఉతికినట్లు ఉతికీగలిగిదండి.

ఏ దుక్కైనా–దూలమైనా సరేనండి. అటు యిద్దరు మొగాళ్ళు పడితే, యిటు యిదొక్కర్తీ వట్టీసీదండి. కాని పాపం! మొన్న సంకురేత్తిరికి మూడేళ్ళౌద్దండి–అప్పుడది మూడో నెల బాలింతరాలు. సంకురేత్తి రొస్తన్నాది కదా, యిల్లు అలుక్కుందావంని ఊరవతల గోతిలో ఎఱ్ఱ మన్ను తవ్వుతున్నాదండి–ఒంగి తవ్వుతున్నది మరి లేవనేదండి. దాని నడుంమీద–మట్టిపెళ్ళ బండరాయిలాగ పడిపోనాదండి.

దాని నడుం సెరుగ్గెడనాగ పుటుక్కున యిరిగిపోనాదండి.

మరంతేనండి పాపం!

అప్పటి కాడ్నించి మంచంమీదే ఉంటున్నాదండి. దాని మొగుడు మూడ్నెల్లు సూసి బండిమీద పుట్టింటికి తోలీసినాడండీ.

యింక యీ మల్లమ్మ ముండ కన్నకడుపు కదండి? ఎలా ఒగ్గెస్తాదండి? దాని అర్జన దాని కడుపుకే సాలనప్పుడు యింక యీ కుంటికూతురి మాటేటి? మూడేళ్ళ మనవఁరాలి మాటేటి? ఆ మూడు ప్రాణాలు నిలబడలంటే మరి అది దొంగతనం కాక దొరతనం చేస్తాదేటండి?

యిదీ ఆడు సెప్పిన కత.

యీ రెండు కతలూ యిన్నాడు సిట్టిబాబు.

## 36

కతలు రెండూ యిన్నాడని సెప్పినానా?

కేసెట్టక తప్పదన్నారు కూలోళ్ళు.

కేసు పోక తప్పదన్నాడు సిట్టిబాబు.

"ఇప్పుడు తోకమీద నిలబడినోళ్ళే, రేపు తోక ముడిచేస్తారు. ఇప్పుడు కళ్ళారా జూసినోళ్ళే, కోరట్లో మాం అక్కడ నేఁవంటారు. కాకపోతే రాఁవుఁడుగోడు కొబ్బరి సెట్టెక్కి సరదాకి గెంతీసి నాడంటారు.

మల్లమ్మ మదం ఎక్కువై కోకిప్పుకుని గెంతినా దంటారు.

ఆ బాబులు ఆళ్ళచేత అలాగే జెప్పించీగల్రు.

డబ్బిచ్చి జెప్పిస్తారు.

బయపెట్టి జెప్పిస్తారు.

"మీ కూలోళ్ళలో యింకా కట్టు సాల్దు" అనీసినాడా బాబు.

కాని కూలోళ్ళొగ్గనేదు.

నాయం జరగాలన్నారు.

ఎలా జరగదో చూస్తావఁన్నారు.

కోరట్లో నిజం చెప్పకపోతే ఊరొగ్గేస్తావఁన్నారు.

"నిజం చెప్పేక ఊళ్ళో ఉండలేకపోయినా ఊరొగ్గేస్తావన్నారు."

"నువ్వు సిటీ కొచ్చి రెండు సురకల్లాటి కేసులు తగిలించు – మిగతాది మాఁవుఁ జూసుకుంటాం" అన్నారు.

రావుఁడుగోడు "కేసెట్టండి–కేసు పోతే–ఆ లంజికొడుకు నన్ను తోటలో సెట్టు క్కట్టినాడుగాని–నాను ఆడ్ని పబ్లిగ్గా – రచ్చబండకాడ రావిఁసెట్టుక్కట్టీసి–ఆడ్ని నాను కొట్టను. ఆడి బట్టలిప్పీసి ఒంటికి తేనె రాసీసి–ఒగ్గేస్తాను.

అంతే. మర్నాటికల్లా ఆడు బతికుండగానే సీఁవలు పట్టీసి – అయ్యేసంపెయ్యాలన్నమాట.

ఆ లంజికొడుకుని యిడిపించడానికి ఊరు పెదబాబులంతా దిగినా–పదిమందిర్ని ఏసి–మరీ సస్తాను" అన్నాడు.

"మానం పోయిన ముండని–పేనం ఉన్నా లేనట్టే–మీరంతా కేసెట్టి నన్నేటి సెప్పమన్నా సెప్తాను. ఈ ఊర్లో యిప్పుడు పరవాఁన్నం తినేస్తున్నానేటి? ఈ ఊరొగ్గేస్తే పస్తులుండాలని బయ పడ్డానికి? కాని–ఒక్క మాట–ఆ బాడుకోవోడికి సిచ్చ పడినా –ఒగ్గేసినా–నా కొక్కటే.

నాక్కావలసిందల్లా ఒకటే–ఢిల్లీ గేదెలా గుంటాదే ఆడి పెళ్ళాం –అదిగో అది, యిత్తనాల పోతులా గుంటాదే ఆడికూతురు –అదిగో–ఆళ్ళిద్దర్నీ జుత్తు లట్టుకుని రచ్చబండకాడికి యీడ్చి – ఊరందరి మద్దిల–ఆళ్ళ కోక లిప్పీసి కూకో పెట్టకపోతే–నా పేరు మల్లమ్మే కాదు" అంది మల్లమ్మ.

అది మాట్లాడక ముందు–జూస్తే–యిది బతికుందా? సచ్చి పోనాదా అన్న అనుమానం వచ్చినట్టుంది. కాని మాటాడు తున్నంతసేపూ దెయ్యంపట్టిన దాన్లా అయిపోనాది.

"మరిప్పుడు నీదే బారం. నువ్వేటి జేప్తే అది సేస్తాం.

ఊరొగ్గీసి పొమ్మంటే పోతాం.

అగ్గిలోకి గెంతమంటే–గెంతేస్తాం.

కాని–ఆ ఇద్దరు లంజకొడుకుల్నీ జైలుక్కంటించాల నువ్వు" అన్నారు కూలోళ్ళు సిట్టిబాబుతో.

"మీరేటి జేద్దామనుకుంటున్నారు? అది జెప్పండి ముందు" అన్నాడా బాబు.

"కడుపుతో ఉన్నది–మంతర్సాని ముండని కనమన్దు కదా! యేటి సెయ్యాలో సెప్పాల్సింది నువ్వు" అన్నాడో కుర్ర నంజి కొడుకు.

"పోలీసు రిపోర్టే యిస్తావో కోరట్లో కేసే ఎడతావో–నీ యిష్టం. ఇంక డబ్బుంటావా– ఎంతకావాలో జెప్పు–

ఇప్పుడెలాగూ ఓ పూట వస్తుంటున్నాం కదా. రెండు పూట్లా పస్తులుండైనా సరే నువ్వెంత కావాలంటే అంతా నీ కాళ్ళకాడ పడేస్తాం.

యీ కేసులు పోవు.

పోడానికీల్లేదు.

యిందులో పిసరంతైనా అబద్ధం ఉందేటి? కలికాలంతో దరమ దేవత ఒంటికాలిమీద కుంటుతాదంటారా? ఒంటికాలి మీద కుంటక్కర్లేదు. నిలబడితే సాలు ఆ బాడుకావోళ్ళకి సిచ్చులైపోతాయి.

యీ కేసులుగాని పోయేయో–దరమ దేవతకి కుంటడాని కైనా, పరిగెత్తడానికైనా, రెండు కాళ్ళుంటాయో–నాలుగు కాళ్ళుం టాయో–తెల్దుకాని దానికి పేణంవే నేదని రుజువై పోద్ది" అన్నారు మాలోళ్ళు.

అంతవొరకూ తపస్సులో కూర్చున్న మునిలా కళ్ళు మూసు కొని వింటున్న సిట్టిబాబు కళ్ళిప్పేడు. అప్పుడా బాబు కళ్ళు సూడ్డానికే బయవేసింది.

సీకట్లో సిరతపులి కళ్ళలా ఉన్నాయి.

ఆ బాబు గుండెల్లో మంటంతా కళ్ళల్లోకి ఎక్కిపోనాది.

అయితే మాటలు మాత్తరం శాంతంగానే మాట్లాడుతున్నాడు.

"ఇది డబ్బునోడి రాజ్జెం.....అంటే బీదోడికి – బతకడాని క్కూడా ఈల్లేదన్నమాట.

కోరట్లో ఐనాసరే, కూరల మార్కెటులో నన్నాసరే, డబ్బునోడిదే మాట–ఆడు జెప్పిందే సత్తెం.

ఆడి వాక్కు వేదవాక్కు.

మీరనే దరమదేవత ఆడి పక్కనే. ఆడి మొదటి పెళ్ళాంలా – నిలబడుంటాది.

లచ్చింతల్లి ఆ తొత్తుకొడుకుని వొరించేసినాది.

సరస్వత్తల్లి ఆడి నాలికమీద దసకత్తు జేయిస్సిన్నాదన్న మాట.

ఆడు బలంవోడుకొని, డబ్బు కరుసెట్టి–

పుల్ని పిల్లిని సేసీగల్డు.

ఆడి రాజ్జెంలో–ఆడ్ని–ఎవ్వరూ–

మినిస్టర్లు. ఎమ్మెల్లేలు, పోలీసోళ్ళు, జెడిజీలు, ఆళ్ళూ – యీళ్ళూ కాదు–బగమంతుడు కూడా ఏటీ సెయ్యలేడు.

ఆడ్ని కుట్టిన తేలుకి తోకూడిపోద్ది.

ఆడ్ని కరిసిన పావుఁకి పేణాలు పోతాయి.

ఆడు–యిడుగో–యీ రావుడిగోడి తోలు తీసీసినాడు. యీ డాడి మీద కేసెడతా దనుకుండారి.

ఆడేటి వోదిస్తాడంటే–

ఆ నేరమప్పుడు తనక్కడ లేనంటాడు. ఉన్నా రావుఁడుగోడే తెగ తాగీసి–ఆడ్ని నానా బూతులూ తిట్టి–ఆడు బూతులు, కేసెడ తాడన్న బయానికి వొళ్ళంతా తనే కొరడాతో కొట్టీసుకొని –తప్పుడు కేసెట్టేడంటాడు.

ఆడి ప్లీడరు కొత్త కార్లో కోరటు కొస్తాడు.

ఈడి ప్లీడరుకి కారా కిల్లీ కొనుక్కోడానికి కూడా కాణీ జోబీలో ఉండదు.

ఆడి సాచ్చులు గొప్పోళ్ళు, సదువుకున్నోళ్ళు, మరింక ఆళ్ళు అబద్దాలాడేరంటే–అవి నిజమేనేమోనని ఆళ్ళే నమ్మేసేటట్టుం టాయి. అంత బాగా అబద్దాలాడగల్రు.

ఇంక యీడి సాచ్చులు ఒట్టి బీదెదవలు.

పెళ్ళాం పేరడిగితే, గాబరాపడిపోయి పక్కింటోడి పెళ్ళాం పేరు చెప్పీ రకం.

నువ్వు "గవర్నమెంటు గజెటు" కోరటుకి అట్టుకెళ్తే అది పోర్జరీ అని నమ్మించీగల్డు ఆడు.

ఆడి పోర్జరీలు మాత్తరం–కోయంబత్తూరు నోట్లలా సెలామణి అయిపోతాయి.

ఇంక జెడిజీలు అంటావా–ఆడి ప్లీడరు ఆర్గుమెంటు సెప్తూ వుంటే బూతుపాట ఇన్నంత శ్రద్ధగా యింటారు.

యీడి ముష్టి ప్లీడరు సెప్పీ సింకి ఆర్గుమెంటు మంచి జెడిజీ అయితే యింటాడు. సెడ్డ జెడిజీ అయితే యిన్నట్టు నటిస్తాడు.

ఆళ్ళు యిన్నా యినకపోయినా ఆ ఆర్గుమెంటుకి సింకి కాయి తానికున్న యిలవకూడా ఉండదు.

గొప్పోడు తీసే గొయ్యి ఎలాగుంటాదంటే–మనం అందులో పడినా అది గొయ్యి అని మనకి తెల్దు. ఆ గొయ్యి బూఁవిఁలో కట్టిన మేడలా అగుపడుద్ది మనకి.

గొప్పోడి రాజ్జెం అంతం అయ్యేవొరకూ, కోరటూ ఆడిదే – గవర్నమెంటూ ఆడిదే.

ఇక్కడో మాలోడూ-అక్కడో కూలోడూ తిరగబడి నాబంనేదు.

తిరగబడ్డోడు తగలబడిపోతాడు.

దీపాన్ని అరపాలంటే-ఒక్కొక్క పురుగూ ఎల్తే దాని రెక్కలే కాల్తాయి. కాని దీపం మాత్తరం ఎలుగుతూనే ఉంటాది.

వొంద పురుగు లెళ్ళి ఒక్కసారే మీదపడితే-పది సచ్చినా - దీపం ఆరిపోద్ది.

తొంబై పురుగులు సుకపడ్తాయి.

ఇప్పుడు నేనేం చెప్పినా నా మాట మీరు ఇనరు. నాను కేసు లొద్దంటే-నానుకూడా గొప్పోళ్ళ పారిటీలో కలిసిపోనానని యియ్యేళ గాక పోతే రేపన్నా అంటారు.

కాని-ఓ రకంగా కేసులెట్టడం కూడా మంచిదే. నాను చెప్పే యీ 'తీరీ' (తియరీ) మీకు నడినెత్తికి ఎక్కుద్ది. కేసులు సంకనాకి పోనాక-సిటీలో నాకు తెలిసిన ప్లీడరున్నాడు. అతగోడికి ఉత్తరం యిస్తాను. పట్టుకొని ఎళ్ళండి" అన్నాడు.

అన్నాక ఎంటనే ఓ ఉత్తరం బరికి రాంవుండిగాడి సేతిలో ఎట్టినాడు. అన్నట్టు సెప్పడం మరిసిపోన్ను. ఇదంతా జరిగి నప్పుడు మా యాదది-సిట్టిబాబుకాడే ఉంది. కడుపులో నొప్పి వచ్చి మందు కెల్లినాదట. ఇదంతా ఇన్నాక దానికి కడుపు లేకుం డానే పురు డొచ్చీసినట్లయిపోనాదట.

రేత్తిరి కూడు కెళ్ళినప్పుడు, దాన్ని జూస్తే నాకే బయం ఏసి పోనాది. ఈనిన పులిలా వుంది మనిషి. అంతవొరకు దానికి "పోలిటిక్సు'లో యింటరెస్టు నేదు. బీదోళ్ళు బాదలు పడ్డానికే పుడతారని ఒప్పేసుకొని బతికేది.

ఆ రేత్తిరి దాన్ని జూస్తే నక్సలైటై పొద్దేమోనని జడిసిపోన్ను.

అన్నాయం మీదో 'లెక్చరూ' అదరమం మీద ఓ 'స్పీచీ' దంచీసినాది.

దంచీసినాక 'సి.స్పీ. యిదేం రాజ్జెం? దుర్యోదను డంతటోడు ఆడదాని కోక యిప్పించబోతే-నానా సంకులు నాకినాడు. అలాం టిది-యీ 'సువ్వర్ కా బచ్చా' గోడు-పోస్టు కవరిప్పీసి నట్టు కోకిప్పేస్తాడా? మల్లమ్మ ముండ ఆడికి యీడా? జోడా? సీరిప్పి సొగసు జూడ్డానికి?

దానికి దయిర్యం నేకపోనాది కాబట్టి-బతికిపోనాడు. నా నైతేనా? ఆడి పేగులు పీకేసి-మెళ్లో యేసుకొని-కోకిప్పుకొని మరీ దణ్ణం ఎట్టించుకుండీదాన్ని. దణ్ణం ఎట్టించుకున్నాక - మరింక జెనమలో ఆడికి-ఆడా-మొగా తేడా తెలకుండా ఆడిగుడ్లు పీకీసీ దాన్ని.

ఆడు కాద్సరి కదా-ఆడి మనవఁడు కూడా - పరాయి దాన్ని కాదు-ఆకరికి పెళ్ళాన్ని కూడా మళ్ళీ కోకిప్పమన కుండా జేయి స్సీదాన్ని.

కోకిప్పబోయిన కౌరవులంతటోళ్ళు కలికంలోకి కన పళ్ళేదు-యింకీళ్ళ మాటయేరే జెప్పాలా? ఈళ్ళకి నూకలు నిండు కొనీ రోజు లొచ్చీసినాయి.

సి.స్పీ. ఈళ్ళ కూడు తిండంకన్నా పస్తుండి సావడం నయ్యం. ఇంతన్నాయవాఁ?"

అలా మాటాడినంత సేపూ పిచ్చెక్కిన ఎలుగ్గొడ్డులా - ఊగి పోనాది. నిజం జెప్పాలంటే ఆ రేత్తిరి నాకూ వొణ్కం సయించ నేదు బాబూ.

## 37

"యేట్రా కెప్టెనూ! ఆ మల్లమ్మ లంజ "రేప్" సర్టిఫికెట్టు పుట్టిం చేసినాదేట్రా సిట్టిబాబు కాద?" ఆ రేత్తిరి అడిగినాడు మా బాబు.

పెట్రోలు పోసి వొళ్లు అంటించీసినట్టు అయిపోనాది నాకు. అంత వొరకూ ఆ బాబు ఏ ఆడదాన్నీ-లంజా-లండీ అనీవోడు కాడు. కోకిప్పినోడు మా పారిటీ పెద్ద కాబట్టి మల్లమ్మ లంజై పోనాది మా బాబుద్దేశంలో.

ఈ బాబు బుద్ధి యిదివొరకు సెడితే యిప్పుడు సెదపడు తున్నాదనిపించినాది నా మట్టుకు నాకు.

ఏటి సెప్దామా? అనాలోచిత్తావుంటే ఆ బాబే మళ్ళీ అడిగి నాడు "యేటి? కేసెట్టినాదేటి!" అని.

"కూతురికి కూదెట్టలేంది-అదేం కేసెడతాదండి" అన్నాన్నేను.

"ఆఁహాఁ" పీకల వొరకూ పులావ్ తిని తేనిపినట్టున్నాదండి ఆ "ఆఁహాఁ".

"కానండీ-పాతీసిన శవాల్ని- పీక్కొచ్చి - ఆటిజేత - కేసు లెట్టించీజెనం- తయారైనారండి- ఊళ్ళో" అని సల్లగా ఓ మాట కుట్టినాను.

'యెవుర్రా ఆ జెనం" ఆదుర్దా దిగమింగే అడిగినాడు.

"ఇంకెవరండీ? మీ ఓరసుల్లే-సిట్టిబాబూ-అతగోడి సిస్సు లూను" అన్నానండి మంట కొంచెం - రాజేద్దారని.

"నీ కెలా తెలుసురా?" అంతవొరకూ పడక్కుర్సీలో పడుక్కు నున్నోడు-నెగిసి-మేకు దిగ్గొట్టినట్టు-కూకున్నాడండి.

"ఆ కూ లంజి కొడుకులు-ఆ బాబుకాడికి - ఎల్లిన ప్పుడు - నా నక్కడే ఉన్నానండి. దెబ్బకి పలాస్ట్రీ..రాస్తే సాలన్నాడండి రావుడుగోడు. కొబ్బరికాయలు తను తీసుకున్నాననికూడా- ఒప్పీసుకున్నాడండి. అయినా ఆ సిట్టిబాబు-ఒప్పుకోనేదండి. ముండకాడి కెళ్తే-జబ్బు పెళ్ళానికి తగులుకున్నాదని సామెత - జెప్పినట్టు - కొట్టినా దొకడూ - తిన్నోడు మరోడూ-మద్దెల ఈ బాబు కెందుకండి వొంటి దురద? తవఁరుగోరు నమ్మరు - గానండి బాబూ -తపస్సు జేస్తున్న ఇస్సామిత్తురిళ్ళా- ఒంటి కాలు మీద నిలబడి పోనాడండి-ఆ తరవాత-రంబో-యెవర్తో అది-దాన్ని జూసిన ఇస్సామిత్తురిళ్ళా - ఒంటికాలు - దాన్సు - పేరంబించినాడండి. ఉన్నట్టుండి- "దేన్సు" ఆపి "హోత్తెరి-ఆ ఇస్సినాదం 'బంచాత్' గాడికి బూఁవిఁ యెక్కడ్నించొచ్చినాది? తోట ఎక్కడ్నించొచ్చినాది? అయిపడీసుకున్న ఆస్తులే గదా? వూరికి పెద్దదొంగ ఆడు. ఆడి దొంగకాయల్లో నాలుగు నువు తీసుకుంటే దొంగతనం ఎలాగవుద్ది? నిజానికి నువు జేసింది పోలీసు పని! ఇయ్యేళ-కోక తీసేసిన్నాదు-నువ్వూరుకుంటే-రేపు పెళ్ళాన్ని పక్కలోకి పంపమంటాడు-ఆడి పెళ్ళాన్ని అనుకునేవ్! నీ పెళ్ళాన్ని-నీ కాడ డబ్బు లేకపోతే నాతో జెప్పు-నాను యెడ తాను మదుపు-నీకు సాచ్చులు రాకపోతే నాతో జెప్పు-నాను జెప్తాను సాచ్చికం-బేపనోడు మంతరాలు సదివినట్టు మరీ జెప్తాను. నీకు ప్లీడర్ని పెట్టీపని నాది-ప్లీడరంటే - అలాటి లాటోడనుకున్నావేటి? ఆడి మొకం జూస్తే-"నక్సలైటు పోలీసోడు" గూడా- మూణ్నెల్లు నిద్దర మానేస్తాదు. ఆడి వోదన ఇంటే-ఇందిరాగాంధీ లాటిది గూడా మంచం ఎక్కీయాలన్న మాట-ఇలాటిషయాలన్నీ నా కొగ్గీ-ఆర్జునిడితో సీకుష్టమూర్త న్నట్టు- ఆకరికి-మేస్ట్రీటు కతికే రకవైఁతే ఆడికి లంచం పారీసీ పూచీ నాది-దరమామీటరూ పేషంట్లతో సహా-ఈ ఆస్పత్తిరి అమ్మీసి -యెంత కావాలంటే దానికి రెండు రెట్లు-ఇలా పిక్కమీద ఎంట్రుక-పీకి పారీసినట్టు-దిగదుడిసి మరీ పారేస్తాను. దొంగోడు దొరికిన్నాడే దుమ్ము లిరిసియ్యాల. అంతేగాని మరో పాలి-వొచ్చినప్పుడు జూసుకుందాం అని వొగ్గేసి నావోఁ-మళ్ళీ వొస్తాడు. రంకు మరిగినోడు నీలాటిరేవుని గాసినాడని - తప్పు కుండా మళ్ళీవస్తాడు గాని తుపాకీ పట్టుకొని మరీ వస్తాడు. వొచ్చి నీ ఇంట్లో యేఁవీఁదొరక్కపోతే-నీ పెళ్ళాన్ని పట్టుకుని మరీ-యెల్తాడు. అంచేత-ఆ ఇస్సినాదం నంజికొడుకు-ఆ నాగు పాపుగోడు- తలెత్తిన్నాడే-బుర్ర సిదగపొడిసియ్యాల - మరంచేత నా మాటిని-యెనకడుగు- ఎయ్యక." అని సంటి పిల్లోడుకి మనం మాటలుజెప్తావేఁ? అదిగో అలాగ-మరీ మరీ జెప్పి - బోదపరిసి- ఆడి సేతిలో ఇన్నినోట్లూ-ప్లీడరికో ఉత్తరం ఎట్టి నాడండి. అలాగే మల్లమ్మ ముండని గూడా రెచ్చగొట్టినా దండి -"నువ్వు కూడా-ప్లీడరు కాడికి-ఆ బాబు మెడికల్ సర్టిఫి కట్టులు కావాలని అంటే నాతో వొచ్చి జెప్పండి-తాఁవఁర జబ్బు గోడు తొడ బకురుకున్నట్లు-యెన్ని సర్టిపికెట్లు గావాలంటే-అన్నీ బకిరేస్తాను" అన్నాడండి. ఈ కేసుల్తో-ఈ ఊర్ని-రష్యాలోనో- చెయినాలోనో -కలి పేస్తాడటా బాబు-" అని అబద్దాలు జెప్పే నండి-ఎందుకు జెప్పినావు-అని అడిగితే-నాకే తెలదండి - అప్పుడు నా కదుపు-ఇలా గెలాగ-ఉడికిపోనాదంటే-నేటి జేస్త న్నానో-యేటి మాటాడుతున్నానో-నాకే తెలదండి.

"రాఁవఁనాదం మన కుడిబుజవేఁ" అన్నాడండా బాబు - పడక్కుర్చీలో ఇలా జావకారి పోతున్నట్టు - కారిపోతూ.

"ఎడం కాలైనా-కుడి బుజవైనా-కేసు తప్పేటట్టు నేదండి" అని ఓ బంకం ఏసినాను.

"అతగోడు-జెయిలు కెళ్ళదానికీల్లేదు" అన్నాడండి.

"జెరిమానాతోటి సరిపోయిటట్టు-సూద్దురుగాన్లెండి" అని దయిర్యం చెప్పినానండి-సీకటి కాబట్టి సరిపోనాది గానండి - బాబూ-నేకపోతే-నా నువ్వు ఆ బాబు జూస్తే పీక పిసికీసుం డీవోడండి.

"ఈల్లేదు-అతగోడి వొంటిమీద-ఈగకూడా వోలడాని కీల్లేదు" అన్నాడండి వొరండాలో పచారుచేస్తూ.

"వొంటికి కిరసనాయిలు-రాసుకోమనండి" అందా మని పించినాదండి నా మట్టుకు నాకు.

"ఆ బాబుని-అరిజెంటుగా-లాక్కురారా" అని పురమా యించినాడండి. ముందా బాబునీ-తరువాత మా గేంగునీ లాక్కొ చ్చినానండి. ఆచారి బాబుకాడి కెళ్ళాలంటే-అరదరేత్తిరి దాటి పోనాదండి. ఆచారిబాబు అరదరేత్తిరి వొరకూ -పెళ్ళాం కాదుంటే -ఆ తరువాత మరదలి "కేరాఫ్"లో ఉంటాడండి.

తింటున్న మేక-ముక్కని-ఎట్టమనడిగితే -పులి-యెడ ద్దేటో గాని బాబూ-ఆ మరదలు-మరిడీ-ఆచారి బాబుని అయిదు నిముషాలొగ్గదండి-పొద్దు పొడిసీ వొరకూను-మరంచేత రాఁ వఁసెంద్రావు బాబు-ఇల్లు సేరుకున్నావండి.

# 38

"మావుఁరామసెంద్రావు బాబిల్లు-జేరీసరికి-రేత్తిరి వొటిగంటొద్దండి. గాని ఇల్లుమాత్తరం - సిచ్చుబుడ్డిలా - యెలిగి పోతన్నాదండి. మాఁవుఁయెళ్ళీ సరికి సానా మందిరి ప్లీడర్లు -మేడమెట్లు దిగిపోతున్నారండి - యెవుడో ప్లీడరు పెద్ద అన్నే యం కేసు గెలిసి నట్టున్నాడండి. అంచేత పెద్ద-మందుపారిటీ జేసుకుంటున్నారండి- మేడమీద - అన్నేయం కేసుగాకపోతే- అంతపెద్ద పారిటీ యెందుకండి? మాఁవుఁయీది గేటు జేర గానే-మమ్మల్ని చూసి పారొచ్చి నారండి రాఁమసెంద ్రావూ- సెల్లిలూను. ప్లీడర్లందరూ యెళ్ళిపోనాక-మాఁవుఁమేడ మీద కెళ్ళి- సూద్దువుఁగదా! ఒక కుర్సీలో కాళ్ళు నిగడదన్ని-మరో కురిసీలో సచ్చిన గాడిదలా పడుకున్నాడండి పారదసారదిబాబు. బతి కుండగానే-కాళ్లు బిగుసుకుపోయినట్టున్నాయండి-

ఆ బాబు- కళ్ళు తెరిసే ఉంచినాడండి-కాని కళ్ళకి ఏటీ- అగపడతన్నట్టు నేదండి- సేతిలో గళాను నేకపోతే- సమాదిలో ఉన్నాడనుకుంటామండి. ఆ బాబు మాఁసం తిండండి- కోడి గుడ్డు- సేత్తోగూడా- పట్టుకోడండి. "బీరు" తప్ప- మరే మందూ పుచ్చుకోడండి. మూడు "బీర్లు" - అయితే ఆ బాబుకి నాలిక- తడుస్తాదండి- అంతే. అయిదు పడీసరికి- అగ్గిరావుఁడై పోతా దండి. నెలకో పాలిగాని- తాగడండి- తాగిన్నాడు మాత్తరవండి- అరకేసులాగించీ గలడండి. అయిదయితే- అగ్గిరావుఁడన్నానా? అరడజను పడీసరికి, బీరు బుడ్డి తప్ప మరింకేం కంటికి అగపడ దండి. ఏటి జెప్పినా అరదం అవదండి. ఏడు పడితే ఏం జెప్పినా ఇనిపించదు కూడా నండి.

పారదసారదిబాబు-యెంత తాగినా- అవతలపారిటీ ప్లీడరు గదండీ, మరంచేత-ఇసయం బైటెట్టడానికి- మా బాబు యెన కాడినాడండి. "మరేం పరవానేదు. అతగోడు సమాదిలో కెళి పోనాడు. అరడజను ప్రోనోట్లమీద-సంతకాలెట్టిమన్నా- ఎట్టీ స్తాడు. అయినా ఆఫీసు "రూం" లోకిపోదాంరండి" అంటూ ఆయమ్మ- తోవదీసినాదండి.

గదిలోకెళ్ళేక- జరిగిందంతా- ఇవరంగా మా బాబు జెప్పి నాదండి- మల్లమ్మ ముండ కోక ఇప్పీదం గురించి- సెప్తూ వుంటేనండి- పదిమంది రాడోళ్ళు, పబ్లిక్‌లో- తన పంచి పీకీ స్తున్నట్టు- మొకం యెట్టినాడండి- రాఁవఁనాదం బాబు.

"మొత్తాని కెలాగైతేనేం-దుస్సేసునుడు ముండాకొడుకు - జెయ్యలేని పని సాదించినారన్న మాట" అందండి ఆ యమ్మ నవ్వుతూను.

"మల్లమ్మ మానం కాపాడ్డానికి సీకిష్టుడు-లేకపోనా దన్న మాట" అన్నాడండి రావఁసెంద్రావు బాబు.

"సీకుష్టుడు- లేకేం? కాకపోతే-కుసింత 'లేటు'గా వొచ్చి నాదంతే-" అన్నాదండాయమ్మ.

"యెవుడాదు" కలలో-కుష్టుడ్ని జూసిన-కంసుళ్ళా- మొకం - ఎట్టినాదండి రావఁనాదంబాబు.

ఈ "నాటకంలో- సిట్టిబావే సీకుస్టుడు- మల్లమ్మ మానం కాపాళ్ళేక పోయినా-సెర్లో సెలగాటాలాడుతున్న కుష్టుడినాగ- పబ్లిక్కోరట్లో- మీ పంచిలు ఊడపీకీగల్డు- గోవర్ధనం ఎత్తినట్టు- మీ కొంపలు యెత్తేసి గాల్లోకి ఇసిరీగల్డు- ఊరు పీకీసి పంది రేసీడవేఁగాదు- ఆ పందిరికి పొట్లకాయలు యేలాడినట్టు మిమ్మల్ని యేలదీసీగల్డు" అందండి ఆయమ్మ.

"సుచి పలకరా పెళ్ళికొడకా- అంటే సోబనంనాడు ఊరొ గ్గేస్తాసన్నాట్ట యెనకటికెవడో- అలాగుందండి మీ తంతు జూస్తే" అని గొణిగినాడండి రావఁనాదంబాబు.

కోకలు పీకీడంలో- కిష్టుడైతే గావచ్చుగానండి- దయి ర్యానికి మాత్తరం ఆ బాబు కుందేలు పిల్లేనండి.

"నాకు తెలకడుగుతానూ- కరమనాడు కళ్యాణం మంత రాలు- సదువుతారేటి? స్రేద్ధం మంతరాలు గాక" అందండా యమ్మ-సాయింతరవేఁ- రెండు "పెగ్గు"లు బిగించి ఉంటా దండి- నేకపోతే అలాగమాటాడే-మడిసి గాదండి. ఆ తరు వాత- ఇంకా రెచ్చిపోనాదండి. "మేస్ట్రీటు కోరటు కెళ్ళి-" మంత్రి పని యెప్పుడిస్తారు? అనడుగుతాఁవేఁటి? సంవత్సరం ఏస్తారా? అదురుష్టం బావుండి, ఆర్నెల్లకి తగ్గుతాదా? అక్కడి బాబెలా టోడు? సీఁరామసెందురుడా? మందుకి లొంగుతాడా- ముండకి మొగ్గు తాడా- లేకపోతే అంతా "కేష్" బిజినెస్సా? ఏ.పీ.పీ.గోడు కతకని రకఁవాఁ? ఇలాగాలోచిస్తాం గాని.

"ఇంతకీ మనం జేసినపని-ఏం గొప్పపనని? ప్రెజకి నచ్చీదా? పెళ్ళాంమెచ్చీదా?" ఇలా ఆ యమ్మ - బజకడిగీడం - ఆరంబించినాదండి.

"ఈ- సీవాట్లు పొద్దు పొడిసినాక- పెట్టొచ్చు. ఇప్పుడేటి సెయ్యాలో-సెలవియ్యండి" అని మాబాబు బతిమిలాడినాడండి.

"సెయ్యవొలసింది-తర్వాత జెపుతానుగానీ-ఎగస్పార్టీ వోళ్ళు -సిటీకి బయెలెల్లినారా- కొండసిలవల్లా- పెళ్ళాలకి- సుట్టుగొని తొంగున్నారా?" అనడిగినాడండి.

"బయలెళ్ళుతున్నారనే బోగట్టా" రామనాదంబాబు గొణిగి నాడండి.

"అయితే ఉండండి-జెప్తాను. ముందీ పారదసారదిగోడ్ని - ఇంటికి తరవాఁల!" అని ఆ యమ్మ- మా కంటే ముందరే డాబామీదకి- యెళ్లిందండి.

పారదసారదిబాబు పులిని జూసిన మనిషిలా- కొయ్యబారి పోయి- అలాగే కురిసీలో ఉన్నాడండి.

తాగని గళాసు-సేతిలోనే ఉందండి. సూపులేని- కళ్ళు తెరిసే ఉన్నాయండి.

"పార్దూ" పిట్టలా-పిలిసిందండి- ఈ యమ్మ.

దేవుఁడొచ్చి పిలిచినా-యముడొచ్చి అరిసినా- పలికే స్టేజిలో లేడండాబాబు. కాని- ఆ- యమ్మే- తడితువ్వాలుని- దులిపి నట్టు- గుంజి లేపిందండి- లేపి మొకం కడుక్కొమ్మని - నీళ్ళు ఇచ్చిందండి. ఆ బాబు మొకం- కడుక్కున్నా- మళ్ళీ కురిసీలో కుదబడిపోనాడండి.

"ఇంటికెళ్ళు- పారిటీలు వొచ్చుంటారు" అందండాయమ్మ.

బస్-అంతేనండి -"పార్టీ" అన్న మాట- ఇనగానే- నచ్చిన- సత్యవంతుడు లెగిసి కూకున్నట్టు- సటుక్కుని నెగిసేడండి. ఆ బాబు- "పారిటీగోడు- యేడీ?" అంటూను. పార్టీగోడు పేరు- జెపితే- గోరీలోంచి కూడా- లెగిసొచ్చేస్తాడండి- ప్లీడరన్నోడు- ఎపుడన్నాసరే-

"పార్టీగోడేదీ?" అనడిగేడండి- పారదసారదిబాబు. ఆ మాటకి- ఆ యమ్మ యేటన్నదో- యెరికా?

"నీలాటోడేనట- సోబనం గదిలో- నా సాని యేదీ" అన్నాట్ట. నీ పారిటీలు- అంత దొంగలంజికొడుకులేననుకో - కాని ఇంకా మా ఇల్లు దోసుకునీవొరకూ రాలేదాళ్ళు- ముందో సిగరెట్టు- ఎలిగించు- తరవాత "స్కూటరు" ఎక్కక- కింద మా డ్రైవరు తొంగొనుంటాడు. ఆడ్ని లేపు- ఆడు కార్లో దిగవెట్టేస్తాడు. ఇంటి కాడుంటారు- నీ పార్టీలు ఆళ్ళతో మాట్లాడి- సంది కిష్టమైఁతే రా- నేకపోతే "బెడ్రూంలో బోర్లాతొంగో- రేపు కోరట్లో కలు ద్దాం" అని జెప్పి-ఆ యమ్మ పారదసారది బాబుని- తోలీసి నాదండి-

తరవాత-ఆ డాబామీదే-కూకుండిపోనాదండి- అంత మందిరి కేసులు గురించి-చాలాసేపు మాట్లాడినారండి ఆళ్ళంతా.

మద్దిలో- "ఇక్కడ సలేస్తున్నాది" అన్నాడండి రాఁమనాదం బాబు.

దాంతో-ఆ యమ్మ-తోకమీద నిలబడిపోనాదండి- "సంకు రేత్తిరి రోజులు- సలెయ్యక- దప్పికేస్తాదేటి? పాపం- కోకిప్పీ సినప్పుడు- ఆ మల్లమ్మ ముండకి- యెంత సలేసుంటాదో! తొలుత- దాన్నీ- తర్వాత మేస్ట్రీటుబాబునీ- తలుసుకో- వొళ్ళు "హీటు" యెక్కిపోద్ది. సరసాలకీ- సలహాలకీ- సల్లగాలే "బెటరు". ఇక్కడే కూకోండి- నాను సెప్పవొలిసింది- సెప్పీవొరకూ." అంటూ ఆ యమ్మ- ఆ రేత్తిరి- హైస్కూలు హెడ్మాస్టు - అయి పోనా దంటే నమ్మండి.

ఆ తరవాత-కాళ్ళుగాలిన పులి- బోన్లో తిరిగినట్టు- డాబా మీద తిరగడం- ఆరంభించినాదండి.

"ఇందాకేదో- సంది అంటున్నారు సారదిబాబుతో?" అని మా బాబు- ఇలాగ- అన్నాడో- నేదో- అంతేనండి- జెర్మనీ వోడు- ఇంగిలీషోడిమీద ఇరగబడి పోయినట్టు- మా బామ్మీద యిరుసుకు పడ్డాదండి.

"సందికి- రమ్మనకపోతే- సరసానికి రమ్మంటారేటి- బుచ్చి బాబుని- ఇపుడు. కేసుపెట్టీ మల్లమ్మ ముండది- మన పార్టీ దైతే- ఎగస్పార్టీ బుచ్చిబాబుకీ మనకీ- సంది- యేటి? ఇదేనా- మీ దరమ సందేహం?

"అదిగో అక్కడే ఉంది- ఫరకు- శనీశ్వరుడు- అసలీస్వె రుడితో అన్నట్టు నానోటి- జెప్తాను- పెద్దగా ఇనుకోండి.

"రష్యావోడికీ- అమెరికావోడికి- స్నేహవాఁ? రంకు మొగుడికీ- అసలు మొగుడికీ- మద్దెల నేస్తం- ఉండొచ్చే మోగాని- ఆళ్ళిద్దరికీ స్నేహంలేదు- నాను జెప్పింది నిజవాఁ? అబద్దవా? ఆళ్ళిద్దరి మద్దే "ఐస్" (ICE) ముక్కెడితే- అగ్గినిప్పు- అయిపోతాదా? లేదా? అయిపోతాది-

కానీ– తనమీద– జెరమనీవోడు– ఇరుసుకు పడ్డప్పుడు– రష్యా వోడేటి జేసినాడు? రమ్మని– అమెరికా వోడికి కబురంపినాడా లేదా? అంపినాడు.

అప్పుడు– అమెరికావోడు– యేటి జేసినాడు? "మీరిద్దరూ– యేనుగూ సింహాల్లా కుమ్ముకు సవ్వండి– నాను గట్టుమీద– నక్కలా కూకుని జూస్తూ ఉంటాను– మీలో యెవరు సచ్చినా– ఇద్దరూ సచ్చినా– గట్టుమీద నక్కలాగే– ఆనక తినేస్తాను" అని సమాధానం ఇచ్చినాడా! ఉఁహూఁ! రాఁవులోరి సాయానికి – సుగ్రీవుడు– ఉరికినట్టు– రంగంలోకి దిగేడు. నాను జెప్పింది నిజవాఁ? అబద్దవా?

"ఇప్పుడాళ్ళ నీతే– మనకీ గావాలి.

హిట్లరుగోడు– సిన్నరాజాలనీ– పిప్పరమెంటు బిళ్ళలూ – అప్పడాలూ సప్పరించీసినట్టు– సప్పరించీస్తూ వుంటే– ఇంగ్లీషోడు యేటిజేసినాడు కాళ్ళు ముడుసుకుని– కూకున్నాడు. మన కెందుకులే అని–అప్పుడేటైంది?

"అప్పడాలు తిన్నోడు– అక్కడితో ఆగిపోతాడా? ఆగడు– అన్నం గావాలంటాడు–ఈ గ్రహింపు ఇంగ్లీషోడికి లేదు."

"అంచేత– అప్పడాలూ–వొడియాలూ లాటి– సిన్న రాజ్జేలు– నవిఁలీసేక హిట్లరుగోడేటి జేసేడు? ఉట్టి వొణ్ణంగాదు– పరమాన్నంలాటి ఇంగ్లండుమీద–పడ్డాడు." అని ఆ యమ్మ– "లెక్చరు" దంచీసినాది.

"నాకేం అరదం– అవడంలేదు" అని గొణిగినాడు రాఁవఁనాదం బాబు.

"సదువురాని ముండకి 'లౌ లెట్రు" (love letter) రాస్తే– సమంగా–ఆ మాటే అందిట– సదువురాని దానిక్కాదు– ఆకిరికి– సంటిపిల్లక్కూడా అరదం– అయ్యీటట్టు జెప్తున్నాను. ఇనుకోండి." అని మా బాబువేపు తిరిగి– ఆ బాబుకి– తలంటీసినట్టు– మళ్ళా తగులుకున్నాదండి.

## 39

"మీరేటి జేసినారు? మీ ఈది బాగుజేస్తాం అన్నారు. మీ ఊరు సుబ్బరం జేస్తాం– అన్నారు. ఆ పని పాకీవోడు గూడా– జెయ్యగల్డు కాని ఆ సంగతి మీరు గ్రహించినారా? నేదు. ఊర్ని ఉద్దరించేస్తాం–అన్నారు–మీ ఊరు– ఉద్దరించుకుపోతే– జిల్లాలు జెల కడుక్కుపోతాయన్నారు. దేశంలో దరిద్రం పోతుందన్నారు.

"కాని మీరు– జేసిందేటి"

"మాలపేటకి రోడ్డు యేయించేరు– దానికీ తార్రోడ్డు– ఏసినా – కంకరరోడ్డు– ఎయ్యకపోయినా ఒకటే– ఆళ్ళకి కార్లున్నాయనుకున్నారేటి?

"ఆళ్ళకో స్కూలు– ఎట్టినారు– ఆళ్ళ పిల్లల్లో సగంమందిరి– స్కూల్లో జేరరనీ మీకు తెలుసు– మిగతా సగంమందిరీ మూడో క్లాసు దాటరనీ మీకు తెలుసు."

"ఆళ్లు సస్తే– మీకు పన్లు జరగవని ఆళ్ళకో ఆస్పత్తిరి ఎట్టిస్తారు. ఆళ్ళు–మొగుడూ పెళ్ళాలు– దెబ్బలాడుకుంటే– కోర్టుకెక్కకుండా– ఆళ్ళకీ రాజీ చేసేసి– ఆళ్ళ నుద్దరించినాం అన్నారు."

"సెర్లో– చేపలు పెంచి– జాలారోళ్ళచేత– సగం చేపలు– సగం రేటుకి– మీ ఊళ్ళో అమ్మించేరు. ఎందుకు జేసినారలాగ? పైకి బీదోడ్ని ఉద్దరించడంకోసం– నిజానికి మీ కడుపులు నింపుకోవడానికి–సగం రేటుక్కాదు– సరిగదా– చేపలు ఉట్టినే ఇచ్చినా – పులుసెట్టుకోడానికి– పేదోడికాడ– సింతపండు ఉండదని మీకు తెల్దేటి?"

"కాని– నా నడిగీదొక్కటే– కూలెదవకి– కూలి–కాణీ యెక్కువిచ్చినారా? వొడ్డీ అడక్కుండా వొంద రూపాయిలు– అప్పిచ్చినారా? అని–"

"ఇవ్వనేదు– ఇవ్వరు."

"ఎంచేత."

"పేదోళ్ళు నిజంగా పెరగాలంటే– మీరు తరగాల."

"ఆళ్లు బాగుపడాలంటే– మీరు కుసింత సెడాల."

"మీ ఊరు–ఉమ్మడి రాబడి లక్ష అయితే– మీ తొమ్మిది కుటుంబాలోళ్ళూ– తొంబై తొమ్మిదివేలు మిగిల్చీసుకొని– మిగతా వెయ్యీ– తొంబై తొమ్మిది కుటుంబాలోళ్ళకీ– బేమ్మడు అచ్చింతలు జల్లినట్టు, జల్లితే– అయ్యే పదివేలు– అనుకొని– ఆళ్ళు సావుబతుకులు బతుకుతున్నారు. కాని– ఆళ్ళకి– మీరు సచ్చినా– ఆళ్ళు సచ్చినా సరే– రెండో యెయ్యిరాలసరు– ఇది పచ్చినిజం– మీకు తెల్సు– నాకు తెల్సు–

"అలాగని– మనపట్లాగే గేదెని మింగిన కొండసిలవలా– మీరు తిని తొంగున్నారా? నేదు? ఎంచేత? మీకు పేరు గావాలా – పవరుగావాల– మీరు గొప్పోళ్ళని పేపర్లు రాసియ్యాల– మీరు మహాత్ములని– బీదెదవలు కూడా– నమ్మియ్యాల– గాని

ఆళ్ళు మాత్తరం-యెప్పుడూ బీదెదవలుగానే ఉండిపోవాల- మీరెప్పుడూ- ఇలాగే- ఆర్నెల్లయ్ ఆవు మొకం జూదని ఆంబోతుల్లా- ఇలాగే "పవర్"లో ఉండిపోవాల".

"మీరు పవర్లో ఉండాలంటే- మీకు ఓట్లు గావాల - వోట్లు గాదెల్లో దొరకవ్- మీ పొలాల్లో పండవ్- మీ పెళ్ళాలు కట్నాలుగా- పట్టుకురారు."

"అయి యెవుడి కాదున్నాయి-బీదెదవకాద"

"ఓట్లు బీదోడి కిచ్చినప్పుడు- మీరు ఆడితో- యేటన్నారు. ఈ రాజ్జెం నీది. యీ గవర్నమెంటు నీది- ఒరేయ్- యెదవా- నువ్వే ఆలోసించుకో- నువ్వూ మీవోళ్ళు- యెంత మందిరున్నారు? యెయ్యికి తొమ్మిది వందల తొంభై తొమ్మది మందిరున్నారు- మాఁవెంత మందినిఁ- ఉన్నాం? యెయ్యి కొకళం కూడా లేవుఁ నువు ఓటేస్తేనే గదా మాఁవుఁ ఐదరాబాదుకీ- వల్లకాటికీ- యెల్లీదీ? నేకపోతే మాఁవుఁ కళ్ళం పాకల్లోనే తొంగోవాల? నిజవేఁనా? కావాలంటే- మీరందరు మందిరీ- యేఁకఁవై- మీ వోడినే నిలబెట్టి- ఆడికే ఓట్లిచ్చి- ఐదరాబాదు- కాదు గదా- ఢిల్లీకే పంపుకోండి- మీ కిష్టవైఁతే పాకిస్తాన్తో యుద్ధం చెయ్యండి- "చెయినా" వోడితో- చెయ్యి కలపండి. ఒక్క- ఇసయం మాత్తరం మరిసిపోకండి- ఈ గవర్నమెంటు మీదని-దానికి-ఇదిగో ఈ ఓటే పత్రం"- అని అన్నారా? లేదా? అన్నారు.

"ఇంకా యెదవ- ఆడెలాటోడు? మీరు పాలు జూపించి- ఇయి పాలుగావురా- ఇసం తాగుతే "హార్టెటాక్" వస్తాది- తాక్కురా- అంటే నిజవేఁననీసుకుని- ఆడి ఆవులపాలు-అన్నీ మీ కడుపుల్లో పోసినాడు- గాని సుక్కముట్టనేదు."

"మీరు జెప్పిన యెదవ మాటలు- వేదలు- అనీసుకొని- కల్లుగొట్టెలా పొంగిపోనాడు- ఇటుపైని- మావోడే- "సీ.యం" అయిపోతాడని మురిసిపోనాడు."

"కానీ-ఆడికి తెలనిదీ- మీరు జెప్పనిదీ- ఒక్క యిసయం- ఉంది." ఏటది?

"తల్లిని తాకట్టు పెట్టినా- పూట గడవనోడికి- ఓటిస్తే- దాన్ని ఆడుయేటిజేస్తాడు? ఫోటో కట్టించి- గోడకి యేలాడదీస్తాడా? కూతురి పెళ్ళిలో- కట్నంకింద సదివిస్తాడా?"

"ఇదేటి సెయ్యడు- మరేటి జేస్తాడు? అమ్ముకుంటాడు. తన ఓటుకి- ఎవరు యెక్కువిస్తే- ఆడికి అమ్ముకుంటాడు-"

"ఆడి ఓటు- యెవరు కొంటారు? ఆడి తమ్ముడా? వొఁజ్రాన్ని యేలం-యేస్తే యేతోడు-కొంటాడా? గీతోడు కొంటాడా? బొజ్జా - బోషాణం ఉన్న షావుకారు కొంటాడు."

"ఈ యిసయం- ఆడికి తెల్దు- మీకు తెలుసును-గాని మీరు ఆడికి- చెప్పలేదు."

"ఆడు ఓటు అమ్ముకుంటే కొన్నారు. దరమంజేస్తే "దానం" పట్టినారు- ఆడి ఓటు కొనుక్కునో- దండుకునో- దోసుకునో పవర్లోకి వొచ్చినారు- పవర్లోనే ఉండిపోనారు. ఉండిపోతారు.

కాని- మిమ్మల్నో బయం- దెయ్యంలాగ పట్టుకున్నాది- మీరు బీదోడి కళ్ళకి కట్టిన గంతలు- ఆడు ఇప్పీసుకుంటాడేమోనని. మరంచేత మీరు యేటిజెయ్యాలి? గంత మీద గంత- గంత మీద గంత కట్టి పారెయ్యాలి- ఆటిని ఇప్పుకోలేక-ఆడి సేతులు పడిపోవాల. అందుకు- గవర్నమెంటు ఆడిదేనని- ఆడ్ని- నమ్మించడానికి- మీరు యెయ్యని "ట్రిక్కు" లేదు. మచ్చుకి- మీరు- మీ గవర్నమెంటు జేత-ఆడికో- ఢిల్లీ గేదెని "ఫ్రీ"గానో "ఆప్రేటు" కో ఇప్పిస్తారు.

గేదె-ఇంటికొచ్చినాదు-తొత్తుకొడుకు- కామధేనువే తనింటి కొచ్చేసినా దనుకొని- సంతోషపడిపోతాడు. ఆడి పెళ్ళాం- సరేసరి- అందలం యెక్కిపోయి మరింక దిగదు- మామూలుగా ఉండిపోయీవోళ్ళు- యేటీ అరదంగాని- ఆడపిల్లలే.

మూఁడ్రోజులుకిగాని అరదం అవదు- ఆ అమాయకపు యెదవకి- గేదె గాలి పీల్చి బతకదనీ- అది పాలియ్యాలంటే- దానిగ్గడ్డి కావాలనీ-గడ్డి ఆడి గుడిసెమీద మొలవదనీ- అది పెరిగే బూఁవుఁలు మీవనీ.

అంచేత- ఆళ్ళలోసేతనైనవోడు- గేదెని సగంరేటుకో- పావు రేటుకో- అమ్మీసుకొని- ఆ డబ్బుతో తాగేస్తాడు. మీ కరణం గోడు లెక్కల్లో- గేదె సచ్చీసినాదని బకిరేస్తాడు, మీ గవర్నమెంటు గేదె- మీ కాడే ఉండిపోద్ది.

సేతగానోడు- తన గేదెని మీ బూఁవుఁల్లో మేపుకుంటాడు. మేపుకోనిచ్చి నందుకు- మీరు ఆడిగేదెని- ఎప్పుడూ తీసుకోరు- పాలు మాత్తరం తీసుకొంటారు. గేదె పాలు మీవొంతు- పేద ఆడి పిల్లల వొంతు- గేదెని కడగడం ఆడి వొంతు.

పేరుకి మాత్తరం- గవర్నమెంటూ ఆడిదే- గేదే ఆడిదే----

ఈ గేదె– "రూలే"– ఆడికిచ్చీ బంజరు బూఁవిక్కూడా– వొర్తిస్తాది. మీది– పెద్దల పార్టీ– యెయ్యి యెలక్షన్లు వొచ్చినాసరే మీకు సెదనం ఉండదు–సరిగదా– మీ ఇనప్పెట్లికి పిల్లలు పుడతాయి. మీ పార్టీ యేర్లూ (వేళ్ళూ) ఊడలూ తన్నీసి, దెయ్యం సెట్టులాగ పెరిగిపోద్ది– ఇయ్యాల ఊబిలో వున్న– బీదోడు మాత్తరం రేపు పాతాళంలోకి దిగిపోతాడు."

ఆ యమ్మ– మంచినీళ్ళు తాగడానికో–ఊపిరి పీలుసు కోడానికో గాని ఆగినాదండి.

"ఇదేటి? నక్సలైటు మీటుంగా" అని – మావోళ్ళలో యెవుడో గొణగబోతే ఆయమ్మ నల్లేరుమీద బండిలాగ– దెయ్యం ఒగ్గీసీక– కావిఁణీ పట్టుకున్న మడిసిలాగ మరీ రెచ్చిపోనాదండి.

"నీలాటోడే యెనక్కి సెయిత్యానికి (రొంపకి) ఆసుపత్తిరికెళ్ళి సిస్సీ ఇక్కడ సుక సంకటాలక్కూడా వొయిజ్జెం జేస్తారా? అన్నాట్ట మజ్జెలో– అడ్డురాక– నాను సెప్పీదంతా– వినీ నచ్చకపోతే ఆకర్ని మీకు నచ్చిన ప్లీడరుకాడికి పొండి. "జెయం" అని నాను మెళ్ళొ దండేసి మరీ పంపుతాను. "మూదేళ్ళు–మీరూ బుచ్చిబాబూ కల్సి "సేవలు" జేసినారు. ఆ తరవాత మీకూ మీకూ "డిపరెన్సు" లొచ్చినాయి. అంచేత మీరు రెండు పార్టీలు యెట్టినారు. ఇదేగా బోసు "ప్రెజాసామ్యం." అనీసుకున్నారు బీదెదవలు.

కాని మీ పీకలు మీదకి సీకుష్నుళ్ళా దిగినాడు సిట్టిబాబు. అతగోడు సీకుష్టుడైనా కాకపోయినా సరే మీ రెండు పారిటీల్లోనూ పాండవులు మాత్తరం లేరు.

సీకుష్నుడేటి జేసినాడు– రాజ్జెం గావాలన్నాడా? కిరీటం యెట్టమన్నాడా? ఆకరికి యుద్ధవైనా జేస్తానన్నాడా? లేదు – మరేటి జేస్తానన్నాడు–గుఱ్ఱాల్ని తోలియ్యండి అన్నాడు– తోల్నిస్తే తన తడాకా సూపెట్టినాడు.

యీ సిట్టిబాబూ అంతే ఊళ్ళో ఆస్పత్తిరి మాత్తరం యెట్టినాడు– ఇప్పుడు మిమ్మల్ని మన్యాలు పట్టించీసి బీదోళ్ళకి కిరీటం యెట్టిస్తాడు.

ఇలాటి సిట్టిబాబులు ఊరికి తాలూకాకి కాదు– జిల్లా కొకడు తగులు కొన్నాడంటే తల్లకిందై పోయేది పంచాయితీ బోరుడు కాదు– ఢిల్లీ గవర్నమెంటు.

ఇప్పుడు సిట్టిబాబు పెట్టించీ కేసులు పోతాయా? గెలుస్తాయా? అన్నది కాదు– పాయింటు.

మన పారిటీ బీదెదవలే మనమీద యెదురు తిరిగేరన్నది అసలు యిసయం. రేపు రెండు పారిటీల పేదోళ్ళూ యేకవై పోతారన్నది రెండో పాయింటు.

ఈ పేదోళ్ళు కలవడం అంటురోగమన్నది మూడో పాయింటు.

ఆళ్ళంతా యేఁకవై పోయిన్నాడు– మనకి మేళ్ళూ– కార్లూ– గాదు– ఆకరికి కూడుకూడా వుండకపోవచ్చు నన్నది ఆకరి పాయింటు.

## 40

"ఊళ్ళో అగ్గి రాజుకున్నాది. ఆళ్ళు–కేసులు గెలిసినారా– ఊరు బుగ్గయిపోతాది– లేక కేసులు పోనాయా– కుసింత 'లేటు'గా– బుగ్గయిపోద్ది– ఊరు– అంతే 'డిఫరన్సు.'

"ఊరు 'బస్' ముక్కలా– సల్లగున్నన్నాళ్ళూ– మీరూ– బుచ్చిబాబూ– కుమ్ముకోవచ్చు– గాదు– కుమ్ముకోవాల– కాని అగ్గి అంటుకున్నాక మాత్తరం– ఈ పిడకల దెబ్బలాట్లు మానీసి– సేతులు గలిపి– అగ్గి ఆరపాల– సేతులే కాల్తయో– అగ్గే ఆరుద్దో– తర్వాత జూడొచ్చు గాని– నాను సెప్పిన ఇసయాలు– బాగా ఆలోచించుకొని మరీ– జెప్పండి– సంది జేసుకుంటే– కేసులు ఒక రకంగా వోదించాల– నేకపోతే– మరో ఇదంగా వోదించాల" అని – ఆగిపోనాదాయమ్మ.

బైటికెళ్ళి– అరుగులమీద– గుసగుసలాడి– వొచ్చినా రండి– మా వోళ్ళు– వొచ్చీ– సందికి– సిద్దవేఁ అన్నారండి.

పార్దసారది బాబుకి– టెలిఫోన్ జెయ్యడానికి– ఆ యమ్మ లోపలి కెళ్ళినాదండి.

ఇంతలో మాయదారి నిద్దర– యెక్కడ్నించొచ్చినాదో గాని– మళ్ళీ ఉట్టప్పుడు "ఫుల్ బాటిల్" లాగించీసి– సైకిలు– సేతులొ గ్గీసి తొక్కగల్నండి– కాని ఆ పొద్దు మాత్తరం నిద్దరాపుకోలేక– కిందకెళ్ళి– యీదరుగుమీద– తద్దినం బోజనం జేసిన బేమ్మళ్ళా – తొంగుండి పోనానండి.

❖ ❖ ❖

నాను– లెగిసీసరికే– సంది జరిగిపోనాదండి, మా రెండు పార్టీలోళ్ళకీ–బాబు లిద్దరూ– కౌగిలించీసుకుని ముద్దులు పెట్టీసుకుంటున్నారండి, అప్పుడు నాకు– మా బాబులిద్దరూ– "డబుల్ ఏక్షన్" చేస్తున్న– "విలన్లా"గ అగుపడినారండి– నన్ను పిలిసీ–

సంది సంగతి ఊళ్లో తెలవకూడ దన్నారండి. యెవరితోనూ జెప్పనని ఒట్టెయ్యమన్నారండి– ఒట్టేసి–మళ్ళీ మీరడిగినా జెప్పను అన్నానండి నాను.

"మనం యే కేసులూ యెట్టొద్దు. ఆళ్ళు పెట్టే కేసులు ఓదిస్తే జాలు–ఇంతకీ మనవేం కేసులు యెట్టగలం– మల్లమ్మ ముండ రాఁవఁనాదం బాబుని "రేప్" జేయిస్సినాదని–యెదతాఁవాఁ?" అన్నాదండి ఆ యమ్మ.

"ఐదరాబాదులో ఆపీసు యెట్టాల్సిన దానివి" అన్నారండి మా వోళ్ళు.

"ఐదరాబాదో–సికిందరాబాదో తర్వాత జూడొచ్చు– అర గంట ఆలిస్సెం అయితే అగ్గయిపోతాడు– ఆచారిగోరు. బేగి బయలెల్లండి" అని తోవదీసిందండి కారు కాడికి.

"మాఁవుఁ ఆచారిబాబు– ఆపీసు జేరినావండి– ఆ బాబుకో – దణ్ణం పడేసి నాను యీదిలో కొచ్చేసినానండి. మరో అర గంటలో మా బాబులు కూడా వొచ్చేసినారండి– అప్పుడు జూడా లండి ఆళ్ళని–ఇలా గెలాగున్నారంటే– నెహురూ– కవల కొదు కుల్లాగ యెలిగిపోతున్నారండి...ఆ తరవాత – ఆపనీ– ఈ పనీ జూసుకొని ఊరు జేరినా వండి."

"మీ యెదవ పారిటీవోళ్ళు– మల్లమ్మ ముండమీద కేసు మోపినారా?" అనడిగినాదండి–మాయాడది– లేదన్నానండి– నాను.

"యీా యెదవ పారిటీ వోళ్ళని– పెంచకపోతే– పందుల్ని పెంచకూడదా? అనడింగిందండి.

"పందులకీ– మా వోళ్ళకీ–యేటి బేదం?" అనడిగినానండి– అమాయకంగా.

"అది తెలిసిన్నాడే మడిసివి" అని ఉమ్మి యెలిపోనాదండి– తరవాత–నాను కూడా– కొలువుకి యెల్లి పోనానండి.

"సంది–ఇసయం– మీ యాడదాన్తో జెప్పినావేట్రా" అనడిగి నాడండి మా బాబు.

"నేదన్నానండి"

"సెప్పక– ఆడదాన్నోట్లో 'ఐస్‌క్రీం' గూడా నాన్దు– ఇంతకీ మీ యాడదేటంటాదిరా?–యాపారం యెలాగుంది?" అనడిగి నాడండి.

"పందుల్ని ఎంచమంటున్నాదండి" అన్నానండి – నాను.

"సిస్సీ తురకది కాదేట్రా – పందుల్ని పెంచమన్డానికి – ఆ మాటలా గొగ్గీ– నువ్వు మాత్తరం– సిట్టిబాబుని ఒగ్గక –ఆడు నక్సలైటో– కాడో తరవాత జూద్దాం. ముందు కేసుల బోగట్టా మాత్తరం–ఆడికాడ– యెప్పటికప్పుడు– పీకి–నాకు జేరె య్యాల– తెలుసా" అన్నాడండి.

అలాగే నన్నానండి – నాను.

❖ ❖ ❖

ఆ సాయింతరం – సిట్టిబాబు ఆస్పత్తిరి కాడి కెళ్ళినానండి – ఆ బాబుకి–కుసింత సెయ్యి – తీరుబడి అయ్యా వొరకూ – కూకొని – తీరుబడి అయినాక – లోపలికి తీసుకెళ్ళి – సంది ఇసయం – జేరేసినానండి.

"ఈ – యిసయం– నాకు జెప్పడం – మోసం" అన్నాడండి– ఆ బాబు.

నాను ఒల్లకుండి పోనానండి.

"నా కెందుకు– జెప్పినావు– ఈ యిసయం" అనడిగి నాడండి.

"సెప్పాలనిపించినాది– జెప్పేను" అన్నానండి. ఆ తరవాత– మొదట్లో మా బాబు–అతను నకసలైటో– కాడో– కనిపెట్ట మన్నాడనీ–ఇప్పుడు–కేసుల–కూపీ–పీకమన్నాడనీ" జెప్పి నానండి.

"నాను–రంకుతనవూఁ– దొంగతనవూఁ జెయ్యడంలేదు. నీ కేటి జెప్పాలనుంటే– అదే మీ బాబుతో జెప్పు" అనీసినాడండి.

అంతేగాని– మీ పారిటీవోళ్ళ– బోగట్టా– నాకు జేరెయ్య మని– అడగనేదండి–నీతంటే–ఇదేననిపించినాదండి– ఈ బాబే – నకసలైటైతే– నానూ నకసలైటవాలనిపించినాదండి–

❖ ❖ ❖

"కేసులెట్టిన– మల్లమ్మా– రాఁవుఁడుగోడూ– మిగతా వోళ్ళూ– మా ఊరు తిరిగొచ్చినాక– మూడ్రోజులు–మా ఊళ్ళో– యెక్కడ జూసినా– శివరావు బోగట్టానేనండి– శివరావు అంటే– సిట్టిబాబు ఉత్తరం ఇచ్చిన ప్లీడరన్న మాటండి– ఆ బాబూ– సేవగోడేనటండి– బీదోడి కాడ కాణీ పుచ్చుకోడటండి– లచ్చ రూపాయలిచ్చిన బీదోడిమీద కేసు పట్టడట.

"కేసు పెట్టడాని కెళ్ళిన– మా ఊరోళ్ళందరికీ– బోజనం– కరుసు– ఆ బాబే యెట్టేడటండి– కాని ఒక్కిసయవండి– కేసులు

గెలిసినా– నాకు కాణీ ఇయ్యొద్దు. పోతే మాత్తరం నన్నడక్కండి– అవతలోళ్ళు– గొప్పోళ్ళు– జవానుగోడి కాడ్నించీ– జెడిజీబాబు వొరకూ– ఎవుడ్ని పడితే– ఆడ్నికొనీగ(లు" అని స్పష్టంగా జెప్పేసి నాడటండి.

సిట్టిబాబు వొయిజ్జానికీ– శివరావు వోదనకీ– తిరుగుండదని మా ఊరోళ్ళ నమ్మకవండి– ఆ బాబూ ఆస్తున్నవోడే నటండి– యెనకెప్పుడో జెడ్జీపనిస్తావంటే– "అన్నం లేనోళ్ళకి– అన్నేయం జేసే– ఈ ఉజ్జోగం– నా కొద్దు–" అనీసినాడటండి.

❖ ❖ ❖

"యీ యవ్వారా లిలాగుండగా– బీదోళ్ళకి బంజరు బూఁ వుఁలిస్తారని ఊళ్ళో దండోరా ఏసినారండి– కావొలిసినోళ్ళని– కరణానికి అరిజీలు పెట్టుకో మన్నారండి. ముండొస్తాదంటే– యెంత ముసిలోడన్నా– లెగిసినట్టు– బూఁవిఁస్తారంటే– బీదోడు, సచ్చి సగం కాలినోడుకూడా– నెగిసొచ్చేస్తాడండి– జెనం ఇరగ బడి–కరణపోడి కాళ్లు–పట్టుకుని–అరిజీలు–రాయించు కుండీ వోరండి."

"అన్నట్టు సెప్పడం– మరిసిపోనానండి– కేసులెట్టినాక– రావుఁడు గోడు మా పారిటీవోళ్ళ పన్ల లోకే కూలికొచ్చీ వోడండి – మల్లమ్మ– బుచ్చి బాబుగోరి పారిటీవోళ్ళ పన్ల కెళ్ళీదండి– కూలికి–రెండు కేసుల్లోనూ– సాచ్చులు మాత్తరం– పారిటీలు– ఫిరాయించనేదండి. మా బాబులు కూడా. ఆళ్ళు రాజీ అయి పోయినట్టు ఊళ్లో తెలనివ్వలేదండి– సరిగదా– రాఁవుఁడిగోడి కేసుకి– మా బాబూ– మల్లమ్మ కేసుకి– బుచ్చిబాబూ "సపోర్టు" ఇస్తన్నట్టు నటించీవోరండి..పైకి– మా బాబులిద్దరూ– ఒకరు మీదొకరు– బుసకొట్టేవో రండి– లోపల ఇసం లేకపోయినా.

ఓ పొద్దు– మా బాబు పన్లోకి– కూలికొచ్చినాడండి– రాఁ వుఁడుగోడు. అవతలపార్టీ వోళ్ళు లచ్చరూపాయలిచ్చినా– కేసు వొగ్గీవొద్దని– మా బాబు సలహా ఇచ్చినాడండి– అవసరవైఁతే – ఐదరాబాదు కోర్టుకి కాదు– డిల్లీ కోరుటు వొరకూ– తనే మదుపెడతానన్నాడండి."

"అవఁసరవైఁతే– ఐదుకాదు– పదివేలన్నా సరే– మనవే– కరుసెడదాం– నీ సాచ్చుల్ని కూడా మన పారిటీలోకొచ్చీమను. అక్కడ ఆళ్ళకి ముట్టీకన్నా– యెక్కువే ముట్టజెబుదాం. మీ ప్లీడరు కెంత కావాలో జెప్పు– రెండింతలు సదివిద్దాం. కాని కేసు మాత్తరం– బిగించమన్జెప్పు" అన్నాడండి– మా బాబు.

"మా బాబుకి" 'ఫీజు' వొద్దటండి" అన్నాడండి రాఁవుఁడు.

"బంగారం– తీసుకోని కఁవఁసాలోడ్నీ– ఫీజొద్దనీ– ప్లీడరు గోడ్నీ– నమ్మకూడదంటార(రా. 'కాణీ వొద్దు– సరసం జేస్తే చాలు" అనీ సాన్దాన్నీ నమ్మగలఁవఁ(టా! ఆ సంగతి– తర్వాత జూద్దాం గాని– కరణంకాడికెళ్ళి– అరిజెంటుగా– అరిజీ– బంజరుకి– ఇయ్యి. నువు తీసుకెళ్ళరా కెప్టెనూ– కరణం కాడికి– ఈడికేటీ తెల్దు– అక్కడ కబుర్ల లోపడి–కాపురం యెట్టక– బేగొచ్చే యండ ి– మార్కెట్టుకు దాన్యంతోలాల" అని మా బాబు నన్నూ– రాఁ వుఁడిగోడ్నీ– కరణంకాడికి అంపినాడండి.

❖ ❖ ❖

కరణానికి కళ్ళులేవండి– కళ్ళలో పువ్వులేసినాయండి– ఒక కన్ను– నాలాటి సేతగాని డా(టు– ఆపరేసన్ జేసి బొక్కెట్టేసి నాడండి– రెండోకంట్లో పువ్వు– ఆపరేషన్‌కి లేతదేనట గానండి– సూపుకు మాత్తరం– ముదరదేనండి.

"కుసింత దూరంగా ఉంటే–ఆ బాబుకి– మడిసికీ– పశువుకీ తేడా తెలదండి. దగ్గిరికెళ్ళినా– ఆడకీ మొగకీ బేదం తెలదండి.

"కాని– యేమాటకామాటే– జెప్పాలండి. అతగోడు పరమ బక్తుడండి– ఊరి పారిటీల పితలాటకాల్లో– కాలెట్టలేదండి– అసలా మాటకొస్తే ఇల్లువొగ్గి– ఈదిలో కాలుకూడా యెట్టడండి– పేరుకేనండి, ఆ బాబు కరణం– పనంతా అతగోడి మనఁవఁ డే జూసుకుంటాడండి.

మాఁవెఁళ్ళీసరికి– ఆ బాబు వొరండాలో పడక్కుర్సీలో పడు కున్నాడండి– మా అలికిడి ఇని– వొరండాలో యెండ లేక పోయినా– కళ్ళమీద సెయి– అడ్డు పెట్టుకొని మా యేపు జూసి "రాయె–మల్లమ్మా– నీ కన్నేయం అయిపోనాదట– యేటో కలి కాలం– రా– రా– " అన్నాడండి.

"మాం–మల్లమ్మలం గాం–" అని నానంటే "నానండి– రాఁ వుఁడు గోడ్ని" అని రాఁవుఁడన్నాడండి.

"రా! రా! రాఁవుఁడూ– నీకు అన్నేయం జరిగిపోనాదట. కొబ్బరి కాయలు పోతే–మాత్తరం–కొరడాతో కొడతార(టా కలి కాలం కాకపోతేనూ–రా–కూకో" అన్నాడండి.

"మాఁవొఁచ్చినపని తెలజెప్పినామండి.

"టయాం కొచ్చినారు– ఈ పొద్దే మా మనవఁడు అరిజీలు పట్టుకొని– తాలూకాఫీసుకి యెల్లాడు. ఇప్పుడిక– ఆరే వొచ్చి

నాయి– ముందొచ్చిన ఆరిజీలకి ముందిస్తారట– అబ్బాయి పొలానికెళ్ళినాడు– అరగంటలో వొచ్చేస్తాడు. కూకోండి” అన్నాడండి.

“మాఁవుఁ బేగెలి పోవాలండి” అన్నాడు రాఁవుఁడు.

అరగంట కూకున్నావండి– గంట కూకున్నావండి– అబ్బాయి వొచ్చీ జాడ కాన్రేదండి.

“మాఁవెలిపోవాల–” అంటూ రాఁవుఁడుగోడు– మద్దెల వోయించటం ఆరంబించినాడండి.

“బూఁవిఁ కావలిసినోడూ– బిడ్డ కావలసినోడూ– తొంద రపడకూడదురా– నువ్వాగవు– అబ్బాయి రాడు– నానేటి జేసేది–పోనీ రేపొచ్చి అర్జీ రాయించుకో– రెండోవిడత– అరి జీలు మళ్ళీ పుచ్చుకుంటార్లే– ఆరుగురిక్కాదు. అరవై మందిరి కిచ్చినా– ఇంకా మిగులుద్ది. ఆ స్మేసేనం అవతల బంజరు” అన్నాడండి.

“రేపు రాలేం– కేసువోయిదా ఉందన్నాడండి–” రాఁవుఁడు.

“మరైతే– ఓ పన్జెయిరా– అమ్మాయిని పిలిచి– తెల్లకాయితం మీద యేలిముద్దరేసిపో–అబ్బాయొచ్చి నింపుకుంటాడు'' అన్నాడండి.

ఆ ప్రెకారం జేసినాడండి రాఁవుఁడు.

❖ ❖ ❖

“రెణ్నెల్లో మూడ్నెల్లో అయినాయండి. వరసకెళ్ళినట్టు పట్నం యెల్లడం– ప్లీడరు గేదె ఈస్తున్నాదనో– మేస్ట్రీటుబాబు బార్యకి గంటు నొప్పనో– కేసులు వోయిదాలు– పడిపోడం– మాఁవుఁ సెల్లని రూపాలు తిరిగొచ్చీసినట్టు– వొచ్చీడం–” ఇలాగ్గడిసి పోతన్నాయండి రోజులు.

“ఇలాగుండగా– ఒకనాడు రాఁవుఁడిగోడికో రిజిష్టరీ ఉత్తరం వొచ్చినాదండి– ఆడి దూరపుసుట్టం– యెవుడో పటాలంలో ఉన్నాడటండి– ఉత్తరం ఆ సుట్టపోడి కాడ్నించేమో ననుకొని– సిట్టిబాబుకాడికి– పరిగెత్తి కెళ్ళినాడటండి.

“సిట్టిబాబు సదివినాడటండి– ఉత్తరం సుట్టపోడి కాడ్నుంచీ– కాదటండి– ప్లీడరు కాడ్నించటండి–బుల్లిబాబు ప్లీడరు కాడ్నిం చటండి.”

“అందులో– యేఁవఁనుందంటే– రాఁవుడుగోడు– తనకున్న అరెకరా బూఁవీఁ (ఆడికున్నదే అరెకరా సెక్కండి) ఏడాది కిందట– రెండు యేలకి– బుల్లి బాబుకి అమ్మడానికి వొప్పు కొని–పురోణీ (యెగ్రిమెంటు) రాసేడటండి– పదిహేను వొందలు ఎడ్వాన్సు కూడా పుచ్చుకున్నాడటండి–మిగతా అయిదు వొందలు పుచ్చుకుని– బూఁవిఁ సోదీనం జెయ్యమని బుల్లిబాబు అడిగినా సెయ్యలేదటండి. మరంచేత– అయిదు వొందలూ పుచ్చుకొని–బూఁవిఁ సోదీనం జేసీసి– మరియాదగా దస్తావేజు– రాస్తావా– లేకపోతే– దావా ఏసి– బూఁవి సోదీనం– కరుసులతో సహా జేసుకోమంటావా? అనుందటండి.”

“ఆడొక్కడే– మడిసైనట్టూ– మిగతావోళ్ళంతా దెయ్యాలై నట్టు– కొరదుబారిపోయి– యెర్రిజూపు పడిపోనాదండి– రాఁ వుఁడిగోడికి– ఆడికి కాళ్ళూ సేతులు అడ్డం మానీసినాయండి– గోడకి జేరపడిపోనాడండి– ఆడి వోలకం జూస్తే – కూకుండి సచ్చిపోయినోళ్ళా గున్నాడండి.”

“ఆడి కంటికీ సూపు నేదండి.”

“ఆడి నోటికి మాట నేదండి.”

“ఆడికి సెవులు ఇనిపించడం మానీసినాయండి.”

“నా నెక్కడ కరుసులు తెచ్చీదిరో రాఁవుఁడా?” అని ఆడి పెళ్ళం యేడుపు పాట లంకించుకుందండి.

“రాఁవుఁడూ” అని–సిట్టిబాబు– ముచ్చెంమున్నూరు పిలిసి నాడండి.

“ఆడు పలకనేదండి– సూపు మలపనేదండి.”

“సిట్టిబాబు లోపలికెళ్ళి– రెండు మాత్తర్లు దెచ్చి–అయినోట్లో యేసి– నీళ్ళు తాగించేడండి– మాఁవంతా– ఆదుర్దగా జూస్తున్నా వండి– మాత్తర్లు మింగిన మూణ్నివఁషాల వొరకూ అలాగే ఉన్నాడండి– ఉండి–ఉండి–దెయ్యాన్ని జూసినోళ్ళా గాదండి – దెయ్యంలాగే ఓ గావుకేక పెట్టి పక్కకి– వొరిగి పోనాడండి.

“ఆ కేక్కి–ఆస్పత్తిర్లో– పిల్లకి పాలిస్తున్న ఒక తల్లికండి– పాలు ఒక్కపాలి–యెండిపోనాయండి.

“ఆ కేకకి– జడిసిపోయిన ఊరకుక్కలు– తోకలు ముడుచు కొని పారిపోవడవే– గాదండి– వోరంరోజులు– ఆస్పత్తిరి– యీది క్కూడా రానేదండి.”

“రాఁవుఁడుగోడు– సచ్చిపోనాడేటో– అని నాను గాబరా పడిపోనానండి– ఆడు సావనేదండి– మత్తుమందు పుచ్చు కున్నోడిలా– బెమ్మనిద్దర్లో ఉన్నాడండి.”

"ఆ నిద్దర– నిద్దరండి–మళ్ళీ లెగిసీసరికి– మర్నాడు– మద్దేన్నమైం పోనాదండి– నిద్దర్లెగిసేదన్న మాటే గానండి– పిలుస్తే జడుసుకుండీవోడండి– ఆడు మళ్ళా మామూలు మడిసవ డానికి– వోరం రోజులు పట్టిందండి."

"ఆ తరవాతండి– సిట్టిబాబు అన్ని ఇసయాలూ రాంవుం డిగోడ్ని అడిగినాడండి– ఆనక శివరావు ప్లీడరికో ఉత్తరం– ఇచ్చి ఆడ్ని పంపినాడండి– యీ యవ్వారంలో కరణపోడి కుతలపీ– సానా ఉందనీ–ఆడు–రాంవుండిగోడి సేత– యేలిముద్దర యేయించుకున్న– తెల్లకాయితంమీద– బుల్లిబాబు పార్టీ వోళ్ళు– ఫోర్జరి యెగ్గిరిమెంటు బకిరీసుంటారని– ఇలాగేటేటో– సానా రాసినాడండి."

శివరావుబాబు–రాంవుండుగోడి తరపున– జవాబు నోటీసిచ్చి నాడండి.

"రాంవుండుగోడు– రెంటికీ సెడ్డ రేవడి లాగై పోనాడండి– రెండు పార్టీలోళ్ళూ ఆడ్ని కూలికి పిలడం మానీసినారండి– ఆ ఊళ్ళో పని దొరికినప్పుడు– మొగుడూ పెళ్ళాం పోయీవోరండి– లేనప్పుడు–కాళ్ళు ముడుసుకు– తొంగొని నిద్దర్లో సచ్చిపోవా లని– దేంవుడికి దణ్ణాలెట్టుకొనీవోరండి."

## 41

"ఇక కేసులండి– మేస్ట్రీటు బాబు సానా మంచోడటండి– కతికీరకం– గాస్సరిగదా–అలాటోళ్ళంటే–ఆ బాబుకి– అసయ్యం వటండి. సూటిగా పొయ్యీ రంకవటండి. లేకపోతే–మా బాబులూ –ఆళ్ళ ప్లీడర్లూ– ఊరుకుండీ రకాలు గారండి. లంచానికి లొంగు తాడా? లంజకి మొగ్గుతాడా–అని– అన్నీ వోయించీ రకాలేనండి.

పైకి మాత్తరం–మల్లమ్మ ముండ సాచ్చుల్ని నిజం సెప్పొద్దని– మా బాబన్లేదండి– రాంవుండుగోడి సాచ్చుల్ని అబద్దాలు సెప్ప మని– రెండో బాబూ అన్లేదండి.

"రెండు పారిటీల పెద్దోళ్ళూ– పైకి– ఈ కేసుల్తో సమ్మందం లేనట్టే నటించీవోరండి. వోయిదాల రోజుల్లో– కోరటుకి– యిస్సి నాదం బాబూ– రాంవంనాదం బాబే యెల్లీ వోరండి. ఇంకెవరూ పార్టీల పెద్దలు– ఎళ్ళీవోరుగారండి– యేదో వొంక జెప్పి ప్లీడర్లు వోయిదాలు ఏయించీసివోరండి. ఒక వోయిదాకి పారదసారది బాబు తల్లి తద్దినవండి– మరో వాయిదాకి పద్మావొతెమ్మకి గంటునొప్పండి– ఇంకో వోయిదాకి రాంవంనాదం బాబు రామే శ్వరం యాత్తరండి. మరింకో వోయిదాకి– ప్లీడర్లకి సెక్సన్ కోరట్లో "డబుల్ మర్డర్" కేసండి– పిర్యాదీ యెదవలకి– కాళ్లు పీకండి– ఆళ్ళ సాచ్చులికి– కూలి డబ్బులు దండగండి.

మేస్ట్రీటుబాబు ముందలే వోయిదాలు యేసీసినా– గుమాస్తా బాబుల ముడుపులు– సదివించకపోతే– పూచీకత్తులు కట్టీసరికి పొద్దుపోయీదండి– ఆకరి బస్సూ పోయీదండి– పట్నంలోనే రేత్రిళ్ళు పస్తులు పడుక్కొని పొద్దుటి బస్సులో ఊరు జేరీసరికి– లేటైపోనాదని పన్లల్లోకి రానిచ్చీవోరు కారండి.

ఇలాగ– ఆర్నెల్లు తిరిగీసరికండి– కళ్ళంలో కోకిప్పు కోడం గాదండి– కోరట్లో కోకిప్పుకొని గెంతమన్నా సరే–సిద్దవేం– ఈ కేసు ఒగ్గిపోతే జాలు– అన్నట్టు తయారైపోనాదండి మల్లమ్మ. మరోసారి చెండాలెగ్గొట్టీసినా పరవా లేదన్నట్టు అయిపోనాదండి రాంవుండు."

❖ ❖ ❖

"మా బాబూ–నానూ–ఒకపాలి కోరటుకి–మరింకేదో పనుండి– ఈ కేసుల యిచారణ రోజుని యెల్లినావండి.

కోరట్లో– రాంవుండి కేసు ముందు తీసుకున్నారండి.

బోనెక్కి అంతా నిజంవేం జెప్పినాడండి రాంవుండు.

బూంవింలోంచి బాకు పుట్టుకొచ్చినట్టు నెగిసినాడండి– వీరు బాబు– అంటే పార్దసారది బాబు.

నెగిసినాక– మూణ్నిమషాలు మాటాళ్ళేదండి. మళయాళ మంతర గోళ్ళా రాంవుండిగోడియేపు జూసినాడండి. కళ్ళతోనే కొలిసేడండి ఆడ్ని– ఆ తర్వాత తూకాలు యేసిన కంసాలోడు తాసు పక్కని పెట్టీసినట్లు– సేతిలో కాగితాలు పక్కని పెట్టీసి నాడండి. కళ్ళజోడు కూడా తీసీసినాడండి.

ఆ తరవాత– సెవలపిల్లి మీదికి– సిరతపులి గెంతినట్టు– బోనుమీద కొక్కసారి గెంతినాడండి.

అప్పుడు రాంవుడ్ని జూస్తే కడుపు తరుక్కుపోతాదండి.

కట్టుకున్న పెళ్ళం– పెళ్ళిపీటల మీదే పిశేచం అయిపోయి నట్టు, జడిసిపోనాడడాడు. ఆడి గుండె అదటికి ఆడే జడిసి పోతన్నాడండి.

"రాంవుడూ..." రెండో పెళ్ళాన్ని పిలిసినట్టు– ముద్దుగా పిలిసేడండి ప్లీడరు.

"సిత్తవండి" అన్నాడండి రాంవుండు.

"దేనికయ్యా సిత్తం" అనడిగినాడండి పార్ధసారదిబాబు, కళ్ళ జోడెట్టుకుని.

"దేనికి 'సిత్తవో' మరిసిపోనాడండి రాఁవుఁడు.

బెల్లం కొట్టిన రాయిలా అలా జూస్తావేటి? సెప్పు" రగడా యించడం ఆరంబించినాడండి ప్లీడరుబాబు.

రాఁవుఁడుగోడు ముందు శివరావుబాబుని జూసినాడండి. తరవాత తన పాదాలకేసి జూసినాడండి–అయి ముందుకి తిరుగున్నయ్యో– యెనక్కి తిరిగిపోనాయో– జూడ్డానికన్నట్టు–

"మీరు–"రాఁవుఁడూ" అన్నారు. అతగోడు "సిత్తం" అన్నాడు. ఈ సంగతి మరిసిపోతే యెలా?" అని అడ్డుపుల్ల యేసినాడండి శివరావు బాబు.

కళ్ళజోడు తీసీసి–ఆవుని తినీసిన పులి పెయ్యని జూసినట్టు– పేమగా– సారదిబాబు శివరావుబాబుకేసి ఓ పాలిజూసి– "సాచ్చికం మీరు చెప్తారా? రాఁవుఁడ్ని జెప్పనిస్తారా" అని అడిగినాడండి.

"నాను జెప్పింది సాచ్చికవోఁ–గాదో–కోరటువోరికి ఇసె దవేఁ" అన్నాడండి శివరావు బాబు.

"పోనీ–నాటకంలో 'ప్రాంపుటింగు' జేసినట్టు– ప్రాంపుటింగు జేస్తారా?" అని తిరగబడ్డాడండి సారదిబాబు.

"యేటి జేసినా మిమ్మల్ని అడిగి జెయ్యను–మీతో జెప్పి సెయ్యను" అని డ్రిల్లుజేస్తున్న 'హెడ్డు' నిలబడ్డట్టు–ఠంచన్‌గా నిలబడ్డాడండి శివరావు బాబు.

"కేసు–కానీండి" అని ఇసుక్కున్నాడండి మేస్రీటుబాబు.

"చిత్తం" అన్నాడండి సారదిబాబు– అని "రాఁవుఁడూ! మీ ఊళ్ళో రెండు పార్టీలున్నాయి. నిజవేఁనా" అని రాఁవుడ్ని అడి గేడండి.

"నిజవేఁనన్నా"డండి–రాఁవుఁడు.

"పార్టీల నీడర్లు (లీడర్లు) యెవరని" అడిగినాడండి ప్లీడరుబాబు.

పేర్లు జెప్పినాడండి– రాఁవుఁడు.

"నువు బుల్లిబాబు పారిటీ– యేం?"

"కాదన్నాడండి" – రాఁవుఁడు.

"మరైతే యెవురి పారిటీ?"

"బుచ్చిబాబు పారిటీ" అన్నాడండి రాఁవుఁడు.

"మరి ఇస్సినాదం బాబుది?"

"మా పారిటీయేనండి" అన్నాడండి రాఁవుఁడు.

"అవతల పారిటీవోళ్ళని కొట్టడానికి–ప్రేక్టీసుకోసం– ఇస్సి నాదంబాబు నిన్ను కొట్టేడంటావా" అని పిలకపట్టుకున్నా డండి ప్లీడరుబాబు.

"ఆ పెశ్న అడక్కూడదన్నాడండి" శివరావుబాబు.

"అడగొచ్చు–అడిగేను–మళ్ళీ అడుగుతున్నాను" అన్నాడండి సారదిబాబు.

ఆ తరవాత ఇంగ్లీషొచ్చిన కుక్కల్లా దెబ్బలాడుకున్నారండి ఇద్దరు ప్లీడర్లూను.

రాఁవులోరూ–రాఁవఁణాసురుడూ– ఒక్కపాలే పెత్యక్షం– అయితే–యెవరికి ముందు దండం యెట్టాలో తెలనోడిలా– యెర్రిచూపులు జూడ్డం ఆరంబించినాడండి రాఁవుఁడు.

సడెన్‌గా దెబ్బలాట ఆపీసి "ఐతే మీ పారిటీవోడి మీదే కేసు పెట్టీసి కైదుకి కట్టించెయ్యాలని జూస్తన్నావన్నమాట" అని రాఁవుఁడిమీద పడ్డాడండి సారదిబాబు.

కుస్తీ జూస్తున్నవోడు–శాండోలు ఇద్దరూ సడెన్‌గా కుస్తీ మానీసి–తన మీదికి గెంతితే యెల్లాగైపోతాడో అలాగై పోనాడండి రాఁవుఁడు.

ఆడికళ్ళకి సూపు పోనాదండి. నోటికి మాట పోనాదండి.

"యీ బుద్ధి నీకే తోసిందా? మీ లీడరికి పుట్టిందా" రెండు గుళ్ళ తుపాకీ ఒక్కపాలే పేలిసినట్టడిగినాడండి పారదసారది బాబు.

'పోర్సనే' మరిసిపోయిన నాటకపోళ్ళా ఐపోనాడండి– రాఁ వుఁడు.

ఆ తరవాత అప్పడాల పిండిని పిసికినట్టు– రాఁవుఁడ్ని పిసికీడం ఆరంబించినాడండి పారదసారదిబాబు.

"ఈ నేరానికి–సరిగ్గా సంవత్సరం ముందు నీ బూఁవిఁ అమ్మడాని కొప్పుకొని– బుల్లిబాబుకి యెగ్రిమెంటు రాసేవు. ఔనా!"

"నేను రాయనేదండి."

"పోనీ నీ జేత బుల్లిబాబుగోరే రాయించుకున్నారు."

"నేదండి."

"పోనీ– ఈ కాయితం మీదున్న - యేలిముద్దర– జూసి– నీదో–కాదో జెప్పు" అన్నాడండి. అంటూ కరణపోడి ఫోర్జరీ కాగితం పారద సారదిబాబు బయట పెట్టేడండి.

"అదేటి? ఆడి పెళ్ళం ఫొటోనాయేటి? ఈ ఫొటో నీ పెళ్ళాందో కాదో జూసి– సెప్పనడానికి. యెవుడి యేలిముద్దర–ఆడు గురుతుపట్టగలడేటి" పీడకలొచ్చిన పులిలా అరిసినాడండి శివరావుబాబు– ఒక్కుబికినిలెగిసి.

మళ్ళ ఇంగ్లీషు కుక్కలు–మరో అయిదు నిముషాలు కొట్లాడు కున్నాయండి.

దెబ్బలాట ఒక్కపాలి ఆపీసి "శివరావుగోరు సాచ్చెం జెప్పడం మళ్ళీ ఆరంబించినారు" అన్నాడండి సారదిబాబు.

"నాను జెప్పీది సాచ్చికం కాదు" అన్నాడండి శివరావుబాబు.

"సాచ్చికం కాపోతే ఆర్గుమెంటు జెప్తున్నారు. ఆర్గుమెంటు–టయిం– ఇంకా రానేదు" అన్నాడండి సారదిబాబు.

ఇదంతా–ఇంటున్న రాఁవుఁడిగోడు–లారీ కుమ్మేసిన మడి సిలా–అయిపోనాడండి– అప్పుడాడికి– యేటనిపించి ఉంటా దంటే– "నన్నొక్కడినే గాదు– నన్నూ నా పెళ్ళాన్నీ గూడా– ఆర్నెల్లు జెయిలుక్కటేసినా పరవానేదుగాని– నన్ను ఈ బోన్లో నించి ఒగ్గేస్తే– సాలు–" అనిపించి ఉండాలండి.

కూర తిన్నోడు– పచ్చడి మీది కొచ్చినట్టు– శివరావు నొగ్గిసి– రాఁవుఁడిమీది కొచ్చినాడండి సారదిబాబు. "యేటి నీ జెవాబు" అంటూ.

ఆ బాబు పెస్నే మరిసిపోనాడండి రాఁవుఁడు.

"రంకు మొగుడి పక్కలో మొగుడికి దొరికిపోయిన దాన్లా" అయిపోనాడండి– రాఁవుఁడు. ఆడి నాలిక అంగుడికి అంటుకు పోనాదండి.

"సెప్పు బాబూ–నీ దొక్కటేగాదు– ఇంకా సేనా కేసులు న్నాయి కోరటువోరికి" వొల్లనిగుంటకి (పిల్లకి) లవ్ లెట్రురాస్తు న్నట్టుముద్దుగా అడిగేడండి.

"యేటి జెప్పమంటారండి" అని–పోయిన పంచప్రేణాల్లో ఒకటి తిరిగొచ్చినట్టు కుసింత దయిర్యంగానే అడిగినాడండి రాఁవుఁడు.

"నా నేటి జెప్పమంటే–అది జెప్పేస్తావా? నువు పెట్టిన కేసు పచ్చి అబద్దం అని జెప్పమంటాను. చెప్పేస్తావా?" అని ఓ ఆటంబాంబు పేలిసి నాడండి పారద సారదిబాబు.

రాఁవుఁడిగోడికి–తిరిగొచ్చిన ఒక్క పేణం యెళిపోనాదండి.

"యీ యెగ్రిమెంటుమీద–యేలిముద్దర–నీదో–కాదో చెప్ప లేవు–అంతేనా?"

అప్పటికి–పన్నెగేపకవొఁచ్చి–కుసింత ఊపిరందిం దండి –రాఁవుఁడికి–"అంతేనండి" అన్నాడండి.

"పోనీ మరో తెల్లకాయితంమీద–ఇప్పుడు–యేలిముద్దర యేస్తావా? మాఁవేఁ జూసుకుంటాఁవుఁ" అనడిగినాడండి సారది బాబు.

కరణపోడి ఫోర్జరీ దెబ్బతిన్న రాఁవుడిగోడి పరిస్తితే టంటే–పెళ్ళాం, పిల్లల పీకలు ఒక్కపాలే నొక్కేమన్నా–నొక్కడానికి ఆడు సిద్దఁవేఁగాని–ఆడు మరీ జెనమలో యేలిముద్దర – యెయ్యదలుచుకోలేదండి. అంచేత "యెయ్యను" అని గట్టిగానే అరిసినాడండి.

"పబ్లిక్ కోరట్లో కూడా యెయ్యనంటావ్?"

"కోరట్లో–కాస్సరిగదా–కోటలోకూడా యెయ్యను" అని మొండికెత్తేసినాడండి రాఁవుఁడు.

"యెందుకెయ్యడో అడగండి" అన్నాడు శివరావు.

"ఆడికాడ ఫీజు పుచ్చుకున్న–మీరే అడగండి–ఆకర్ని – అడ గాలనుకుంటే" అన్నాడండి పారదసారది బాబు–కళ్ళలోనే మెరు పుల వాన కురిపిస్తూ.

❖ ❖ ❖

ఇంకేటుందండీ–జెప్పడానికి–సందివొచ్చినవోడు సారా తాగినట్టు–జెప్పేడండి–ఆ తరువాత సాచ్చికం–రాఁవుఁడు.

కేసు ముమ్మాటు తేలి మునిగి పోనాదండి.

ఒక్క మేస్ట్రీటు–బాటే కాదండి–ఆ బాబు జెవాన్లు కూడా–రాఁ వుఁడిది మా పారిటీయే అని నమ్మీసినారండి.

"ఇక్కడితో ఈ కేసు–ఊసు ఒగ్గీస్తానండి."

## 42

"ఇక మల్లమ్మ ముండ కేసండి.....

అది–శివరావుబాబు–అడిగినంత సేపూ–నిజఁవేఁ జెప్పినా దండి–అడగ వొలసిందంతా–అడిగేసినాక – శివరావు బాబు – కురిసీలో కూకున్నాడండి.

కళ్ళు మూసుకొని తపస్సుజేస్తున్న పులిలా - అంత వొరకూ - కురిసీలో కూర్చున్న పద్మావొతెమ్మ-బిద్ధకంగా - నెగిసిందండి.

"ఆ యెనక-కంటున్న తల్లికాడికి-మంతర్సాని ముందెళ్ళి నట్టు-సల్లగెళ్ళినాదండి- మల్లమ్మకాడికి."

"సూడు మల్లమ్మా-నీ వయసెంత? అని తొలికానుపు తల్లిని మంతర్సాని అడిగినట్టు-సల్లగానే అడిగినాదండి.

గరబాదానంనాడు-సిగ్గుపడ్డాదో లేదో తెల్దుగానండీ - అప్పుడు మాత్తరం సిగ్గు ముంచెత్తుకొచ్చేసినాదండి మల్లమ్మకి.

పెళ్ళిసూపుల్లో-పెళ్ళికూతురు జూసినట్టు-జూసినాదండి మల్లమ్మ-పద్మావొతెమ్మని.

"చెప్పమ్మా-నీ వొయె సెంతో-" మెల్లగానే అడిగినాదండి పద్మావొతెమ్మ.

"తెల్దండి" అందండి మల్లమ్మ.

మరంతేనండి-అంతవొరకూ పొరమీదున్న నాగుపాఁవుఁ లా ఉన్న-పద్మావొతెమ్మ-పొర ఒక్కపాలి ఒగ్గేసి-పడగ - ఇప్పినా దండి.

"ఏటి తెల్దు-చెప్పడం తెల్దా? వొయెసు తెల్దా?"

"వొయెసేనండి".

"పోనీ ఉరమరగా చెప్పు తల్లీ....ఓ యాబై ఉంటాయా!"

"ఉండవండి."

"నలబై తొమ్మి దుంటాయా?"

"అన్నెందుకుంటాయండి."

"నా పేనం ఇసిగించక- యాబై ఉంటాయా-అంటే, ఉండవంటావ్-నలబై తొమ్మిదుంటాయా-అంటే అన్నెందు కుంటాయంటావ్-నా జేత- యెక్కాలు- సదివించక - యెన్నుం టాయో-నువ్వే చెప్పు తల్లీ?"

"పదహారు ఉండొచ్చండి."

"నీకో మనవడున్నాడు."

"ఉన్నాడండి-"

"ఆడు నీ కూతురు కొడుకు, అవునా?"

"నాకు కొడుకుల్లేరండి."

"నీకు కొడుకులున్నారా అనడిగేనా?"

"నేదండి."

"మరి నీకు కొడుకుల్లేరని యెందుకన్నావ్?"

"మీరు అడుగుతారనుకున్నానండి."

"నా నేటి అడుగుతానో-నీకు ముందే తెలిసిపోద్దంటావ్ తపస్సు జేస్తావా?"

"కూలిపని జేస్తానండి."

"ఇదుగో మల్లమ్మా- ఇది కోరటు- ఇక్కడ-అడిగినదానికే జెవాబు- చెప్పాల. ఇది మన ఇల్లు కాదు. సింతపండుందా అంటే బెల్లంముక్క లేదనడానికి."

అంతవరకూ- కోరట్లో యేం జరుగుతున్నాదో కుసింత- కుసింత తెలుస్తున్న మల్లమ్మకి- ఈ తపస్సూ- సింత పండూ - బెల్లం ముక్కల్తో- యేఁవీఁ అరదం అవడం మానీసి నాదండి.

"నీ కో మనవడున్నాడు."

"కూతురి కొడుకండి."

"ఆడికి ఐదేళ్ళు."

"తెల్దండి."

"పాలు మానీసినాడా?"

"మానీసినాడండి."

"గాలివోన యేడు పుట్టేడు?"

"ఔనండి."

"వాడ్ని నీ కూతురు-పెద్దమనిషైనాక కన్నాదా-ముందే కన్నాదా?"

"పెద్దమనిషవకుండా పిల్లలు పుడతారేటండి?"

"చూడు నాను జదివింది- ప్లీడరీ- వొయిజ్జెంగాదు. అడిగిం దనానికి చెప్పుదూ తల్లల్లీ....."

"పెద్దమనిషయ్యాకే కన్నాదండి."

"ఆదది-పెద్దమనిషి- పదమూడు- పద్నాలుగేళ్ళకి అభివృద్ధి నిజవేఁనా?"

"నిజవేఁనండి."

"నీ కూతురికి పెద్దమనిషయ్యేసరికి -పదమూదేళ్ళుం టాయ నుకుందాం - పిల్లడు- పుట్టేసరకి- పద్నాలుగు- దాని కొడుక్కి ఇప్పుడైదు- అంటే దానికి పందొమ్మిదేళ్ళుంటాయి, ఔనా?"

"మరంతేనండి."

"నీ కూతురుకి పందొమ్మిదేళ్ళున్నా- నువ్వు మాత్తరం పద హారేళ్ళ బాలాకుమారినంటావ్?"

దాంట్లో కోరట్లో ఉన్నోళ్ళంతా గొల్లుమన్నారండి-ఆళ్ళ నవ్వులు దెయ్యాల నవ్వులా ఇనిపించి-గాబరా పడిపోనాదండి మల్లమ్మ.

"నువ్వు అందంగా ఉన్నాననుకుంటావా?"

"నా కందవేఁటండి-నా మొకం."

"అదేనమ్మా- నీ మొకం. అందంగా ఉందా? ఉందనుకుం టున్నావా? ఉందని యెవరేనా అన్నారా?"

"నాకు యేఁవీఁ అరదం గావడం లేదండి."

"అరదంగాక పోడానికి-నేను మళయాళం-మాట్టాడ్డం లేదమ్మా-తెలుగులోనే అడుగుతున్నాను. పోనీ-ఈ సంగతి జెప్పు- రాఁవఁనాదం బాబు- నీకన్నా సిన్నేనా?"

"నాను కాపరానికొచ్చేసరికి-ఆ బాబు తల్లికాడ పాలు తాగుతున్నాడండి. నా కన్నా సిన్నేనండి.

"అంటే-నీ అందం జూడ్డానికి-నీ కోక-ఇప్పుండడు- అంతేనా?"

"అంతేనండి."

ఆ తరవాత-బుచ్చిబాబు పారిటీవోళ్ళని పదిమందిరి పెద్దోళ్ళ పేర్లు జెప్పి- "నువ్వూ ఆళ్ళకాడికి కూలికెళ్తావ్" అనడిగింది పద్మావొతెమ్మ.

ఆళ్ళకాడ మల్లమ్మ కూలిపని జేస్తున్న మాట నిజమేఁనండి- గాని- రాఁవఁనాదం బాబు అగాయిత్యం జేసినాకే- ఆళ్ళ పనుల్లోకి యెల్తున్నాదండి మల్లమ్మ.

"ఆళ్ళకాడ యెప్పట్నుంచీ పనిజేస్తున్నాదో అడగండి" అన్నాదండి శివరావుబాబు.

"నానేటి అడగాలో- యేటి అడక్కూడదో నాకు తెలుసు- నా నేదన్నా మరిసిపోతే నా సీనియరు- ఆచారిగోరున్నారు- పక్కని- గేపకం జెయ్యడానికి- కాబట్టి శివరావుగోరిని- నా సీనియర్ పని చెయ్యవద్దని దయచేసి చెప్తారా" అందండా యమ్మ- మేస్ట్రీటుగోరితో.

"ఆ తరవాత నీది బుచ్చిబాబు పారిటీ" అంది మల్లమ్మతో.

కాదన్నాది మల్లమ్మ.

"పోనీ- నువు కూలికి వెళ్ళేవోళ్ళవి-పదిపేర్లు- జెప్పినావే- ఆళ్ళది- బుచ్చిబాబు పారిటీయేనా-" అనడిగిందండి పద్మా వొతెమ్మ.

ఆళ్ళది బుచ్చిబాబు పారిటీయే యని మల్లమ్మ వొప్పీసు కున్నాదండి.

ప్లీడర్లు-ఇలా సాచ్చుల తోకలు ముడేసేసినారండి. తలలు తెగ్గొట్టేసినారండి.

❖ ❖ ❖

మరో- మూణ్నెల్లకి- కేసులు- సంకనాకి పోనాయండి- ఇస్సినా దాన్నీ-రాఁవఁనాదాన్నీ కోరటువోరు-బాణాల్లా వొగ్గేసి నారండి. ఆళ్ళని ఒగ్గేసిన్నాదు -ఇద్దరు పారిటీలోల్లూ పెద్ద ఇందు (విందు) జేసుకున్నారండి-అయ్యేళే సంపిన కోళ్ళ ఈకలు ముప్పయి పరుపులు కుట్టించుకున్నా ఇంకా మిగిలిపోతాయండి.

కాని ఇచిత్తరవేఁటంటే-ఇందు పెద్దోళ్ళే జేసుకున్నారు- గాని - రెండు పార్టీల్లోనూ కూడా-ఒక్క కూలి నా కొడుకునైనా పిల్నేదండి.

మాంసం బాగా వొండుతాదన్జెప్పి- ఒంటంతా మా యాద దాన్చేతే జేయించినారండి-గానండి- వొంటైతే జేసింది- గానండి-వొణ్ణం మెతుకు ఒక్కటైనా నోట్లో యెట్టలేదండి- అది. "ఈ వొణ్ణం నీతున్న పంది కూడా తిందు" అనీసినాదండి.

❖ ❖ ❖

మరంతేనండి-తఁవఁరుగోరు-అసలు పాయింటు గ్రెహిం చాల- ఊళ్లో పాతపార్టీలు పోనాయండి- కొత్తపార్టీలు నెగిసి నాయండి.

పెద్దోళ్ళ పార్టీకి- మునపట్లాగే- మా బాబులిద్దరూ నీడర్లండి (లీడర్లండి) వొనవోసం తరువాత సీతా- రాఁవుఁలోరు-లాగా- ఇద్దరూ-ఒకర్నొకరు- అరచ్చెణం ఒగ్గేవోరు గారండి.

రెండోపార్టీ- బీదోళ్ళ పార్టీకి- సిట్టిబాబు నీడరండి. ఆ బాబుని వొయిజ్జాని కూడా పిలడం మానీసినారండి పెద్దోళ్ళు- అంతేగాదండి- సిటీనుంచి-ఒక కుర్రముండ డాక్టరమ్మను పిలిపించి-ఆవిడగోరిజేత- ఊళ్ళో ఆస్పత్తిరి యెట్టించీనారండి- ఆడకీ-మొగకీ కూడా పనికొస్తాదని. ఆ డాక్టరమ్మకాడో- కిరస్తానీ మంతర్సానండి- ఇలాగెలా గుందంటే- సేవొచ్చిన సింతపిక్కా-

వోసనొచ్చిన మల్లిమొగ్గా కలిసి జేసినట్టుందండి- అదిగాని పెళ్ళాడతానంటే- శివాలయం ముసిలి పూజారి- ఇబూది పండుకి యెంట్రుకలు మొలిసినట్టుంటాడే ముసలోడు- అదిగో అలాటోడు గూడా మతం మారిచీసుకుంటాడండి. దాన్ని ఒగ్గే స్తానండి- దాని కిందులో 'పోర్సన్' లేదండి- దానికత- కావా లంటే మరోపాలి జెప్తానండి.

ఊరు ఎలా సీలిపోనాదంటే- బీదోడు- సుట్ట అంటించు కోడానికి- గొప్పోడు- అగ్గిపెట్టియ్యడు- సరిగదా- కాలుతున్న తన సుట్టకూడా ఇయ్యడండి- గొప్పోళ్ళ గుంట- కన్ను కొట్టడం కాస్సరిగదా- కాళ్ళట్టుకుని దణ్ణం- యెట్టినాసరే-బీదోడు దాని కాడ తొంగోడండి-ఆళ్ళ ఆడకుక్క-ఈళ్ళ మొగకుక్క యెంట పడినా- అంతేనండి.

రెండు పారిటీలోళ్ళూ-యెవరూ యెవర్నీ- తిట్టరండి- కొట్ట రండి. పైకి ఊరు సల్లగానే ఉండీదండి- కాని యెప్పుడో ఒక నాడు- ఉప్పెనొచ్చి- ఊర్ని ముంచెస్తాదనీ- రెండుపారిటీల- మద్దెల- బారతయుద్దం తప్పదని- ఊళ్ళో మనుషులకే కాదండి- కుక్కల్కూడా తెలుసండి.

కానీ- బూఁవిఁ యెప్పుడు పగులుద్దో- ఎక్కడ పగులుద్దో యెవరికీ తెలదండి-కానీ ఊళ్ళో యే పారిటీ వోడికి అన్నేయం జరిగినా ఆడి పారిటీవోళ్ళంతా కలిసి రెండో పారిటీవోళ్ళని- ఆళ్ళ కుక్కలూ-కోళ్ళతోకూడా-తవ్విపాతేస్తారని అందరికీ తెలుసండి.

మా బాబులిద్దరూ-లాలోసి ఐపోనాక- నన్ను సిటీ తీసి కెళ్ళడం తగ్గించీసినారండి- కానండి సిట్టిబాబు కాడ కూపీలు- పీకమని- ఉసిగొలిపీ వోరండి.

ఒక్కమాట జెప్పడం మరిసిపోనానండి- ఇసయాలు- ఇలా ఇషమించక- మునిపే- పొలాలు-ఊడుపులైపోనాయండి- అంచేత కూలోళ్ళకి పనులుండీవీ కావండి- మళ్ళీ కోత లొస్తేనేనండి-ఆళ్ళకి పన్లు.

❖ ❖ ❖

గేదె-గొర్రె ఉన్న బీదోళ్ళు ఆట్ని మేపుకోటానికి పోయీ వోరండి.

లేనోళ్ళు-సిట్టిబాబు కాడికి- జేరీవోరండి-సంకటాలకి వొయిజ్జం జేయించుకోడానికో- నేకపోతే-సంగతులు- ఇన డానికో-

మా యాడది గూడా-సిట్టిబాబు కాడికి- తరసూ-యెళ్ళడం 'బిగిన్' జేసిందండి."

"నీ కెందుకే- ఈ 'లిటిగేషనూ?" అని నా నడిగితే- "ఊరు తగలబడతాదని తెలిసినాక- ఫైర్ డిపార్టుమెంటు కెళ్ళాలా? ఫారెస్టు డిపార్టుమెంటుకెళ్ళాలా? మీ బాబులు-పెట్టీ అగ్గి సల్చార్చీ వోడూ- సిట్టిబాబే- సరిజేసీవోడూ-సిట్టిబాబే-

ఆ బాబుకాడ- కూపీలు లాగడానికి- నిన్ను- మీ బాబులు- యెళ్ళమన్నారు.

నిన్నెళ్ళమంటే- మీ యాడదెందుకు- యెళ్తున్నాదిరా? అని మీ బాబులు నిన్నడుగుతే-

నీకు దయిర్య ఉంటే- సిట్టిబాబుకి సపోర్టు- యెళ్తున్నాదని చెప్పు.

దయిర్యం- నేకపోతే- సిట్టిబాబుని తగులుకున్నాదన్జెప్పు.

నీకు నిజంగా- గుండే- దాంట్లో దయిర్యవూ- ఉంటే- నువుగూడా- సిట్టిబాబు పారిటీలో- పబ్లిగ్గా జేరిపో.

నానూ ఒకప్పుడు-ఒళ్ళమ్ముకొని బతికినదాన్నే-గాని ఇప్పుడు-నా వొళ్ళూ నా బతుకూ నాయి.

నువు-ఇంకా వొళ్ళమ్ముకొని బతుకుతున్నావ్- ఇప్పటి వొరకూ అమ్ముకున్నది సాలు- ఈ లుచ్చాపనొగ్గేసి- బతికీ నాలుగు రోజులూ- దయిర్యంగా బతుకు. దర్మానికిబతుకు- వీలైతే మీ పార్టీ- వొగ్గేసి లోపు మీ ఇద్దరి బాబుల పీకలూ కోసేసి మరీ- పార్టీ పిరాయించు.

కాని ఈ మొగ-లంజరికం మానీ" అని కాండ్రించి ఉమ్మి నాదండి.

అప్పుడు దాన్ని జూస్తేనండీ- అమ్మోరు పూనిన మనిషిలా కాదండి-అమ్మోరిలాగే ఉన్నాదండి. ఇన్నాళ్ళూ దీనికాడే తొంగు న్నానా? ఇది మనిషా? కాఁవిణీనా? అని బయవేఁసిపోనాదండి.

❖ ❖ ❖

"ఒకసారి మాఁవంతా సిట్టిబాబుకాడ కూకున్నావండి.-

అది సలికాలవండి.

సాయంత్రవండి. సలిసల్లగా ఉందండి.

సింత సెట్లలో సిక్కుకున్న సూరీదు ఆరిపోయీ ముందు దీపంలా- భగ్గుమంటున్నాదండి.

అప్పుడు చాలామందివేఁ ఉన్నావండి- మా యాడది- కూడా ఉన్నాదండి.

ఈలోగా సప్పుళ్ళేకుండా- దెయ్యం- లాగొచ్చి నిలబడ్డాడండి రాఁవుఁడు.

"కూచోవోయ్! రాఁవుఁడూ" అన్నాడండి సిట్టిబాబు.

"ఈ ఊళ్ళో- ఇక కూకోడానిక్కాదు- సరిగదా నిలబడ్డానికి కూడా సోటుండదండి- కోతలకి మనూరి కూలీల్ని పిలవ రటండి- పక్కూళ్ళ నుంచి తెప్పిస్తారటండి- కూలీల్ని" అన్నా డండి రాఁవుఁడు.

కోతలప్పటికి పది-పదిహేను రోజులుంటాయండి.

మావూరి కూలీల్ని- బాబులు కోతలకి పిలవకపోతే- ఆళ్ళు పీకలు కోసీసుకోవలసిందే నండి-పెళ్ళాం పిల్లల్తో-

"ఇంత అన్నేయవాఁ?" అన్నాదండి మా యాడది.

"పక్కూరి "నేబర్ని" (లేబర్ని) ఈ ఊరికి కూలికి రావొద్దని బతిమిలాడుదారి" అన్నాడం డెవడో.

"అంతవొరకూ-వొస్తే అట్నుంచి సరుక్కువొద్దాం. మీ రెవరూ తొందర పడకండి" అన్నాడండి సిట్టిబాబు.

"ఆ తర్వాత- చాలాసేపు- మాటాడినాం గానండి గుండెలు బరువెక్కిపోయి మాటలు పెగిలీయిగాదండి."

ఆ మర్నాడు- పొద్దుటండి- మా బాబడిగాడండి- "యేఁటో సిట్టిబాబు నిన్న సాయింత్రం మీటింగెట్టినట్టున్నాడు" అని.

"యెట్టేడండి" అన్నానండి.

"మీ యాడదిగూడా యెళ్ళిందట!"

"సిత్తం వొచ్చినాదండి-దానికి గంటు నొప్పండి."

"గంటునొప్పైనా- పంటినొప్పైనా లేడీడాట్రుంది గాదురా - ఆ యెగస్పార్టీ యెదవకాడికి- యెళ్ళడం- దేనికీ?

అనడిగినాడండి-ఆ బాబుకేదో అనుమానవొఁచ్చినా దనిపిం చినాదండి. నా మట్టుకు, నాకు.

నాను ఆలోసించకుండా అనీసినానండి- "మొదట్లో నా నొక్కద్నే యెడితే సిట్టిబాబు నన్ను నమ్మడన్జెప్పి దాన్నికూడా రమ్మనీవోడినండి- వొచ్చింది వొచ్చినట్టు కూకోక- సిన్నదానికీ పెద్దదానికీ వొయిజ్జెం సేయించుకోడం ఆరంబించినాదండి- దానికి గంటునొప్పండి- దానికితోడు నెలకు మూడుమాట్లు బయట కూకుంటాదండి. దానికి ఆ బాబు వొయిజ్జెంలో గుణం కనిపించినాదండి. దాంతో ఆ బాబు "అస్తవాసి" మంచిదని దానికి నమ్మకం యేర్పడిపోనాదండి- మన డాట్రమ్మ వొచ్చి నాక-ఆ బాబు నొగ్గీసి- ఈ యమ్మ కాడికెళ్లవే- అంటే- యేట న్నదో బాబూ- యెరికా- డాట్టర్నీ- డాఫర్నీ మారసగూడదు అందండి- సెప్పుకుంటే సిగ్గు. అదొకప్పుడు "యాపారం"లో ఉండీదిగదండీ- దాని నమ్మకాలూ- సాఁవెఁతలూ అన్నీ ఇలాటి య్యేనండి" అన్నానండి.

"ఆనకూతురు-అంటీముట్టకుండా అవతల పార్టీలో ఉంటేనే మంచిదిలే- ఇంతకీ మీటింగు సంగతులేటి- ఆ సత్తరికాయగోడి బోడి ప్లాను ఏటి? ఊరంటించీస్తాడా? సెరవులు తెగ్గొట్టిం చీస్తాడా? అనడిగినాడండి.

"తెగ్గొట్టించేస్తాడట- గానండి బాబు- సెరువులు మాత్తరం గావటండి."

"మరేటి తెగ్గొట్టిస్తాడు, కూలి గుంటలని తగులుకొని ఆళ్ళ మెళ్ళల్లో తాళ్ళా?"

"తాళ్ళుగావు బాబూ, మెళ్ళు (మెడలు)"

"యెవురియిరా?"

"మనయ్యేనండి- ఆళ్ళ పీకలు ఆళ్ళే కోసుకొనీటంత- యెర్రి గొఱ్ఱెలు గారండి- అవతలపార్టీ వోళ్ళు."

"మన పీకలెందుకు కోస్తార్రా!"

"మన కోతలకి మనూరి "నేబర్ని" (లేబర్ని) పిలకపోతే మన పీకలే కోసేస్తాడటండి- సిట్టిబాబు."

"అంత "హీరో" అయ్యేడ్రా కుర్ర నంజికొడుకు. పొలం నాది. పంటనాది. కోతకి నాకు ఇష్టంలేని నేబర్ని పిల్ను- ఇష్టం ఉన్నోళ్ళని పిలుస్తాను. పక్కూరివాళ్ళని పిలుస్తాను. నా యిష్టం. ఆళ్ళు రాకపోతే పోలీసోళ్ళచేత కోయిస్తాను. ఆళ్ళూ రాకపోతే మిలిటరీవోళ్ళచేత కోయిస్తాను. ఆళ్ళూ రాకపోతే రిజర్వోళ్ళూ, ఆళ్ళూ రాకపోతే పంటెండబెట్టీసి పసువుల జేత మేయింపిం చేస్తాను. మనూరి నేబరు ఊరిడిసి -వొలసెళ్ళిపోవాల- నేకపోతే మనూళ్ళోనే, మలమల మాడి సావాల, బెమ్మం (బ్రహ్మంగోరి) మాట తప్పుతే-తప్పిద్దిగాని-నాది తప్పదు.

నా మాటలు దాచక, ఆ కుర్రడాట్రుగోడికీ-ఆడి పార్టీ కూలి నంజి కొడుకులకీ- చెప్పు. డప్పేసి కొట్టి మరీ చెప్పు.

"దొంగదెబ్బ మన వంశంలో లేదు.

వార్నింగ్ ఇస్తేనే గాని పంజా ఇప్పం మనం.

అంచేత- ఇప్పుడే యెళ్ళి జెప్పు 'ఒరేయ్ కుర్రదాట్రు యెదవా? ఒరేయ్ కూలిలంజికొడుకుల్లారా- మా పొలాల్లో- పంటలుకాదు సరిగదా-గట్లమీద గడ్డి కూడా కొయ్యడానికి మిమ్మల్నెట్టుకోవుఁ.

మీరంతా సేతులు కట్టుకొని సవుఁద్రంలోనే దిగుతారో తాళ్ళు కట్టుకొని పీకలే యేలాడదీసుకుంటారో- ముందరే ఆలోసించు కోండి. అన్జెప్పు.

పక్కూళ్ళ నుంచి నేబరు రాకపోతే పక్కజిల్లాల్నించి నారీ (లారీ) ల్లో దింపుతాఁవఁని-అడ్డొస్తే- పిట్టల్ని కాల్చినట్టు కాల్చే స్తారనీ- మనం గాదు- పోలీసోళ్ళు- అంచేత- పిల్లాపాపా- యెదిగి బాగుండాలంటే- కూలోళ్ళని పై ఊళ్ళూ- డాట్రు యెద వని "చెయినా" పొమ్మని చెప్పు.

కుళ్ళునీళ్ళు తాగి పస్తున్న కూలినంజి కొడుకులుకి- పోనీ గదా అని మంచినీళ్ళ నుయ్యి తవ్విస్తే మంచినీళ్ళు తాగి- ఇలాంటి తప్పుడు బుద్దులు కట్రా పోతారు?

దొంగతనాలు చేసేరు. యెంతకాలంలో ఉన్న గుంటైనా (పిల్లయినా) దొంగతనంజేస్తే ఓ దెబ్బెయ్యక ముద్దు పెట్టుకుం టార్రా? అంచేత ఓ దెబ్బేసినంత మాత్తరాన- కట్టు కడతారా? కోరటు కీడుస్తారా?

"కోరట్లలో యేటొద్దో- కూలెదవలకి తెలకపోతే పోనాది- గాని- ఆ కుక్కల డాట్రుగోడికి తెలవొద్దూ?

ఈడో రుపోర్టు (రిపోర్టు) బకిరీసి-దానికో రూపాయి స్టాంపు- నాలికతో నాకీసి అంటించీసినంత మాత్తరాన- కోరటు మమ్మల్నందర్నీ కైదుకి కట్టేస్తాదా? ఉరేసేస్తాదా? మాం- పోలీ సుల్నీ- సాచ్చుల్నీ- డాక్టర్లనీ- ప్లీడర్లనీ- ఆకిరికి కోరట్లనీ కూడా కొనీగలం- అమ్మీగలం.

మా మాట గాదని-యీ రాజ్జెంలో ఎవుడూ- నీళ్ళు తాగ లేడు- నిలబడలేడు.

కుళ్ళులో- పురుగుల్లా- కిలకిలా కొట్టుకు- బతుకుతున్న కూలెదవల్ని- పోనీగదా అని జాలిబడి- వొద్దుకి జేరిసి- వొణ్ణం- యెడితే- మంచి పాఠవేఁ నేర్పేర్రా గాడిద కొడుకులు. కూడేసిన- సెయ్యిని- కుక్క కూడా కరవదురా- కరవగలిగీవోడూ- కరిసీ వోడూ కూలోడేన్రా.

ఒంటిపూట తిన్నన్నాళ్ళే- కూలోళ్ళు- రెండుపూట్లా తిన్నారో నాడు కానుకోనేదుగాని- సంగాలెట్టీక మాన్రు. యెట్టినోళ్లు- యెట్టినట్టు ఊరుకుంటారా? ఊఁహూఁ! ఊరుకోరు.

ముందు బూఁవుఁలు గావాలంటారు!

యెవిరియి?

గవర్నమెంటు వనుకునేవ్?

మనయ్యి- మన బూఁవుఁలు-కావాలంటారు.

బూఁవులిస్తే ఇళ్ళు గావాలంటారా?

"అయీ-ఇస్తే వుజ్జోగాలుకావాలంటారు?

ఉజ్జోగాలిస్తే యేటి గావాలంటారో- యెరికా? మీ పిల్లల్నిచ్చి పెళ్ళిళ్ళు జెయ్యండంటారు.

యియ్యన్నీ జేస్తే యేటొద్దో యెరికా?

మాం కూలోళ్ళవై ఁపోతాం.

తెలివితక్కు వెదవని- ఒక్కపూట పస్తుపడుకుండీ- యెదవ లకి- రెండు పూట్లా- వొణ్ణం ఉండీటట్టు జేద్దారని జూసేను- చేస్తే యేటైందో చూసేవ్ గదా!

నా పంట కోతకి నా కిష్టంవొఁచ్చిన కూలోళ్ళని తెచ్చు కోడా నికీల్లేదని ఇయ్యేళ- అంటున్నారు.

"రేప్పొద్దున- నా కూతురికి నా కిష్టంవొచ్చిన మొగుడ్ని తేడాని కీల్లేదంటారు.

ఇక నాను నోటితో లెక్కర్లియ్యను.

చేత్తో- చేసి-జూపిస్తాను.

నాను ముందే- జెప్పినాను- నాది దరమయుద్దవఁని."

గట్టుమీద గడ్డి కొయ్యడాని క్కూడా మనూరెదవల్ని- పిల వనని- బొట్టూ- కాటుకా- చీవాట్లూ- చెప్పుదెబ్బలూ- పెట్టి మరీ చెప్పు.

"ఆళ్ళని పిలకలు పీక్కోమను."

అనాగిపోనాడండి మా బాబు.

తవఁరుగోరెప్పుడన్నా జూసినారో- నేదోగాని- గౌడుగీద- ఈనీటప్పుడెలా ఆయాసపడుద్దో- అలా ఆయాసపడిపోనాడు మా బాబు. అసలే ఆస్తిపరుడూ- ఈ ఆయాసానికి- హార్టెటాకే వొస్తాదేమో ననుకున్నానండి.

మా బాబన్న మాటలు– పువ్వులు దండ గుచ్చినట్టు– జెప్పినా నండి సిట్టిబాబుతో."

"నా ననుకున్నకన్నా– సీరియస్సయి పోతన్నాదిరా పరిస్తితి" అన్నాడండి– ఆ బాబు. ఆ యెంటనే కూలీలందర్నీ– పిలవనంపి – మీటింగెట్టి నాడండి. బెల్లం దిమ్మకాడ– కండసీవఁలు – జేరినట్టు– పోగైపోనారండి– ప్రెజ.

"వొచ్చీయి– వరికోతలు గావు. మన పీకల కోతలు– దీంతో మనం– ఊళ్ళో ఉండడవోఁ– సంద్రంలో ములగడవోఁ తేలి పోద్ది. సిన్నా పెద్దా– ఆడా మొగా– అంతా కలిసున్నావాఁ – సరే– కాని– ఒక్కడు– వొసిలినా– హోల్– మొత్తం– పారిటీనే– ములిగిపోద్ది. యెక్కడ– యే బీదోడికి– అన్నేయం జరిగినా మన వందరం– కలిసి కొట్టాల. రావణాసురుడులాటోడు– కోతుల దండుకి తట్టుకోలేక పోనీడు. సీఁవఁలన్నీ కలిసి– కరిసేస్తే– నాగుబాఁవు– కాదు – కొండసిలవే– కిలకిల– సస్తాది. కానీ– ఒక్కిసయం– పాఁవుఁసచ్చీలోపుని కొన్ని సీఁవఁలు సావక తప్పదు. మన్లో కొంతమందిరన్నా సావుదెబ్బలు తినక తప్పదు– సస్తే సావనూ వొచ్చు. కాబట్టి– ముందుకి అడుగేసీలోపలే– బాగా ఆలోసించుకోండి.

పేణాలకి– తెగించి యుద్దాన్ని కెళ్ళడవోఁ?–

మానాలు– వొగ్గీసుకొని– ఆళ్ళకి లొంగిపోయి– ఇది వరకటి కన్నా– కనికిష్టపు బతుకులు– కుళ్ళు బతుకులు– సావు బతుకులు– గజ్జికుక్కల్లా బతికీడవోఁ.

లొంగిపోదలుసుకుంటే– యవ్వారం ఇంకా–ముదరక మునుపే– ఇదే టయాం. మీరు లొంగిపొండి.

"నాను–ఆళ్ళ కాళ్ళకీ–మీ కాళ్ళకీ– చెరో దణ్ణవూ– యెట్టీసి– ఊరొగ్గేస్తాను. నాను లేకపోతే మీరు మామూలుగా బతికెయ్యొచ్చు. బాగా ఆలోసించుకోండి" అని ఆగిపోనాడండి– ఆ బాబు.

"మా బతుకుల్లోకి సల్లగా– సందమాఁవఁలా గొచ్చినారు. మీరెళ్ళి పోతే– మాకంతా సీకటే– గబ్బిలాల్లాగా మావంతా తలకిందులుగా బతకాలి– మరంచేత మావంతా సచ్చినా సరే– గాని– మీరు– ఊరొగ్గడానికీల్లేదు" అన్నారండి అంతమందిరీను.

"మీలో ఒక్కరికన్నా– సరే– దెబ్బలాట–ఇష్టం నేకపోయినా– అటు జేరిపోవాలన్నా– ఇదే టయాం– తరవాత– పార్టీ– ఫిరాయిస్తే రెండు సోట్లా– ఇలువుండదు" అన్నాడండా బాబు.

కాని– ఏ ఒక్కడూ– అవతల పార్టీ కెళ్ళడానికి– వొప్పుకో లేదండి.

"మంత్రం సదివినట్టు– మళ్ళీ మళ్ళీ సెబుతున్నాను. మన్లో– యే ఒక్కడికి– అన్నేయం జరిగినా–అంతా కలిసి కొట్టాల– మరిసి పోకండి" అని మరోసారి– హుషారిచ్చినాడండి– ఆ బాబు.

అప్పుడు అక్కడ జేరినవోళ్ళ మొకాలు జూస్తే– పాత యెర్రి గొర్రెల మొకాల్లా లేవండి– వీర నక్సలైట్ల మొకాల్లా– యెర్రగా యెలిగి పోతున్నాయండి. ఆళ్ళ ఉబలాటం జూస్తే– యెలా గుందంటే– అప్పుడే ఆళ్ళని ఊరిమీదికి ఒగ్గేస్తే– అవతల పారిటీవోళ్ళని అందర్నీ–సంపీసి–ఉప్పు, కారం అదక్కుండా– ఆళ్ళని తినీసీటట్టున్నారండి.

## 43

ఇక్కడ జరిగిందంతా– మా బాబుకి జెప్పినానండి. అప్పుడు బుచ్చిబాబుకూడా ఉన్నాడండి.

పటాలంవోడి– పెళ్ళి ఒక్కరేత్తిరే నన్నట్టు– ఇంకెన్నాళ్ళులే ఈళ్ళ సోబనం" అన్నాడండి ఆ బాబు.

"నా మొగుడి సత్తువ– నాకు తెల్దా– అన్నట్టు– తండ్రెవరో తెలీని – ఈ తొత్తుకొడుకుల పని– నా కొగ్గీ తమ్ముడూ" అన్నాడండి మా బాబు.

రోజు లెళిపోతున్నాయండి.

కోతలు వోరానికి–వొచ్చీసినాయండి.

"బాంబు పేలుద్ది గాని – యెప్పుడు పేలుద్దో– తెలనట్టు– ఊరంతా సల్లగానే ఉందండి.

ఊళ్లో సప్పుళ్ళూ–సెబ్దాలూ ఇనిపించడం మానీసినా యండి. కుక్కలూ– కాకులూ కూడా అరుపులు మరిసి పోనాయా– అనిపించీదండి నా కొకొక్కప్పుడు,

"సంటిపిల్ల యేడుపు యింటే – సంగీతం విన్నట్టుండీ దండి.

మూడో నాడండి– రేత్తిరి– నాను కూడు దిని– బీడీ కాలుసు కోడానికి పై కెళ్తూ ఉంటే– "పొద్దుటే– యెక్కడికీ పోకరా– అరిజెంటు పనున్నాది" అన్నాడండి మా బాబునాతో.

"అదివొరకు– మా బాబు నాతో అలా– యెప్పుడూ అన్లేదండి– నాకు తెలని అరిజెంటు పని మా బాబు కేటుందా? అని ఆలోచిస్తే– అనుమానం వొచ్చీసినాదండి– అప్పుడే గ్రిహిం

చీసినానండి- నాకాడ యెప్పుడూ- రహస్యాలు పెట్టుకోని మా బాబు- నాకాడ యేదో- ఇసయం దాస్తున్నాడనీ- తెల్లారితే- కురుచ్చేత్రం తప్పదనీ- గ్రెహించీసినానండి."

❖ ❖ ❖

"తెల్లారి లెగిసి-నా పనీ- కుక్కల పనీ- జూసుకుండీ సరికి - టయాం తొమ్మిదైనాదండి.

తఁవఁరుగోరు కుసింత సేపాగాల- మొగుడొచ్చి నప్పుడు - రంకుమొగుడితో- యెవర్తో అన్నట్టు-

"రా బాబూ- డా(ట్రుబాబూ- నీలోటోడే- నిన్ను సల్లగా సావనిస్తే నాను డాక్టర్నే గాను" అన్నాడట. మళ్ళీ కట్టిప్పక- బాబ్బాబూ- పొద్దుటే మీ అసిస్టెంటు బాబు కట్టిప్పి-కత్తితో- కోడి గెలికినట్టు గెలికి-కారిన రకతానికి మొకం తిరిగి పడి పోనాడు. అదురుష్టం బావుండి- ఆ బాబుకంటే- అడుగు పొడుగూ- రెండడుగులు యెడల్పూ- ఉన్న నరసుమీద పడ్డాడు కాబట్టి సరిపోనాది. నేకపోతే- ఈపాటికి- పక్క 'బెడ్డు' మీదుండీ వోడుఆనరసు- సచ్చిన తొండని పట్టుకున్నట్టు- యెడంచేత్తో పట్టుకొని- గొరగొర ఈడుసుకు పోనాది. ఈ వార్డులోనే ఈ బాబుకి మూర్చవొచ్చెస్తన్నాది. ఇక పురిటి వోర్డులో- యేస్తే- యేటౌతాడో" అని సణుక్కుంటూ.

"అన్నస్- సంపీసినావయ్యా! అదేటి? ఇంజీషను సూదా? ఇనప ఇనీమా గొట్టవాఁ? నాను తెలకడుగుతాను- సన్న సూదులు-గవర్నమెంటాస్పత్త్రిర్లి కివ్వరా? ఇస్తే-మీరూ- నర్సులూ- పిల్లలాడుకుంటారని- ఇళ్ళకి- అట్టుకుపోతారా?"

సూడు బాబూ-నాను పోలీసోళ్ళకాడ పెరిగినాను- అంటే ఆళ్ళవొణ్ణం తిని కాదు- ఆళ్ళ దెబ్బలు తిని. ఆళ్ళ పదిదెబ్బలు- ఓ- మీ ఇంజీసనుకాడ- బలాదూరే.

యెంత జెప్పినా మన పోలీసోళ్ళకి- బుద్దినేదు బాబూ- అనవసరంగా- ఆళ్లు చెయ్యిజేసుకుంటారుగాని- స్టేషనుకో డాక్టర్నేసి- ఆ బాబుకో గవర్నమెంటు "సిరంజి" ఇచ్చి- ఓ ఇంజీషను ఇప్పించినారా అంటె- ఏవుడన్నా సరే- ఆకరికి- నికరవైఁన నకసలైటైనా సరే-అమ్మమీద ఒట్టుపెట్టీ మరీ- నిజం అంతా కక్కేస్తాడు.

ఐపోనాదా బాబూ- మీ పని- బొంబాయి సేట్ని- బెజవాడ ముండడిగినట్టు- మీరు మంచోర్లాగున్నారు- రేపు కలుద్దాం బాబు- మీకు- ట్రాన్స్ఫర్ రాకపోతే-

చెమించాలి బాబూ- మిమ్మల్ని కూకోబెట్టీసినాను- ఇంత సేపూ- బ్రోతెలు హవుసుముండ-మూడో పేసింజరుతో అన్నట్టు.

యెంతవొరకూ జెప్పినాను బాబూ- కత? ఆఁకుక్కలకాడి కొచ్చినాను గదూ. ఆటి పనీ- నా పనీ జూసుకుండీసరికి పొద్దున్న తొమ్మిదై పోనాదన్నాను గదూ?

ఆ తరవాత- ఇంటి ముందు పందిట్లో కెళ్ళీసరికి- మా బాబులిద్దరూ- మరో పదిమందిరీ- అడివిలో నకసలైట్లలా గుస గుసలాడుతున్నారండి- సెప్పడం మరిసిపోనాను. సన్నాసిగోడు కూడా ఉన్నాడండి.

మా బాబు మాత్తరం - ఈనబోయీ పులిలా- ఆయాసపడి పోతన్నాడండి. మిగతావోళ్ళు దేనికోసవో- యెదురు జూస్తు న్నారండి. బ్రాకెట్టాట-రిజల్టు-వొచ్చీముందు జెనం యెలా గుంటారో- అలాగున్నారండి.

ఇంతకీ తవఁర్లాటోళ్లు- బ్రకెట్టు లెందు కాడతారండి- యెత్తే గుర్రప్పందేలు కెళతారు గాని-

"ఈళ్ళింతకీ రారేం?" అని ఒక డంటే "గడియో-చెఱవోఁ - వొచ్చెస్తారు" అని మరోడంటున్నాడండి.

"ఈ- వొచ్చేదెవరా? సావఁర్లకోట సానా? డిల్లీ యెంపీనా?" అని నాకు 'బ్లెడ్ప్రెషరు' పెరిగిపోనాదండి.

ఈలోగా వొచ్చినాది బాబూ-పందిట్లోకో "టెంపో"- దాన్లోంచి దిగినారు బాబు పదిహేనుమందిరి- ఆళ్ళలో- ఇద్దరు - మారీచ సుబాహుల్లా ఉంటే- మిగతావోళ్ళు ఆళ్ళ కవల అన్నల్లా ఉన్నారండి. ఆళ్ళెవరని అడుగుతే కడుపులో ఉన్న పిల్ల కూడా సెప్పుతాదండి- సిటీ రౌడీలని' ఆళ్ళ కనుబొమ్మలు- రావణాసురుడి మీసాలంతున్నాయండి- ఒక్కొక్కడి జుత్తుతో పది సవరాలు కట్టించుకోవచ్చు. బాబూ- ఆళ్ళలో యే ఒక్కడి నన్నా సరే- ఓ పులి తింటే అజీర్తి జేసి-సచ్చెస్తాదండి- ఆళ్ళంతా అక్కర్లేదు- బాబూ- ఆళ్ళలో నలుగురు కలిస్తే- ఒక యేనుగుని ఏ కీలు కాకీలు- పీకీగలరండి.

కాని అందులో- ఒక్కడు మాత్తరం- మిగతావోళ్ళలా లేడండి - సచ్చిన ముసలి యెలక్కి- సింకికోటు తొడిగినట్టున్నాడండి- ఆడూ, ఆడి కోటూనూ-ఆడి జేబులో ఆడి తాత "పెన్ను" ఉన్నా దండి- ఆడు- సచ్చిపోయిన ఆడి బాబు సెవంలా ఉన్నాడండి- ఆడి సేతులో- ఓ సింకి అట్టకి కాయితాలు తగిలించి ఉన్నా యండి. ఆడు కోరటు ఆమీనటండి.

"మొగుడి తద్దినం– రంకుమొగుడెట్టాలా" అన్నట్టు– అంతా తిరకాసుగా– కనిపించి నాకేటీ అరదం ఆవలేదండి.

సెవం కుళ్ళితే కంపుకొట్టదా? మనకెందుకు తొందర? ఓపిక పడితే– సంగతి– అదే అర్దం ఔతాదని నాను యెవ్వర్నీ– యేటీ అడగలేదండి.

ఆ యెనక–ఆళ్ళ మాటలుబట్ట– నా కరదం– అయిందే టంటే–మా బాబు– రావుఁడుగోడిమీద– ఫోర్జరీ యెగ్రిమెంటు పెట్టి– దావాయేసి దొంగ "డిక్రీ" పొందీసినాడనీ– బూఁవిఁ సోదీనం జెయ్యడానికి–కోర్టు అమీనుగోడొచ్చినాడని– సపోర్టుకి– సిటీ రౌడీలొచ్చినారని– ఇదండి నా కరదవైంది.

హమ్మ లంజికొడుకులు–ఈళ్ళు తల్లికి మొగుడు రకం గాదండి– రంకుమొగుడి రకవండి– ఈళ్ళని జూస్తే– మదుసులు కాదు– దెయ్యాలు కూడా జదుసుకు– మంచాలెక్కేస్తాయండి. ఈళ్ళ జాతికే నీతి లేదండి.

ఒక బీదోడ్ని కొట్టడానికి ఊరి బీదోళ్ళనందర్నీ – అగ్గిలో తోసీగలరండి– ఊళ్ళో బీదోళ్ళని–లొంగదీసుకోడానికి– ఊరికే– అగ్గిపెట్టేస్తారండి.

యీళ్ళ రాచ్చస యజ్ఞానికి–రాఁవుఁడుగోడు బలి అన్న మాటండి.

నానిలా ఆలోచిస్తూ ఉంటే–ఊరేగింపుకు బయలెల్లినారండి– మా బాబులు.

"కుక్కల్ని పట్టుకుని నువ్వూ రారా" అన్నాడండి. "నువ్వూ– మీ తమ్ముడూ ఉండగా– యేరే కుక్కలెందుకూ" అని మదసులో అనుకొని నానూ బయలెల్లినానండి– దెయ్యం కుక్కల్ని పట్టుకొని.

మాఁవుఁ ఊళ్లో యెళ్తూ ఉంటే– పిల్లుల పెళ్ళి ఊరేగింపు– యెలకలు కన్నాల్లోంచి చూసినట్టు– గుడిసెల్లోంచే– బిక్కుబిక్కు మని జూస్తున్నారండి ప్రెజ.

ఊరికి ఈ సివర మా బాబు బంగళా ఉంటే– రెండో సివర రావుడి గోడి బూవండి.

అది ఊట్టిబూఁవిఁ గాదండి. బంగారప్పళ్ళెవండి– ఇదుగో ఇది– బూఁవైఁతే– అదిగో– అదేనండి సెరువు. సెర్లో ఓ సుక్కన్నా నీరుంటే– అది ముందు రాఁవుఁడిగోడి బూఁవిఁలోకి రావాల సిందేనండి. బూవిఁకి రెండో పక్క రోడ్డండి– మూడో పక్క ఊరండి. ఊరికెంత దగ్గిరంటే– బూఁవిఁలోంచి తీసి ఒక్క అడుగు – వేస్తే రెండో అడుగు– ఊళ్ళోనే పడతాదండి.

బీదోడికి– బంగారప్పళ్ళెంలాంటి బూఁవుఁన్నా– బంగార బ్బొమ్మలాటి భార్య ఉన్నా దక్కవంటారండి.

"మా ఊరేగింపు– యెళ్తా వుంటే– రౌడీలు సారా పోసన యేసేస్తున్నారండి– అమీనుగోడు– సచ్చిన కంపూ– కల్లు కంపూ కలిసి కొట్టేస్తున్నాడండి. తాక్కపోయినా– తాగుడు నవ్వులు తగి లించీసుకున్నారండి– మా బాబులు, ఆళ్ళ పార్టీ పోళ్ళూను.

ఊరేగింపులో– నాను సివరున్నానండి– కుక్కల్ని పట్టుకొని, కుక్కలు– యెంత గింజుకుంటున్నాయంటే– నా సేతులు పీక్కుపోతాయేమోననిపించీసినాదండి.

మాఁవుఁ రావుఁడిగోడి గుడిసెకాడి కొచ్చీసరికి– ఆదు యింటిముంగట– బాణాలమీద బీష్ముదు పడుకున్నట్టు కుక్కి నులకమంచంమీద పడుకున్నాడండి– మమ్మల్ని జూసి లేసి నాడుగానండీ– యెంత జడిసిపోనాడంటే– గుడిసెలోకి పారి పోదాని క్కూడా– ఆడికి అడుగు పడలేదండి. యెవ్వరూ జూడ కుండా ఆడి బూఁవిఁవేపు ఓ పాలిజూసి– ఆడికి కన్ను కొట్టి నానండి–

❖ ❖ ❖

మాఁవు బూఁవి జేరినావండి– జేరగానే వప్పగింత– రసీదు రాసీమన్నారండి మా బాబులు.

"అలా గీల్లేదంతే– పద్ధతి ప్రెకారం– బూఁవిఁకి ముమ్మారు పెదచ్చినం జెయ్యాలసిందే" అని– యెంత కల్లు తాగేసినా– యెంత లంచం తినీసినా– మొండిపట్టు పట్టేడండి అమీనుగోడు.

"యెనకటికి– ఓ దొంగపెళ్ళికి– పురోహితుడిని ముంద ట్రోజే– దక్షిణ ఇచ్చీసీ– పెళ్ళి బేగి జరిపించవయ్యా బాబూ"– అంటే దక్షిణ దబ్బుల్తో మందు కొట్టీసొచ్చి 'వివాహం' విగ్నేస్వె రుడి పూజకాడే మొదలెట్టాలని– పోలీసోళ్ళొచ్చి– పెళ్ళాపీసీ వొరకూ–మంతరాలు జదివినాడటండి.

అలాగుంది ఈ అమీనుగోడి వొరస– బూఁవిఁకి ప్రెదచ్చిన అక్కర్లేదన్నారు– మా బాబులు. కావాలన్నాడు అమీనుగోడు– కావాలంటే తనతో కోర్టుకొస్తే సుప్రీంకోర్టు తీరుపు జూపిస్తా నన్నాదు. అనీసి ఓ సెట్టుకింద సతికిలపడిపోయి– కల్లు కపాలాని కెక్కిపోయినట్లుంది. కళ్ళు మూసీసినాదు. అరగంట కష్టపడి లేపి– ప్రెదచ్చినం– చేద్దాం రమ్మంటే పెదచ్చినం జెయ్యడానికీ– ఇది గూడా? ఆలయవాఁ నానురాను. మీక్కావాలంటే– మూడు సుట్లు గాదు– ముప్పై సుట్లు జెయ్యండన్నాదు.

"ఆకరికి– ఆడ్ని నిద్దర్లేపి– ఆడి పని ఆడికి అరదం అయ్యేటట్టు జెప్పేసరికి– తలప్రాణాలు– తోకల్లోంచి యెళిపోనాయి మా బాబులకి. పెళ్ళినాడు ప్రెదచ్చిణాలు జేయించినట్టు ముమ్మారు– బూఁవికి పెదచ్చిణాలు జేయించినాడు అమీనుగోరు.

ఆ యెనక గట్టుమీద సతికిలపడి పోనారంతా– అమీనుగోడు సెప్తా ఉంటే రాఁవఁనాదంబాబు– అదేదో– రశీదట– రాస్తున్నాడండి. మావంతా ఆళ్ళయేపే జూస్తున్నావండి.

ఇంతలో యేటైందోగాని– సెట్టుకు కట్టిన కుక్కలు యెర్రి అరుపులు అరవడం మొదలెట్టినాయండి.

"యేటా? అని మాఁవుఁ తిరిగి సూద్దువూఁ! మిడతలదండు లాగ వొచ్చేసినారు బీదోళ్ళంతా–ఆడా మొగా సిన్నా పెద్దా అంతా కర్రలూ–కత్తులూ–బండలూ రోకళ్ళూ పట్టుకొని మరీవొచ్చి నారండి.

'యెదవ నంజికొడుకుల్లారా! నా బూఁవిఁలో కాలెందుకెట్టి నార్రా?" అని పూనకం పూనినోళ్ళా యెర్రి అరుపు అరిసినాడండి రావుఁడుగోడు. ఆ యెనక ఆడు తిట్టిన బూతులు–పోలీసోళ్ళతో తిరిగినోడ్ని–సెప్పడానికి నాకే సిగ్గేస్తాదండి.

"నీ బూఁవిఁ బాబుకి వొప్పగించడానికి" అన్నాడండి అమీనుగోడు–యే మాటా అనడానికి మా బాబులుకి నోళ్లు ఆడనేలేదండి– ప్రెజని జూసేక.

"నీ పెళ్ళాన్ని అప్పగించకూడదట్రా– అది సస్తే నీ కూతుర్ని అప్పగించ కూడదా? నా బూఁవేఁ దొరికిందిరా నీ కప్పగించటానికీ!" అన్నాడండి రావుఁడు.

"నీ మీద ఎగస్పార్టీ డిక్రీ అయిపోనాది" అన్నాడండి అమీను.

"నీ యమ్మ రంకుమొగుడిమీద అయిందిరా– ఇప్పుడు నీ కొద్దిరా" అని ఒక్కెగురు– యెగిరి అమీనుగోడి నెత్తిమీద కర్రతో ఒక్క దెబ్బేసినాడండి రాఁవుఁడు.

దెబ్బకు తల పట్టుకున్నాడండి అమీను. తరవాత చేతులు జూసుకున్నాడండి. ఆ యెనక–ఆటిమీద రకతం జూసుకున్నాడండి. మరంతేనండి ఆ తర్వాత– అమీనుగాని– ఆడి సేతులు గాని– ఆటి రకతంగాని యెవరూ సూల్లేదు. ఎటు పారిపోనాడో– అమీనుగోడు తారాజువ్వలా మాయఁవైపోనాడు.

ఈ లోపుల అప్పటివరకూ సీతారాఁవుల్లా బతుకుతున్న కుక్కలు కట్లు తెంపేసుకొని– ఒకదాన్నొకటి కరిసేసుకోడం ఆరంబించినాయండి.

రెండు పారిటీలోళ్ళూ పేకముక్కలు కలిపేసినట్టు కలిసిపోయి కొట్టేసుకుంటున్నారండి.

బుర్రలు పగిలిపోతున్నాయండి– యెఁవిఁకలు ఇరిగిపోతున్నాయండి.

అప్పటివరకూ–మందిలో యెక్కడుందో మా యాదది– నాను సూడనేలేదు. సేత్తో రోకలెత్తుకొని– గుళ్ళోంచి అమ్మోరొచ్చినట్టు వొచ్చేసి 'కాసుకోరా కోకల రంగనాదం!' అని అరిసి– ఆడి నెత్తిని రోకలితో ఓ పెట్టు పెట్టినాదండి– ఆడు మూడుసుట్లు గిరగిర తిరిగి కళ్ళు తేలేసి పడిపోనాడండి. ఇంతట్లో సిటీ రౌడీగోడు మా యాడదాని గుండెల్లో బాకు గుచ్చేసినాడండి. అది తుళ్ళి నా కాళ్ళకాడపడి– రకతం సేతుల్తో నా పాదాలకి దణ్ణ వెట్టి– పేనం వొగ్గేసినాదండి. దాని సేతులు నా పాదాలకు తగలగానే నాకు యేదో అయిపోనాదండి.

సచ్చిన మా ఆడిదానియేపు జూస్తే– దేఁవుఁడే సచ్చిపోనాడనిపించినాదండి.

"ఇంకా జూస్తున్నావేట్రా యెయ్యక?" అన్నాడండి మా బాబు.

"యేస్తున్నా– యేస్తున్నా" అని మా బాబు నెత్తిమీదే కర్రతో ఒక టిచ్చేసినానండి. కంసుళ్ళా కూలిపోనాడండి మా బాబు. ఆ బాబు మన్ను కరిసేలోపల మరోటి యేసేనండి.

నాను పారిటీ బదలాయించానని తెలీక– మాయల ఫకీరుగోడు నానెత్తి మీదొక్కటేసేడండి. తరవాత చాలా దెబ్బలు తిన్నానండి. తెలివొచ్చేసరికి– ఇదిగోనండి–ఈ ఆస్పత్రిర్లో ఉన్నానండి.

నాకు తెలివొచ్చేక తెలిసిన ఇసయం యేటంటే– మాఁవుఁ కూనీలై పోతావుంటే పక్కూరు ఆమ్మోరు పండుక్కి బందోబస్తు యెళ్తున్న పోలీసులు లారీ లాపి–గాల్లో తుపాకులు పేల్చి, దెబ్బలాట ఆపి ఆ తరవాత సచ్చినోళ్ళనీ– సస్తున్నోళ్ళనీ అస్పత్రిరికి జేర్చినారట–మరో ఇషయం యేటంటే– మా బాబు రాఁవుఁడిగోడి మీద ఫోర్జరీ యెగ్రిమెంటు మీద దావాయేసి కోరటు జవాన్ల నీ గుమాస్తాలనీ కొనేసి 'యెగస్పార్టీ డిక్రీ' పొందేసినాడట. బీదోళ్ళసేత కుట్ర జేయించినాడని జెప్పి సిట్టిబాబుని జెయిల్లో తోసేసినారట."

❖ ❖ ❖

"రా– అమ్మా– రా! బిళ్ళలు తెచ్చినావేటి– నాకు ఆస్పత్రిర్లో తెలివి రాగానే మొదట జూసింది ఈ నర్సునేనండి."

నాను సావను తల్లీ? సావను. నీ కెందుకీ గాబరా".

ఏటియి? బిళ్ళలా? బిస్కత్తులా? ఇంతున్నాయి. పోనీ బిస్కత్తులను కొని కొరుక్కు తిందామంటే కాకరకాయల్తో జేసేరేటో చేదు– ఇషం ఇన్ని నీళ్ళన్నా ఇయ్యమ్మా ఇయి మింగాలంటే గ్లాసుడు సాలవ్! కూజాడు గావాలి– అదేఁకరమహోఁ గవర్న మెంటాస్పత్రిర్లలో మంచినీళ్లు గూడా మందిచ్చినట్టు ఔన్సు గ్లాసుల్లో ఇస్తారు.

తల్లీ! నువ్విచ్చిన గ్లాసుకి డబుల్‌సైజ్ గ్లాసుడు దించకుండా తాగేసీ వోడిని– నీళ్ళనుకునేవ్! రమ్ము."

❖ ❖ ❖

"నాను సావను తల్లీ–సస్తే యేడిసీవోళ్ళూ లేరు. సస్తే మాత్తరం సచ్చీ లోపల ఒక మంచిపని జేసేనన్న– సంతుష్టితో సస్తాను తల్లీ.

ఇంతకీ– మా బాబెలాగున్నాడు తల్లీ– ఇంకా సావనేదా? అలాటోడు సచ్చినా స్పెషల్ వోర్డులో స్పెషల్ సావు సస్తాడులే.

తల్లీ నా కత ఇనడానికి మొదట మీ పత్రికలోళ్ళు పదిమంది రొచ్చినారు ఒకరూ ఒకరూ జారుకోగా సివరకి నువ్వొకర్తివే మిగిలినావ్.

నా కతకూడా 'కతం' అయిపోనాది.

మా బాబు సచ్చేడా నాకు ఉరెయ్యొచ్చు. సావకపోతే 'లైపు' ఎయ్యొచ్చు.

యేదేసినా పరవానేదు. అదురుష్టం బాగుండి ఒగ్గేసెరా– సిట్టిబాబు కాడికి జేరి–ఆ బాబు పారిటీకి బతుకు బలి యిచ్చేస్తాను. మళ్ళీ ఇలాటి యెవ్వారం ఏదైనా జరిగితే అస్పత్తిరికో జైలుకో నా నెక్కడుంటే అక్కడికి రా తల్లీ!

ఇప్పటికే సాలా రాసున్నావు. ఇక చాల్తల్లీ– పువ్వులూ పాలూతో పదికాలాలు హాయిగా బతుకు."

**చివరి మాట**

"గాంధీజీ" బహు దొడ్డ సిద్దాంతం కాని దేశం నిండా గాంధీలు ఉంటేనే – అది ఆచరణకు సాధ్యపడుతుంది.

పుట్టింది ఒకే గాంధీ. అతడినైనా బతకనివ్వలేదు దేశం.

గాంధీజం గొప్పదా? కాదా? అన్నది కాదు సమస్య. దానికి మనం తగుతామా అన్నదే ప్రశ్న.

మనం దానికి తగకపోతే – మరో సిద్ధాంతం ప్రజ వెదుక్కోవాలి. **– బీనాదేవి**

**(యువ, 1.12.1984)**

# అతడూ - ఆమే

**పం**జరం బతుకుకి అలవాటుపడిపోయిన చిలకలా–

బలంలేని అడుగుల్తో –

చెయ్యని నేరానికి శిక్ష అనుభవించవలసిన మనిషిలా–

కుర్చీ అంచున–

భయం భయంగా కూర్చుంది – ఆమె

ఆమె కాళ్ళముందు – ద్వారంలోంచి పడుతున్న సాయంకాల ఎండ దేముడు పరచిన బంగారు చాపలా ఉన్నా –

ఆమె చూపులో దేముడు ఉన్నాడన్న నమ్మకం కంటే –

లేడన్న భయమే కనిపిస్తుంది.

ఊపిరి సలపని మనిషిలా ఆమె ఒక్కసారి గుండెల నిండా ఊపిరి పీల్చుకొని పైట రెండో భుజం మీద కూడా కప్పుకొని

ఎదురు కుర్చీలో ఉన్న అతనివేపు –

వికృతమైన పెళ్ళికూతురు – అందమైన పెళ్ళికొడుకు వేపు చూసినట్టు భయంగా బాధగా చూసింది ఆమె–తను అతి అందంగానే ఉన్నా

❖ ❖ ❖

ఎదురు కుర్చీలో కూర్చున్న అతను –

జీవితమంతా తపస్సు చేసి –

దేవుడు లేడని కనుక్కున్న మనిషిలా –

నిర్లక్ష్యంగా–నిర్భయంగా ఉన్నాడు.

మనిషి కళ్ళల్లో కొంచెం నీరసం కనిపించినా –

తనకు ముప్పై ఏళ్ళు పెరిగిన బలం వంట్లోనూ –

సత్తువ మనసులోనూ – ఉన్నాయి.

అతను ఆమెను పరిశీలనగా చూసేడు.

"వెలిసిపోయిన వెన్నెల బొమ్మలా ఉంది"

అనుకున్నాడు.

సమంగా ఆ మాటలే అన్నాడు – వాళ్ళు మొదటి

సారి – పార్టీలో కలుసుకున్నప్పుడు – ఇందిరని

చూపిస్తూ..